



# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక








ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 109: శుక్రవారం 05 డిసెంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్


## అమరావతిలో ప్రతి భవనం ఓ

# అద్భుతంలా ఉండాలి

### ప్రపంచస్థాయి ప్రమాణాలతో క్రియేటివ్ సిటీ



- అమరావతిని క్రియేటివ్ సిటీగా తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు
- గవర్నర్ నివాసం, జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణాలకు ఆమోదం
- మౌలిక వసతుల కోసం రూ.7,380 కోట్ల నాబార్డు రుణానికి అంగీకారం
- నీరుకొండపై తెలుగు వైభవ ప్రతీకగా భారీ ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు నిర్ణయం
- నిర్మాణాల్లో వేగం, నాణ్యతపై రాజీ వద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

**అమరావతి :** రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఒక 'క్రియేటివ్ సిటీ'గా తీర్చిదిద్దనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధానిలో నిర్మించే ప్రతి భవనం ప్రత్యేకంగా, విలక్షణంగా ఉండాలని, పచ్చదనంతో కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

మిగతా 2 లో



## ఆరు కంపెనీలకు ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాలు

- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం
- పెట్టుబడులపై పోర్టల్ ద్వారా నిరంతర పర్యవేక్షణ
- సీఐఐ సదస్సుకు ముందు తరవాత 50శాతం ప్రక్రియ మొదలు
- చంద్రబాబు అధ్యక్షతన 13వ ఎస్ఐపీబీ సమావేశం
- వివరాలు వెల్లడించిన మంత్రులు భరత్, దుర్గేశ్



## భారత్ చేరుకున్న రష్యా

# అధ్యక్షుడు పుతిన్

- ఘనంగా స్వాగతం పలికిన ప్రధాని మోడీ
- ఇరువురు నేతలు కలిసి ప్రధాని నివాసానికి చేరిక
- నేడు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు

3

## నాణానికి రెండో వైపు చూడాలి

### చంద్రబాబు పాలనలో రైతుల అధోగతి

### వ్యవసాయాన్ని దండగలా మార్చారు

- మొంథా తుపాన్ బాధిత రైతులకు మొండిచేయి
- మా హయాంలో రైతులకు ఉచిత బీమా అమలు
- అగమ్య గోచరంగా కౌలు రైతుల పరిస్థితి
- విశాఖ స్టీల్ ప్లాంట్‌పై అప్పుడో మాట..ఇప్పుడో మాట
- సేవ్ ఆంధ్రా కార్యక్రమంలో వైఎస్ జగన్

**అమరావతి :** నాణెలినికి రెండో వైపు ఎలా ఉందో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని వైసిపి అధినేత వైఎస్ జగన్ అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలని.. రైతులు పరిస్థితి చూస్తుంటే సేవ్ ఆంధ్రప్రదేశ్ అన్నట్టుగా ఉందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ' సేవ్ ఆంధ్రా ' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో జగన్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా రైతులను సంతోషపెట్టాలి.. రైతు సంతోషంగా ఉంటేనే రాజ్యం సంతోషంగా ఉంటుందన్నారు. పండుగలా ఉండాల్సిన వ్యవసాయాన్ని చంద్రబాబు హయాంలో దండగలా మారింది. మొంథా తుపాను ఇంకా కళ్లముందే కదలాడుతోంది. మొంథా తుపానుపై ఎంత బిల్డప్ ఇచ్చారో చూశాం. మొంథా తుపాన్ పీకను పట్టుకుని విసిరేసిట్లు బిల్డప్‌ఇచ్చారని అంటూ వైఎస్ జగన్ దుయ్యబట్టారు. మా హయాంలో రైతులకు ఉచిత పంటల బీమా హక్కుగా లభించింది. చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఇన్‌పుట్ సబ్సిడీల

మిగతా 2 లో



## గుర్తింపు కోసం నేను పనిచేయను..

### ప్రజల కోసం మాత్రమే పనిచేస్తా

- నాకు పదవి అలంకరణ కాదు.. ఓ బాధ్యత
- ప్రజలకు సేవలందించడానికి డీడీవో ఆఫీసులు
- చిత్తూరు పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**చిత్తూరు :** గుర్తింపు కోసం నేను పనిచేయను.. ప్రజల కోసం మాత్రమే పనిచేస్తా. నాకు పదవి అలంకరణ కాదు.. ఓ బాధ్యత అని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే గ్రామీణాభివృద్ధిశాఖ పని అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. చిత్తూరులో డివిజనల్ అభివృద్ధి అధికారి డీడీవో కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అదే కార్యక్రమంలో వివిధ జిల్లాల్లోని 77 డీడీవో కార్యాలయాలకు పవన్ వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏపీ వ్యాప్తంగా కొత్త డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు. వర్చువల్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా డీడీవో కార్యాలయాలను

మిగతా 2 లో





## రాహుల్ గాంధీకి సుప్రీంలో ఊరట

- భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసు
- ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేసిన సుప్రీం

.. వివరాలు 3లో

## హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్



- హిడ్మాతో పాటు శంకర్‌లకు చిత్రహింసలు
- చికిత్స కోసం విజయవాడకు వెళితే పట్టుకుని కాల్చివేత
- దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ ప్రకటన

03



## రైతులనునట్టేట ముంచిన

# ఘనత జగన్‌ది

- అడపాదడపా వచ్చి విమర్శలు చేయడం కాదు
- అసెంబ్లీకి రాని వ్యక్తికి ప్రభుత్వ పనులు ఎలా కనిపిస్తాయి
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు

**అమరావతి :** అబద్దాలకు అంబాసిడర్‌గా వైఎస్ జగన్ వ్యవహరిస్తున్నారని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపణలు గుప్పించారు.. రైతులను ఎవరు ఆదుకున్నారో చర్చించడానికి సిద్దంగా ఉన్నామని అన్నారు. అసెంబ్లీకి వస్తే కదా

మిగతా 2 లో

### తాణేలంక గురుకుల పాఠశాల విద్యార్థినిని

## బయటకు పంపటంపై ఆగ్రహం

- బాలిక బంధువులమంటే పంపేస్తారా
- ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా
- చర్యలు శూన్యమని పలువురు నిరసన

3



### అమరావతి రెండో విడత

## ల్యాండ్ పూలింగ్

- 2500 ఎకరాలలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ
- యండ్రాయిలో గ్రామసభలో రైతులతో ముఖాముఖిలో నారాయణ

**పల్నాడు :** అమరావతి కోసం రెండో విడత ల్యాండ్ పూలింగ్ పక్రియ గురువారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా అమరావతి మండలం యండ్రాయిలో గ్రామ సభ ఏర్పాటు

మిగతా 2 లో

# ప్రపంచస్థాయి ప్రమాణాలతో క్రియేటివ్ సిటీ

మొదటి పేజీ తరువాయి

అధ్యక్షతన 55వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజధాని నిర్మాణానికి సంబంధించి పలు కీలక ప్రతిపాదనలకు అథారిటీ ఆమోదముద్ర వేసింది. రాజధాని భవనాల డిజైన్ల కోసం గతంలోనే విస్తృతమైన అధ్యయనం చేశామని సీఎం గుర్తుచేశారు.

**కీలక నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్**

అమరావతిలోని గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో గవర్నర్ నివాస సముదాయమైన 'లోక్ భవన్' నిర్మాణానికి అథారిటీ ఆమోదం తెలిపింది. ఈ భవనాన్ని రూ.169 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. అదేవిధంగా, రూ.165 కోట్ల అంచనా వ్యయంతో ఏపీ జ్యుడీషియల్ అకాడెమీ నిర్మాణ ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించింది. వీటితో పాటు 2024-25 వార్షిక గణాంకాల నివేదికలను కూడా అథారిటీ ఆమోదించింది. రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం నాబార్డు నుంచి రూ.7,380 కోట్ల భారీ రుణాన్ని స్వీకరించేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలోని సీఆర్డీఏ అథారిటీ అంగీకారం తెలిపింది. ఈ-3 సీడ్ యాక్సెస్ రహదారిని జాతీయ రహదారి-16తో అనుసంధానించే పనుల కోసం రూ.532 కోట్లతో టెండర్లను పిలిచేందుకు కూడా అనుమతి ఇచ్చింది.

**నీరుకొండపై తెలుగు వైభవం.. ఎన్టీఆర్ విగ్రహం**

తెలుగువారి ఆత్మగౌరవాన్ని, వైభవాన్ని చాటిచెప్పేలా



నీరుకొండ వద్ద దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇది కేవలం ఒక విగ్రహంగా కాకుండా, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు, అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల జీవిత విశేషాలు, రాష్ట్ర వనరులను ప్రతిబింబించే ఒక చారిత్రక కట్టడంగా నిలవాలన్నారు. ఈ ప్రాజెక్టు కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న ఉత్తమ ప్రాజెక్టులను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఇది తెలుగు ప్రజలందరి ప్రాజెక్టుగా, వారి భాగస్వామ్యంతోనే నిర్మాణం చేపట్టాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

**నిర్మాణాల్లో వేగం, నాణ్యత ముఖ్యం**

ప్రస్తుతం రాజధాని పరిధిలో 85 పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. ప్రభుత్వ భవనాలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఉద్యోగుల నివాస సముదాయాలతో పాటు రహదారులు, విద్యుత్, నీటి సరఫరా వంటి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, నిర్మాణాల్లో వేగంతో పాటు నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్దేశించిన గడువు కంటే ముందే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సీఆర్డీఏ పరిధిలోని పలు ప్రాంతాల్లో సుందరీకరణ పనులు కూడా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులు పాల్గొన్నారు.

## ఆరు కంపెనీలకు ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాలు

**అమరావతి :** ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాల కింద ఆరు కంపెనీలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. పెట్టుబడులపై పోర్టల్ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని నిర్ణయించారు. నిర్ణీత కాలపరిమితిలో ఎంవోయూల అమలుకు వీలుగా చర్యలు చేపట్టాలని తీర్మానించారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 13వ ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. అనంతరం మంత్రులు టీజీ భరత్, కందుల దుర్గేశ్ మీడియాతో మాట్లాడారు. సీఐఐ సదస్సు, అంతకుముందు ఒప్పందాల్లో 50శాతం మేర ప్రక్రియ మొదలైనట్లు తెలిపారు. పెట్టుబడుల ద్వారా 16.13 లక్షల మందికి ఉపాధి కలగనుంది. దావోస్ ఫోరమ్‌కు ముందే వీలైనన్ని శంకుస్థాపనలు జరగాలని ఎస్ఐపీబీ నిర్ణయించింది. రూ. వెయ్యి కోట్లకు పైగా పెట్టుబడులకు డెడికేటెడ్ అధికారిని ప్రభుత్వం నియమిస్తుంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. విశాఖ పరిధిలో రూ.1.69 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రక్రియ మొదలైంది. అమరావతి పరిధిలో రూ.87 వేల కోట్లు, తిరుపతి పరిధిలో రూ.73 వేల కోట్ల పెట్టుబడులకు ప్రక్రియ మొదలైంది. తాజా సమావేశాల్లో రూ.8.29 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. 45 రోజుల్లో క్షేత్రస్థాయిలో అమలయ్యేలా కార్యాచరణ రూపొందిస్తాం. రూ.13.25 లక్షల కోట్లకు సంబంధించి ఎంవోయూలు జరిగాయి. పర్యాటక రంగంలో రూ.21 వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయి. విద్యుత్ రంగంలో రూ.4.54 లక్షల కోట్లు, ఇండస్ట్రీస్, కామర్స్‌లో రూ.2.02లక్షల కోట్లు, ఐటీ రంగంలో రూ.1.22 లక్షల కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్‌లో రూ.8,519 కోట్లు, సీఆర్డీఏకు సంబంధించి రూ.45 వేల కోట్లు, మారిటైమ్ బోర్డు కింద రూ.1.6 లక్షల కోట్ల మేర ఎంవోయూలు కుదిరాయి' అని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఎనర్జీ సెక్టర్‌లో 40శాతం ఎంవోయూలు జరిగాయని మంత్రి టీజీ భరత్ వ్యాఖ్యా నించారు. పోర్టల్‌లో ఎంవోయూలు అప్‌లోడ్ చేశామని.. ఇవీ ఏ స్థాయిలో ఉన్నాయో ఎప్పటికప్పుడు తెలిసేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరానికి వెళ్లే లోపు వీలైనన్ని గ్రౌండ్ అయ్యేలా చూడాలని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. జనవరి 18వ తేదీలోగా గ్రౌండ్ చేయడం ద్వారా రూ. 1000 కోట్ల పెట్టుబడి ఏపీకి వస్తే వారికి ఓ ఆఫీసర్ ప్రత్యేకంగా ఫాలోఅప్ అవుతారని చెప్పుకొచ్చారు మంత్రి టీజీ భరత్. ప్రపంచం మొత్తంలో విశాఖపట్నంలో ఏర్పాటు చేసే గూగుల్‌కు ఒక బజ్ వచ్చిందని వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో తాము ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మంత్రులు, పారిశ్రామిక వేత్తలు, అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. విశాఖపట్నం సమ్మిట్‌లో 30శాతం గ్రౌండ్ అయితే ఏపీ అద్భుతాలు సాధించినట్లేనని వివరించారు. ఈ పరిశ్రమలు అన్ని గ్రౌండ్ అయ్యేలా చూడాల్సిందేనని చంద్రబాబు ఆదేశించారని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో కూడా భారీగా ఎంవోయూలు జరిగాయని గుర్తుచేశారు. పెద్దఎత్తున వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లోనే కాకుండా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ఈ 18 నెలల్లో ఇచ్చామని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. రూ.20,440 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని అన్నారు. 26 సంస్థలు తమ యూనిట్ల ఏర్పాటుకు అంగీకరించాయని వివరించారు. విశాఖ సమ్మిట్ ద్వారా 50వేల ఉద్యోగాలు వస్తాయని భావించామని అన్నారు. తమ ప్రభుత్వం ద్వారా ఎర్లీబర్డ్ ఇన్సెంటివ్‌లు కూడా ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. ఎంవోయూలు సరైన దిశలో అమలు చేయడానికి సీఎం, మంత్రివర్గ ఉపసంఘం, మంత్రులు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వీటన్నింటిని వరల్డ్ ఎకనామిక్ ఫోరంతో ప్రెజంట్ చేయడానికి కృషి చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారని అన్నారు. ఇన్నిపెట్టుబడులు రావడానికి కారణం తమ ప్రభుత్వానికి పెరిగిన క్రెడిబిలిటీనే కారణమని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు.

## గుర్తింపు కోసం నేను పనిచేయను..

మొదటి పేజీ తరువాయి



ప్రారంభించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి సంస్కరణలో భాగంగా రాష్ట్రంలో 77 డీడీవో ఆఫీసులను ప్రారంభించాం అని, విస్తృతంగా ప్రజలకు సేవలందించడానికి డీడీవో ఆఫీసులు ఉపయోగపడుతాయన్నారు. సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించడానికి ఈ కార్యాలయాలు ఉపయోగపడతాయి పవన్ కళ్యాణ్ చెప్పారు. కూటమి ప్రభుత్వం కేంద్రానికి బలం అయ్యింది. కార్యకర్తలకు గుర్తింపు కష్టపడితే వస్తుంది. ప్రభుత్వ ఉద్యోగి ఇంటిలో పదోన్నతులపై ఎంతో ఆసక్తి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులనేది చాలా కీలకం. ఉద్యోగుల పాత్ర తెలుసు కాబట్టి పదివేల మంది ఉద్యోగులకు ఒకేసారి పదోన్నతులు కల్పించాం. గొంతు లేని వారికి మనం గొంతు అవ్వాలి, వారికోసం బలంగా నిలబడాలి. జీవితంలో రిస్క్ తీసుకుంటునే విజయం సాధించగలం. అది కూటమి ప్రభుత్వం చేసి చూపించింది. 15 సంవత్సరాల పాటు కూటమి ప్రభుత్వం అధికారికంలో ఉంటుంది. గత ఇరవై సంవత్సరాలలో కోట్లాది రూపాయల ఎర్రచందనం తరలించి సొమ్ము చేసుకున్నారు. 2008 నుండి రాజకీయాల్లో ఉన్నాను.. చంద్రబాబు లాంటి వారిని కుప్పం రాకుండా అడ్డుకున్నారు. ఎప్పుడూ కూడా ధైర్యాన్ని కోల్పోకుడదు.. ప్రజలు అన్నింటిని ధైర్యంగా ఎదుర్కొవాలి. కూర్చుని మాట్లాడుకుంటే అన్ని సమస్యలు తీరుతాయి. జనసేన కార్యకర్తలకు పరిపాలన పరంగా అనుభవం లేకపోవచ్చు కాని సమాజం కోసం కసిగా పనిచేస్తారు. పార్టీ పరంగా ప్రతి నియోజకవర్గంలో ఓ కమిటీ ఏర్పాటు చేస్తాం' అని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్ఠానికి ఐటీ వింగ్ ఏర్పాటు చేశాం'అని పవన్ అన్నారు. చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లా పర్యటన నిమిత్తం గురువారం ఉదయం 10.30 గం.లకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఏపీ ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ కు అధికారులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, రైల్వే కోడూరు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు,పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, అరవ శ్రీధర్, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ హరి ప్రసాద్, శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, డ్వామా పిడి శ్రీనివాసరావు, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, తదితర అధికారులు ప్రజాప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి వర్యులకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. విమానాశ్రయం వెలుపల ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి ఉదయం 10.40 గంటలకు రోడ్డు మార్గాన చిత్తూరు జిల్లాకు బయల్దేరి వెళ్ళారు.

## అమరావతి రెండో విడత ల్యాండ్ పూలింగ్

మొదటి పేజీ తరువాయి

చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. రెండో విడతలో అమరావతి మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన రైతుల నుంచి అధికారులు భూమిని సేకరించనున్నారు. ముందుగా యండ్రాయి గ్రామంలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా అమరావతి కోసం యండ్రాయి రైతు నంబూరి బలరాం 4 ఎకరాల భూమిని ఇచ్చారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమక్షంలో మంత్రి నారాయణకు పొలం పత్రాలను రైతు నంబూరి అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వం గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో రాజధాని నిర్మాణం ఆలస్యమైందని ఈ సందర్భంగా మంత్రి నారాయణ విమర్శించారు. గుత్తేదారులకు చెల్లించాల్సిన బకాయిలు ఇచ్చి మళ్లీ రాజధాని పనులు ప్రారంభించే సమయానికి వర్షాలు ముంచెత్తాయని తెలిపారు. అంతర్జాతీయ రాజధాని నిర్మాణంలో భాగంగా స్మార్ట్ ఇండస్ట్రీలు, ఇంటర్నేషనల్ విమానాశ్రయం, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని అన్నారు. రెండో విడతలో రైతులు ఇచ్చే 7000 పైగా ఎకరాల భూముల్లో 2500 ఎకరాలలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. గతంలో భూ సమీకరణ సమయంలో రాజధాని రైతుల విషయంలో అనుసరించిన విధానాన్నే ఇక్కడ కూడా అమలు చేస్తామని చెప్పారు. ట్రంకు రోడ్లు, ప్రధాన రహదారులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాలుగు, ఆరు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామని.. ఇక్కడ కూడా ఏడాది కాలంలోనే స్పోర్ట్స్ సిటీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. భూ సమీకరణపై రైతుల అభిప్రాయాలను మంత్రి నారాయణతో పాటు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలుసుకున్నారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.

## చంద్రబాబు పాలనలో రైతుల అధోగతి

మొదటి పేజీ తరువాయి



మాటే ఎత్తరు. ఈ 19 నెలల పాలనలో 17 సార్లు ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. రాష్ట్రంలో 84 లక్షల మంది రైతులు ఉంటే 19 లక్షల మందికి మాత్రమే పంటల బీమా ఉందని వైఎస్ జగన్ పేర్కొన్నారు. బాబు పాలనలో రైతుల జీవితాలు ఛిన్నాభిన్నమయ్యాయి. రూ.1100 కోట్ల ఇన్‌ఫుట్ సబ్సీడీ బకాయిలు ఉన్నాయి. మా హయాంలో హక్కుగా ఉచిత పంటల బీమా ఇచ్చాం. మా హయాంలో ఉచిత పంటల బీమా కింద రూ.7800 కోట్లు ఇచ్చాం. ఉచిత పంటల బీమాకు బాబు ఉరేశారు. బాబు పాలనలో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని జగన్ అన్నారు. ?. రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం గురించి చాలా విషయాలు తెలియాల్సి ఉందన్నారు. నాణెలినికి రెండో వైపు ఎలా ఉందో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రం మొత్తం దేశం వైపు చూడాలని కోరారు. వైసిపి హయాంలో పండుగలా వ్యవసాయం ఉందని చెప్పారు. 62 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. చంద్రబాబు హయాంలో వ్యవసాయం దండుగగా మారిందన్నారు. మొంథా తుపానును చంద్రబాబు, లోకేష్, పవన్‌లే ఆపినట్లు బిల్డప్ ఇచ్చారని విమర్శించారు. తుపాను తర్వాత కూడా రైతులకు న్యాయం చేయలేదు అని చెప్పారు. నష్టపోయిన రైతులకు పైసా సాయం అందించలేదని, పైగా పంట నష్టాన్ని దారుణంగా తగ్గించారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌పై చంద్రబాబు ఎన్నికల ముందు ఏమన్నారు?.. ఇప్పుడు ఏం మాట్లాడుతున్నారంటూ వైఎస్ జగన్ నిలదీశారు. విశాఖలో ఉక్కుకు గనులు ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేశామని.. మా హయాంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఆపేశాం అని వైఎస్ జగన్ వివరించారు. ఉక్కు కార్మికులపై పీడీ యాక్ట్ పెట్టి లోపల వేస్తాడట..! అంటూ చంద్రబాబుపై వైఎస్ జగన్ మండిపడ్డారు. ఎస్ఏఐఎల్‌కు సొంత గనులున్నాయి. ఆర్ఐఎన్ఎల్‌కు సొంత గనులు లేవు. ఎస్ఏఐఎల్, ఆర్ఐఎన్ఎల్‌కు తేడా ఇదే. విశాఖ స్టీల్‌కు సొంత గనులు లేకే నష్టాలు. మిట్టల్‌కు సొంత గనులు ఇవ్వాలని బాబు అంటాడు. కానీ విశాఖ స్టీల్‌కు మాత్రం సొంత గనులు అడగరు. ప్రైవేట్‌కు గనులు అడుగుతారు కానీ.. ప్రభుత్వ ప్లాంట్‌ను పట్టించుకోరని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.సూపర్ సిక్స్ ఇచ్చేశామంటూ నిసిగ్గుగా చంద్రబాబు అబద్దాలు ఆడుతున్నారని జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. సూపర్-6,7 సూపర్‌హిట్ అని ప్రచారం చేసుకుంటున్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసింది గాడిదలను కాయడానికా? అంటూ మండిపడ్డారు. రైతులకు కూటమి ఇచ్చిన ప్రతిమాట అబద్ధమన్న వైఎస్ జగన్.. ఉచిత బస్సు ప్రయాణం కొంతమందికే, కొన్ని బస్సులు పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్-6,7 సూపర్‌హిట్ అని ప్రచారం చేసుకుంటున్నారు. చంద్రబాబు నుంచి గోబెల్స్ పాఠాలు నేర్చుకోవాలి. గోబెల్స్‌కు చంద్రబాబే టీచర్' అంటూ వైఎస్ జగన్ చురకలు అంటించారు. నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామన్నారు. ఏమైంది?. రెండేళ్లలో ఒక్కొక్కరికి రూ. 72 వేలు ఇవ్వాలి ఏమైంది?. ఆడబిడ్డ నిధి కింద ప్రతినెలా రూ. 1500 ఇస్తామన్నారు. రెండేళ్లలో రూ.18 వేలు ఇవ్వాలి.. ఇచ్చారా?. బీసీలకు 50ఏళ్లకే పెన్షన్ అన్నారు.. ఇచ్చారా?. చంద్రబాబు ఈ-క్రాప్ వ్యవస్థను భ్రష్టుపట్టించారని అంటూ వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. ఏపీసీఎస్‌వోతో మేం ఒకటినే జీతాలు ఇచ్చేలా చేశామని.. చంద్రబాబు

హయాంలో ఏపీసీవోఎస్‌ను నీరుగార్చారంటూ దుయ్యబట్టారు. ఏపీసీవోఎస్‌లో రెండు, మూడు నెలలకు కూడా జీతాలు లేవు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. కేవలం ఒక డీఏ మాత్రమే ఇచ్చారు. ఒక డీఏ కూడా వాయిదాల్లో ఇస్తారంట. రిటైర్డ్ అయ్యాక ఎరియర్స్ ఇస్తామన్నది బాబు ప్రభుత్వమే. ఎన్నికల్లో ఇచ్చిన పీఆర్సీ హామీ ఇప్పటికీ లేదని అంటూ వైఎస్ జగన్ మండిపడ్డారు. పీఆర్సీ ఛైర్మన్ కూడా లేదు. జీతాలు పెరగొద్దని పీఆర్సీ ఛైర్మన్‌ను నియమించలేదు. పీఆర్సీ లేదు.. ఐఆర్ లేదు. ప్రభుత్వ ఉద్యోగులకు రూ.31 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు.

## రైతులను నట్టేట ముంచిన ఘనత జగన్‌ది

మొదటి పేజీ తరువాయి

సమస్యలు తెలిసేదని అన్నారు. గెస్ట్‌లాగా వచ్చి విమర్శలు చేయడం కాదని జగన్‌కు చురకలు అంటించారు. వైఎస్ జగన్ చేస్తున్న నీచ ఆరోపణల గురించి రాష్ట్ర ప్రజలకు పూర్తిగా అవగాహన ఉందని మంత్రి స్పష్టం చేశారు. కేవలం 18 నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, జగన్ ఐదేళ్ల పాలనలో చేసిన అబద్దాలను బట్టబయలు చేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వని జగన్ మాట్లాడే అర్హతే లేదని మంత్రి తేల్చిచెప్పారు. గత ప్రభుత్వంలో 1,674 కోట్లు ధాన్యం బకాయిలు చెల్లించకుండా వదిలిపెట్టగా, కూటమి ప్రభుత్వం ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించిందని పేర్కొన్నారు. రైతు ఆత్మహత్యల కుటుంబాలకు గత ప్రభుత్వం ఇవ్వని పరిహారాలను కూడా కూటమి ప్రభుత్వం తక్షణమే అందజేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. మద్దతు ధరల కోసం రైతుల సంక్షేమార్థం 16 నెలల్లోనే 800 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని ఆయన వివరించారు. వాస్తవాలపై బహిరంగ చర్చకు వైఎస్ జగన్ సిద్ధమైతే తాను ఎప్పుడైనా సిద్ధమేనని మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు.. కానీ జగన్ ఇలాంటి చర్చలకు రాడని, కేవలం రాయి వెళ్లడం అలవాటు చేసుకున్నాడని మండిపడ్డారు.

## జగన్ ఏనాడైనా సమస్యలు పట్టించుకున్నారా?

### ఏపీలో ఎన్నిరోజులు ఉంటున్నారో చెప్పగలరా

### హోంమంత్రి అనిత ఘాటు విమర్శలు

**విజయనగరం :** వైసీపీ అధినేత్ జగన్ మోహన్‌రెడ్డిపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవి పోయిన తర్వాత ఏపీలో జగన్ ఎన్ని రోజులు ఉన్నారో చెప్పాలని అన్నారు. ఆయన తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని సవాల్ విసిరారు. గురువారం విజయనగరంలో హోంమంత్రి అనిత పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో హోంమంత్రి అనిత మాట్లాడారు. జగన్ హయాంలో ప్రజా సమస్యలను పరిష్కరించకుండా గాలికొదిలేశారని మండిపడ్డారు. ధాన్యం అమ్మిన రైతులకు 24 గంటల్లోగా డబ్బులు జమ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పుకొచ్చారు. టిడ్కో ఇళ్లు పేదలకు అందకుండా చేసిన పాపం జగన్‌దని.. లబ్దిదారులకు టిడ్కో ఇళ్లు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదని తెలిపారు. ఆయుధాలు విడిచిపెట్టి మావోయిస్టులను లొంగిపోవాలని కోరుతున్నామని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోలేమని... ఆపదలో ఉన్న వారిని సకాలంలో ఆదుకుంటామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# భారత్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

- ఘనంగా స్వాగతం పలికిన ప్రధాని మోడీ
- ఇరువురు నేతలు కలిసి ప్రధాని నివాసానికి చేరిక
- నేడు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు



**న్యూఢిల్లీ:** రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. ఢిల్లీ సమీపంలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగిన ఆయనకు ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ఇద్దరు నేతలు ఒకే కారులో ప్రధాని అధికారిక నివాసానికి ప్రయాణమయ్యారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా రెండు రోజుల పాటు ఇండియా పర్యటనకు వచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ ఆయనను స్వయంగా ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతించారు. పుతిన్ 23వ ఇండియా-రష్యా శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. రెండు దేశాల మధ్య రక్షణ, వాణిజ్య రంగాలలో పలు కీలక ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభానికి కొన్ని నెలల ముందు 2021 డిసెంబరులో పుతిన్ చివరి సారి ఢిల్లీలో పర్యటించారు. ఆ తర్వాత ఆయన మన దేశానికి రావడం ఇదే తొలిసారి. రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు అమలు చేస్తున్న వేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పుతిన్ కు ప్రధాని మోదీ ప్రైవేటు విందు ఇవ్వనున్నట్లు సమాచారం. శుక్రవారం ఇరునేతలు ఇండియా-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పలు రక్షణ, వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. భారత్‌తో సంబంధాలు, సహకారాన్ని మరింత పెంపొందించుకోవడానికి రష్యా ఎదురు చూస్తోందని పుతిన్ ఇప్పటికే తెలిపారు. ఇంధనం, పరిశ్రమలు, అంతరిక్షం తదితర రంగాల్లో అనేక ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసుకోవడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భారత్ నుంచి దిగుమతులు మరింత పెంచుకునే అంశంపైనా చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు. గురువారం వ్లాదిమిర్ పుతిన్ పాలం వైమానిక దళ స్టేషన్‌లో దిగగా ప్రధాని మోదీ ఆయనకు స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 11.00: పుతిన్ రాష్ట్రపతిని కలిసేందుకు రాష్ట్రపతి భవన్‌కు వెళతారు. ఉదయం 11.30కు రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పిస్తారు. ఉదయం 11.50: నరేంద్ర మోదీతో సమావేశం. మధ్యాహ్నం 1.50: హైదరాబాద్ హౌస్‌లో సంయుక్త విలేకరుల సమావేశం ఉంటుంది. సాయంత్రం 7.00 గంటలు: పుతిన్ రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం అవుతారు. రాత్రి 9.00 గంటలకుఆయన తన పర్యటనను ముగించుకుని భారతదేశం నుండి బయలుదేరుతారు. పుతిన పర్యటన సందర్భంగా ఢిల్లీలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



# హెల్త్ సెక్యూరిటీ 2025 బిల్లు

**లోక్‌సభలో ప్రవేశ పెట్టిన నిర్మలమ్మ**

**న్యూఢిల్లీ:** లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హెల్త్ సెక్యూరిటీ సెస్, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025ను ప్రవేశపెట్టారు. రెండు ప్రయోజనాల రీత్యా కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఒకటి ఆరోగ్య భద్రత, రెండు జాతీయ భద్రత ఈ రెండు అంశాలపై ఈ బిల్లును రూపొందించినట్లు సీతారామన్ తెలిపారు. ఆరోగ్యానికి హాని కలిగించే వస్తువులపైనే ఉదాహరణకు పాన్ మసాలా వంటి వస్తువులపై పన్ను విధించబడుతుందని ఈ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్మలాసీతారామన్ స్పష్టం చేశారు. కాగా, ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపీలు వ్యతిరేకించారు. ప్రభుత్వం ధూమపానం చేసేవారిపై పన్ను విధిస్తుంటే.. ఢిల్లీ గాలి మాత్రం మరింత విషపూరితంగా ఉందని సిపిఐ(ఎం) ఎంపీ శివదాసన్ ఎద్దేవా చేశారు. దీనిపై ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే స్పందించారు. ఈ బిల్లుని తేవడం మంచిదే కానీ.. సెస్ రూపంలో పన్నులు ఎందుకు వసూలు చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. దీని ద్వారా పన్నుల ద్వారా ఆదాయం పెరుగుతుంది. కానీ ఈ ఆదాయం రాష్ట్రాలకు అందదు అని కేంద్రంపై ఆమె ఆరోపించారు. బిల్లు చర్చ సందర్భంగా బీడి మాత్రం 40 శాతం స్లాబ్‌లోకి వెళ్లలేదు. 28 శాతం స్లాబ్ లేనందున బీడి 18 శాతం శ్లాబ్ కిందకి వచ్చింది అని నిర్మలా సీతారామన్ అన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అదనపు సిబ్బంది

**రాష్ట్రాలకు సుప్రీం కీలక సూచన**



**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని సుప్రీం కోర్టు ఆయా రాష్ట్రాలకు సూచించింది. ఈ పక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారులు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పలువురు బీఎల్‌వోలు అనారోగ్యానికి గురి కావడం, రాజీనామాలు చేస్తుండటం, పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు కీలక సూచనలు చేసింది. బీఎల్‌వోల పని గంటలను తగ్గించేందుకు అదనపు సిబ్బందిని నియమించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. నిర్ణీత సమయంలో విధులు నిర్వర్తించనందుకుగానూ బీఎల్‌వోలపై బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ నటుడు విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. తీవ్ర పని ఒత్తిడి కారణంగా అనేక మంది బీఎల్‌వోలు మరణించారని, విధులు నిర్వర్తించడంలో విఫలమైతే వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారని టీవీకే తరపు న్యాయవాది వాదించారు. ఈ నేపథ్యంలో కొన్ని సూచనలు జారీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఎల్‌వోలపై పని ఒత్తిడిని తగ్గించేందుకు అదనపు సిబ్బందిని నియమించడాన్ని రాష్ట్రాలు పరిగణించొచ్చని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఎస్ఐఆర్ కోసం అవసరమైన సిబ్బందిని కేటాయించాల్సిన బాధ్యత సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై ఉంది. అవసరమైతే వారి సంఖ్య పెంచొచ్చని సుప్రీం కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.



# రాహుల్ గాంధీకి సుప్రీంలో ఊరట

**భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసు**

**ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేసిన సుప్రీం**

**న్యూఢిల్లీ:** భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఉపశమనం లభించింది. రాహుల్‌గాంధీపై ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులను 2026, ఏప్రిల్ 22 వరకు పొడిగించింది. రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ సతీష్ చంద్రలతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఈ అంశాన్ని వివరంగా విచారిస్తామని తెలిపింది. 2022లో చేపట్టిన భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీ భారత సైన్యంపై అవమానకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై ఫిర్యాదుదారు ఉదరు శంకర్ శ్రీవాస్తవ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ట్రయల్ కోర్టు సమన్లు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు మే 29న కొట్టివేసింది. దీంతో ఈ ఉత్తర్వులపై రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఆగస్టు 4న రాహుల్ గాంధీ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. తదుపరి విచారణ తేదీ వరకు స్టే విధించింది.

# చురుకుగా జైషే ఉగ్రవాద కూటమి

- జోరుగా మహిళల రిక్రూట్‌మెంట్
- రూ.500 ఫీజుతో గంటపాటు శిక్షణ



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే తన కార్యకలాపాలను విస్తరించేందుకు మహిళలతో ఏర్పాటు చేసిన ఉగ్రవాద గ్రూప్ చురుకుగా పనిచేసేందు కు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దీనికి మహిళల నుంచి మంచి స్పందన వస్తోందని ఆ సంస్థ ప్రకటించు కుంది. మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ మహిళా గ్రూపుకు నేతృత్వం వహిస్తున్నారు. 'జమాతుల్-ముమినాత్' పేరుతో ఓ ప్రత్యేక యూనిట్‌ను తయారు చేస్తున్నది. అయితే, కొద్ది వారాల వ్యవధిలోనే వేల సంఖ్యలో మహిళల్ని ఆకర్షించి నట్లు తేలింది. ఈ విషయాన్ని స్వయంగా మసూద్ అజారే సోషల్ మీడియా వేదికగా వెల్లడించడం గమనార్హం. ఉగ్రవాద సంస్థ మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోందని జైష్ చీఫ్ మసూద్ అజార్ అందులో పేర్కొన్నారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. 'జైషే మహిళా విభాగంలో నియామకాల సంఖ్య పెరుగుతోంది. చాలా తక్కువ సమయంలోనే 5,000 మందికిపైగా మహిళలు చేరారు. ఇదంతా అల్లా దయ వల్లే జరిగింది. చాలా మంది సోదరీమణులు నియామకం పొందిన వెంటనే తమ మానసిక స్థితిమారిపోయినట్లు చెబుతున్నారు. జీవిత లక్ష్యాన్ని గ్రహించినట్లు చెప్పారు. ఇప్పుడు జిల్లా యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి జిల్లాకు ఒక ముంటాజియా (మేనేజర్) ఉంటారు' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, పలు నివేదికల ప్రకారం.. జమాతుల్-ముమినాత్ కోసం నియామక డ్రైవ్ ఈ ఏడాది అక్టోబర్ 8న జైషే ప్రధాన కార్యాలయం మర్కజ్ ఉస్మాన్-ఓ-అలీలో ప్రారంభమైంది. ఈ డ్రైవ్‌లో భాగంగా పాక్‌లోని బహవల్‌పూర్, ముల్తాన్, సియాల్‌కోట్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లి నుంచి మహిళలను ఉగ్రవాద సంస్థలోకి చేర్చుకున్నారు. ఈ సంస్థ రూ.500 ఫీజుతో 40 నిమిషాలు ఆన్‌లైన్ శిక్షణ ఇస్తూ.. మహిళల్ని ఉగ్రవాదం వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఐఎస్ఐఎస్, హమాస్, ఎల్‌టీటీఈ తరహాలో ఫిదాయిన్ (ఆత్మాహుతి) దాడులు నిర్వహించడానికి ఈ మహిళలతో ఉగ్రవాద బ్రిగేడ్‌లను ఏర్పాటు చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది.

# అఖండ 2 విడుదల వాయిదా..

**ప్రకటించిన నిర్మాణ సంస్థ**

బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్లో రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' వాయిదా పడింది. ఈ సినిమా విడుదలపై కొన్ని గంటలుగా సందిగ్ధత నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం సమస్యల్లో చిక్కుకున్నట్లు వార్తలొచ్చాయి. గురువారం రాత్రి ప్లాన్ చేసిన ప్రీమియర్స్ను చిత్ర బృందం రద్దు చేయడంతో.. వార్తలకు బలం చేకూరింది. తాజాగా చిత్ర విడుదలను వాయిదా వేస్తున్నట్లు నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 5న థియేటర్లలో ఈ చిత్రం విడుదల కావాల్సిఉంది. ఈ మేరకు 14 రీల్స్ ప్లస్ సంస్థ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. "అనివార్య కారణాల వల్ల 'అఖండ 2' షెడ్యూల్ ప్రకారం విడుదల కావడం లేదు. ఈ విషయం పట్ల చింతిస్తున్నాం. ఈ క్షణం మాకు చాలా బాధాకరమైనది. ప్రతి అభిమాని, సినీ ప్రేమికుడికి ఇది కలిగించే నిరాశను మేము అర్థం చేసుకుంటాము. ఈ విషయాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాము. ఈ నిర్ణయం పట్ల కలిగిన అసౌకర్యానికి మా హృదయపూర్వక క్షమాపణలు. 'ఈ సమయంలో మీ మద్దతు మాకు చాలా అవసరం. అతి త్వరలో సానుకూల నిర్ణయంతో మీ ముందుకు వస్తాం" అని నిర్మాణ సంస్థ పేర్కొంది.

# హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్

**హిడ్మాతో పాటు శంకర్‌లకు చిత్రహింసలు**

**చికిత్స కోసం విజయవాడకు వెళితే పట్టుకుని కాల్చివేత**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ ప్రకటన**



**విశాఖపట్టణం:** మావోయిస్టు కీలక నేత హిడ్మా ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ మరో సంచలన లేఖను విడుదల చేసింది. హిడ్మాది పూర్తిగా బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ పేరుతో లేఖ విడుదలైంది. హిడ్మాతో పాటు శంకర్లను పట్టుకుని చిత్రహింసలు పెట్టి చంపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి చెందిన కొందరు కలప వ్యాపారుల ద్రోహం వల్లనే వీళ్ళ దొరికిపోయారని మండిపడ్డారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా, శంకర్లు చికిత్స కోసం విజయవాడకు వెళ్లినట్లు చెప్పారు. కలప వ్యాపారులతో కలిసి విజయవాడకు వెళితే వాళ్ళని పట్టుకున్నారన్నారు. వారం రోజుల పాటు చిత్రహింసలకు గురిచేసి ఆంధ్రా పోలీసులు చంపేశారని ఆరోపించారు. హిడ్మా, శంకర్ల ఎన్‌కౌంటర్లపై సమగ్ర దర్యాప్తు చేయాలని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి వికల్ప్ లేఖలో స్పష్టం చేశారు. కాగా.. గత నెలలో (నవంబర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో రెండు భారీ ఎన్‌కౌంటర్లు జరిగిన విషయం తెలిసిందే. నవంబర్ 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావో కీలక నేత హిడ్మాతో పాటు ఆయన భార్య, పలువురు అనుచరులు హతమవ్వగా, నవంబర్ 19న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ శంకర్ సహా ఆరుగురు మృతి చెందారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోయిస్టులు హతమయ్యారు. అలాగే ఘటనా స్థలంలో దొరికిన డైరీలోని సమాచారం ఆధారంగా ఏపీలోని పలు జిల్లాల్లో పోలీసులు తనిఖీలు చేసి దాదాపు 50 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

# కేరళలో భారీగా ఎక్సైజ్ తనిఖీలు

**రూ.72 లక్షల నగదు పట్టివేత.. ఎపికి చెందిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్**

**తిరువనంతపురం:** కొట్టాయంలో అంతర్రాష్ట్ర బస్సులో లెక్కల్లో చూపని సుమారు రూ.72 లక్షల నగదును ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీ, కేరళ మధ్య నడిచే అంతరాష్ట్ర బస్సులో ఈ డబ్బును గుర్తించారు. వీటిని తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, కేరళలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సందర్భంగా మాదకద్రవ్యాల, నల్లధనం అక్రమ రవాణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు ప్రారంభించారు. కొట్టాయంలోని కురవిలంగాడ్‌లో జరిగిన తనిఖీలలో, అధికారులు బస్సులోని ఒక బ్యాగ్‌లో దాచిన నగదు కట్టలను కనుగొన్నారు. మరింత అనుమానం రావడంతో ఇద్దరు ప్రయాణికులను తనిఖీ చేయగా, వారి వద్ద మరింత నగదు ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.72 లక్షలు ఉందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను ఏపీకి చెందిన షేక్ జాఫర్ (59), షాషాస్‌గా గుర్తించారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలను ఇద్దరూ సమర్పించలేక పోయారు. ఇద్దరు అనుమానితులను తదుపరి దర్యాప్తు కోసం ఆదాయపు పన్ను శాఖకు అప్పగించారు. భారీగా పట్టుబడిన ఈ నగదు వెనుక హవాలా రాకెట్ ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల ఫోన్‌లను కూడా జప్తు చేశారు. నిధులను ఉగ్రవాద కార్యకలాపాల వినియోగం కోసం తరలిస్తున్నారా? లేదా వేరే దేని కోసమా? అని తెలుసుకోవడానికి సైబర్ ఫోరెన్సిక్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు స్మగ్లర్లు అంతర్రాష్ట బస్సులను ఎక్కువగా వినియోగిస్తుంటారు. చిన్న ప్రైవేట్ వాహనాల మాదిరిగా కాకుండా, బస్సులను తనిఖీల కోసం చాలా అరుదుగా ఆపివేస్తారు. ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని చాలా అరుదుగా మాత్రమే బస్సులను తనిఖీ చేస్తుంటారు. ఈ అవకాశాన్ని కొన్ని ముఠాలు అక్రమాల కోసం వాడుకుంటున్నాయి.

# అంతర్జాతీయ పరిణామాల ప్రభావం

**మరింతగా రూపాయి పతనం**

**రూ.90.36 వద్ద ప్రారంభమై, 90.43కు చేరిక**

**ముంబై:** భారతదేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో రూపాయి మరింతగా పతనం అయ్యింది. తాజాగా గురువారం ఉదయం డాలర్‌తో పోలిస్తే 28 పైసలు తగ్గి, ఆల్ టైమ్ కనిష్ట స్థాయి 90.43కి చేరింది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో రూ.90.36 వద్ద ప్రారంభమై, కనిష్ట స్థాయి 90.43ని తాకింది. రూపాయి పడిపోవడం దిగుమతులను మరింత ఖరీదైనదిగా మారనున్నది. ఇది దేశంలో ధరల పెరుగుదలకు దారితీస్తుందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. రూపాయి విలువ మరింతగా పతనం చెంది 91కి చేరుకుంటుందని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ప్యానెల్ వడ్డీ రేటుపై నిర్ణయాన్ని శుక్రవారం ప్రకటించనున్నారు. అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి పతనం కొనసాగుతూనే ఉంది. భారత్-అమెరికా డీల్‌పై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో రూపాయి మారకం విలువ నానాటికీ క్షీణిస్తోంది. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ విలువ ఏకంగా 28 పైసలు పడిపోయి 90.43 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది. క్రితం సెషన్‌లో రూపాయి విలువ 90.15 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఈ క్షీణత మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని, రూపాయి విలువ 90.70-91 మార్క్‌ను తాకనుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొన్ని నెలలుగా భారత ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటంతో, డాలర్లకు గిరాకీ పెరిగి రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతోంది. వస్తువులకు చెల్లింపులు చేసేందుకు దిగుమతిదారులు భారీగా డాలర్లను కొనుగోలు చేస్తుండటమూ రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. మరోవైపు, నేటి ట్రేడింగ్‌లో స్టాక్‌మార్కెట్ సూచీలు ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. దీంతో సూచీలు స్తబ్దుగా కదలాడుతున్నాయి. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో సెన్సెక్స్ స్వల్పంగా 33 పాయింట్ల లాభంతో 85,140 వద్ద, నిఫ్టీ 6 పాయింట్ల లాభంతో 25,992 వద్ద ట్రేడ్ అవుతున్నాయి.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



సంపాదకీయం

# సవాల్ విసురుతున్న గంజాయి మాఫియా!

గంజాయి మాఫియా విజృంభిస్తోంది. తాజాగా నెల్లూరు జిల్లాలో గంజాయి మాఫియా గ్యాంగ్ ఘాతుకానికి కొట్టాచిట్టం పెంచలయ్య బలయ్యారు. ఇది ఆరంభం మాత్రమే. ఎందుకంటే ఇప్పటి వరకు గంజాయి మాఫియా పట్టుబడడం లేదా తప్పించుకోవడం మాత్రమే చూశాం. ఇక హత్యలకు సంకేతం అన్నట్లుగా పెంచలయ్య మర్డర్‌ను భావించాలి. పెంచలయ్యను చంపిన దుర్మార్గులను వారి వెనుకనున్న డాన్‌లపైన దృష్టి పెట్టాల్సి ఉంది. ఈ విషయంలో ఏపి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. ఎందుకంటే గంజాయి చాపకింద నీరులా ప్రవహిస్తోంది.కాసులు కురిపించడంతో పలువురు దీనికి ఆకర్శితులై కుటీరపరిశ్రమగా వాడుకుంటున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇది బాగా విస్తరించింది. అన్ని ప్రాంతాలలో విచ్చలవిడిగా గంజాయిని సరఫరా చేస్తున్నారు. దీనితో విద్యార్థులు యువత చెడుదారి పడుతున్నారు. డ్రగ్స్ మాఫియాల వెనక రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వారిపై ఉక్కుపాదం మోపి, తక్షణం డ్రగ్స్, గంజాయి తదిర మాఫియాలను నిర్మూలించాల్సి ఉంది. ఎందుకంటే మద్యం, గంజాయి, డ్రగ్స్ మాఫియాలను అరికట్టకపోతే సమాజం దారి తప్పుతుంది. పాలకులు ఎంతసేపు పెన్షన్ల పంపిణీ, బియ్యం పంపిణీలపై దృష్టి పెట్టడం మానాలి. హెలికాప్టర్లు వేసుకుని ఊరేగడం మానాలి. హెలికాప్టర్, విమానాల్లో తిరగడానికి వందల కోట్లు తగలేస్తున్నారు. ఆ డబ్బులను మాఫియాలను అరికట్టేందుకు వినియోగించాలి. ప్రజా చైతన్య కార్యక్రమాలను చేపట్టాలి. విశాఖ,మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి విచ్చలవిడిగా సాగవుతోంది. అక్కడ నుంచి జిల్లాలోకి అక్రమంగా గంజాయి రవాణా అవుతోంది. ముఖ్యంగా ఒడిశా, అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఎక్కువగా వస్తోంది. మారేడుమిల్లి, రంపచోడవరం మీదుగా జగ్గంపేటకు గంజాయి రావాణా సాగుతోంది. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా ఎగుమతి అవుతోంది. ఇటీవల తెలంగాణలో కూడా విచ్చల విడిగా గంజాయి ప ట్టుబడుతోంది. అయితే పట్టుబడుతున్న గంజాయి లేదా డ్రగ్స్ కొంత మాత్రమే. ఇప్పటికే అది గుట్టుచప్పుడు కాకుండా రవాణా అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాలు తలచుకుని గట్టిగా చర్యలు తీసుకుంటే దీనిని అరికట్టవచ్చు. మొగ్గలోనే దీనిని తుంచివేయాలి. ఈగిల్ టీమ్‌లకు మరింత బలగాలను ఇచ్చి అదేపిగా తనిఖీలు చేపట్టాలి. ఎక్కడెక్కడ పండిస్తున్నారో గుర్తించి ధ్వంసం చేయాలి. అయితే పోలీసులు నిఘా పెట్టి అరెస్టులు చేస్తున్నా గంజాయి రవాణా మాత్రం ఆగట్లేదన్న ఆరోపణలే ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా నగరాల్లో విద్యార్థులు, యువతను టార్గెట్ చేస్తున్నారు. అందుకే పట్టణ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. యువత, విద్యార్థులనే గంజాయి మాఫియా టార్గెట్ చేసుకుంటోంది. ఒంటరిగా, జులాయిలా తిరిగే యువకులను రవాణాకు ఉపయోగించుకుంటోంది. గంజాయిని చిన్నచిన్న పొట్లాలు, లిక్విడ్, చాక్లెట్లుగా మార్చి యువతకు, విద్యార్థులకు అమ్ముతున్నారు. ఎక్కువగా ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల యువతనే వీరు లక్ష్యంగా చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటీవల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు సందర్భాల్లో ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు గంజాయి సేవిస్తూ పోలీసులకు చిక్కారు. కొన్నిచోట్ల రాజకీయ పలుకుబడితో కేసు నుంచి వారు తప్పించుకున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. గత జగన్ ప్రభుత్వ హయాంలో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాం లోనూ పరిస్థితిలో పెద్దగా మార్పు కానరావడంలేదు. మేము అధికారంలోకొస్తే గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపుతాం అని టిడిపి అధినేత చంద్రబాబు చెప్పుకొచ్చారు. అధికారంలోకొచ్చి ఏడాదిన్నర అయినా గంజాయికి అడ్డుకట్ట పడడంలేదు. గత ప్రభుత్వం లో మాదక ద్రవ్యాలు, గంజాయి రాష్ట్రమంతటా పాకాయి. వాటి మూలాలను గుర్తించి నివారించాలి. యువతను గంజాయి మత్తు నుంచి బయటకు తీసుకురావాలి. మాదకద్రవ్యరహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించాలి. ఇప్పటికీ గంజాయి మాఫియా రెచ్చిపోతోందనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు పాలకపక్షం లోని కొందరి అండదండలే కారణమని ప్రచారం జరుగుతోంది. తాజాగా నెల్లూరు ఘటన దీనికి పరాకాష్టగా చూడాలి. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న పెంచలయ్యను దారుణంగా హత్య చేయడం దారుణంకాక మరోటి కాదు. ఈ ఘటనతో స్థానికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రధాన హంతకుడు జేమ్స్ ఇంటిని వారు దగ్ధం చేశారు. నెల్లూరు నగరంలోని అయ్యప్పగుడి ప్రాంతంలోని ఆర్‌డిటి కాలనీలో పెంచలయ్య ఉంటున్న వీధిలోనే జేమ్స్ కుటుంబం ఉంటోంది. జేమ్స్ అక్క అరవ కామాక్షి గంజాయి, మాదక ద్రవ్యాలు, దొంగతనాలకు యువకుల ను ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో పెంచలయ్య తన స్నేహితులతో కలిసి గంజాయి అమ్మకాలు, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. కామాక్షి తమ కాలనీకి రావద్దంటూ స్థానికులు నిర్ణయం చేశారు. దీంతో, కక్ష పెంచుకున్న జేమ్స్ మరికొందరితో కలిసి పెంచలయ్య ను హత్య చేశారని స్థానికులు చెబుతున్నారు. గంజాయిని అమ్మవద్దంటే చంపేస్తారా? అంటూ స్థానిక మహిళలు, యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకుని వస్తే వారే దీనిపై పోరాడుతారు. వారే సమాచారం ఇస్తారు. ఇక తెలంగాణలోనూ ఇటీవల ఈగిల్ టీమ్ దాడులు పెంచింది. పెద్ద ఎత్తున దాడులు చేస్తూనే ఉంది. ఇటీవల ఢిల్లీలో కూడా దాడులు చేసింది. అయినా మత్తు మాఫియాదే పైచేయి అవుతోంది. దీనిని కఠినంగా అణచివేయాలి. అందకు చిత్తశుద్ధితో కృషి చేయాలి. రవాణా జరుగుతున్న తీరును గుర్తించి మాటువేయాలి. విశాఖ నుంచి గంజాయి సరఫరా అవుతోంది. భద్రాచలం ఏజెన్సీ నుంచి కూడా వస్తోంది. ఈ రెండు ప్రాంతాల్లో గజాయి తోటలను ధ్వంసం చేస్తూ పోవాలి. అప్పుడే కొంతలో కొంతయినా విజయం సాధించవచ్చు.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్

# తాణేలంక గురుకుల పాఠశాల విద్యార్థినిని బయటకు పంపటంపై ఆగ్రహం

**ముమ్మిడివరం(మనసులో మాట) డిసెంబరు 4:** గురుకుల పాఠశాలలో బాలికలపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల గురువారం పలువురు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం మండలం తాణేలంక గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని (మైనర్ బాలిక)ని ఒక వివాహితుడు బంధువునని చెప్పి బయటకు తీసుకు వెళ్లాడు. ఈ విషయం తెలిసిన మైనర్ బాలిక బంధువులు నిరసనను వ్యక్తం చేస్తూ గురువారం గురుకుల పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. ఇందుకు సంబంధించి బాలిక బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం.. కాట్రేనికోన మండలం పల్లంకుర్రు గ్రామం లో సాపేవారిపేటకు చెందిన బాలిక తాణేలంక గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. ఆ విద్యార్థిని తల్లి ఉపాధి నిమిత్తం గల్ఫ్ లో ఉండటం, తండ్రి పనులు కోసం ఇతర రాష్ట్రంలో ఉండటంతో బాలిక నాయనమ్మ తాతయ్యల వద్ద ఉంటోంది. వడ్డివారిపేట చెందిన వివాహితుడు




మోకా గిరిబాబు (35) బుధవారం గురుకుల వసతి గృహానికి వచ్చి బాలికను ఆసుపత్రికి తీసుకు వెళ్ళాలని, పంపించమని గురుకుల పాఠశాల యాజమన్యాన్ని కోరగా అందుకు వారు నిరాకరించారు. దీంతో అతను వెను తిరిగి వెళ్ళిపోయాడు. మరి కొద్ది సమయానికి తాను ఆ బాలిక మేనమామ భార్యను అని చెప్పి ఓ మహిళ వసతి గృహానికి వచ్చి బాలికను తీసుకుని వెళ్లింది. అయితే బుధవారం సాయంత్రం ప్రిన్సిపాల్ డీ శారద హాజరు పరిశీలనలో ఒకరు తక్కువ ఉండటాన్ని గుర్తించి బాలికను ఇంకా ఎందుకు పంపలేదని విద్యార్థిని నాయనమ్మకు ఫోన్ చేయగా తాను ఎవరినీ పంపలేదని, తమ మనమరాలు మా ఇంటికి రాలేదని చెప్పింది. దీంతో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సెక్యూరిటీ సిబ్బంది పై పోలీసులకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే మోకా గిరిబాబు గురువారం ఆ బాలికను గురుకుల పాఠశాల వద్ద వదిలి వెళ్ళిపోయినట్టు సమాచారం. బాలిక నాయనమ్మ, బంధువులు గురువారం గురుకుల పాఠశాలకు చేరుకుని ఆందోళనచేపట్టి పోలీసులను ఆశ్రయించారు. తాము గురుకుల పాఠశాలలోకి పర్మిషన్ కోసం వెళ్లాలంటే ఎన్నో ఆంక్షలు పెడతారని అటువంటిది బయట వ్యక్తులు వచ్చి పంపించమంటే ఎలా పంపించారని పాఠశాల సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా కూడా ఎటువంటి బాధ్యతా లేకుండా ఇంత నిర్లక్ష్యంగా ఎలా



ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సెక్యూరిటీ పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు. అమలాపురం డీఎస్పీ ఎస్ఆర్కే ప్రసాద్ పర్యవేక్షణలో ముమ్మిడివరం సీఐ ఎం మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైద్య పరీక్షలు నిమిత్తం విద్యార్థినిని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గిరిబాబు కూడా వచ్చి బాలికను తీసుకువెళ్లిన మహిళ ఎవరనేది గుర్తించారని సమాచారం.

# గుర్తింపు కోసం నేను పనిచేయను..

**హైదరాబాద్, డిసెంబరు 4:** రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ప్రపంచాన్ని శాసిస్తుందని డిప్యూటీ సీఎం విక్రమార్క పేర్కొన్నారు. అయితే, తెలంగాణ 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి చేరుకోవాలని ప్లాన్ చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన క్వాంటం పవర్డ్ ఎకానమీ స్ట్రాటజీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. క్వాంటం టెక్నాలజీ గురించి దేశం చర్చిస్తుంది.. దాని ఆవిష్కరణకి తెలంగాణను ఎంచుకున్నందుకు నీతి ఆయోగ్ కి ధన్యవాదాలు చెప్పుకొచ్చారు. డిజిటల్, టాలెంట్‌కి

హైదరాబాద్ కి కేంద్రంగా మారింది అన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా టెక్నాలజీని ప్రమోట్ చేసే పనిలో ఉన్నారు.. నీతి ఆయోగ్ కూడా గ్లోబల్ సమ్మిట్‌లో భాగస్వామ్యం కావాలని కోరుతున్నాం.. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అన్ని రంగాల పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం.. యంగ్ ఇండియా స్టార్టప్ కోసం ఫండింగ్ చేయాలని నిర్ణయించాం.. 1000 కోట్ల రూపాయలతో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. 'క్వాంటం సిటీ'గా హైదరాబాద్ ను తీర్చిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర




ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీని రూపొందించా మన్నారు. గచ్చిబౌలిలోని 'ఐఐఐటీ హైదరాబాద్'లో 'నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం అండ్ తెలంగాణ క్వాంటం స్ట్రాటజీని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు.

'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీలో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్‌లో ఆర్‌అండ్ డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమే కాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశా నిర్దేశర చేసే 'డైరెక్షన్' అని అన్నారు. ఈ టెక్నాలజీ లో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్'కు కూడా శ్రీకారం చుట్టామన్నారు.

# పాక్‌కు సైనిక సమాచారం

## ఇద్దరిని అరెస్ట్ చేసిన గుజరాత్ ఏటీఎస్

**న్యూఢిల్లీ,డిసెంబరు 4:** సైనిక వ్యవహారాలకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ఓ ఆర్మీ విశ్రాంత ఉద్యోగి, మరో మహిళను గుజరాత్ ఏటీఎస్ అరెస్టు చేసింది. ఈ ఇద్దరూ పాకిస్థానీ ఏజెంట్లతో సమాచారాన్ని పంచుకుంటున్నట్లు గుర్తించింది. సైన్యం కదలికలు, కీలక అధికారుల బదిలీల గురించి సమాచారం అందించమని అతన్ని పాక్ నిఘా సిబ్బంది ప్రలోభపెట్టినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు.. కొంతమంది సైనిక సిబ్బందిని హనీట్రాప్ చేయమని ఆ మహిళకు చెప్పారన్నారు. ఈ గూఢచర్య నెట్‌వర్క్‌కు సంబంధించిన ఆధారాలను నిందితుల ఫోన్ల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుజరాత్ ఏటీఎస్ ఎస్పీ సిద్దార్థ్ కోరుకొండ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన అజయ్‌కుమార్ సింగ్ (47) సైన్యంలో పనిచేసి 2022లో రిటైరయ్యాడు. ప్రస్తుతం గోవాలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతడు సైన్యంలో సుబేదార్‌గా ఉన్నప్పుడే.. 'అంకిత శర్మ' పేరుతో ఓ పాకిస్థానీ నిఘా అధికారి అతన్ని సంప్రదించాడు. పరిచయం పెంచుకుని.. భారత ఆర్మీ రెజిమెంట్ల కదలికలు, కీలక ఆర్మీ అధికారుల బదిలీల వంటి సున్నితమైన సమాచారాన్ని టెక్స్ట్, ఫొటోలు, వీడియోల రూపంలో పంపించాడు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రష్మణి పాల్ (35).. 'ప్రియా ఠాకుర్' అనే నకిలీ గుర్తింపుతో పనిచేస్తోంది. డబ్బుకు ఆశపడి పాక్ ఏజెంట్లు చెప్పినట్లు.. సైనిక సిబ్బందితో స్నేహం చేయడం ద్వారా వారి నుంచి సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం.




# థాంక్యూ సీఎం గారు

## రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు

**ఆదిలాబాద్, డిసెంబరు 4:** ఆదిలాబాద్‌కు విమానాశ్రయం కావాలని గతంలో సీఎం రేవంత్ రెడ్డిని తాను అడిగానని బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. కేంద్రం మంజూరు చేస్తే.. కావాల్సిన సహకారం అందిస్తానని సీఎం అన్నారని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్న సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు. ఆదిలాబాద్‌లో సీఎం పర్యటించారు. ఇందిరా ప్రియదర్శిని మైదానంలో బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాయల్ శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్తే అంగీకరించారని, విమానాశ్రయా నికి వెంటనే 800 ఎకరాల భూసేకరణకు సీఎం ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. మాజీ సీఎం కెసిఆర్ ప్రభుత్వం ఆదిలాబాద్ విమానాశ్రయానికి భూమి ఇచ్చేందుకు ముందుకు రాలేదని విమర్శించారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా సీఎంను కలుస్తానని చెప్పారు. చనాఖా– కొరాట ప్రాజెక్టుకు పెండింగ్ నిధులు విడుదల చేయాలని, సోయాబీన్ పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరంతున్నానని అన్నారు. ఆదిలాబాద్‌కు యూనివర్శిటీ మంజూరు చేయాలని రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నానని పాయల్ శంకర్ తెలియజేశారు.



# రెండు పోలీస్ కమిషనరేట్ల వెబ్‌సైట్లు హ్యాక్

**హైదరాబాద్, డిసెంబర్ 3:** తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఇటీవలే హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన సైబర్ క్రిమినల్స్.. తాజాగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లను పనిచేయకుండా చేశారు. దీంతో గద పది రోజులుగా రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లు పూర్తిగా నిలిచిపోయాయి. వీటిలోకి మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే అధికారిక సమాచారానికి బదులుగా గేమింగ్ సైట్లకు రీడైరెక్ట్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో సర్వర్లను డౌన్ చేసి వాటిని నిర్వహిస్తున్న ఎన్ఐసీకి సమాచారం అందించారు. సమస్యను పరిష్కరించేందుకు రెండు కమిషనరేట్లలోని ఐటీ బృందాలు యత్నిస్తున్నాయి. వెబ్‌సైట్ల పునరుద్ధరణకు ఎన్ఐసీ పర్యవేక్షణలో ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల పోలీస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. మళ్లీ హ్యాకింగ్ కాకుండా అధునాతన ఫైర్‌వాల్స్ ఆడిట్ చేస్తున్నారు. ఆడిహ్యాకింగ్‌కు కారణమైన ముఠాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో




సమన్వయం చేస్తూ సర్వర్ల భద్రతను బలోపేతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, ఇదే తరహాలో పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు కూడా హ్యాక్ అయినట్లు సమాచారం. ఇప్పటికే డార్క్ వెబ్‌లో 22 వెబ్‌సైట్లకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉందని సైబర్ నిపులు చెబుతున్నారు.

### ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ

# చర్యలు చేపట్టాలి

### శాంతి భద్రతలపై అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశం



**నర్సీపట్నం ,డిసెంబర్ 4 (మనసులో మాట)..** నర్సీపట్నం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణపై గురువారం స్థానిక స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పోలీస్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని, ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సమయంలో సామాన్యులకు అసౌకర్యం కలగకుండా చూడాలని, అలాగే పట్టణంలో శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో నర్సీపట్నం డిఎస్పీ శ్రీనివాస్, టౌన్ సిఐ గఫూర్, రూరల్ సిఐ రేవతమ్మ, 25 వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేష్, ఎస్సైలు రాజారావు, దామోదర్ పాల్గొన్నారు.


మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
శుక్రవారం 5 డిసెంబర్ 2025




### పరిపాలన వికేంద్రీకరణతోనే

# ప్రజలకు సత్వర న్యాయం

### స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు - నర్సీపట్నంలో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం ప్రారంభం





**నర్సీపట్నం, డిసెంబర్ 4 (మనసులో మాట)..** పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం వికేంద్రీకరణకు పెద్దపీట వేస్తోందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం నర్సీపట్నంలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి అధికారి (డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్(డిడిఓ) కార్యాలయాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు రిబ్బన్ కట్ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించి లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఏర్పాటు చేసిన 77 డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖా మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పీకర్ అయ్యన్నపాత్రుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ గతంలో పంచాయతీలకు సంబంధించిన చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి కూడా జిల్లా కేంద్రాలకు, జెడ్పీ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు డివిజన్ స్థాయిలోనే కార్యాలయాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు, సర్పంచులకు ఎంతో సమయం ఆదా అవుతుందన్నారు. ఈ మంచి నిర్ణయం తీసుకున్నందుకు డిప్యూటీ సీఎం గారికి స్పీకర్ ధన్యవాదాలు తెలిపారు. అలాగే పంచాయతీరాజ్ వ్యవస్థలో సమితులు ఉన్నప్పుడు జరిగిన ప్రమోషన్ల తర్వాత, మళ్లీ ఇప్పుడు పవన్ కళ్యాణ్ చొరవతో అధికారులకు ప్రమోషన్లు రావడం శుభపరిణామని, దీనిపై అధికారులంతా సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ వేదికగా స్పీకర్ అయ్యన్న డిప్యూటీ సీఎం దృష్టికి రెండు ప్రధాన అంశాలను తీసుకువచ్చారు. డివిజనల్ కార్యాలయాలకు ఒకే నమూనాతో శాశ్వత భవనాలను నిర్మించాలని కోరారు. ఉపాధి హామీ పథకం (నరేగా) నిధుల ద్వారా పంట కాలువలకు సిమెంట్ లైనింగ్ చేసే అవకాశం కల్పిస్తే, నీటి వఅధాను అరికట్టి చివరి ఆయకట్టు వరకు నీరందించవచ్చని, దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీనికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జ్ సూర్యచంద్ర, జిల్లా పరిషత్ సీఈవో పీ.నారాయణమూర్తి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, ఆర్డీవో వివి.రమణ, డీఎస్పీ శ్రీనివాస్, టౌన్ గఫూర్, జడ్పిటిసి రమణమ్మ, నర్సీపట్నం డిడిఒ ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



### అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు నిర్మాణంపై

# ఎమ్మెల్యే సమీక్ష

అచ్యుతాపురం, డిసెంబర్ 4 మనసులో మాట : అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆదేశించారు. ఏపీఐఐసీ కార్యాలయంలో ఆర్అండ్బీ సమీక్షలో మాట్లాడుతూ, అవసరమైతే మ్యాన్పవర్ పెంచి పనులను స్పీడ్లో పూర్తిచేయాలని చెప్పారు. రోడ్డు కల్వర్టుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో వివరాలు తెల్సుకున్నారు. తదుపరి సమావేశానికి రోడ్డు రూపురేఖలు, పనుల పురోగతి మొత్తం డిజిటల్గా సిద్ధం చేయాలని ఆయన సూచించారు. రోడ్డు పూర్తయ్యేంతవరకూ రోజువారీ పనుల ప్రణాళికను అధికారులు ముందురోజే సిద్ధం చేయాలని ఆదేశించారు. పనులు కొనసాగుతున్న సమయంలో ట్రాఫిక్కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి సర్కిల్ పరిధిలో నేర నియంత్రణ, ప్రమాదాల నివారణపై స్పష్టమైన చర్యలు రూపొందించాలని ఆయన స్పష్టం చేశారు. అండర్గ్రౌండ్ ఎలక్ట్రికల్ లైన్ పనుల పురోగతిపై సమాచారం తీసుకున్న ఎమ్మెల్యే, రైతులకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకం రాకుండా చూడాలని పేర్కొన్నారు. డి.ఆర్ల విషయంలో ఉన్నతాధికారులతో నిరంతరం చర్చించి, వీలైనంత వేగంగా పూర్తి చేసి, భూస్వాములకు అందజేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన రెవెన్యూ సేవలను ఆలస్యం లేకుండా అందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో నాలుగు మండలాల ఎమ్మార్వోలు పాల్గొన్నారు.



### రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను మర్యాద పూర్వకంగా కలిసిన బుద్ద నాగజగదీష్

**అనకాపల్లి, డిసెంబర్ 4 (మనసు లో మాట):** విశాఖపట్నం విమానాశ్రయంలో గురువారం తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటి, విద్య శాఖమంత్రి నారా లోకేష్ ను టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు మర్యాదపూర్వకంగా కలుసుకోవడం జరిగింది. విజయనగరం జిల్లా పార్వతీపురం పర్యటనకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు కలిసి స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం రాష్ట్ర మంత్రి లోకేష్ ఎలా ఉన్నారని నాగ జగదీష్ ను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం జరిగింది.

## రాజీయే - రాజమార్గం



విజయనగరం:(మనసులో మాట): డిసెంబర్: 4:: ఈనెల 13వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మరియు ఛైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఎం బబిత తెలిపారు. విజయనగరం జిల్లాలో ఉన్న న్యాయమూర్తులతో భౌతికంగానూ మరియు పార్వతీపురం జిల్లాలో ఉన్న న్యాయమూర్తులు అందరితో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు మరియు ఎగ్జిక్యూషన్ పిటిషన్ ,ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలు ,వాటర్ కేసులు, మున్సిపాలిటీ కేసులు మరియు ప్రి లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేయాలని తెలియజేశారు. లోక్ అదాలత్ కు సంబంధించి ప్రజలలో విస్తృత అవగాహన ప్రచారం చేయాలని సూచించారు.

## అనకాపల్లి లోని వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే

### - కొణతాల రామకృష్ణ సమీక్ష



**అనకాపల్లి, డిసెంబర్ 4 (మనసులో మాట):** అనకాపల్లి గుండాల జంక్షన్ లో గల జీవీఎంసీ ఎస్ఆర్ శంకరన్ మీటింగ్ హాల్ లో గురువారం వివిధ శాఖల అధికారులతో మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించారు. హౌసింగ్, అగ్రికల్చర్, రెవెన్యూ, పంచాయతీరాజ్, జివిఎంసి, హెల్త్ కు సంబంధించిన అధికారులతో ఈ సమీక్షా సమావేశం జరిగింది. అనకాపల్లి నియోజకవర్గ అభివృద్ధి కి సంబంధించిన విషయాలపై చర్చించి అధికారులతో సమీక్ష జరిపి పలు సూచనలు చేసారు. ప్రధానంగా 11 గ్రామాలకు చెందిన కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ విషయంపై హెల్త్ ఆఫీసర్లతో సమీక్ష చేసి మందులు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయుష్మాన్ మందిర్ ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి స్థల పరిశీలన త్వరితగా పూర్తి చేసి సంబంధిత డిపార్ట్మెంట్ కి స్వాధీనం చేయాలని తహశీల్దార్ కి ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రతి సోమవారం జరుగు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్), ప్రజా దర్బార్ పై సమీక్ష చేసి, ఇప్పటి నుండి పిజిఆర్ఎస్, ప్రజా దర్బార్ లలో అనకాపల్లి మండలం, కసింకోట మండలం,జివిఎంసి లకు సంబంధించి ఒక్కొక్కవారం చొప్పున తను పాల్గొనడం జరుగుతుందని అధికారులతో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆయేషా , జివిఎంసి జోనల్ కమిషనర్ చక్రవర్తి, డిప్యూటీ ఎంపిడిఓ తోటరావు, జిఎస్డబ్ల్యూఎస్ సుబ్బలక్ష్మి , సిపిడిఒ ప్రభావతి , ఎంఈఒ సురేష్ , అగ్రికల్చర్, ఎఈ ఆర్డబ్ల్యూఎస్ కే శ్రీనివాస్ , హౌసింగ్ ఎఇ వెలగా శ్రీనివాస్ , మెడికల్ అండ్ వెటర్నరీ ఆఫీసర్స్, ఎపిఓ ఎం శ్రీనివాస్, అధికారులు, ఇంచార్జ్ అధికారులు, విజన్ యాక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో

## డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయం

### - జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్



**పాడేరు, మనసులో మాట, డిసెంబర్ 04 :** పరిపాలన సౌలభ్యం కోసం జిల్లా పరిధిలో డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ( డీడీవో ) కార్యాలయం పాడేరు కేంద్రముగా ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు . గురువారం పాడేరు జిల్లా కేంద్రములో నూతనంగా నిర్మించిన డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ( డీడీవో ) కార్యాలయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్తూరు ఆర్డీవో కార్యాలయము నుండి వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్య క్రమములో జిల్లా కలెక్టర్ వారు మాట్లాడుతూ రాష్ట్రములో 77 డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ( డీడీవో ) కార్యాలయాలను ప్రారంబిస్తే అందులో పాడేరు కేంద్రముగా ఒక కార్యాలయమును ప్రారంబించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులుకి అల్లూరి సీతారామ రాజు జిల్లా ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపారు . ఈ కార్యాలయాల్లో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి డిడిఓ, డి ఎల్ పి ఓ, ఏపిడి, డ్వామా ఇతర అధికారులు సేవలందించనున్నారన్నారు. డివిజినల్ డెవలప్మెంట్ కార్యాలయాల ఏర్పాటుతో ప్రతి పంచాయతీ స్వయం ప్రతిపత్తి కలిగి స్వతంత్రంగా వ్యవహరిస్తూ ప్రజల అవసరాలను తీర్చగలమని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలను సమీకృతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ చేయవచ్చున్నారు. జిల్లాలో ఉన్నటువంటి వందల వేల ఎకరాలలో నాణ్యమైన పంటలు పండించడం ద్వారా అధిక ఆదాయాన్ని ఆర్జించడంతో పాటు భవిష్యత్తు తరాలకు మంచి వ్యవసాయ విధానాలను అందించిన వాళ్ళమవుతామన్నారు . గ్రామాలను సుసంపన్నం చేయుటకు గ్రామ సచివలయాలను బలోపేతం చేయుటకు ప్రభుత్వ సంక్షేమ పధకాలు పారదర్శకంగా ప్రజలకు అందించుటకు ఈ కార్యాలయాలు ఉపయోగపడతాయన్నారు. గ్రామ సచివాలయాలలో ఉన్నటువంటి సిబ్బందిలో అధికముగా ఈ ప్రాంతం వారే కాబట్టి స్థానిక వాతావరణ పరిస్థితులు , వ్యవసాయ పంటలు సాగుచేసే విధానముపై అవగాహన ఉంటుంది కాబట్టి ప్రాంత రైతులతో మమేకమై ఉత్తమమైన సాగు విధానాలు అవలంబించేలా ప్రోత్సాహించనున్నారు. ఈ కార్యక్రమములో పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖల పాలనాపరమైన సంస్కారణాల్లో భాగంగా జిఓఎంఎస్ నెంబర్ 57, 58 లను తీసుకు రావడం జరిగిందని తెలిపారు. మండల స్థాయిలో అభివృద్ధి శాఖకు ఎంపిడిఓ లు, రెవెన్యూ శాఖకు తహశీల్దార్ లు, పోలీస్ శాఖ కు సర్కిల్ ఇన్స్పెక్టర్ లు ఉంటారని, వీరికి సంబంధించి రెవెన్యూ మరియు పోలీస్ శాఖ కు మాత్రమే డివిజినల్ కార్యాలయాలు ఉన్నాయని, ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల తో ఇక పై పంచాయతీరాజ్ శాఖకు కూడా ఒక డివిజినల్ స్థాయి అధికారి ఉంటారన్నారు. గ్రూప్ 1 ద్వారా కూడా ఈ పోస్ట్ లను భర్తీ చేయవచ్చున్నారు. ప్రభుత్వం ఉద్యోగాలను ఆశిస్తున్న యువతకు ఒక గొప్ప అవకాశం అన్నారు. ఈ కార్యక్రమములో పాడేరు ఎంపిపి సోనావాయి రత్నకుమారి , పాడేరు జడ్పిటిసీ కిముడు గాయత్రీ దేవి , సర్పంచ్ పాడేరు కొట్టగుళ్ళ ఉషా రాణి , డివిజనల్ పంచాయతీ అధికారి కే పి చంద్ర శేఖర్ , డ్వామా పిడి విద్య సాగర్ , సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

### అరకులోయ, పాడేరు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి

## ఎస్టి కమిషన్ సభ్యుల వినతి



**అరకులోయ, డిసెంబర్ 4 (మనసులో మాట):** అరకులోయ పాడేరు ప్రాంతాలను మరింత పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యులు కిల్లో. సాయిరాం, కద్రక.మల్లేశ్వర రావులు కలిసి పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ను వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ సభ్యులు సాయిరాం మల్లేశ్వరరావు మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలు ప్రకృతి సౌందర్యం ఆదివాసి సంస్కృతి చారిత్రక ప్రాధాన్యతాలతో ప్రత్యేక పర్యాటక ప్రాంతాలుగా గుర్తింపు పొందుతున్నందున పర్యాటక రంగంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చర్యలు చేపట్టాలని మంత్రిని కోరినట్లు వారు తెలిపారు. మంత్రి పర్యాటక రంగం అభివృద్ధిపై సానుకూలంగా స్పందించి పర్యాటరంగం అభివృద్ధి పథంలో రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడమే కాకుండా ఆ ప్రాంతాలను పర్యాటక అభివృద్ధి దిశగా ముందడుగు వేయడం జరుగుతుందని హామీ ఇచ్చినట్లు ఎస్టీ కమిషన్ సభ్యులు సాయిరాం మల్లేశ్వరరావు తెలిపారు.

### కూటమి ప్రభుత్వానికి

## అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు

### ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్



**మునగపాక, డిసెంబర్ 4, మనసులో మాట,** అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు రాకెట్ స్పీడులో భారతదేశంలోని ఏ రాష్ట్రము చేయనంత పనులు ఒక ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం హయాంలోనే జరుగుతున్నాయని ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ పేర్కొన్నారు. మునగపాక మండలం కాకరపల్లి పంచాయతీ భవన నిర్మాణ పనులకు స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. పంచాయతీ భవన నిర్మాణంచనా విలువ 32 లక్షలు కాగా మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం నుండి ఏడు లక్షలు, రాష్ట్రీయ గ్రామ స్వరాజబియాన్ నిధులుండి 25 లక్షల రూపాయలు మంజూరు కాబట్టే వీటితో సరవేగంగా పనులు పూర్తిచేసి పంచాయతీ భవనం నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశు రాము, ఎలమంచిలి నియోజకవర్గం టిడిపి నేత దొడ్డి శ్రీనివాసరావు, దాడి ముసలి నాయుడు, అనకాపల్లి అవకాల్లువా చైర్మన్ ఆడారి ఆనంద సన్యాసినాయుడు, ఆడారి జనార్దన్ రావు, గ్రామ సర్పంచ్ కొల్లి ముసలయ్య, ఎంపీటీసీ సభ్యురాలు ఇల్ల శిరీష, కోయిలాడ దశావతారం, దొడ్డి రమేష్, పినాగు, మొల్లేటి ఆనంద్ పలువురు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



# హిడ్మా ది ముమ్మాటికీ బూటకపు ఎన్కౌంటరే

## సామాజిక కార్యకర్త, ఆర్టీఐ జిల్లా కో ఆర్డినేటర్ అర్జున్ రెడ్డి

**గూడెం/సీలేరు డిసెంబర్ 04:(మనసు లో మాట).** అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం, మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఈ మధ్య ఎన్కౌంటర్ జరిగిందని, మీడియాలో, సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్న విషయం దేశ వ్యాప్తంగా తెలిసిందే. అయితే వాస్తవమైతే, బూటకపు ఎన్కౌంటర్ చేసి, హిడ్మా దంపతులను పోలీసులు చంపేశారని సామాజిక సేవకుడు, జిల్లా ఆర్టిఐ కో ఆర్డినేటర్ అర్జున్ రెడ్డి ఆరోపించారు. ఇది నూటికి నూరుశాతం నిజం. పోలీసులు కరెక్ట్ కాదు అని చెప్పడానికి నా దగ్గర చాలా ఆధారాలు ఉన్నాయని అర్జున్ రెడ్డి అన్నారు. నేను హై స్కూల్ లో చదివే రోజుల్లో నా తోటి విద్యార్థులను చిన్న పని ఉందని చెప్పి, స్కూల్ నుంచి పోలీసులు రాత్రికి రాత్రే విశాఖపట్నం జిల్లాకు తరలించేశారని అర్జున్ రెడ్డి అన్నారు. ఉదయం చూస్తే, ప్రతీ ప్రింట్ మీడియాలో జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు అని ప్రచారం జరిగిందని అన్నారు. పోలీసుల్లో మానవత్వం, నీతి నిజాయితీ 95 శాతం మందిలో ఉండదని అన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగితే, పోలీస్ స్టేషన్లో న్యాయం జరగదని, ఎవరైతే లంచం ఇస్తారో వాళ్ళకి మాత్రమే న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అధికారులు, రాజకీయ నాయకులు అణగారిన వర్గాలకు సరైన వైద్యం, విద్యా మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైనప్పుడు నక్సలిజం పుట్టుకొస్తుందని, నక్సలైట్లు పోలీసులు కాల్చుకుని చంపుకోవడం ఈ రెండు వర్గాల వారిది కాదని, ప్రభుత్వం పరిపాలించే సందర్భంలో రాజకీయ వ్యవస్థలో అవినీతి, దోపిడీ అరికట్టే సందర్భంలో ఇరువురు కాల్చుకుని చంపుకోవడం జరుగుతుందని, అధికారులు, రాజకీయ నాయకులు సరిగా పరిపాలన ప్రజలకు అందిస్తే, నక్సలిజం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉండదని అన్నారు.

# రేవుపోలవరంలో భక్తి శ్రద్ధలతో శ్రీ దత్త జయంతి



**ఎస్. రాయవరం, డిశంబర్ 4,(మనసులో మాట):**మండలంలోని రేవుపోలవరం షిర్డిసాయిబాబా ఆలయంలో శ్రీ దత్తాత్రేయ జయంతి వేడుకలు భక్తులు అత్యంత భక్తిశ్రద్దలు తో నిర్వహించారు. సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని దత్త త్రేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలు నుండివచ్చిన భక్తులు పూజలు, భజనలు నిర్వహించారు. బాబాఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామం. లలిత సహస్రనామ పారాయణంతోపాటు సాయిబాబాహారతి, సమూహిక భజన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంవద్ద ఉచిత అన్న సమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బాబా ఆలయ అర్చకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

# హిందీ పండితుల పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

**చీడికాడ డిసెంబర్ 4, (మనసులో మాట)..** మండల కేంద్రమైన చీడికాడ హైస్కూల్లో హిందీ పండితు పోస్టు ఖాళీగా ఉందని మండల విద్యాశాఖ అధికారి బొంజు బాబు తెలిపారు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ర పోస్టుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు అర్హత కలిగిన హిందీ పండితు చేసిన యువతీ యువకులు శనివారం సాయంత్రం ఐదు గంటలు లోపు చీడికాడ మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని బొంజు బాబు తెలిపారు

# రైతు ఆదాయం సర్క్యులర్ ఎకానమీ

## జిల్లా జి.వి.ఎ. పెరుగుదలకు రైతులే బలమైన ఆధారం - జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి




**విజయనగరం(మనసులో మాట): డిసెంబర్ 4:** జిల్లాలో వ్యవసాయ రంగాన్ని సమగ్రంగా బలోపేతం చేయడం, రైతుల ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, అందులో భాగంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా రైతులతో వర్క్ షాపులు నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. బొండపల్లి మండలం గొట్లాం రైతు సేవ కేంద్రంలో ఏర్పాటుచేసిన వర్క్ షాప్ లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమాన్ని రైతు ఆదాయం పెంపుతో కూడిన సర్క్యులర్ ఎకానమీ మోడల్గా ప్రభుత్వం గుర్తించిందని, ప్రతి శాఖ సమన్వయంతో వ్యవసాయ ఉత్పాదకతను పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లా జి.వి.ఎ పెరుగుదలకు వ్యవసాయ రంగం కీలకమన్నారు. రైతు ఆదాయం పెరిగితే జిల్లా ఆర్థిక ప్రగతి వేగవంతమవుతుందని పేర్కొన్నారు.రైతులను ఉద్యాన పంటల వైపు విస్త ృతంగా ప్రోత్సహించాలని, ముఖ్యంగా ఆయిల్ పామ్, మామిడి, జీడిపప్పు వంటి పంటల్లో మొదటి ఐదు సంవత్సరాలు అంతర పంటలు వేసి అదనపు ఆదాయం పొందే అవకాశాలను వివరించాలని ఆదేశించారు.అంతర పంటలతో రైతుకు తక్షణ ఆదాయం లభించడంతో పాటు, ప్రధాన పంటలకు అనువైన నేల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని చెప్పారు.డ్రోన్లు, మట్టి ఆరోగ్య కార్డులు, మొబైల్ యాప్ల ద్వారా నిరంతర పర్యవేక్షణ వంటి అధునాతన టెక్నాలజీ వినియోగం వ్యవసాయంలో తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు.రైతుల ఉత్పత్తులకు విలువ జోడించేందుకు గ్రామ, మండల స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, యువతను కూడా ఈ రంగంలో ప్రోత్సహించాలని సూచించారు.

డిసిసిబి చైర్మన్ నాగార్జున మాట్లాడుతూ,రైతుల ఆదాయం, జీవన ప్రమాణం పెరగాలంటే వినూత్న పద్ధతుల్లో, మార్కెట్ డిమాండ్కు అనుగుణంగా పంటలు పండిరచాల్సిన అవసరం ఉందని సూచించారు. పండిన పంటలను గ్రేడిరగ్, ప్యాకింగ్, నాణ్యత ప్రమాణాలతో విక్రయిస్తే మంచి లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వివరించారు.రైతులు పంటలు పండిస్తూనే అరకొర జీవితం గడుపుతున్నారనీ, ఈ పరిస్థితి మారాలంటే ప్రస్తుత పద్ధతులను మార్చాలని స్పష్టం చేశారు.వ్యవసాయ ఖర్చులను తగ్గిస్తూ, ఉత్పత్తిని పెంచే ఆధునిక సాంకేతికత వైపు రైతులను తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.అదేవిధంగా, డిసిసిబి తరపున ఇళ్లలో రూఫ్ గార్డెనింగ్ కోసం సహకారం అందిస్తామని తెలిపారు. ఇది కుటుంబ స్థాయి ఆహార భద్రతకు, పట్టణాలలో పచ్చదన విస్తరణకు దోహదం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పడాల అరుణ, బిజెపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, ఏఎంసి చైర్మన్ గోపాల్ రాజు, జనసేన ఇన్చార్జ్ సురేష్, జిల్లా వ్యవసాయ అధికారి జిటి రామారావు, పలువురు రైతు సంఘం ప్రతినిధులు, రైతులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మచెక్కిన బొమ్మను చూడాల్సిందే : భీశెట్టి



**విజయనగరం (మనసులో మాట) డిసెంబర్ 4:** దేశవ్యాప్తంగా ఒక తెలుగు నాటిక కర్ణాటక, మహారాష్ట్ర,తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సంచలనం స ృష్టిస్తున్న అమ్మచెక్కిన బొమ్మ నాటికను విజయనగరం జిల్లా ప్రజలు యువతీ యువకులకు చూడాలనే ఉద్దేశంతో డాక్టర్ పి.వి.జి.రాజు కళావేధిక,మరియ హెల్పింగ్ హ్యాండ్స్ ఇజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 7 ఆదివారం రాత్రి 7 నుండి 8 వరకూ స్థానిక గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియంలో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశామని డాక్టర్ పీవీజీ రాజు కళావేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు, గురువారం కమీటీ సభ్యులతో కలిసి నాటక వివరాలు విడుదల చేసారు భీశెట్టి మాట్లాడుతూ గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్, తెలంగాణా కళాకారులు అమ్మచెక్కిన బొమ్మ నాటిక ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తున్నారని రచయిత జ్యోతిరాజ్ భీశెట్టి, దర్శకుడు డాక్టర్ వెంకట్ గోవాడ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో ఈ నాటిక ఎక్కడ ప్రదర్శన జరిగినా అదుతేమైన ప్రజాదరణ పొందుతుంది అందుకే విజయనగరం లో ఏర్పాటు చేశామని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని సమయానికి నాటిక ప్రారంభిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రేగాన శ్రీనివాసరావు, తుమ్మగంటి రామ్మోహన్ రావు,బోర రమేష్,తాడేపల్లి నాగేశ్వరరావు, ఇప్పలవలస గోపీ, దవడ కొండబాబు,పిడకల ప్రభాకరరావు, జలంత్రి రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# కోటి సంతకాల ఉద్యమంలో సిరమ్మ బిజీ..బిజీ



**విజయనగరం (మనసులో మాట) డిసెంబర్ 4:** భీమిలి నియోజకవర్గం, భీమిలి 4వార్డు , మంగమారి పేటలో గురువారం డి.కొండబాబు మరియు వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు భీమిలి నియోజకవర్గం పాల్ రమణ ఆధ్వర్యంలో జరుగు కోటిసంతకాలు కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ తన తండ్రి ఆదేశాలు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా జరుగుతున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య , వైద్యం ప్రజల కనీస హక్కు అని , ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిని ప్రజలకు దూరం చేస్తోందని అన్నారు. మెడికల్ కాలేజీలకు వ్యతి రేకంగా ఈ కోటి సంతకాలు కార్యక్రమం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ప్రజాప్రతినిధులు, స్థానిక ముఖ్య నాయకులు, కార్య కర్తలు,చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిశ్రమ-విద్యా సహకారాన్ని బలోపేతం

## - ఎం.వి.జి.ఆర్ అవగాహన ఒప్పందం



**విజయనగరం (మనసులో మాట) డిసెంబర్ 4:** పరిశ్రమ-విద్యా సహకారాన్ని బలోపేతం చేయడానికి మరియు విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఎం.వీ.జీ.ఆర్ కళాశాల మరియు పెన్నాంట్ టెక్నాలజీస్ గురువారం అవగాహన ఒప్పందం చేసుకోవడం జరిగింది. ఈ అవగాహన ఒప్పంద కార్యక్రమంలో పెన్నెంట్ టెక్నాలజీస్, సి.హెచ్.ఆర్.ఓ కంప్లైయన్స్ హెడ్ రవి వర్మ దాట్ల, ఎం.వీ.జీ.ఆర్ కళాశాల డైరెక్టర్ పి. ఎస్. సీతారామ రాజు ఎం.వీ.జీ.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా. వై. ఎం. సి. శేఖర్,ఎం.వీ.జీ.ఆర్ కళాశాల శిక్షణ ప్లేస్మెంట్స్ డీన్ డా. ఎం. సునీల్ ప్రకాష్ ఇతర డీన్లు, హెచ్ఓడిలు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.ఎం.వీ.జీ.ఆర్ కళాశాల మరియు పెన్నాంట్ టెక్నాలజీస్ డిసెంబర్ మధ్య ఈ వ్యూహాత్మక భాగస్వామ్య సహకారం పరిశోధన, విద్య, ఆవిష్కరణ, అభివృద్ధి, సామర్థ్య నిర్మాణం మొదలైన వాటిని ముందుకు తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యం. ఈ సహకారం ఎం.వీ.జీ.ఆర్ కళాశాల విద్యార్థులను పరిశ్రమ-సిద్ధమైన సామర్థ్యాలతో సిద్ధం చేయడం మరియు ఆవిష్కరణ, ఆచరణాత్మక అభ్యాసం మరియు వృత్తిపరమైన అభివృద్ధి పట్ల సంస్థ యొక్క నిబద్ధతను బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.ఇంటర్న్షిప్లు, ల్కైవ్ ప్రాజెక్టు, పరిశ్రమ నేత ృత్వంలోని వర్క్షాప్లు, ఫ్యాకల్టీ శిక్షణ మరియు పాఠ్యాంశాలకు అనుగుణంగా నైపుణ్య అభివ ృద్ధి కార్యక్రమాలపై ఈ ఒప్పందం ద ృష్టి పెడుతుంది. పెన్నెంట్ టెక్నాలజీస్ క్రమం తప్పకుండా సాంకేతిక సెషన్లను నిర్వహిస్తుందని మరియు శిక్షణ మరియు ఇంటర్న్షిప్ అవకాశాల ద్వారా రియల్-టైమ్ ఎక్స్పోజర్ను అందిస్తుందని పెన్నెంట్ టెక్నాలజీస్ సంస్థ తెలిపింది.

# కార్మిక హక్కులకై సీఐటీయూ పోరాటం: విశాఖ

## అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు




**అచ్చుతాపురం డిసెంబర్ 4 మనసులో మాట:** సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు డిసెంబర్ 31 నుంచి విశాఖపట్నంలో జరగనున్న సందర్భంగా అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అచ్చుతాపురం ఎస్ఈజెడ్ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సిఐటియు ఏర్పడిన తర్వాత విశాఖపట్నంలో జరుగుతున్న మొట్టమొదటి చారిత్రాత్మక అఖిలభారత మహాసభలను యావన్మంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మికుల సమస్యలపై అకుంఠిత దీక్షతో పోరాడుతున్న సిఐటియు మహాసభలు ఈ ప్రాంతంలో జరగడం ఈ ప్రాంత పోరాటాలకే వెన్నుదన్నుగా నిలుస్తాయని అన్నారు. అనకాపల్లి జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో కార్మిక హక్కులకై, ఉద్యోగ భద్రతకై సిఐటియు పోరాడుతుందని వారు తెలిపారు. స్కీం వర్కర్ల సమస్యలపై కనీస వేతనాల అమలుకై, అసంఘటిత రంగ కార్మికులకు సిఐటియు ఎల్లవేళలా కృషి చేస్తుందని చెప్పారు. 2026 జనవరి 4న విశాఖపట్నంలో లక్షలాది మందితో జరిగే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభలో దేశంలోనే ఆదర్శంగా ఉన్న కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్తో పాటు అఖిలభారత నాయకత్వం పాల్గొంటున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రె అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్. రాము, మండల



# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి - పప్పల

**అచ్చుతాపురం డిసెంబర్ 4 మనసులో మాట :** అచ్చుతాపురం దివ్యాంగుల ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల ను పాఠశాల వ్యవస్థాపకులు పి ఎస్ టి పట్నాయక్ ఆధ్వర్యంలో ఈనెల 3 తేదీ నుండి 10 తేదీ వరకు దివ్యాంగుల వారోత్సవాలు జరుగుచున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పప్పల చలపతి రావు మాట్లాడుతూ దివ్యాంగులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఇంద్ర ధనస్సు పేరుతో 7 వరాలు ప్రకటించారని, దివ్యాంగులకు కూడా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించారని, కూటమి ప్రభుత్వం మరల రాయితీ రుణ పథకాన్ని పునరుద్ధరించిందని, దివ్యాంగులకు ప్రత్యేకంగా డిగ్రీ కళాశాల ను బాపట్ల లో ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారని, రాజధాని నగరంలో దివ్యాంగులకు ప్రత్యేకంగా దివ్యాంగ భవనం నిర్మిస్తామని, దివ్యాంగులలో క్రీడా ప్రతిభను చాటే ప్రత్యేకంగా శాప్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని , తెలిపారు దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్ ను చంద్రబాబు నాయుడు 12 రెట్లు పెంచారని గతంలో 500 నుంచి 6 వేల వరకు పెంచారని, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి 15వేల రూపాయలు అందిస్తున్నారని, అధికారంలోకి వచ్చిన తరువాత రెండు నెలలు నెల ముందు నుంచే పెన్షన్ పెంపు అమల్లోకి వచ్చిందని, ఈ మధ్యకాలంలో అంధ క్రికెటర్లు ప్రపంచ కప్ నెగ్గడంతో మనకెంతో స్ఫూర్తిదాయకమైన విషయమని, వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని, దివ్యాంగుల అభివృద్ధికి మరియు వారి యొక్క సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీల తులసీరామ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు, మండల ప్రధాన కార్యదర్శ కాంద్రేగుల అప్పారావు, పిఎసిఎస్ చైర్మన్ దేశం శెట్టి వెంకటరమణ, పుర్రె శ్రీనివాసరావు, నియోజవర్గ ఐటీడీపీ ఇంచార్జ్ పతివాడ చిన్నయ్య నాయుడు, లాలం నాగేశ్వరరావు, రాజాన రామనాయుడు, దేశం శెట్టి కాసుబాబు, చొప్ప తాతారావు, దేశం శెట్టి తాతీలు తదితరులు పాటు కూటమి నాయకుడు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# మట్టి నమూనాసేకరణ పై రైతులుకు శిక్షణ




**ఎస్. రాయవరం, డిశంబర్ 4, (మనసులో మాట):** ఎస్ రాయవరం మండలం లోని ఉప్పరపల్లి, సైతార్ పేట గ్రామాలలో మట్టినమూనా కార్డ్ లు పంపిణీ, వాటి ఉపయోగాలు పై రైతులుకుశిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలవ్యవసాయ అధికారి సౌజన్య, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి విజేత,కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఏ.బీ.యం. శిరీష(ప్రజనన శాస్త్రం) రైతులుకు శిక్షణను ఇచ్చారు. రైతులు మట్టి నమూనాలను వారి పొలాల నుంచి సేకరించుకొని మట్టి సాయిల్ టెస్టింగ్ చేయించుకోవాలని సూచించారు. మట్టి నమూనాలను ఎలా సేకరించాలి,సాయిల్ టెస్ట్ కార్డ్స్ లో వచ్చిన ప్రామాణికాలు బట్టి మనం ఎరువులు ఎంత వేయాలి అనే దాని పైన ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. రైతులు పచ్చిరొట్ట ఎరువుల తప్పనిసరిగా వాడుకొని భూమిని మరింత సారవంతం చేయాలని ఈ శిక్షణా కార్యక్రమంలో సూచించారు. అధికంగా రసాయనక ఎరువులు వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు అమలకంటి అబద్దం , సర్పంచ్ శ్రీరాములు , ఎస్. రాయవరం పిఎసి ఎస్ చైర్మెన్ తుంపాల నాగేశ్వరరావు , వీ సం అప్పల స్వామి నాయుడు తదితర రైతులతో పాటు గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు సంతోషి, దినకర్, రేవతి,బ్లెసీ, జాస్మిన్ పాల్గొన్నారు.

# ఘంటసాలకు ఘన నివాళి



**విజయనగరం (మనసులో మాట) డిసెంబర్ 4:** మధురగాయకుడు, పద్మశ్రీ ఘంటసాల జయంతి సందర్భంగా గురువారం ఉదయం ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో పట్టణంలోని గుమ్చీవద్ద ఘంటసాల విగ్రహానికి కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు పాలాభిషేకం చేసి పూలమాల వేసారు.ఈకార్యక్రమంలో అధ్యక్షులు దూర్వాసుల రాజేంద్రప్రసాద్ , ఉపాధ్యక్షులు భోగరాజు సూర్యలక్ష్మి, పలువురు కళాకారులు,గాయనీగాయకులు నివాళులు అర్పించారు. వ్యవస్థాపకుడు భీష్మారావు మాట్లాడుతూ ఈఉత్సవాలలో భాగంగా ఈనెల 5న ఆనందగజపతి ఆడిటోరియంలో ఉదయయం పదిగంటలనుండి రాత్రి పదిగంటలవరకు ఘంటసాల సినీసంగీత విభావరి జరుగుతుందని ప్రపంచఖ్యాతిపొందిన మాస్ట్రో శివమణి ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని తెలిపారు.కార్యక్రమానికి ముందు గుమ్చీలో కొలువైన శ్రీఆంజనేయస్వామికి ఘంటసాలపేరిట అర్చనలు నిర్వహించారు.ఆప్రాంగణంలోగల కీ.శే.చొప్పల్లిసూర్యనారాయణ భాగవతార్ విగ్రహానికికూడా కళాపీఠంసభ్యులు. పూలమాలలు వేసారు.

# పునరావతంలో ఉన్న పనులు పరిశీలన



వి మాడుగుల డిసెంబర్ 4 (మనసులో మాట)మాడుగుల మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న డిగ్రీ కాలేజ్ ఎన్నో ఏళ్లగా డిగ్రీ విద్యార్థులు కి స్థిరమైన నిర్మితమవుతున్న సందర్భంగా పనులు పై పరిశీలన మరియు దుర్గాలమ్మ గుడి సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ ల గురువారం పురోగతిని గౌరవ శాసనసభ్యులు శ్రీ బండారు సత్యనారాయణమూర్తి ఆదేశాల మేరకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందా రపు సన్యాసిరావు మరియు ప్రధాన కార్యదర్శి పుప్పాల రమేష్ పరిశీలించడం జరిగింది



## ప్రమాదమని తెలిసి రైతులు చెక్కల వంతెనల మీదే ప్రయాణం

**మునగపాక , డిసెంబర్ 4 , మనసులో మాట..** రైతుల ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను వ్యవసాయ కమతాల నుండి మెయిన్ రోడ్డుకు తీసుకురావడానికి రైతులు ఈ చెక్కల వంతెన పైనే ప్రయాణం సాగిస్తూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. మునగపాక నుండి కసింకోట వెళ్లే రహదారిలో ఇలాంటి వంతెనలు ఎన్నో దర్శనమిస్తున్నాయి. మెయిన్ రోడ్డుకు పంట పొలాలకు మధ్యలో సాగునీటి కాలువలు ఉండడంతో అనునిత్యం రైతులు పండించిన పంటలను ఒడ్డుకు చేర్చడానికి ఈ వంతెనలే మార్గంగా ఎంచుకుంటున్నారు. ప్రమాదమని తెలిసి కూడా రైతులు నిత్యం ప్రయాణం సాగిస్తున్నారు. రైతుల కష్టాలను చూసి ప్రభుత్వం ఇప్పటికైనా చిన్నపాటి వంతెనలు నిర్మాణం చేపట్టి రైతులకు సహకారం అందించవలసిందిగా పలువురు రైతులు కోరుతున్నారు.

## కోర్టు తో చెలగాటం 2నెలల కారాగారం

చోడవరం,నవంబర్ 03(మనసులో మాట ): అరెస్టు వారెంట్ తో న్యాయస్థానం ఎదుట హాజరై తన వాదితో రాజీ కుదుర్చుకుంటానని నమ్మబలికి కోర్ట్ వెసులుబాటు కల్పించేసరికి సిబ్బంది కన్నుగప్పి పరారైన నిందితుని కి రెండు నెలల సాధారణ జైలు శిక్ష తోపాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ తీర్పు వెలువరించారు. చోడవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ అప్పలరాజు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు చీడికాడ పోలీస్టేషన్ పరిధి అర్జునగిరి గ్రామానికి 3బూరె చిలుకు పై కోర్టు పరిధిలో ఉన్న ఒక కేసుకు సంబంధించి న్యాయ స్థానం అరెస్టు వారెంట్ జారీ చేసింది . గత ఏడాది డిసెంబర్ 4న కోర్టు ఫీల్డ్ అసిస్టెంట్ రుద్రరాజు వంశీవర్మ అరెస్టు వారెంట్ అమలు ప్రకారం నిందితుడు చిలుకును కోర్టు కి హాజరుపరిచాడు. కోర్టు ప్రక్రియ సమయంలో తన పై డిక్రీ పొందిన వ్యక్తితో రాజీ కుదుర్చుకుంటానని నమ్మబలకడంతో కోర్టు హాలు బయట కూర్చోమని తెలిపారు. ఇదే అదనుగా నిందితుడు కోర్టు అధికారి అదుపునుంచి తప్పించుకుని ఉడాయించాడు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ వంశీవర్మ ఫిర్యాదు మేరకు నిందితుడు పై ఐపిసి 224 సెక్షన్ తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసారు. ఏపీపీ పి.హరిప్రియ వాదనలతో కోర్టు ఏకీభవించి నిందితుడు చిలుకుకు రెండు నెలలు కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సూర్యకళ తీర్పు చెప్పారు .

## చిత్తులాట ఆడుతూ అడ్డంగా బుక్కైన జూదరులు.. రూ. 14,500 నగదు స్వాధీనం



కొయ్యూరు డిసెంబర్ 4 (మనసులో మాట): మండలంలోని చింతవానిపాలెం గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా చిత్తులాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై కిషోర్ వర్మ తెలిపిన వివరాల ప్రకారం..చింతవానిపాలెం గ్రామంలోని ఓ జీడి తోటలో కొందరు వ్యక్తులు డబ్బులు పెట్టి చిత్తులాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో చిత్తులాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 14,500 నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఘనంగా శతకంపట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కలశజ్యోతి ప్రదర్శన



**అనకాపల్లి, డిసెంబర్ 4 (మనసు లో మాట):** అనకాపల్లి గవరపాలెం శతకంపట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణం లో మార్గశిర మాస పౌర్ణమి పర్వదినాన గురువారం శీతలదుర్గ గా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కలశజ్యోతి ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పి.వి రమణ, ఆలయ చైర్మన్ బీమరశెట్టి వరహా నూకరాజు, కార్యవర్గం సభ్యులు, శ్రీ గౌరీ పరమేశ్వర కమిటీ సభ్యులు, శ్రీ మరిడిమాంబ అమ్మవారి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మన పల్లె మన ఎమ్మెల్యే..

## అంతకాపల్లి పంచాయతీ లో ప్రకటించిన అభివృద్ధి పనులు రెండేళ్లలో పూర్తి చేసి చూపిస్తా

### చొక్కాకుల ఆధ్వర్యంలో మన పల్లె మన ఎమ్మెల్యే కార్యక్రమంలో త్వరలో వచ్చిన జనం





**సబ్బవరం, డిసెంబరు 4, ( మనసులో మాట) :** పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని సబ్బవరం మండలం అంతకపల్లి గ్రామపంచాయతీకి "మన పల్లె బిమన ఎమ్మెల్యే" సభలో ప్రకటించిన పలు అభివృద్ధి పనులను రెండేళ్లలో పూర్తి చేసి చూపిస్తాను అని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, హామీ ఇచ్చారు. ఈ గ్రామంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ షిప్పింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, బిజెపి నేత చొక్కాకుల వెంకటరావు సోదరుడు మాజీ ఎంపిపి చొక్కాకుల గోవింద్, మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు మిడతాడా. మహాలక్ష్మి నాయుడుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పంచకర్లకు గురువారం అపూర్వ స్వాగతం పలికారు.

ముందుగా అంతకాపల్లి ఎస్సీ కాలనీ వద్ద గల బాబూ జగజ్జీవన్ రామ్ నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును, భారీ ఎత్తున బాణాసంచా, భాజా భజంత్రీలు, మహిళల కోలాటాలు, కర్పూర హారతులతో రావలమ్మ పాలెం "మన పల్లె బిమన ఎమ్మెల్యే "సభకు తోడుకొని వెళ్లారు.

గుల్లేపల్లిబి గొటివాడ మధ్య బ్లాక్ తారు రోడ్డు నిర్మాణానికి సంబంధించి, 1.90 కోట్ల రూపాయలతో చేపట్టే పనులకు ఎమ్మెల్యే పంచకర్ల శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా సభలో చొక్కాకుల వెంకటరావుబి గోవిందరావు సోదరులు ఎమ్మెల్యేను గజమాలతో, దుశాలువల తో వరకు సత్కరించారు.

సభకు భారీగా హాజరైన జనాన్ని చూసి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మంత్రముగ్ధులయ్యారు.

తర్వాత టెక్కలి పాలెం గ్రామంలో మన పల్లె బిమన ఎమ్మెల్యే గ్రామ సభలో ఎమ్మెల్యే పంచకర్ల జనసేన టిడిపి నేతలు పాల్గొన్నారు.

ఈ సభలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు కర్రి. కనకరాజు, బలి రెడ్డి అప్పారావు, ఇందలి. వెంకటరమణ, బోకం స్వామి నాయుడు, బయలుపూడి దేవుడి బాబు, సబ్బవరపు రమణ, రొంగలి దేముడు, బోండా సత్య రావు, సాలాపు వెంకటేశ్వరరావు, బంతికోళ్ల పద్మ, గొర్లి కుమార్ స్వామి,లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన మిడతడమహాలక్ష్మి నాయుడు అంతకాపల్లి గ్రామపంచాయతీ శివారు గ్రామాలతో సహా పలు సమస్యలతో కూడిన వినతి పత్రాల బుక్లెట్టును ఎమ్మెల్యేకు అందజేశారు.

అవి చదివిన ఎమ్మెల్యే పంచకర్ల సంబంధిత అధికారులకు ఆయా పనుల నిమిత్తం నిధులు తన మంజూరు చేస్తానని మీరు అంచనాలు తయారు చేసి పంపాలని ఆదేశించారు.

ఈ పంచాయతీలో రెవెన్యూ పరమైన చాలా అంశాలు నిరుపేద రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, వాటిపై భూముల రి బిసర్వే ను వెంటనే చేపట్టాలని తాసిల్దార్ బి చిన్నికృష్ణని ఆదేశించారు.

ఈ గ్రామపంచాయతీలో కోటి రూపాయలు సిసి రోడ్లకు మంజూరు చేస్తున్నానని, అవసరమైన చోట్ల పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే ప్రకటించారు.

కేవలం ప్రజా సమస్యలు మాత్రమే కాకుండా వ్యక్తిగత సమస్యలు కూడా వినతిపత్రాలు ఇస్తే తాను సహాయం చేస్తానని ఆయన ప్రకటించారు.

ఎంతో అపూర్వ స్వాగతం పలికిన అంతకాపల్లి ప్రజలకు తాను రుణపడి ఉంటానని, ఏ సమస్య ఉన్న తన దృష్టికి తెస్తే కసితో పనిచేసి చూపిస్తానని హామీ ఇచ్చారు.

ప్రముఖ పారిశ్రామికవేత్త చొక్కాకుల వెంకటరావు సోదరులు తనకు కుటుంబ మిత్రులని, మనిద్దరం కలిసి ఒకే రకమైన వ్యాపారం చేసామని, ప్రజా సమస్యల విషయంలో ఇద్దరం రాజీ పడే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే ప్రకటించారు.

### శిధిలావస్థలో గిరిజన పాఠశాలలు

# విద్యార్థులకు తప్పని అవస్థలు





**హుకుంపేట నవంబర్4 (మనసులో మాట)..** మండలంలోని భీమవరం పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ట్రైబల్ వెల్ఫేర్) శిధిలావస్థకు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 1990 సంవత్సరంలో నిర్మించిన ఈ పాఠశాల భవనానికి నేటికి 35 సంవత్సరాలు పూర్తయ్యాయి. అప్పటి నుంచి సరైన మరమ్మత్తులు లేకపోవడంతో భవనం పూర్తిగా జ???రిత స్థితికి చేరుకుంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో 13 మంది గిరిజన విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వర్షాలు పడితే తరగతి గదులలోకి వర్షపు నీరు చేరి, నేల మొత్తం నీటితో నిండిపోతుంది. దీంతో పిల్లలు కూర్చుని చదువు చెప్పుకోవడం కూడా సాధ్యంకాని పరిస్థితి నెలకొంటోంది. శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి, ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం పరిస్థితి మరింత దయనీయంగా మారినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో తరగతులు సక్రమంగా జరగక పిల్లల భవిష్యత్తు అంధకారమవుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త పాఠశాల భవనం నిర్మించాలి లేదా తక్షణమే మరమ్మతులు చేపట్టాలి అని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు గట్టిగా కోరుతున్నారు. లేనిపక్షంలో పెద్ద ప్రమాదం సంభవించే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నూతన పాఠశాల భవనం నిర్మాణం చేపట్టి విద్యార్థుల భవిష్యత్తులపై పునాదివేయాలని. అలాగే శిథిల వ్యవస్థ పాఠశాలలో విద్య బోధనలు ప్రమాదకరంగా ఉందని . భీమవరం పంచాయతీ సర్పంచ్ నైని సన్నీ బాబు భీమవరం పాఠశాల భవనం ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని పాఠశాల భవనం సరిగలేక విద్యార్థులు విద్యాభ్యాసానికి భయాందోళనలతో విద్యాభ్యాసం చేస్తున్నారని పెచ కమిటీ అధ్యక్షులు కోటి బాబు.

# జేపీసీ సత్యా గ్రహ యాత్ర ప్రారంభం



**దుంబ్రిగుడ, డిసెంబర్ 04, (మనసులో మాట) :** మండలంలోని కొర్రాయి పంచాయితీ తోట వలస గ్రామంలో సత్యా గ్రహ యాత్ర జేపీసీ కన్వీనర్ సమర్ధి గోపాల్ ఆధ్వర్యంలో సత్యా గ్రహ యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా జేపీసీ నాయకులు యాత్రలో భాగంగా గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో జరుగుతున్నటువంటి అన్యాయాలను, సమస్యలను గురించి గ్రామస్తులకు తెలియపరిచారు. ప్రధానంగా మన్య ప్రాంతంలో జరుగుతున్న హైడ్రోప్రోవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలని, మన ఉద్యోగాలు మనకు రావడానికి ఉద్యోగ నియామకాలు చట్టం చేయాలని, అక్రమంగా సొరబాటు చేసిన గిరిజన నేతరులు ఉపాధ్యాయులను వెనక్కి పంపించి స్థానిక ఆదివాసి ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని జేపీసీ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జేపీసీ నాయకులు పాల్గొన్నారు.

# నర్సయ్య పేటలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం



చోడవరం, డిసెంబర్ 03(మనసులో మాట ): గ్రామాల్లో జాతీయ సేవా పథకం ద్వారా చేపట్టే సేవా పనుల్లో పాలుపంచుకోవడం విద్యార్థులకు మంచి నడవడికను అలవరుస్తుందని చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ అన్నారు . పట్టణ సమీపంలోని నర్సయ్య పేటలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఒకటవ యూనిట్ విద్యార్థులచే గురువారం సేవా శిబిరం చేపట్టారు. గ్రామ సర్పంచ్ ఉగ్గిన గౌరీశంకరి నాగబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ సేవా శిబిరం ప్రారంభించారు. చాలా సంవత్సరాల తర్వాత ఇలాంటి ప్రత్యేక సేవా శిబిరం నిర్వహణకు అవకాశం కల్పించారని ఆయన తెలిపారు. రవి అకాడమీ నిర్వాహకులు రవి విద్యార్థులకు మోటివేషన్ తరగతుల ద్వారా చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, రత్న భారతి, బి.పిచ్చమ్మ, సీనియర్ ఉపన్యాసకులు పాల్గొన్నారు.



## ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ బిజేపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కి వినతి

గాజువాక (మనసులోమాట) డిసెంబర్ 4

ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు తమ భూములను ఇల్లను ఉపాధిని సర్వం కోల్పోయామని నిర్వాసితుల సంఘం అధ్యక్షులు పితాని బాస్కర్ ఆద్వర్యంలో భాజపా రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కి తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో తమకు యాభై శాతం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని గతంలో హామీ ఇచ్చారని తెలిపారు. ఈ మధ్యకాలంలో యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా కర్మాగారం నష్టాల్లోకి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ కార్డులు వుండి కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని కూడా అన్యాయంగా ఈ మధ్య తొలగించారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటి వరకు ఉద్యోగాలు రాని వారు సుమారు ఎనిమిది వేల మంది కార్మికులకు నిరుద్యోగ భృతి నెలకు ఇరవై ఐదు వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. లేదా వన్ టైం సెటిల్మెంట్ రూపంలో ఒక్కొక్కరికి కోటి రూపాయలు చొప్పున ఇవ్వాలని కోరారు. కుదరకపోతే తమ భూమిని తమకు ఒక్కొక్కరికి యకరా భూమి ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన బిజేపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిజేపి రాష్ట్ర మీడియా పేనలిస్ట్ మరియు గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు, ఉమ్మిడి అప్పారావు,గూటూరు శంకరరావు,నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

## రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ రావు కి స్టీల్ టీఎన్‌టి యుసి వినతి



**గాజువాక (మనసులోమాట)డిసెంబర్ 4..** సెయిల్ లో విలీనం చేయాలని కోరుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు నిర్వాసితులకు న్యాయం చేయాలని దృఢ సంకల్పంతో మీ నాయకత్వంలో కేంద్రమరియు రాష్ట్ర కూటమి ప్రభుత్వం సుమారు 14 వేల కోట్ల రూపాయలు ప్యాకేజీని విశాఖ ఉక్కు కు కేటాయించి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఈ దిగువ ఉన్న సమస్యలను మీ దృష్టికి తీసుకొస్తున్నాము. ఉక్కు ఉద్యోగులకు ప్రొడక్షన్ ఆధారిత జీతాలు ఇస్తానన్నడం కార్మికుల హక్కులకు చట్టాలకు వ్యతిరేకం దీన్ని పరిశీలించి మాకు తగు న్యాయం చేయాలని కోరుతున్నాం విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూములు ఇల్లు త్యాగాలు చేసిన నిర్వాసితులు ఉపాధి పొందుతూ అన్యాయంగా తొలగించబడ్డారు నిర్వాసితులను కార్మికులను తక్షణమే జాయిన్ చేసుకోవాలని మరియు వారి ఆధార్ కార్డు బ్లాక్ తొలగించాలి అని కోరుతున్నాం ఉక్కు ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న జీతాలు తక్షణమే చెల్లించి రాబోవు పండగలకు మా కుటుంబాలలో వెలుగును నింపాలని కోరుతున్నాం పై సమస్యలపై రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసన సభ్యులు పల్లా శ్రీనివాస్ రావు సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గాజువాక సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనువాసరావు స్టీల్ టి ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి గుమ్మడి నరేంద్ర కుమార్ గాజువాక టి ఎన్ టి యు సి అధ్యక్షులు అంజిబాబు ప్రధానకార్యదర్శి కోన సోమినాయుడు బడే చిన్నారావు కొల్లి శివ నాగేశ్వరరావు తురుబిల్లి శ్రీను గండేపల్లి రాము ఎస్ వి అప్పలరాజు పల్లా మనోజ్ జి కుటుంబరావు కాంట్రాక్టు యూనియన్ నాయుకులు కోన రాజు తదితరులు పాల్గొన్నారు

## 87వ వార్డ్ పరిధిలో ముఖ్య మంత్రి సహాయనిది పంపిణీ



**గాజువాక (మనసులోమాట) డిసెంబర్ 4..** గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధిలో గవరవీధి ప్రాంతానికి చెందిన కాండ్రేగుల శ్రీనివాసరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్ అందచేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యానికి భరోసాగా సిఎం సహాయనిది అండగా నిలుస్తుందని అందులో భాగంగా గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యానికి గురై చికిత్స పొందిన కాండ్రేగుల శ్రీనివాసరావు కు 41048/- రూపాయల చెక్కును అందజేయడం జరిగిందని. రాష్ట్ర అధ్యక్షులు గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్ రావు ప్రత్యేక శ్రద్ధతో సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసి ఆమోదం పొందేలా చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్ రాజు,ప్రగడ దానయ్య, కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ,ఆనంద్ కుమార్, కడుపుట్ల శ్రీను, గండేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

## చీపురుపల్లిలో చీపురుపల్లి ఆసుపత్రిలో.. సిరమ్మ అన్నప్రాసద వితరణ

**విజయనగరం (మనసులోమాట ) డిసంబర్ 4:** గురువారం ఉభయ ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా తన కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ సౌజన్యం తో చీపురుపల్లి లో ఆసుపత్రికి వచ్చే ఆశ్రితులకు చీపురుపల్లి సేవా కమిటీసభ్యులు అధ్వర్యంలో అన్న ప్రసాదం వితరణ గావించారు.





## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం కార్పోరేషన్ చైర్మెన్, సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవం

**విజయనగరం (మనసులో మాట) డిసెంబర్ 4:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం కార్పోరేషన్ చైర్మెన్ మరియు సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం విజయయవాడ లోని బి.సి. భవన్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం కార్పోరేషన్ చైర్మెన్, సభ్యులతో ముఖ్యఅతిథి గా పాల్గొన్న ఎమ్మెల్యే బొండా ఉమా ప్రమాణ స్వీకారం చేయించగా, అతిధులుగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయులు గంటా రవితేజ గారు, విజయనగరం జిల్లా జనసేన నాయకులు అవనాపు విక్రమ్ పాల్గొన్నారు. అంగరంగ వైభంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి మరియు కృష్ణా జిల్లాల నుండి వచ్చిన నాగవంశ పెద్దలు, నాయకులు, సొదరులు, సోదరీమణులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాగవంశం కార్పోరేషన్ చైర్మెన్ మరియు సభ్యులుగా ప్రమాణం చేసిన వారిని విక్రమ్ అభినందించారు. అనంతరం మంగళగిరి లోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన అధ్యక్షుల రాజకీయ కార్యదర్శి %ం% ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్ తో అవనాపు విక్రమ్ భేటీ అయ్యారు.

## 3వ రోజు ఏబిఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రత్యేక సేవా శిబిరం



**నర్సీపట్నం ,డిసెంబర్ 4 (మనసులో మాట)** నర్సీపట్నం ఏబిఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 విద్యార్థులు మూడో రోజు నర్సీపట్నంలోని నీలంపేట, అయ్యన్నకాలనీలో ప్రైమరీ స్కూల్, అంగన్వాడీ విద్యార్థులకు ఆటలు ఆడించి వారికి మధ్యాహ్నం భోజనంలో సహాయం చేశారు. అనంతరం కళాశాల విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించి వారిచే యోగాసనాలు చేయించారు. పాఠశాల ఆవరణలో వాలంటీర్లు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పీ.సత్యనారాయణ, ఎ.కుమార్, అధ్యాపకులు ఎల్.లక్ష్మణ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆర్డీవో అయేషా హామీతో యువకుల ఆమరణ నిరాహార దీక్ష విరమణ

**- ఫలించిన అధికారిక చర్చలు**



**యలమంచిలి డిసెంబర్ 4 మనసులో మాట..** గత మూడురోజులుగా పెద్దపల్లికి చెందిన యువకులు తమ గ్రామంనకు చెందిన ప్రభుత్వ భూమిని కొంతమంది భూకబ్జాదారులు ఆక్రమించినందున ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. నిన్నటి రోజున వీరికి అనేకమంది గ్రామ ప్రజలు ఇతర పార్టీ నాయకులు అధికారులు మద్దతు తెలుపగా వీరి యొక్క దీక్షకు బలం చేకూరింది. ఈ విషయంపై ఆర్డీవో, డి.ఎస్.పి స్పందించి బుధవారం రాత్రి 8 గంటలకు యలమంచిలి చేరుకొని యలమంచిలి రెవెన్యూ అధికారులతోనూ, పోలీస్ శాఖ వారితోను, గ్రామ పెద్దలతోనూ, యువకుల తోనూ చర్చలు జరిపారు. అధికారులు ప్రభుత్వము వీరి యొక్క ఆవేదనను చూసి గ్రామం పట్ల వీరుకున్న అంకితభావం చూసి వీరితో చర్చలు జరిపి వారి గ్రామానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని అధికారులతోనూ మాట్లాడి చెరువు భూమిని గ్రామానికి అప్పగిస్తామని ఆర్డిఓ హామీ ఇవ్వడంతో అర్ధరాత్రి 2 గంటలకు యువకులు నిరాహార దీక్షను విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి, బొడ్డపు ఎర్రయ్య దొర, దాసరి కుమార్, దాసరి గణేష్, బొడ్డపు శ్రీనివాసరావు, పందల సూరిబాబు, వెంకటస్వామి, బొడ్డపు కృష్ణ, బొడ్డపు గణేష్, మరిసా సత్తిబాబు, చేబోలి శ్రీను పాల్గొన్నారు.

### ఘనంగా అమరగాయకులు

# ఘంటసాల జయంతి వేడుకలు

**- పాటలపోటీల విజేతలకు బహుమతుల ప్రధానం**




**అనకాపల్లి, డిసెంబర్ 4 (మనసులో మాట):** అనకాపల్లి జివిఎంసి పట్టణ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరగాయకులు, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 103 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందు గా ఘంటసాల చిత్ర పటానికి పూలమాలలు వేసి ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.హెచ్.దక్షిణామూర్తి ఘనంగా నివాళి లర్పించారు. అనంతరం ఘంటసాల పాటల పోటీల విజేతలైన విద్యార్థులు ఎమ్. లక్ష్మి లలితాంబ ప్రథమ, డి. తేజస్విని ద్వితీయ, వి. వెన్నెల తృతీయ స్థానాలు దక్కాయి. ప్రోత్సాహక బహుమతులు ఏ. కారుణ్య, కె. లక్షణ్య లు ఎంపికయ్యారు. విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, ఘంటసాల మెరిట్ మెడల్స్,బహుమతులు గా అందజేసారు. ఈసందర్భముగా ముఖ్యఅతిధి డాక్టర్ బి.హెచ్.దక్షిణామూర్తి మాట్లాడుతూ ప్రముఖ తెలుగు సినీ గాయకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఘంటసాల వెంకటేశ్వరరావు తెలుగు చలన చిత్ర రంగంలో 10 వేల పాటలు, పద్యాలు, శ్లోకాలు అలపించడం జరిగిందన్నారు. అలాగే భగవద్గీత, పుష్పవిలాపం, కుంతీ విలాపం, ప్రైవేట్ లలిత జానపద గీతాలను గానం ద్వారా వినిపించి తెలుగు వారి భాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప మహనీయులని కొనియాడారు. సిద్దార్థ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ గాన గంధర్వుడు ఘంటసాల సినీ నేపథ్య గాయకునిగా, తెలుగు సినీ సంగీత దర్శకునిగా, నిర్మాతగా తెలుగు చలన చిత్ర రంగా నికి విశేష సేవలను అందించిన గొప్ప మహనీయుడని, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు శిక్షను కూడా అనుభవించిన దేశ భక్తుడని వారి సేవలను గుర్తించి ప్రభుత్వం ఘంటసాల కి భారతరత్న పురస్కారాన్ని ఇచ్చి గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే ఘంటసాల సినీ పాటల పోటీలలో సుమారు 35 మంది విద్యార్థినులు హాజరయ్యారు. అనంతరం విద్యార్థినులకు మిఠాయి లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపధ్యాయురాలు రాణి రుధిరారాణి, సిద్దార్థ అసోసియేషన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు బొడ్డు సోమరాజు, అయ్యగారు వెంకటరమణమూర్తి, జి.ఎస్. కె.సాయిబాబా, నందేల అప్పా రావు, ఘంటసాల అభిమానులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

### శ్రీ గౌరీ పరమేశ్వరుల గుడి నిర్మాణానికి సహకరించని వ్యక్తులకు

# ఉత్సవం నిర్వహించే అర్హత ఉందా

**- సిహెచ్ అప్పలనాయుడు ఆక్షేపణ**





**మునగపాక, నవంబర్ 4, మనసులో మాట,** మండలంలో గణపర్తి గ్రామంలో వందేళ్ళ చరిత్ర గల శ్రీ గౌరీ పరమేశ్వరుల ఆలయంశిథిలావస్థకు చేరడంతో 2014, 15 సంవత్సరంలో పాత గుడిని తొలగించి గుడి పునఃనిర్మాణానికి చర్యలు చేపట్టడం జరిగిందని, గ్రామంలో గౌరీ పరమేశ్వర దేవాలయం నిర్మాణం జరిగితే అప్పటి సర్పంచ్ కర్రీ రామనాగేశ్వరరావు అడుగడుగున ఆటంకం కలిగిస్తూ ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని, అయితే అప్పట్లో గ్రామ సర్పంచ్ గా ఉన్న సదరం గణేష్ నాయుడు మధ్యలో అర్ధాంతంగా వదిలేశారని సిహెచ్ అప్పలనాయుడు ఆరోపించారు. అయితే గుడి నిర్మాణం ప్రజా సహకారంతో పూర్తి చేసి అక్టోబర్ 16న పునః ప్రారంభించి ఏట సమీప గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులను రప్పించి అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని అప్పలనాయుడు తెలిపారు. గుడి నిర్మాణాన్ని ఆపేద్దామని ఎన్నో కుయుక్తులు పన్నిన ఆ నాయకులు ఇప్పుడు గౌరీ పరమేశ్వరుల ఉత్సవం నిర్వహించడానికి ముందుకు రావడం సిగ్గుచేటు అని అప్పలనాయుడు ఎద్దేవా చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ, తాసిల్దార్, మునగపాక ఎస్ ఐ కు ఫిర్యాదు చేయడం జరిగిందని అధికారులు చెప్పిన విధంగా నే నడుచుకుంటానని అప్పలనాయుడు తెలిపారు.

# నక్కపల్లి రెవెన్యూ డివిజన్ 1491 జీవోను రద్దు చేయాలి

**- ధర్మశ్రీ డిమాండ్**



**రాంబిల్లి డిసెంబర్ 4 ( మనస్సులో మాట)** నక్కపల్లి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తూ ఓటమి ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 1491 ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ గురువారం రాంబిల్లి కేంద్రంలో ఎలమంచిలి వైసిపి సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో మానవహారం, ర్యాలీ నిర్వహించారు. తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాన్ని ఖండించారు. యలమంచిలికి ఉన్న సౌకర్యాల దృశ్య రెవెన్యూ సబ్ డివిన్ ఏర్పాటు చేయాలని లేదా నియోజకవర్గంలోని నాలుగు మండలను అనకాపల్లి లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. నక్కపల్లి రెవెన్యూ డివిజన్ కు వ్యతిరేకంగా పంచాయతీ తీర్మానాలు చేయాలని కోరారు. కార్యక్రమం లో ఎంపీపీ గొట్టిముక్కల శిరీష శ్రీనుబాబు, జడ్పిటిసి ధూళి నాగరాజు, వైసిపి మండల పార్టీ ప్రెసిడెంట్ పిన్నమరాజు కిషోర్ రాజు వైసిపి నాయకులు నెట్టం సత్యనారాయణ, సంర్పచ్లు,ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కిడ్నాప్ కేసులో 4 వ్యక్తులు అరెస్ట్



**విజయనగరం (మనసులోమాట) డిసంబర్ 4:** రూరల్ పోలీసు స్టేషనులో గత నెల 23వ తేదీన నమోదైన కిడ్నాప్ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించినట్టు విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణ రావు రూరల్ సర్కిల్ కార్యాలయం లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు.
వివరాల్లోకి వెళితే... తే.23.11.2025దిన మధ్యాహ్నం విశాఖపట్నంకు చెందిన మహేష్ కుమార్ యాదవ్, కోస్ట్ గార్డ్ విజయనగరంలో ఉన్న వాళ్ళ ఫ్రెండ్ ని కలవడానికి విజయనగరం వచ్చాడు. తన ఫ్రెండ్ని కలిసి ఇద్దరూ ఒక స్కూటీ మీద డెంకాడ నుండి రామనారాయణం వెళ్తుంటే మార్గమధ్యలో పడాలపేట వెళ్లే మార్గంలో కొంత మంది వ్యక్తులు ఒక కారు మీద వచ్చి స్కూటీని అడ్డగించి డిఎస్పి అని చెప్పి అతన్ని బలవంతంగా కారులో ఎక్కించి కిడ్నాప్ చేసి అక్కడినుంచి కారులో తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టి డబ్బులు డిమాండ్ చేసి మెడలో చైన్, చేతి ఉంగరం, రూ. 10,000లు దోచుకున్నారు. తర్వాత రోజు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఖాళీ పేపర్ మీద సంతకాలు పెట్టించి, 20 లక్షలు ఇవ్వకపోతే చంపుతామని బెదిరించి వైజాగ్ లో విడిచిపెట్టేసారని విజయనగరం రూరల్ పోలీసులకి ఫిర్యాదు అందింది. వెంటనే రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.
విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశాల మేరకు కేసును ఛేధించేందుకు పోలీసు బృందాలు గా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టగా, తే 03.12.2025 దిన మధ్యాహ్నం విజయనగరం జిల్లా, చెల్లూరు బైపాస్ రోడ్డు దగ్గర గల %ఖ.ఎ.=% లే అవుట్ వద్ద నిందితులు కిలపర్తి నాగంనాయుడు, 38 సం., కుమ్మరి వీధి, కొత్తపేట, విజయనగరం, కొన్న రామకృష్ణ, 43 సం., గాజులరేగ, విజయనగరం, బుడ్డ పరమేష్, 26 సం, మదురవాడ, విశాఖపట్నం జిల్లా, నేలతేటి చిరంజీవి, 25 సం., %వీ.బా% కాలనీ, విశాఖపట్నం జిల్లా వారిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారని తెలిపారు. నిందితుల వద్ద నుండి 03 కారులను, 04 సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో మరో నలుగు నిందితుల కోసం గాలింపు చేపడుతున్నామని, త్వరలో పట్టుకుంటామని విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణ రావు తెలిపారు. ఈ కేసులో ముద్దాయిలను పట్టుకోవడంలో క్రియాశీలంగా పనిచేసిన విజయనగరం రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, అభినందించారు.



## శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికి విరాళం

**అందజేస్తున్న ఆళ్ల సాంబశివరావు**

**మునగపాక, డిసెంబర్ 4, మనసులో మాట..** మండల కేంద్రం మునగపాకశ్రీ వేంకటేశ్వర స్వామి గుడి నిర్మాణానికి మునగపాక వాస్తవ్యులు ఆళ్ల చిన అప్పలనాయుడు కుమారుడు ఆళ్ల సాంబ శివరావు రూ.5,000/-చందా ఇవ్వడం జరిగింది. వారికి వారి కుటుంబానికి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా కలగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, పలువురు పాల్గొన్నారు.

# యోగాతో మానసిక ప్రశాంతత

**సిమ్ వ్యవస్థాపకులు డాక్టర్ బొబ్బిలి రామకృష్ణ**



**అరకులోయ, డిసెంబర్ 4(మనసులోమాట):** అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవ పథకం యూనిట్ 1,యూనిట్ 2, ఆధ్వర్యంలో దత్తత గ్రామాలైన రవ్వలగూడ, ఆర్ డుంబ్రిగూడ గ్రామాలలో మంగళవారం నుంచి ప్రారంభించిన ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా గురువారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శృంగవరపుకోటకు చెందిన సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్ (సిమ్)స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బొబ్బిలి రామకృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన యోగ, ధ్యానం, ప్రాణాయామం పై అవగాహన కల్పించి వాలంటీర్లతో ధ్యానం, ఆసనాలు, ప్రాణాయామం చేయించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక దృఢత్వాన్ని మానసిక ప్రశాంతతను పొందవచ్చు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి కొండబాబు,ఎన్ ఎస్ ఎస్ పి ఓ లు పి నాగబాబు, వై విజయలక్ష్మి , ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కలిసి కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ప్రత్యేక సేవ శిబిరంలో భాగంగా వాలంటీర్లు ప్రాథమిక పాఠశాల ఆవరణను పరిశుభ్రం చేశారు.

# అనకాపల్లి లో రైతుబజారు ఏర్పాటు చేయాలి

**ఆరోవ రోజు కు చేరుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ నిరహరదీక్ష**




**అనకాపల్లి, డిసెంబర్ 4 (మనసు లో మాట):** అనకాపల్లి లో రైతు బజారు ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ అధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టి గురువారం కు ఆరవ రోజు కు చేరింది. అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్ లో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరనాథ్ బాబు, అబ్దుల్ కలామ్ సేవా సంఘం వ్యవస్థాపక ఛైర్మెన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు అడ్లబోయిన నారాయణ రావు, గొర్లి వెంకటేశ్వరరావు, ఎం. విజయశంకర్ నిరహరదీక్ష చేపట్టి ఆరవ రోజు అవుతుంది. ఎన్నో ఏళ్ళ నుంచి అనకాపల్లి లో రైతు బజార్ ఏర్పాటు అనేది హామీలకే పరిమితమయ్యింది. రైతు బజార్ వస్తే ఇటు వినియోగదార్ల కు ఆటు రైతులకు ప్రయోజనం చేకురుతుందని వారి వాదనగా ఉంది. రైతు బజార్ ఏర్పాటైతే దళారీ వ్యవస్థ ఉండదని వారి భావన. రైతు బజార్ ఏర్పాటు జరిగితే నేరుగా రైతుల వద్దకు వెళ్లి కూరగాయలు కొనుగొలు చేసే వీలుకల్గుతుంది. ఏదేమైనా రైతు బజార్ ఏర్పాటు కు కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని ఆమ్ ఆద్ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరనాథ్ బాబు తదితరులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రైతు బజార్ తోపాటు కోల్డ్ స్టోరేజ్ కూడా ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ కోరుతోంది.

# ఘనంగా కట్టుబోలు నవదుర్గ జాతర



రాంబిల్లి డిసెంబరు 4 ( మనస్సులో మాట) మండలంలోని కట్టుబొలి గ్రామంలో మించి ఉన్న శ్రీ నవ దుర్గా దేవి జాతర మహోత్సవం సందర్భంగా గురువారం దుర్గాదేవి అమ్మవారికి పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి భవాని పీఠం భక్తులు పూజ అనంతరం అమ్మవారి భక్తి పాటలను ఆలపించారు. భక్తులకు అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాత్రికి శూలాల మహోత్సవాన్ని నిర్వహించి ఘటాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. అలాగే శ్రీ నూకమాంబ ఆలయం సమీపంలో భక్తులు అగ్నిగుండ ప్రవేశాన్ని నిర్వహించారు.

# శ్రీశ్రీశ్రీ కనకమాలక్ష్మి అమ్మవారికి తొలి పూజ చేసిన బండారు రమేష్ దంపతులు



**యలమంచిలి డిసెంబర్ 4 మనసులో మాట..** కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారు శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి మార్గశిర మాసం రెండవ గురువారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున బండారు రమేష్ గీతా దంపతులు తొలి పూజ నిర్వహించి అనంతరం భక్తులకు అమ్మవారిని దర్శించుకున్నారు. యలమంచిలి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి అమ్మవారికి చీర, సారి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు తరలి రావడంతో క్యూ లైన్ లో గంటలు తరబడి వేచి ఉండవలసి వచ్చింది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ కొటారు సాంబశివరావు మాట్లాడుతూ మూడవ శుక్రవారం పేరెడ్డి నాగేశ్వరరావు పద్మ దంపతులచే కుంకుమ పూజ పుణ్య వ్రతం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు
శుక్రవారం 5 డిసెంబర్ 2025




ఆ ఈఓ వ్యవహారం

# పట్టించుకోండి..

- ▸▸ లేదంటే దేవాలయాన్ని అపవిత్రం చేసేస్తాడు
- ▸▸ దేవాలయంలో ఆ గదిలో.. రంగ రంగా శ్రీరంగా.. కనవయ్యా
- ▸▸ అతగాడి సామాజిక వర్గానికే ఉద్యోగాలు
- ▸▸ అతగాడికి లొంగిన మహిళలకే పెత్తనం..
- ▸▸ రాసలీలలు బయటకు పొక్కకుండా స్థాయికి తగ్గట్టుగా శక్తికి మించి సత్కారాలు, నజరానాలు
- ▸▸ ఛీఛీ అంటున్నా..సిగ్గులేకుండా దులిపేసుకునే రకం..
- ▸▸ ప్రజాప్రతినిధులైనా దృష్టి సారించకపోతే..ఆ బురద అంటే ప్రమాదం లేకపోలేదు..

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** ఏళ్ళు వచ్చాయి గానీ..లేకిరితనం పోలేదు. రేపోమాపో పదవీ విరమణ చేసే సమయం ఆసన్నమవుతోంది..ఇంకా ఆడాళ్ళ పిచ్చి మాత్రం పోలేదు. అది అతగాడి వ్యక్తిగతం అని ఊరుకోవడానికి..ఆయన ఒక దేవాలయానికి కార్యనిర్వహణ అధికారి (ఈఓ). అదేమీ చిన్నా చితక ఆలయం కాదు. సాక్షాత్తూ ఆ భగవంతుడే అక్కడ కొలువై భక్తుల కోరికలు నెరవేరుస్తారనే ప్రగాఢ విశ్వాసం ఉన్న ఆలయం. భక్తుల కోరికలు స్వామి తీరుస్తాడో లేదో తెలియదు కానీ, తన కామవాంఛ తీర్చే మహిళల కోరికలు మాత్రం సదరు ఈఓ తీరుస్తాడట. కొంగు కనబడితే సొంగలు కార్చే ఇతగాడి రాసలీలు కథలు కథలుగా చెబుతున్నారు. మరి దేవదాయ శాఖ ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. వీరికీ వారి స్థాయిని బట్టి కానుకలు, మొక్కుబడులు సదరు ఈఓ తీర్చేస్తాడట. దీంతో శాంతించిన సంబంధిత శాఖ అధికారులు.. చూసీ చూడనట్టు పోతారట. కనీసం ప్రజాప్రతినిధులైనా 'ఈఓ నీ వ్యవహారం ఏమీ బాగుండటం లేదు. ఫిర్యాదులు చాలానే వస్తున్నాయి..' అని మందలించిన సందర్భాలూ లేవు. ప్రజాప్రతినిధులను సైతం తమ చెప్పు చేతల్లో పెట్టుకునే నైపుణ్యం ఉండటంతో వారూ మాట్లాడటం లేదని చెబుతున్నారు. నిజాలను నిర్భయంగా ప్రజలకు, ప్రభుత్వానికీ చేరవేయాల్సిన మీడియాను కూడా శక్తికి మించి ఖరీదైన కానుకలతో సత్కరించి తన వశం చేసుకుంటున్నాడట. మొన్న ఒక విలేకరికి రూ.50 వేలు తాంబూలంలో పెట్టి మరీ సాగనంపాడట. అరరే..అంత పోటుగాడా అని విన్నవారు ఆశ్చర్యపోతున్నారు. తన సొంత డబ్బు అయితే ఆశ్చర్యపోవాలి కానీ..ఆలయంలో హుండీ అతగాడికి ఏటీఎం లాంటిదని, జల్సాలకు విందులు, చిందులకు ఎలా కావాలంటే అలా ఖర్చుపెట్టే రకం. మొన్న ఒక వివాహితను ఏకంగా తన కారులో రాజమహేంద్రవరం తీసుకొచ్చి ఒక లాడ్జిలో గడిపాడట. ఈ విషయం పెద్ద దుమారమైంది. "మనుమరాలి వయసున్న వివాహితతో ఆ రాసలీలలు ఏంటి ఈఓ".. అని ప్రశ్నిస్తే..అబ్బే అది ఒక ప్రైవేటు ఫంక్షన్. తనపై గిట్టని వారు లేనిపోని ప్రచారం చేసి తన పరువు, ప్రతిష్ఠను తీయడానికి యత్నిస్తున్నారని మొసలి కన్నీరు కార్చాడట. రాజమహేంద్రవరం లాడ్జి రహస్యం సోషల్ మీడియాలో వీడియోలు, ఫొటోలతో రచ్చరచ్చ అయ్యేసరికి..ఆ వివాహితను ఒక నెల రోజులు విధులకు హాజరు కాకుండా బాధ్యతగా చాలా జాగ్రత్తగా వ్యవహరించాడట. రెండు మూడు రోజుల నుంచి మళ్ళా 'విధులకు' వస్తున్నట్టు సమాచారం. ఈమె ఆలయంలో శాశ్వత ఉద్యోగిని ఏమీ కాదు. కానీ ఈమె గారే..ఈఓ కీలక బాధ్యతలను కూడా స'క్రమంగా' నిర్వహిస్తుందని టాక్. పేరుకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని కానీ..ఎవరిని ఎలా బుట్టలో వేసుకోవాలో అన్ని 'సోర్సు'లు తెలుసున్న వగలమారి అని ప్రతీ ఒక్కరూ వ్యాఖ్యానిస్తున్నారు. ఆ దేవాలయంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఏతావాతా వందమందికి పైనే ఉద్యోగాలు..అన్నీ ఈఓ సామాజిక వర్గానికి చెందిన వారికే ఇచ్చారట. ప్రస్తుతం ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. మిగతా సామాజిక వర్గీయులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. సోషల్ మీడియాలో ఇదే అంశంపై ఒకరూ ఇద్దరూ కాదు..చాలామందే విమర్శలు చేస్తున్నారు. ఉద్యోగాలిస్తే విమర్శలు ఏంటనే కదా అనుమానం. ఉద్యోగం అంటే ఆషామాషీ కాదు. అందులోనూ దేవదాయ శాఖలో. ఎన్ని నిబంధనలు ఉంటాయి?..ఎన్ని షరతులు ఉంటాయి?. ఎన్ని పద్ధతులు ఉంటాయి?.. కానీ ఇక్కడ ఈఓ... అంత కన్నా ముఖ్యంగా ఆ ఔట్ సోర్స్ ఉద్యోగిని చెబితే చాలు..ఈఓ గంగిరెద్దులా తలాడించి ఇచ్చేస్తాడట. మరి ఆ మహిళా ఉద్యోగినిపై అంత నమ్మకం. అందుకే ఎక్కడకు వెళ్ళినా డ్రైవర్నైనా తీసుకెళ్ళడం మానేస్తాడు కానీ..ఆ మహిళా ఉద్యోగిని మాత్రం మరచిపోకుండా తీసుకువెళ్తాడని అంటున్నారు. దైవ సన్నిధిలో భగవంతుని సేవ చేసుకోవాల్సిన.. బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ..ఇంకా ఈ వెధవ వేషాలు వేయడం ఏమిటని అతగాడి గురించి బాగా తెలుసున్న వ్యక్తులే వ్యాఖ్యానించడం గమనార్హం. మరి ఈ ఈఓ పదవికి మించి చేస్తున్న అవకతవకలు, అక్రమాలు, అసభ్య వ్యవహారం పై స్థానిక ప్రజాప్రతినిధులైనా దృష్టి సారించకుంటే..ఆ ఎమ్మెల్యేకు తెలియకుండానే ఇవన్నీ జరుగుతాయా అని ఎవరో ఒకరు విమర్శించినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఏమంటారు ఎమ్మెల్యే గారు..



# రెవెన్యూ తరహాలో పర్యవేక్షణకు..

### రాజమహేంద్రవరం, కొవ్వూరులో డీడీఓ కార్యాలయాలు ప్రారంభం

### - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** పరిపాలనా వ్యవస్థలో అవలంబిస్తున్న సంస్కరణల నేపథ్యంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ కార్యకలాపాలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీఓ) కార్యాలయాలను రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ పరిధుల్లో ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలియజేశారు. గురువారం రాజానగరం మండలంలోని లాలా చెరువు గ్రామంలో రాజమహేంద్రవరం డీడీఓ కార్యాలయాన్ని కలెక్టర్ కీర్తి చేకూరి, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో ఆర్డీఓ విధానం ఉన్నట్లుగా పంచాయతీ రాజ్ వ్యవస్థలో కూడా పర్యవేక్షణ బలోపేతానికి ఈ డివిజనల్ అభివృద్ధి అధికారి వ్యవస్థ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ వ్యవస్థ అమలుతో డివిజనల్ గ్రామ పంచాయతీ అధికారి, ఉపాధి హామీ పథకం అధికారులు, సచివాలయ సిబ్బంది ఒకేచోట పనిచేయడం ద్వారా పరిపాలనలో వేగం, జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. ఇప్పటి వరకు అభివృద్ధి పనుల నిమిత్తం మండల స్థాయిలో ఎంపీడీఓను సంప్రదించాల్సి వచ్చేదని, ఇకపై డివిజన్ స్థాయిలోనే సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 75 డివిజన్లలో ఈ కార్యాలయాలు ఒకే సారి ప్రారంభించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా జరిగే పనులను పర్యవేక్షించడానికి ఈ వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. గ్రామ సచివాలయాల పనితీరును విశ్లేషించి లోపాల్ని తక్షణమే పరిష్కరించేలా ఈ కార్యాలయాలు వారధిలా పనిచేస్తాయని, ప్రజలకు త్వరితగతిన సేవలు అందుబాటులోకి రావడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ చాలా కాలం తరువాత పంచాయతీ రాజ్ పరిపాలనలో క్రమబద్ధీకరణ సాధ్యమవుతుందని, పోలీసు వ్యవస్థలో డీఎస్పీ, రెవెన్యూ వ్యవస్థలో ఆర్డీవో ఉన్నట్లుగానే పర్యవేక్షణ కోసం డీడీఓ వ్యవస్థ అమలులోకి రావడం అభినందనీయమన్నారు. ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సూచనలతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ విధానంలో ఈ కార్యాలయాలు ప్రారంభించబడ్డాయని వివరించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసినందుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీ వెంకట గిరి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తమ్మిరెడ్డి శ్రీనివాస్ బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ వేచర్ల అవినాష్ , కాంట్రాక్టర్ ఎన్ సురేష్ (దొరబాబు), పంచాయతీ కార్యదర్శి చదలవాడ మురళీని అభినందించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వీ శాంత మణి, డివిజనల్ అభివృద్ధి అధికారి పీ వీణాదేవి, డివిజనల్ గ్రామ పంచాయతీ అధికారి ఎం నాగలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీవీ రెడ్డి గిరి, డీఈ శ్రీనివాస్, ఏఈ అవినాష్, కార్యదర్శి మురళి, కాంట్రాక్టర్ సురేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ రైల్వే పనులు వేగవంతం చేయండి

### రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కోరిన ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం (మనసులోమాట) డిశంబరు 4:** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసుల ఆకాంక్షకు అనుగుణంగా కోటిపల్లి, నర్సాపూర్ రైల్వే లైన్ పనులను వేగవంతం చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి కోరారు. గురువారం ఎంపి హరీష్ బాలయోగి ఢిల్లీ లోని మంత్రి కార్యాలయంలో ఆయనను కలిసి కోనసీమ రైల్వే లైన్ మరియు ద్వారపూడి రైల్వే స్టేషన్ ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరచాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. కోటిపల్లి, నర్సాపూర్ రైల్వే లైన్ కోనసీమ ప్రజల చిరకాల కల అని, వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాబోయే రోజుల్లో రైల్వే లైన్ పనులు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు. అలాగే ద్వారపూడి రైల్వే స్టేషన్ లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు, కోనసీమ రైల్వే లైన్ పై ప్రత్యేక దృష్టి సారించేందుకు మంత్రి వైష్ణవ్ సానుకూలంగా స్పందించారని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

# ఏపీలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తాం

### - రాజమహేంద్రవరంలోని ప్రసాదిత్య మాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సారథి సినిమాస్ ప్రారంభోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి





**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** ఆంధ్రప్రదేశ్ లో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని ప్రసాదిత్య మాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సారథి సినిమాస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజమహేంద్రవరం నగరం పర్యాటకం, సంస్కృతి, వినోద రంగాల్లో మరింత అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఏపీలో సినిమా రంగ అభివృద్ధికి తొలి మెట్టుగా ప్రసాదిత్య మాల్ ను భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో చలన చిత్ర అభివృద్ధికి అవసరమైన స్టూడియోలు, రీరికార్డింగ్ థియేటర్లు, డబ్బింగ్ థియేటర్లు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్న క్రమంలో సారథి సినిమాస్ తో ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఏపీలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో కొత్త ఫిల్మ్ పాలసీ తీసుకొస్తున్నామని ఈ క్రమంలో సినిమా రంగ పురోగతికి అవసరమైన అనేక విభాగాలు ఏపీకి రావాలని కోరుకుంటున్నామని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అన్నారు. సినిమా రంగ ఉన్నతికి అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి దుర్గేష్ భరోసానిచ్చారు. రాజమహేంద్రవరం నగరంలో కమర్షియల్ కాంప్లెక్స్ తో పాటు అద్భుతమైన మల్టీప్లెక్స్ ఏర్పాటు చేసిన ప్రసాదిత్య మాల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. డాల్బీ అట్మాస్ వంటి లేటెస్ట్ టెక్నాలజీతో కూడిన ఈ స్క్రీన్స్ లో సినిమా చూస్తే సినిమా లవర్స్ అద్భుతమైన అనుభూతికి లోనవ్వడం ఖాయమన్నారు. సారథి సినిమాస్ స్క్రీన్స్ లో సాధారణ సినిమా చూసినా కూడా అద్భుత అనుభూతి కలుగుతుందన్నారు. ఎన్నో అవాంతరాలు ఎదుర్కొని మొత్తానికి ప్రారంభానికి నోచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన వినోదాన్ని అందించేందుకు ఇలాంటి ప్రాజెక్టులు మరింతగా ముందుకు రావాలని మంత్రి ఆకాంక్షించారు. సాంస్కృతిక వైభవం, ఘనమైన చరిత్ర కలిగి తెలుగు భాషకు తొలి నుడికారం దిద్దిన ఆదికవి నన్నయ్య పుట్టిన నేల రాజమహేంద్రవరం నగరంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మల్టీప్లెక్స్ ఏర్పాటు కావడం శుభ పరిణామన్నారు. గోదావరి, కోనసీమ అందాలను, ప్రకృతి సౌందర్యాలను అద్భుతంగా వెండి తెరకెక్కించిన దర్శకులు ఆదుర్తి సుబ్బారావు, విశ్వనాథ్ తదితరులు ఎందరో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ముంబయిలో సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ లో పాల్గొన్న అంశాన్ని ప్రస్తావించిన మంత్రి దుర్గేష్ ఏఐ ఆధారిత టెక్నాలజీతో సినిమా రంగం కొత్త పుంతలు తొక్కనుందని అన్నారు. ఈ సందర్భంగా సినిమా రంగానికి సంబంధించి ఆంధ్రాలో మొట్ట మొదటి స్టూడియోగా దుర్గయ్య ప్రారంభించిన ధవళేశ్వరంలోని దుర్గా మూవీ టౌన్ స్టూడియో పేరుగాంచినదని మంత్రి దుర్గేష్ గుర్తు చేశారు.

### సంక్షేమ ఫలాలు ప్రతి నిరుపేద ఇంటికి చేరాలన్నదే

# కూటమి ప్రభుత్వ లక్ష్యం



**ఏలూరు, డిసెంబరు 04 (మనసులో మాట)..** స్థానిక శనివారంపేటలో గురువారం డివిజనల్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుండి 77 డివిజనల్ అభివృద్ధి అధికారి వారి (డివిఎల్ డివో కార్యాలయాలు) కార్యాలయాలను వర్చువల్ గా ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రారంభించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సంయుక్తంగా వీక్షించి, అనంతరం డివిజనల్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్చువల్ ద్వారా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిల పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో సంస్కరణలు సమర్థవంతంగా అమలు చేసి, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణీలు సంతృప్తి చెందే స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి నిరుపేద ఇంటికి చేరాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలన దక్షతతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని అన్నారు. కార్యాలయాలన్నీ ఒకే చోటకు చేర్చడం వలన మంచి పరిపాలన సౌలభ్యంతో పాటు ప్రజలకు మంచిమేలు జరిగే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కనీస మౌలిక వసతులు కల్పనకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిధులు సమకూర్చుతున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కీలక పాలనాపరమైన సంస్కరణలు చోటుచేసు కుంటున్నాయని, స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అందులో భాగంగా ప్రాంతీయ అభివృద్ధి అధికారులు (డీడీఓ) కార్యాలయాలు ప్రారంభించుకునుట చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామ పంచాయతీలు పాలన సంస్కరణలు ఫలితాలు, ఫలాలు ప్రజలకు చేరాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పాలనాపరమైన సంస్కరణలు తీసుకువచ్చామని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, నిరుపేద లకు సంక్షేమ ఫలాలు అందించే బాధ్యత అధికారులుపై ఉందని, మనస్సు పెట్టి పనిచేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు.

# మీడియాపై బోడి పెత్తనం ఎవరిది?!

- ▸▸ బ్రోకర్లుగా చలామణి అవుతున్నది ఎవరు?
- ▸▸ మీడియాను గ్రూపులుగా చీల్చి ఆనందిస్తున్నదెవరు?
- ▸▸ మొన్న డెల్టా హాస్పిటల్, నేడు మరోచోట..
- ▸▸ జర్నలిస్టుల అవమానానికి కారకులెవరు?

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరంలో జర్నలిస్టులు అడుగడుగునా వివక్షతకు గురవుతున్నారు. అవమానాలతో మనస్తాపంతో మదనపడుతున్నారు. పవిత్రమైన జర్నలిజం రంగంలోకి పత్రికా విలువలు తెలియని 'కొంతమంది' చొచ్చుకువచ్చి.. ఇంకా పచ్చిగా చెప్పాలంటే మాఫియాగా తయారై వర్గాల కుంపట్లకు ఆజ్యం పోస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్నవారిని, తెలుసున్న వారిని ఒక గ్రూప్ గా జాబితా తయారు చేసి..వీరే జర్నలిస్టులు..ఇంకెవరూ లేరనే అభిప్రాయాన్ని కలుగజేస్తూ ఆ బ్రోకర్లు అందినకాడికి అడ్డంగా బొక్కేస్తున్నారని సహచర పాత్రికేయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్న డెల్టా హాస్పిటల్ లో ఈ బ్రోకర్లు తలదూర్చి..నవ్వుల పాలయ్యారు. సదరు హాస్పిటల్ యాజమాన్యం తప్పయిందని క్షమాపణలు చెప్పి ఆ ప్రెస్మీట్ ని రద్దు చేసుకున్నారు. దీంతో కాస్త సంఖ్య పెంచితే బలంగా ఉంటుందనుకున్నారో ఏమో గురువారం స్థానికంగా ఓ ప్రైవేటు వ్యాపారం ప్రారంభోత్సవానికి 72 మంది జర్నలిస్టుల జాబితా ఒకటి తయారు చేసి..సదరు నిర్వాహకులకు పంపారట. వీరిని పిలిస్తే చాలు..నిజానికి వీరే జర్నలిస్టులు.. మిగతావాళ్ళు వెస్ట్, పీడీఎఫ్ గాళ్ళు, పనికిమాలిన యూట్యూబ్ గాళ్ళు..వృధా అంటూ ఆ వ్యాపార నిర్వాహకులకు చెప్పారట. పాపం వారికేమి తెలుసు..మా బాగా చెప్పారు.. వీరినే పిలుస్తామని చెప్పి బ్రోకర్లు ఇచ్చిన జాబితాలోని వారికే సదరు నిర్వాహకులు ఆహ్వానించారట. అసలు మీడియాపై ఈ బోడి పెత్తనం ఎవరిదని ఆహ్వానాలు అందుకోని జర్నలిస్టులు గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తున్నారు. దీనికి సమాధానం చెప్పాల్సింది 'ది రాజమండ్రి ప్రెస్ క్లబ్'. ఇదే విషయం మీడియా సోదరులకు సూచిస్తే.. అసలు రాజమండ్రి ప్రెస్ క్లబ్ పాలకవర్గం లేనే లేదు.. అలాంటప్పుడు ఎవరికి చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. ఘనత వహించిన 'రాజమండ్రి ప్రెస్ క్లబ్' కు పాలకవర్గం లేకపోవడం ఒకింత ఆశ్చర్యం, బాధాకరం. రాజులేని రాజ్యంలో ప్రజలే దోపిడీ దారులుగా తయారవుతారు అనడానికి ఇదొక సాక్ష్యం. ఎవరి పెత్తనం వారిది. అడిగేవారు లేరు. దోచుకునే వారు ఎక్కువయ్యారు. నగరంలో ఎక్కడ ఏ ప్రారంభోత్సవం, సభలు, సమావేశాలు అయినా..అక్కడ బ్రోకర్లు వాలిపోతారు. అంతా ఇంతా హడావిడి కాదు. వార్తలు రాసే జర్నలిస్టులు తమ విధులు తాము నిర్వహించుకుపోతారు. కానీ బ్రోకర్లు తెరముందు తెర వెనుక డబుల్ డ్రామా ఆడేసి చక్కబెట్టేస్తున్నారట. ఈ బ్రోకర్ల ద్వారానే జర్నలిస్టులను ఎంతమంది పిలవాలి, ఎవరెవర్ని పిలవాలో ఆ జాబితా నిర్వాహకులకు వెళుతుంది. అక్కడ ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు నిర్వాహకులు. జాబితాలో లేని కొందరు జర్నలిస్టులు అక్కడకి వెళ్ళి నానా రాద్ధాంతం చేస్తున్నారు. ఎంతో గౌరవంగా ప్రెస్ ని పిలిచి గౌరవిద్దాం అనుకుంటే..వ్యతిరేక వార్తలతో నిర్వాహకులు నవ్వులపాలవుతున్నారు. సిగ్గుతో తలెత్తుకు తిరగలేకపోతున్నారు. ఈ పరిస్థితికి కారణం ఎవరు?, సహచర జర్నలిస్టులను జర్నలిస్టులుగా చూడలేని అసూయ దేనికి?. ద్వేషం దేనికి?, ఈ విష సంస్కృతి ఉండీకొద్దీ ఎందుకు పెరిగిపోతోంది?. మన ఇంట్లో శుభ కార్యం అంటే..మన శక్తిని బట్టి.. ప్రధానమైన వ్యక్తులను పిలుచుకుంటాం. దానినెవరూ తప్పుబట్టరు. కాకపోతే ఇక్కడ.. నగరంలో ప్రధానమైన కార్యక్రమాలకు కావాలని కొంతమందిని పక్కనపెట్టి..కొంతమందికి సమాచారం ఇచ్చి..విభజించి పాలించు విధానం ఏ మేరకు సమంజసమనేది బ్రోకర్లుగా వ్యవహరిస్తున్న 'మాఫియా' గుర్తించాలి. ఇక్కడ బ్రోకర్లు అనే పదం వాడినందుకు కొందరికి మనస్తాపం కలగవచ్చు. నా ఉద్దేశంలో జర్నలిస్టులైతే ఇటువంటి దురుద్దేశ ఆలోచనలు ఉండవు. మీడియా ముసుగులో కొందరు చేస్తున్న వ్యక్తులు అనే అభిప్రాయంతో 'బ్రోకర్లు' అని సంబోధించాల్సి వచ్చింది. నిజంగా జర్నలిస్టులే ఇటువంటి పనికి కీలకపాత్ర పోషిస్తుంటే..అటువంటి వారెవరో గుర్తించి ఇకపై ఇటువంటి తప్పుడు నిర్ణయాలు కొనసాగకుండా చూడాల్సిన బాధ్యత సీనియర్ పాత్రికేయులు అందరిపైనా ఉంది. లేదంటే పరిస్థితి అదుపుతప్పే ప్రమాదం లేకపోలేదు.

**మనకెందుకీ గొడవ..అంటే సరిపోదు..**

బ్రోకర్ల జాబితాలో మొన్నటి వరకూ కొందరి పేర్లు లేవు. అప్పుడు ఆ జర్నలిస్టులు ఎంత వేదన చెందారో అందరికీ తెలుసు. ఇప్పుడు కొత్త జాబితాలో మరికొందరి పేర్లు చేర్చారు. హమ్మయ్య..నా పేరు ఉంది. ఇంకెవడి పేరు లేకుంటే నాకెందుకు అనే ఆలోచన పక్కన పెట్టి రియల్ జర్నలిస్టుగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. అసలు ఈ జాబితాల వ్యవహారం ఏమిటి?, ఎక్కడ నుంచి ఎవరు పంపిస్తున్నారు?, ఆ బోడి పెత్తనం ఎవరిది?, ఈ పెత్తనం చెలాయించే వారు జర్నలిస్టులేనా?, వారు ఏ పత్రికకు జర్నలిస్టు?, ఆ పేపర్లలో వార్తలు వస్తున్నాయా లేదా, జర్నలిస్టులపై పడి పబ్బం గడుపుకునే రాబందుల తాట తీయాల్సిన అవసరం సీనియర్ జర్నలిస్టులతో పాటు అసలు సిసలైన ప్రతి ఒక్క జర్నలిస్టుపైనా ఉంది. అలాగే నగరంలో ఉన్న ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. జర్నలిస్టులలో వర్గాలను ఏకం చేసి, రాజమండ్రి ప్రెస్ క్లబ్ కు గత వైభవం తీసుకురావాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# నూతన కోణంతో 'మోగ్లీ'

## - ప్రేక్షకులు సరికొత్త ప్రేమ కథను చూస్తారు - హీరో రోషన్ కనకాల



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన "మోగ్లీ" చిత్రంలో ప్రేమలోని నూతన కోణాన్ని చూపించబోతున్నట్లు చిత్ర హీరో రోషన్ కనకాల తెలిపారు. రాజమహేంద్రవరం ఎఫ్- కేఫ్ లో ప్రమోషన్లలో భాగంగా చిత్ర యూనిట్ మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా రోషన్ మాట్లాడుతూ "మా 'మోగ్లీ' సినిమా ఒక యూనిక్ ఫిల్మ్. ఒక సాధారణ యువకుడిగా, నేను నా పాత్ర కోసం చాలా పరిశోధన చేశాను. ఈ కథ ప్రేక్షకులను వారి మొదటి ప్రేమ జ్ఞాపకాలకు తీసుకెళ్తుంది. ముఖ్యంగా, దర్శకుడు సందీప్ రాజ్ విజన్‌కు ధన్యవాదాలు. ఈ సినిమా విజయంపై మేము చాలా నమ్మకంతో ఉన్నాము. ప్రతి ఒక్కరూ థియేటర్‌లో చూసి, మంచి సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాను. కథ చాలా డిఫరెంట్ గా ఉంటుంది.. ఓ కొత్త ప్రేమ కథని అందరూ చూడబోతున్నారు. విశాఖపట్నం పాడేరు, పార్వతీపురం దీని చుట్టూ ఉన్న ఏరియాలోనే ఎక్కువ షూటింగ్ జరిగింది. ఈ సినిమాలో హర్ష కామెడీ, కాళ భైరవ మ్యూజిక్ హైలైట్‌గా నిలుస్తాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మాపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు. 'మోగ్లీ' అనేది కేవలం సినిమా కాదు, యువత ఫీల్ అయ్యే కథ. ఇదొక ప్రేమ యుద్ధం.. డిసెంబరు 12న గ్రాండ్‌గా రిలీజ్ అవుతోంది." అని తెలిపారు. అందరూ ఆదరించాలని కోరారు. హీరోయిన్ సాక్షి మాట్లాడుతూ ఇది నా తొలి సినిమా, మీ అందరి ఆదరాభిమానాలు అందించాలని కోరారు. కమెడియన్ హర్ష చెముడు మాట్లాడుతూ "నేను చేసిన కామెడీ పాత్ర ఈ సినిమాలో చాలా కీలకం. కేవలం నవ్వించడం కోసమే కాకుండా, హీరో రోషన్ జర్నీలో నా పాత్ర ఒక బ్రిడ్జ్ లాగా ఉంటుంది. ఈ సినిమా కథ చాలా సీరియస్‌గా ఉంటుంది, దానికి తగ్గట్టుగా నా పాత్ర ద్వారా కామెడీ డోస్ కొంచెం లైట్ చేస్తుంది. చాలా మంచి కథ కుదిరింది. డైరెక్టర్ సందీప్ రాజ్ నా పాత్రను చాలా బాగా డిజైన్ చేశారు. తప్పకుండా థియేటర్లలో నవ్వుకుంటారు, అలాగే ఏడుస్తారు కూడా."అంత బావుంటుంది" అని తెలిపారు.

# అనుమతుల్లేని కట్టడాలు కూల్చేస్తాం

## అక్రమ నిర్మాణదారులకు నగర పాలక సంస్థ హెచ్చరిక - మోరంపూడి వద్ద ఒక అక్రమ నిర్మాణం కూల్చివేత



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** రాజమహేంద్రవరం నగరంలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టిన భవనాలు, భవన నిర్మాణ అనుమతులను అతిక్రమించి నిర్మాణం చేసిన భవన యజమానులందరికీ నగరపాలక సంస్థ హెచ్చరిక జారీ చేసింది. ప్రభుత్వం కల్పించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్-2025) అవకాశాన్ని వినియోగించుకోవాలని, లేనట్లయితే భవన యజమానులపై చట్టం ప్రకారం చర్యలు, అక్రమ నిర్మాణాల కూల్చివేత చర్యలు తీసుకోబడతాయని నగర పాలక సస్థ అధికారులు హెచ్చరిస్తున్నారు. గురువారం ఉదయం మోరంపూడి జంక్షన్ వద్ద ఒక అక్రమ నిర్మాణాన్ని నగర పాలక సంస్థ అధికారుల ఆదేశాలతో కూల్చివేశారు. నగర శ్రేయస్సు, ప్రజల భద్రత, ప్రణాళికాబద్ధమైన నగరాభివృద్ధికి విఘాతం కలిగించే నిర్మాణాలపై కార్పొరేషన్ ఉక్కుపాదం మోపనుంది. ఇందుకు అనుగుణంగా కఠినమైన చర్యలు చేపడుతోంది. నగర పాలక సంస్థ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తే నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అనేక భారీ కట్టడాలు వెలుగు చూస్తాయి. కాకపోతే ఈ కట్టడాల వెనుక నగర పాలక సంస్థకు చెందిన సంబంధిత అధికారుల అండదండలు కారణంగానే చకచకా నిర్మాణాలు జరుగుతున్నాయనే ప్రచారం బాహాటంగా వినిపిస్తోంది. వాటిని కూడా నగర పాలక సంస్థ కూల్చేస్తుందా, చూసీ చూడనట్లు వ్యవహరిస్తుందా అనేదే నగర వాసుల సందేహం.

# బేబీ ల భవితకు ధృతి అధిక ప్రాధాన్యత

## - బ్లూ రైన్ హాస్పిటల్ వేదికగా అనేక వైద్య కార్యక్రమాలు...
## - మహిళా క్రికెట్ వరల్డ్ విజయం పై వినూత్న ప్రచారం - డాక్టర్ శుభ శేఖర్ రెడ్డి




**కాకినాడ (మనసులో మాట )డిసెంబర్ 4..** ధృతి ట్రస్ట్ అండ్ బ్లూ రైన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో బాలికా భ్రూణహత్య వ్యతిరేక ఉద్యమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్టు నగరంలో సుమారు 50 కి పైగా ప్రత్యేక ప్రచార సందేశం తో కూడిన హోర్డింగ్ లను ఏర్పాటు చేయనున్న బ్యానర్ లను గురువారం ఉదయం బ్లూ రైన్ హాస్పిటల్ లో డా శుభ శేఖర్ రెడ్డి ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు భారతదేశం అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అందుకు అనేక సందర్భాలను డాక్టర్ శుభ శేఖర్ రెడ్డి వివరించారు. నదుల పేర్లతోపాటు భారత మాతగా కూడా మనం కొలుస్తున్నామని గుర్తు చేశారు. మహిళలు లేకపోతే అభివృద్ధి లేదన్న విషయం అనే రంగాలలోనూ మనకు స్పష్టం అవుతుందని, అయితే కొన్ని కారణాల దృష్ట్యా శిశు జనాల పట్ల మూఢ నమ్మకాలతో పాటు ఆందోళన కూడా వ్యక్తం చేయడం దురదృష్టకరమన్నారు.
ఇటీవలి మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజయం నేపథ్యంలో ధృతి ట్రస్ట్ నిర్వహించిన ప్రచార కార్యక్రమాలకు విపరీత స్పందన వచ్చిందని అన్నారు.ప్రత్యేక సందేశం ద్వారా నగర ప్రజలకు స్పష్టమైన నినాదాలు రూపంలో ప్రత్యేక బ్యానర్లను ఏర్పాటు చేశామని వివరించారు. అందులో కొన్ని నినాదాలను డాక్టర్ శుభ శేఖర్ రెడ్డి వివరించారు.ఒక అమ్మాయి పుట్టడానికి అనుమతించ బడినందుకే భారత భవిష్యత్తు నిలబెట్టబడింది.
న్యూబోర్న్ అత్యవసర సహాయం పీరినేటల్ అవగాహన, కౌన్సెలింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు. అమ్మ ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం అన్న భావనతో బ్లూ రైన్ హాస్పిటల్స్ అంకిత భావంతో పనిచేస్తుందని అన్నారు.ఇదే అంశంతో తల్లులను శక్తివంతం చేసే ప్రయత్నం లో భాగంగా ధృతి ట్రస్ట్ అండ్ బ్లూ రైన్ హాస్పిటల్స్ కలిసి నిర్వహిస్తున్న పీరినేటల్ ఆన్‌లైన్ తరగతులు రాష్ట్రవ్యాప్తంగా గర్భిణీలు, కుటుంబాలకు ఎంతో మేలు చేస్తున్నాయని డాక్టర్ శుభ శేఖర్ రెడ్డి అన్నారు.గర్భంలో నిశ్శబ్దంగా బాధపడుతున్న శిశువు సంకేతాలను ఎలా గుర్తించాలి?, ఫీటల్ డిస్ట్రెస్‌ను ఫీటల్ వెల్‌బీయింగ్‌గా మార్చే శాస్త్రీయ విధానాలు వంటి కార్యక్రమాలు విస్తృత ఆదరణ పొందుతున్నాయని ఆయన వివరించారు. భ్రూణ హత్యల నివారణకు ధృతి ట్రస్ట్ ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని నేడు అన్ని రంగాలలోనూ మహిళలు ముందంజ లో ఉన్నారంటే ఆడపిల్లల శిశు జననాల పట్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా పేరెంట్స్, బంధువులు ప్రోత్సహించాలని, ఆనాడే మహిళలకు నిజమైన స్వేచ్ఛ ఉంటుందన్నారు. వీటిపట్ల ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టితో ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని అవసరమైతే పాఠశాల స్థాయి నుండి అవగాహన కార్యక్రమాలు, ప్రోత్సాహకాలను ప్రభుత్వాలు ప్రకటించాల్సిన అవసరం ఎంత ఉందని డాక్టర్ శుభ శేఖర్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. న్యూ బోర్న్ బేబీ ల రక్షణకు ధృతి ట్రస్ట్ అధిక ప్రాధాన్యత కల్పిస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డా శ్రావణి దుర్గా ప్రసాద్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దాపురంలో డివిజనల్ డెవలప్మెంట్ కార్యాలయం ప్రారంభం





**పెద్దాపురం (మనసులో మాట) డిసెంబర్ 4..** రాష్ట్రవ్యాప్తంగా డీడీవో కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. కాగా కాకినాడ జిల్లా పెద్దాపురంలో డివిజనల్ డెవలప్మెంట్ కార్యాలయాన్ని డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ లాంచనంగా ప్రారంభించారు. డిడిఓ శ్యామల అధ్యక్షతన ప్రారంభోత్సవ వేడుకలు కోలాహలంగా జరిగాయి. ముందుగా నేతలంతా జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు నేర్పించారు. అనంతరం కార్యాలయ భవనాలను ప్రారంభించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రారంభోత్సవ వేడుకల వర్చువల్ దృశ్యాలను డిడిఓ కార్యాలయంలో డి డి వో శారద ఆధ్వర్యంలో లైవ్ షో నిర్వహించారు. నేతలు ప్రజాప్రతినిధులు లైవ్ షో కార్యక్రమంలో పాల్గొన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం డిడిఓ కార్యాలయాలను ప్రారంభించడం జరిగిందన్నారు. అధికారులు సిబ్బంది చిత్త శుద్ధితో ప్రజలకు సేవలు అందిస్తూ సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి సూరిబాబు రాజు, రాష్ట్ర రైతు సమాఖ్య కన్వీనర్ పాలకుర్తి శ్రీనివాస్ చౌదరి, జనసేన పెద్దాపురం టౌన్ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు, జిల్లా అధికారి అడపా వెంకటలక్ష్మి, పెద్దాపురం నియోజక వర్గానికి చెందిన కూటమి నేతలు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## విద్యార్థుల విద్యా పురోగతి కోసం
# మెగా పిటిఎంలో కీలకం

**ఏలూరు, డిసెంబర్, 4 (మనసులో మాట)..** ఈనెల 5వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ 3. %ా% నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో సమూల సంస్కరణలలో భాగంగా మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ (పి టి ఎం) నిర్వహణకు శ్రీకారం చుట్టిందని, గత జూలై 10 న జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటుఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్, జూనియర్ కళాశాలలో మెగా పిటిఎం 2.0 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. అదేరీతిలో ఈనెల 5వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల విద్యా పురోగతి కోసం ప్రజల భాగస్వామ్యం ముఖ్యంగా తల్లితండ్రుల పాత్ర మెగా పిటిఎంలో కీలకమన్నారు. మెగా పిటిఎం ద్వారా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాలల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి వేదికగా పనిచేస్తోందని, విద్యా పురోగతి, ప్రవర్తన సామజిక సమస్యల గురించి అవగాహన చేసుకోవడానికి మెగా పిటిఎం దోహద పడుతుందన్నారు. జిల్లాలోని 1748 ప్రభుత్వ , ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో లక్షా 19 వేల 397 మంది విద్యార్థిని, విద్యార్థులతో పాటు వారి వారి తల్లితండ్రులు పాల్గొంటారని అందుకు తగినవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభవుతుందని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 'మెగా పేరెంట్స్ మీట్' లో ముందుగా విద్యార్థులతో రూపొందించబడిన ఇన్విటేషన్ తో అతిధులను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. అనంతరం తల్లితండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా ప్రగతి, సామజిక ప్రవర్తన, తదితర అంశాలపై చర్చిస్తారన్నారు. అనంతరం గుడ్ టచ్, బాడ్ టచ్ పై విద్యార్థినీ, విద్యార్థులకు తెలియజేస్తారన్నారు. లీప్ యాప్ వినియోగంపై తల్లితండ్రులకు అవగాహన కలిగిస్తారన్నారు. అనంతరం తల్లితండ్రులు టీచింగ్ లెర్నింగ్ మెషీన్స్ ఎగ్జిబిషన్ , స్పోర్ట్స్ మెటీరియల్, లైబ్రరీ బుక్స్ పరిశీలిస్తారన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల నిర్వహణ, విద్యా ప్రమాణాలు, తదితర అంశాలపై తెలియజేస్తారన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులతో సహపంక్తి భోజన కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో 'మెగా పేరెంట్స్ మీట్' ని విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# ఉద్యానవనాల అభివృద్ధికై కలెక్టర్ కృషి అభినందనీయం

## బోటు క్లబ్ వర్కర్స్ సంగం అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్..



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 4..** కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఉద్యానవనాలను వినోదభరితంగా తీర్చిదిద్దనున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అభినందనీయులని బోటు క్లబ్ వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో గురువారం జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు .ఇటీవల నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి అయిన షణ్మోహన్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించా రన్నారు. ఆ సమావేశంలో ఉద్యానవనాలను ప్రైవేటీకరణ చేయడం లేదని వాటిని వినోదభరితంగా తీర్చిదిద్దనట్లు పేర్కొనడం అభినందనీయమన్నారు. ఫుడ్ కోర్టులు, ఎగ్జిబిషన్ ప్రాంగణాలు, నెట్ క్రికెట్, గో కార్డింగ్ ట్రాకులు, ఎమ్యూజ్మెంట్ రైడ్లు వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తే ప్రజలకు వినోదం, కార్పొరేషన్ కు ఆదాయం రెండు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం హర్షణీమన్నారు. పేద, మధ్యతరగతి కి ఆహ్లాదాన్ని అందిస్తున్న ఉద్యానవనాలను అభివృద్ధి చేయడానికి జిల్లా కలెక్టర్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అడబాల తెలిపారు.



## కలెక్టర్ సమయానుకూల చొరవ..
# ప్రభుత్వం అండగా!

- మహిళ స్వస్థలానికి తిరిగి రాక
- విదేశీ ఉపాధి కోసం నకిలీ ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండండి..
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు, దుబాయ్‌లో నకిలీ ఏజెంట్ చేత మోసపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొవ్వూరు మండలం దారావరం గ్రామానికి చెందిన షైక్ నాగూర్ బేబీని అడుగు అడుగునా సహకారం అందించి క్షేమంగా స్వదేశానికి చేర్చడంలో 'వికాస కేంద్రం' కీలక పాత్ర పోషించింది. స్థానిక ఉపాధి అవకాశాలు సాకారం కాక, నకిలీ ఏజెంట్ చెప్పిన తప్పుడు హామీలకు నమ్మి దుబాయ్ వెళ్లిన ఆమె అక్కడ పని, భరించలేనంత ఒత్తిడులు, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొని తీవ్రంగా ఇబ్బందులు పడింది. కుటుంబ సభ్యులు కలెక్టర్ ని సంప్రదించగా వెంటనే స్పందించిన వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కే లచ్చారావు సంబంధిత ఏజెంట్, అధికారులతో సంప్రదింపులు జరిపి ఆమెను భారత్‌కు క్షేమంగా రప్పించే చర్యలు చేపట్టారు. విదేశీ ఉపాధి కోసం ప్రయత్నించే యువత, మహిళలు నకిలీ ఏజెంట్ల మాయ మాటలకు లోను కాక, అధికారిక ఛానెల్స్ ద్వారానే విదేశాలలో ఉపాధి అవకాశాలపై సంప్రదింపులు జరపాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. స్థానికంగా వికాస, నైపుణ్యాభివృద్ధి, న్యాక్ కేంద్రాలు తదితర వ్యవస్థల ద్వారా సరైన ఉద్యోగ%-%ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా షైక్ నాగూర్ బేబీ కుటుంబ సభ్యులు గురువారం కలెక్టరేట్ లో కలెక్టర్ ఛాంబర్ లో కలిసి "అత్యవసర సమయంలో మా కుటుంబానికి రక్షణగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, వికాస సంస్థకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబం ఎప్పటికీ ఈ సహాయాన్ని మరిచిపోమని అన్నారు. ఈ కార్యక్రమంలో వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కే లచ్చారావు పాల్గొన్నారు.

# ఎరువుల కోసం పరుగులు పెడుతున్న రైతులు



**పెదపూడి (మనసులో మాట) డిసెంబర్ 4..** ఎరువుల కోసం పరుగులు పెడుతున్న పరిస్థితి రైతులకు ఏర్పడింది. రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. కానీ క్షేత్రస్థాయిలో కావలసినంత యూరియా లభించని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడలో గురువారం ఎరువుల కోసం రైతులు ఉదయం నుండి బారులు తీరారు. గొల్లల మామిడాడలో మన గ్రోమోర్ ఎరువుల దుకాణానికి యూరియా రావటంతో రైతులు ఎగబడ్డారు. మండలంలోని గండ్రేడు, పెదపూడి, పైన, తదితర గ్రామాల్లోని సొసైటీలకు ఇప్పటికే యూరియా ఎరువులను అందించినట్లు మండల వ్యవసాయ అధికారి సత్యప్రసాద్ తెలిపారు. కానీ ఆయా సొసైటీల వద్ద ఇలా రావడం, అలా అయిపోవడం వెంటనే జరిగింది. కొందరు రైతులు అవసరానికి మించి యూరియా కొనుగోలు చేస్తున్నట్లు కూడా అధికారులకు వివరిస్తున్నారు. రైతు సేవా కేంద్రాలు, సహకార సొసైటీలలో కూడా పూర్తిస్థాయిలో యూరియా, ఇతర ఎరువులు అందించాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

# కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీల్ ను పరామర్శించిన ఎమ్మెల్యే గిడ్డి



**అమలాపురం (మనసులో మాట) డిసెంబరు 4:** అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో ఐసీయులో చికిత్స పొందుతున్న వడ్డి సునీల్ ను పీగన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించారు. గురువారం ఎమ్మెల్యే అమలాపురం కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సునీల్ పరామర్శించి అసలు ఏం జరిగిందని అతని సోదరుడు ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో సునీల్ తలకు బలమైన గాయం అయిందని దీనికి మందులు వాడుతున్నాడని అయితే అప్పటినుండి అతను ఆరోగ్యం బాగానే ఉందని ఇటీవల సడన్ గా కళ్ళు తిరిగి పడిపోయాడని దీంతో ఆదర్శ హాస్పిటల్ కి తీసుకెళ్లగా చికిత్స చేయించి చేయించడంతో కోలుకున్నాడ న్నాడు. అయితే మళ్లీ ఒకటో తేదీన ఇంటి వద్దనే స్పృహ తప్ప పడిపోగా ఫిట్స్ కింద రావడంతో అమలాపురం కిమ్స్ హాస్పిటల్స్ లో జాయిన్ చేయగా డాక్టర్లు ఐసియు లో వెంటిలేటర్ పై చికిత్స అందించగా ప్రస్తుతం కోల్కొన్నాడని తెలిపారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎటువంటి ఆందోళన పెట్టుకోవద్దని ఎమ్మెల్యే సునీల్ కు సూచించారు. సునీల్ కు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే వైద్యులకు సూచించారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




### దత్త జయంతి సందర్భంగా

## హనుమాన చాలీసా పారాయణ

**కాకినాడ (మనసులో మాట )డిసెంబర్ 4..** కాకినాడలోని స్థానిక ఎన్ఎఫ్సీఎల్ రోడ్ నందు వినాయక కేఫ్ హొటల్ లో ఘనంగా సత్కళావాహిని బృందం వారిచే హనుమాన చాలీసా సంగీత పారాయణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. దత్తజయంతి సందర్భంగా వినాయక మాధవరావు సమక్షంలో వారాహి వినాయక కేఫ్ హొటల్ నందు సత్కళావాహిని వ్యవస్థపాకులు ఇ.వి. కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామివారికి అత్యంత వైభవంగా కనులు పండుగగా హనుమాన చాలీసా సంగీత పారాయణ గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్కళావాహిని సభ్యులు అందరూ పాల్గొన్నారు. ఇ.వి. కృష్ణ మాచార్యులు మాట్లాడుతూ దత్త జయంతి సందర్భంగా వినాయక కేఫ్ హొటల్ నందు గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సత్కళావాహిని సభ్యులు చే భక్తి శ్రద్ధలతో హనుమాన చాలీసా సంగీత పారాయణ చేయడం జరిగిందని పేర్కొన్నారు. వారాహి వినాయక కేఫ్ హొటల్ నందు సుంకర శ్రీ రామ చంద్ర మూర్తి ( బాబి) పార్వతి దేవి దంపతులు చే హనుమాన్ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించినారు. స్వామివారిని దర్శించిన అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించినారు. ఈ కార్యక్రమం లో వారాహి వినాయక కేఫ్ హొటల్ యజమాని పెంకె శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### రైతులు వర్షాల నుండి ధాన్యాన్ని కాపాడుకోవడానికి తార్పాలిన్లు

## సద్వినియోగం చేసుకోవాలి

**- జెసి టి నిశాంతి**




**అమలాపురం (మనసులోమాట) డిసెంబరు 4:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఖరీఫ్ సాగుచేసిన రైతాంగానికి అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యాన్ని కాపాడుకునేందుకు అందు బాటులో తార్పాలిన్లు ఉంచడం జరిగిందని వాటిని సద్వినియోగం చేసుకొని గిట్టుబాటు ధరల పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాం తి గురువారం ఒక ప్రకటన ద్వారా రైతులకు పిలుపు నిచ్చారు. ఈ సమాచారాన్ని కోనసీమ ప్రాంత రైతాంగం తెలుసు కొని తాము ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను రక్షించుకోవాలని ఆమె సూచించారు. అకాల వర్షాల ప్రభావం నుండి ధాన్యాన్ని రక్షించేందుకు ముందస్తు చర్యగా డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 204 కొనుగోలు కేంద్రాలకు సంబంధించి సమీపంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో మొత్తం 5,228 టార్పాలిన్ పీట్లు అందుబాటు లో ఉంచడం జరిగిందన్నారు. రైతులు తమ పంట ధాన్యాన్ని రక్షించుకొనుటకు ఈ టార్పాలి న్లను పూర్తిగా ఉచితం గా సరఫరా చేయడం అవసరమైనప్పుడు సంబంధిత ధాన్యం కొనుగోలు కేంద్రానికి సంప్రదించి టార్పాలిన్లను తీసుకొని, వాడుకుంటూ ఆయా పనులు పూర్తయిన తర్వాత తిరిగి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు అప్పగించాలన్నారు. తార్పాలిన్లు అయినవిల్లి మండలంలో 307, ఆలమూరు 290,అల్లవరం 101, అమలాపురం 185, అంబాజీ పేట 147, ఆత్రేయపురం 366, ఐ పోలవరం 210, కపిలేశ్వరపురం 350, కాట్రేనికోన 210, కొత్తపేట 185, మల్కిపురం 93 మామిడి కుదురు 180 మండపేట 344, ముమ్మిడివరం 192, పి గన్నవరం 217, కే గంగవరం 412, రామ చంద్రపురం 520, రావులపాలెం 175 రాయవరం 307, రాజోలు రెండు 212, సఖినేటిపల్లి 25 ఉప్ప లగుప్తం 200 మండలాల వారీగా తార్పాలిన్లు అందు బాటులో ఉన్నాయన్నారు. అకాల వర్షాల వల్ల దాన్యం తడిసి నష్టాలు జరగకుండా ఉండేందుకు ఈ సదుపాయాన్ని రైతులు తప్పనిసరిగా సద్విని యోగం చేసుకోవలసిందిగా ఆ ప్రకటనలో ఆమె విజ్ఞప్తి చేశారు .

# విచ్చలవిడిగా గ్రామాల్లో మద్యం అమ్మకాలు

**- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు**






**అయినవిల్లి (మనసులో మాట) డిసెంబరు 4:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలంలో వివిధ గ్రామాల్లో మద్యం ఏరులై మారుతున్నా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తైనా చూడటం లేదని గ్రామస్తులు అధికారులపై మండిపడుతున్నారు. అయినవిల్లి మండలంలో ప్రభుత్వం నుండి మద్యం టెండర్లలో అనుమతులు పొందిన ఐదు మద్యం షాపులు ఉన్నాయి. వీరంతా సిండికేట్ అయి గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలకు సహకరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ మద్యం షాపుల నుండి కొంతమంది కిరాణా, పాన్, కూరగాయలు షాపుల్లోనూ హొటల్స్, ఇళ్లల్లో ఇలా పలు విధాలుగా రోజుకి 100 నుండి 200 బాటిల్లు అమ్ముకుంటూ బాటిల్ కు 30 నుండి 50 రూపాయలు అదనంగా అమ్మి రోజుకు 3వేలు నుండి 5వేలు సంపాదిస్తున్నారని ప్రభుత్వమే గ్రామాల్లో బెల్ట్ షాపులు పెట్టి ఉంటే ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని దీనివల్ల ప్రభుత్వం ఆదాయానికి గండిపడుతుందని ఆరోపణలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం ఎందుకు వాటిపై దృష్టి పెట్టడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేదునూరు పెద పేటలో ఇటీవల ఒక ఇంట్లో 60 మద్యం బాటిల్లు కాకినాడ నుండి వచ్చిన ఎక్సైజ్ స్క్వాడ్ అధికారులు పట్టుకుని వారిపై కేసు నమోదు చేశారు. దీన్ని బట్టి స్థానిక ఎక్సైజ్ అధికారులు మద్యం బాటిల్లు అమ్ముకునే వారికి ఎలా సహకరిస్తున్నారో స్పష్టంగా అర్థమవుతుందని స్థానికులు చెబుతున్న మాట. ప్రసిద్ధి చెందిన అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి ఆయనకి ఆలయానికి ముక్తేశ్వరం నుండి అయినవిల్లి వెళ్లాలంటే దేవస్థానానికి చెందిన అయినవిల్లి వైపు ఒక ఆర్చి ఉంది. అది దాటగానే ఎదురుగా మద్యం షాపులు దర్శనమిస్తున్నాయి. భక్తులు ఆలయానికి వెళ్లే మార్గంలో మద్యం షాపులు ఉండటం వలన భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం అయిందంటే ప్రధాన రహదారిపై వెళ్లాలంటే మందుబాబులు ఆగడాలకు ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారని, రోడ్డుపై వారు చేస్తున్న ఆగడాలు స్రుతిమించుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు చెంతనే ఉన్న మద్యం షాపులో పరిమిట్లు ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. బ్యాంకుకు వచ్చే కస్టమర్లు మందు బాబులు ఆగడాలు చూసి బిత్తుపోతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అయినవిల్లి లో మద్యం షాపుల నిర్వహణపై జిల్లా ఎక్సైజ్ అధికారులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# సందిగ్ధంలో కాజులూరు మండలం 26 గ్రామాల ప్రజలు

**ప్రభుత్వ నిర్ణయంతో కార్యాచరణ - ఉద్యమ కార్యాచరణ దిశగా గ్రామాల నిర్ణయం**




**కాజులూరు (మనసులో మాట) డిసెంబరు 4:** నియోజకవర్గం పరంగా అమలాపురం జిల్లాలో ఉన్న , రెవెన్యూ పరంగా కాకినాడ జిల్లాలో ఉన్న కాజులూరు మండలం కాజులూరు మండలం ప్రస్తుతం తీవ్ర అసంతృప్తి మేఘాలను చుట్టుముడుచుకున్నదని చెప్పాలి. ప్రభుత్వ తాజా నిర్ణయాల ప్రభావంతో మండలంలోని 26 గ్రామాల ప్రజలు తీవ్ర అయోమయంలో, భవిష్యత్తుపై అనిశ్చితిలో, తమ హక్కుల కోసం ఉద్యమం ప్రారంభించాల్సిన పరిస్థితుల్లో నిలబడ్డారు.

**ప్రభుత్వ నిర్ణయం - ప్రజల్లో అనిశ్చితి..**

ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం వల్ల గ్రామస్తుల రోజువారీ జీవనం, సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు, నీటి వనరులపై ఆధారపడిన జీవనాధారం తీవ్రంగా ప్రభావితమవుతుందని ప్రజలు భావిస్తున్నారు. అసలు నిర్ణయం ఏమిటి, దాని ప్రయోజనాలు ఏమిటి, దుష్ప్రభావాలు ఏమిటి అనే విషయాలపై అధికారులనుంచి స్పష్టమైన వివరణ లేకపోవడం ప్రజల్లో మరింత ఆందోళనకు కారణమైంది.

**26 గ్రామాల ఐక్యత - ప్రజల స్వరమే శక్తి..**

కాజులూరు మండలంలోని 26 గ్రామాలు ఒకే వేదికపైకి వచ్చి సంయుక్తంగా చర్చలు ప్రారంభించనున్నాయి గ్రామ పెద్దలు, రైతు సంఘాలు, మహిళా సంఘాలు, యువజన సమితులు కలిసి పరిస్థితిని విశ్లేషిస్తూ: ప్రభుత్వ నిర్ణయంపై స్పష్టమైన వివరణ ఇవ్వాలి. ప్రజల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి. గ్రామాలకు నష్టం కలిగించే చర్యలు తీసుకోరాదని హామీ ఇవ్వాలి, అనే మూడు ప్రధాన డిమాండ్లను పెట్టుకోవడానికి సిద్ధమయ్యారు.

**ప్రజలు చెప్పేది ఒక్కటే - "మా జీవితాలపై నిర్ణయం మాతో చెప్పకుండా ఎలా?"**

గ్రామాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఇలా అంటున్నారు. మా భూములు, మా వనరులు, మా జీవితం. నిర్ణయాలు మా అభిప్రాయాన్ని తీసుకోకుండా ఎలా తీసుకుంటారు?" అధికారులు వస్తామని చెప్తారు. కానీ స్పష్టమైన సమాధానం ఇవ్వరు,ఇలాగే కొనసాగితే పెద్ద స్థాయి ఉద్యమం తప్పదు అంటున్నారు. ఇలా ప్రతి గ్రామంలో చర్చలు ఉధృతంగా సాగే పరిస్థితులు కనబడుతున్నాయి.

**ఉద్యమ కార్యాచరణ దిశగా అడుగులు..**

ప్రభుత్వం కాజులూరు మండలం పై స్పష్టమైన పట్టించుకోకపోతే, గ్రామాల ప్రజలు దశల వారీగా ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని నిర్ణయిస్తున్నారు.

ఉన్న కార్యాచరణలో భాగంగా: మండల కేంద్రంలో పెద్ద స్థాయి సమావేశం. గ్రామాల నుంచి ప్రతినిధులతో ర్యాలీలు. జిల్లా కేంద్రానికి వినతిపత్రాలు అవసరమైతే నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. అన్ని గ్రామాలు కలిసి ఒకే ధోరణితో ఉద్యమ పంథాను నిర్ణయించుకోనున్నాయి. ప్రజల స్వరం వినాల్సిన సమయం ప్రభుత్వం ముందు ఉంది కాజులూరు మండలంలోని 26 గ్రామాల ప్రజలు కోరుకునేది పెద్దది కాదువారి జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలను వారికి తెలియజేయడం, వారి మాట వినడం. అధికారాలు, ప్రజలు కలిసి మాట్లాడితే సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయి. కానీ ప్రజలు చెబుతున్నట్లుగా, "స్పష్టత లేకపోతే, మా హక్కుల కోసం రోడ్లపై దిగడమే మార్గం" అనే పరిస్థితి ఏర్పడుతోంది. కాజులూరు మండలంలో జరుగుతున్న ఈ పరిణామం ప్రభుత్వం, అధికార యంత్రాంగం ప్రజలతో మమేకమై పనిచేయకపోతే ఎంత త్వరగా పరిస్థితులు ఉద్రిక్తత దిశగా వెళ్లవచ్చో స్పష్టంగా చూపిస్తోంది. 26 గ్రామాల ప్రజలు ఒక్క మాటతో చెబుతున్నారు. "మా జీవనాధారాన్ని కాపాడుకోవడమే మా ఉద్యమం.

### సముద్రంలోకి అత్యంత ప్రమాదకరమైన విష ద్రవాలను

# విడుదల చేస్తున్న ముఠాపై చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ ప్రత్యేక విచారణ కమిటీ వేయాలి**


**- పరిశ్రమలను పరిశీలించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పర్యవేక్షణ చేయాలి - సిఐటియు డిమాండ్**





**కాకినాడ రూరల్ ( మనసులో మాట ) డిసెంబర్ 4..** కాకినాడ రూరల్ మండలం వాకలపూడి, సూర్యారావుపేట గ్రామాల మధ్యలో సముద్రంలోకి వెళ్లే కాలువలోకి అత్యంత ప్రమాదకరమైన విష ద్రవాలను లారీ ట్యాంకర్ల ద్వారా సముద్రంలోకి వదిలేస్తున్నారు. గత రెండు సంవత్సరాల నుండి బీచ్ రోడ్ లో రొయ్యల పరిశ్రమ మూతపడి ఉంది. ఈ పరిశ్రమ నుండి సెక్యూరిటీ ఆఫీస్ రికార్డుల ప్రకారం చూస్తే గత రెండు సంవత్సరాల నుండి రోజుకి మూడు నుండి ఐదు ట్యాంకర్లు విష ద్రవాలను సముద్రంలోకి వెళ్లే కాలువలో వదిలేస్తున్నారు. గత కొంతకాలంగా మత్స్యకారులు స్థానిక ప్రజలు బీచ్ రోడ్ అని వెళ్లే కార్మికులు ఆ ప్రదేశానికి వచ్చేసరికి గాలి పీల్చుకోలేనంత దారుణంగా వాసన రావడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సూర్యారావుపేట మత్స్యకారులు గత కొంతకాలంగా పరిశీలన చేయగా రాత్రి ఒక ఆయిల్ ట్యాంకర్ 24 వేల లీటర్లు ఉన్న విష ద్రవాలను పైపు ద్వారా సముద్రంలోకి విడుదల చేయడాని చూసి మత్స్యకారులు ఆందోళన చేశారు. మత్స్యకారుల ఆందోళనకు సిఐటియు కాకినాడ రూరల్ మండల కార్యదర్శి టి రాజా, చింతపల్లి అజయ్ కుమార్ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా తొట్టిపూడి రాజా, చింతపల్లి అజయ్ కుమార్ మాట్లాడుతూ మత్స్యకారులు గత కొంతకాలంగా వేటకి వెళుతున్న సముద్రం లోపలికి 34 కిలోమీటర్ల లోపలికి వెళ్తే గాని వేటపడట్లేదని ఆందోళన చెందారన్నారు. ఈ కాలంలో అనేక చేపలు తాబేలు జీవులు చనిపోవడానికి ముఖ్య కారణం ఈ విష ద్రవ్యాలన్నారు. మూసివేసిన పరిశ్రమలోకి లారీ ట్యాంకర్ల ద్వారా విష ద్రవాలను వ్యర్థాలను తీసుకుని వచ్చి సముద్రంలో కలపడం అనేది ఈ పర్యావరణాన్ని పూర్తిగా నాశనం చేయడం అన్నారు. సముద్రంలోకి టూరిజం పేరుతో వేలాదిమంది చిన్నపిల్లల నుండి పెద్దల వరకు కాకినాడ బీచ్ కి వస్తూ ఉంటారు అన్నారు. విష ద్రవాలు గాలి ద్వారా పిలిస్తేనే ఉండలేని పరిస్థితిలో సముద్రం నీటిలో కలిసిపోయి బీచ్ కి వెళ్లే ప్రతి ఒక్కరికి అనేక రోగాలకు కారణం అవుతున్నారన్నారు. ఇదొక పెద్ద మాఫియాని తక్షణం ఈ మాఫియా పై సిబిఐ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులు ప్రజలు ప్రాణాలతో చెలగాటం వాడుతున్న ఈ మాఫియా పై కఠినమైన శిక్షలు అమలు చేయాలన్నారు. కాకినాడ రూరల్ లో ఉన్న అన్ని పరిశ్రమలను పరిశీలించి విడుదల చేస్తున్న ద్రవాలను, వ్యర్థాలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పూర్తిస్థాయి విచారణ జరిపి రిపోర్టు జిల్లా అధికారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సముద్ర తీర ప్రాంతంలో దివిస్ అరబిందో వంటి ఫార్మా కంపెనీలు విడుదల చేసే వ్యర్థాలువలనే మత్స్యకారులకు వేట అందుబాటులో ఉండటం లేదని మత్స్యకారుల ఆందోళన చేస్తే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వచ్చి మూడు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటికీ పరిష్కారం చేయలేదన్నారు. విష ద్రవాలను సముద్రంలో కలిపే లారీలను సీజ్ చేయడంతో పాటు పరిశ్రమ యాజమానిని దీని సంబంధించిన అందర్నీ పైన ఎఫ్ఐఆర్ వేసి పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.






### విద్యార్థి దశ నుండే వ్యవసాయం భూముల పై

## అవగాహన కలిగి ఉండాలి

**- వ్యవసాయ శాఖ అధికారి రెడ్డి ఈశ్వరరావు**

**రౌతులపూడి, (మనసులో మాట ప్రతినిధి)డిసెంబర్ 04:** మండలంలోని ఏ మల్లవరం గ్రామంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు కళాశాల విద్యార్థులకు రౌతులపూడి మండల వ్యవసాయ శాఖ అధికారి రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు మట్టి నమూనాలు పై ఆ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే వ్యవసాయం మరియు నేలలపై అవగాహన కలిగి ఉండాలని ఈశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

### కార్పొరేషన్ కు ఆదాయం తక్కువ అయిందని పబ్లిక్ పార్కులను

## ఉద్యానవనాలను ప్రైవేటుపరం చేస్తే సహించేది లేదు

**ఏఐటియుసి జిలా ప్రధాన కార్యదర్శి తోకలు ప్రసాద్ హెచ్చరిక**



**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 4..** కాకినాడ కార్పొరేషన్ కి ఆదాయం తక్కువ అయిందని పబ్లిక్ పార్కులను, ఉద్యానవనాలను ప్రైవేటు పరం చేస్తే సహించేది లేదని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హెచ్చరించారు. గురువారం ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించాల్సిన పార్కులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తారన్నారు. వారి ఆదాయం కోసం పార్కులను ఇష్టానుసారంగా వాడుకుంటారన్నారు. కాకినాడ నగరంలో ప్రభుత్వ స్థలాల్లో కార్పొరేషన్, స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన బీచ్ పార్క్, శిల్పారామం వంటి వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడంతో టికెట్ ధరలు పెట్టి ప్రజల నుండి ముక్కు పిండి మరి వసూళ్లు చేస్తున్నారని తోకల ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. అదేవిధంగా పార్కులను కూడా ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. ప్రైవేటు వ్యక్తులకు అప్పగించవద్దు ప్రభుత్వంనే కొనసాగించాలి లేదంటే ప్రజల ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వం అధికారుల లోనికి వచ్చి 18 మాసాలు గడుస్తున్న ఏ విధమైన అభివృద్ధి చేయకపోగా అధికారులు ప్రభుత్వం తీసుకున్న ఈ దుర్మార్గ చర్య అని తోకల ప్రసాద్ అభివర్ణించారు. కాకినాడ మహానగరంలో రోడ్లన్నీ ఛిద్రంవద్రం ఉన్న పట్టించుకునే నాధుడే కనబడటం లేదని ఆయన ఆరోపించారు. కార్పొరేషన్ కి అనేక విధాలుగా ఆదాయం వస్తున్న పట్టణాన్ని సుందరీకరణ చేసే పనుల్లో అధికారులు లేరని ప్రతిరోజు మీటింగులు లేదంటే సొంత నిర్ణయాలు తప్ప ఏ విధమైన అభివృద్ధి కాకినాడ పట్టణంలో కనబడటం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా కాకినాడ అభివృద్ధికి ప్రభుత్వ సొంత నిధులతోనే అభివృద్ధి పరిచేందుకు అధికారులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## కోనసీమ జిల్లాలో లావాదేవీలు జరగని బ్యాంక్ ఖాతాల్లో 82 కోట్లు




**అమలాపురం( మనసులోమాట) డిసెంబరు 4:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో లావాదేవీలు జరగని 4,70,690 మంది బ్యాంకు ఖాతాల్లో రూ.82.66 కోట్లు పైగా సొమ్ము వివిధ బ్యాంకు ల్లో మూలుగుతోందని సరైన పత్రాలు తీసుకొచ్చి సొమ్ములు తీసుకుని వెళ్లాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనే జర్ కేశవవర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి పదేళ్లకు పైగా లక్షలాది ఖాతాల్లో లావాదేవీలు జరగడంలేదన్నారు. బ్యాంక్ డిపాజిట్స్, ఎల్ఐసి పాలసీలు షేర్స్, మ్యూచువల్ ఫండ్స్ ఉన్న సొమ్మును తిరిగి పొందవచ్చునన్నారు. ఈ ఖాతాలకు సంబంధిం చిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధు లు సరైన ధ్రువపత్రాలతో వచ్చి ఈకే వైసీ పూర్తి చేసి, తమ సొమ్ములను తీసుకువెళ్లా లని ఇటీవల వర్మ సూచిం చారు. పౌరులు మత పేరున ఉన్న క్లెయిమ్ చేయని, మరిచిపోయిన ఆర్థిక ఆస్తుల ను తిరిగి పొందే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించిం దని, దేశవ్యాప్తంగా మీడబ్బు- మీ హక్కు' నినాదంతో భారత ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. పదేళ్లు అంతకుమించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లో సొమ్మును బ్యాంకులు తిరిగి ఇచ్చేస్తున్నాయని ఇటీవల వెల్లడించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. మీ డబ్బు - మీ హక్కు' నినాదంతో భారత ప్రభుత్వం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబరు వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వ హిస్తోందన్నారు. వివిధ కారణాలతో బ్యాంకు ఖాతాల్లో ఉండిపోయిన సొమ్మును తిరిగి పొందేందుకు భారత ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో ఆర్బీఐ జనరల్ మేనేజర్ మార్గనిర్దేశం మేరకు ఈనెల 5 న లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో కోనసీమ కలెక్టరేట్ గోదావరి భవన్ నందు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు లీడ్ బ్యాంకు మేనే జర్ కేశవ వర్మ తెలిపారు పదేళ్లు అంతకుమించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని సొమ్ములు అర్హులైన ఖాతా దారులకు తిరిగి ఇచ్చేస్తున్నామన్నారు. ఖాతాదారుని మరణం, చిరునామా మార్పు, నామినీ వివరా లలో లోపాలు, మరిచిపో వడం వంటి కారణా లతో కొన్ని ఖాతాల్లోని డబ్బులు నిజనమైన లబ్ధి దారులకు చేరడం లేదన్నారు. వీటికి సంబంధిం చిన వ్యక్తులు, సంస్థల పత్రినిధులు సరైన ధ్రువపత్రాలు సమర్పించి పొందాలని ఆయన ప్రకటనలో సూచించారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



వాడపల్లి ఆలయ అన్నదాన పథకానికి

## రూ. 50 వేలు విరాళం

**కొత్తపేట ( మనసులో మాట) నవంబర్ 4..** కోనసీమ తిరుమల గా పేరుపొందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ అన్నదాన పథకానికి, కొత్తపల్లి చెందిన మద్దాల వెంకట మురళి గోపాలకృష్ణ, నాగ దుర్గా వేణి, రూ, 25వేలు 116, తణుకు చెందిన జొన్నలగడ్డ శ్రీరామచంద్రమూర్తి, బాల త్రిపుర సుందరి, కుటుంబ సభ్యులు రూ,25వేలు116 విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు కు అందజేశారు. అర్చకులు సాయి కృష్ణ దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి వేద ఆశీర్వచనం స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

## ఆంజనేయస్వామివారికి సహస్ర తులసీ దళాల పూజ



**తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబరు 4:** పవిత్ర హనుమద్వ్రత మహోత్సవాలలో భాగంగా రెండవరోజైన గురువారం ప్రసన్నాంజనేయ స్వామివారికి సహస్ర తులసీ దళాల పూజను ఘనంగా నిర్వహించారు. పిల్లంక గ్రామంలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి ఆలయంలో 33వ హనుమద్వ్రత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అవధూత యోగీ శ్రీ సీతారామబాబా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలలో స్వామివారికి విశేష పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుదర్శనం నరసింహాచార్యులుచే స్వామివారికి తులసీ దళాలచే పూజ చేసి చామంతి పుష్పాలతో అలంకరించారు. ఆయా కార్యక్రమాలను మండా వెంకన్నబాబు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## పలు కుటుంబాలకు తుమ్మలపల్లి పరామర్శ



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 4..** జగంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో గోడే చెంచు అబ్బాయి సత్తిబాబు ఇటీవల స్వర్గస్తులయ్యారు. ఈ రోజు వారి స్వగృహంలో నిర్వహించిన దశ దిన కర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియచేసిన జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అలాగే సత్యంశెట్టి సుబ్బారావు, చంటియ్య, చంద్రయ్య సోదరి అయిన రాజమండ్రి వాస్తవ్యులు నాగమణి ఇటీవలే స్వర్గస్తులయ్యారు. రాజమండ్రి లో వారి స్వగృహం లో నిర్వహించిన వారి దశ దిన కర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియచేసిన జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్. ఈ సందర్భంగా నాగమణి చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు.జగంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో కొరుమిల్లి రాంబాబు ఇటీవల స్వర్గస్తులయ్యారు. ఈ రోజు వారి స్వగృహం లో నిర్వహించిన దశ దిన కర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియచేసిన జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్.. ఈ కార్యక్రమములో రామచంద్రపురం జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు

# అంగరంగ వైభవంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్**



**అమలాపురం (మనసులోమాట) డిసెంబరు 4:** అంతర్వేదిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణం మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యం త్రాంగం సమన్వ యంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమై న చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. గురువారం అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వా మి ఉత్సవాలు 2026 ఏర్పాట్ల పై అధికారులు ప్రజాప్రతినిధు లతో సమీక్ష సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేది క్షేత్రం మహిమాన్విత మైనదన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో విరాజిల్లుతున్న నర్సింహుని క్షేత్రాలలో ఇది పురాణ ప్రసిద్ధి చెందిందన్నారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణానికి రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు రానున్ననేపథ్యంలో స్వామివారి కల్యాణంలో భక్త కుటుంబాల వారే కర్తలుగా శుభ కార్యక్రమం జరిపించడంలో ముఖ్య భూమిక పోషిస్తు న్నారన్నారు.ఏటా మాఘ మాసం నెలలో శుద్ధ సప్తమి (రథసప్తమి)నుంచి తొమ్మిది రోజులపాటు క్షేత్రంలో లక్ష్మీనరసింహుని దివ్య తిరుకల్యాణ మహోత్సవాలు కనుల పండుగగా సాగు తాయన్నారు. 2026 జనవరి 25 నుండి ఫిబ్రవరి రెండో తేదీ వరకు శ్రీ స్వామివారి దివ్య కళ్యాణ ఉత్సవాలు కనుల పండుగ గా నిర్వహించడం జరుగు తుందన్నారు మాఘమాసం సూర్యభగ వానుడికి ప్రీతికరమైందనీ రథసప్తమి రోజు నుంచి కళ్యాణోత్సవాలు మొదలు పెట్టడం ఆనవాయితీగా వస్తోం దన్నారు. జనవరి 25న చంద్రప్రభ వాహన గ్రామో త్సవం, 26 హంస వాహ నంపై గ్రామోత్సవం ద్వజారోహణ 27 సింహ వాహన గ్రామోత్సవం 28 శ్రీ స్వామివారి తిరు కళ్యాణో త్సవం 29 స్వామి వారి రథోత్సవం 30 పొన్న వాహనంపై గ్రామోత్సవం ఫిబ్రవరి ఒకటవ తేదీ చక్రవారి సముద్ర స్నానం ధ్వజారోహణ రెండో తేదీ పుష్పక వాహనం హంస వాహనం తెప్పోత్సవ కార్యక్రమాల అనంతరం ఉత్సవాలు ముగిస్తాయ న్నారు. గత ఏడాది మాదిరిగానే అధికారులకు విధు లు బాధ్యతలను కేటాయించడం జరిగింద న్నారు. స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రసంగిస్తూ గత ఏడాది కన్నా 20 శాతం భక్తుల రద్దీ పెరిగేందుకు ఆస్కారం ఉందన్నారు. అంతర్వేది ప్రాంతంలో ఇటీ వల సంభవించిన మొంథా తుఫాన్ ప్రభావంతో 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాళ్లు వేస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిందని అటువంటిది కేవలం 70 మీటర్లు వేగంతో ఎలా వచ్చిందో ప్రతి ఒక్క రూ సింహావలోకనం చేసు కోవాలని దానికి స్వామివారి మహిమే కారణమని ఎమ్మెల్యే తెలిపారు. దానికి దీటుగా ఈ ఏడాది ఉత్సవాలు నిర్వహించి స్వామివారి మహిమను విశ్వవ్యాప్తం చేయాలని సూచించారు స్వామి వారికి 9 బుధవారాలు 9 ప్రదక్షి ణలు చేసుకున్న తర్వాత హోమం నిర్వహిస్తే దానివల్ల మహత్తరమైన ఫలితాన్ని పొందవచ్చునని చరిత్ర సూచిస్తుందన్నారు. ఈ ఏడాది ఉత్సవాలకు గరిష్టంగా 10 లక్షలు మంది భక్తులు తరలివచ్చే ఆస్కారం ఉంద ని దానికి తగ్గట్లు జిల్లా యం త్రాంగం ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా ఉత్స వాలను నిర్వహించుకునే బాధ్యత అందరిపై ఉంద న్నారు. ప్రోగ్రెసివ్ భక్తులు తాకిడి పెరిగేందుకు అవకాశం ఉందని రహదారి సౌకర్యాలు శానిటేషన్ వసతులు మెరుగుపర చాల్సిన అవసరం ఉంద న్నారు స్వామివారిని దర్శిం చుకునేందుకు అవకాశాలు మెరుగుపరచాల్సిన అవ సరం ఉందన్నారు. వాడపల్లి లో వసతులు మెరుగుపరచిన కారణంగా భక్తులు తాకిడి విపరీతంగా పెరిగి దేదీప్యమానంగా వెలు గొందుతోందని ఆ విధం గానే స్థానికంగా కూడా స్వామివారి మహిమలను తెలియ చెబుతూ కళ్యాణోత్స వాలు నిర్వహిం చాలని సూచించారు. గతంలో కోనేరు తెప్పోత్స వం కొరకు ఉండేదని ఇటీవల కాలంలో ఆ కోనేటిని త్రాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నా రని, మరల కోనేటిని పునరుద్ధరించి తెప్పోత్సవ నిర్వహణకు సిద్ధపరచాలని అందుకు సుమారుగా రూ.2 కోట్లు మేర అంచనా వ్య యం రూపొందించడం జరిగిందన్నారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న ఐదు ఎకరాలలో బస్ టెర్మినల్ నిర్మిస్తే భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుం దన్నారు. అంతకుముందు కలెక్టర్ మహేష్ కుమార్ జెసి టి నిశాంతిలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, జిల్లా ఎస్పీ రాహు ల్ మీనా ఆర్డీవో కే మాధవి, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ చైర్మన్ రాజా కలిదిండి కుమార్ రామ గోపాల రాజా బహుదూర్ డిప్యూటీ కమిషనర్ రమేష్, అసిస్టెంట్ కమిషనర్ వి సత్యనారాయణ ఈవో ఎం కే టి ఎన్ వి ప్రసాద్, డీఎస్పీ తదితరులు పాల్గొన్నారు.



జే కొత్తూరు కనకదుర్గమ్మ అమ్మవారి

# జాతరమహోత్సవములకు ఎమ్మెల్యే నెహ్రూకు ఆహ్వానం

**- డిసెంబర్ 6వ తేదీ శనివారం రాత్రి జాతర, 7వ తేదీ ఆదివారం తీర్థం**



**జగ్గంపేట(మనసులోమాట) డిసెంబరు 4..** స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జగ్గంపేట మండలం జే కొత్తూరు గ్రామదేవత కనకదుర్గ అమ్మవారి 40వ జాతర మహోత్సవముల కు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కి ఆహ్వాన పత్రం అందించిన ఆలయ కమిటీ చైర్మన్ నకిరెడ్డి శివ, గ్రామ అఖిలపక్ష నాయకులు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ డిసెంబర్ 6వ తేదీ శనివారం రాత్రి 7 గంటల నుండి అమ్మవారి ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జానపద నృత్య ప్రదర్శనలతో కనులు మిరిమిట్లు గోలిపే బాణాసంచా కాల్పుల తో విద్యుత్ దీపాలంకరణతో అతి వైభవంగా అమ్మవారి జాతర జరిపించబడుతుందని ఏడవ తేదీ ఆదివారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అమ్మవారి ఆలయం వద్ద అతి వైభవంగా తీర్థం జరుగునని ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ఆహ్వానించేందుకు వచ్చామని ఈ చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ అమ్మవారికి కానుకలు ముడుపులు మొక్కుబడులు చెల్లించుకుని కనకదుర్గ అమ్మవారి కృపకు పాత్రులవుతారని శివ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు చింతల కన్నారావు, సర్పంచ్ నకిరేడ్డి నాగేశ్వరరావు, ఎంపీటీసీ ఎంపీటీసీ మడగల పెద్దకాపు, కేశిరెడ్డి శ్రీను, గంటా ఫకీర్, బద్ది సురేష్, మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు నకిరెడ్డి సూర్యవతి, నరిసే కృష్ణార్జున, అడపా తాతాజీ, అడపా అబ్బాయి, దంటా కామరాజు, చల్ల బాబి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి

# బదిరెడ్డి గోవింద్ జన్మదిన వేడుకలు

**- హాజరై శుభాకాంక్షలు తెలిపిన ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు...**

**- ఆశీస్సులు అందించిన పీఏసీ సభ్యులు ముద్రగడ పద్మనాభం....**



**ఏలేశ్వరం (మనసులో మాట) డిసెంబర్ 4..** కాకినాడ జిల్లా ఏలేశ్వరం నగర పంచాయతీ మూడో వార్డు కౌన్సిలర్,యువ నాయకులు బదిరెడ్డి సతీష్ గోవింద్ బాబు జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు బదిరెడ్డి గోవింద్ అభిమానులు ఘనంగా గురువారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడునియోజకవర్గం వైసిపి ఇంచార్జి ముద్రగడ గిరిబాబు హాజరై ఘన సన్మానం చేసి,వైసీపీ శ్రేణులతో కలిసి ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన కేకుని కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా కౌన్సిలర్లు, నాయకులు, మండల నాయకులు గోవింద్ కి కేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ముందుగా బదిరెడ్డి గోవింద్ కిర్లంపూడిలో పీఏసీ సభ్యులు ముద్రగడ పద్మనాభం నివాసానికి వెళ్లి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా నాయకుడు బదిరెడ్డి సతీష్ గోవింద్ బాబు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఇటువంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. తన జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి గోవింద్ బాబు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, పెంటకోట నాగబాబు, శిడగం వెంకటేశ్వరావు,జువ్విన వీర్రాజు,సామంతుల సూర్య కుమార్,కోరాడ ప్రసాద్,పైల విజయ్, బదిరెడ్డి వెంకన్నబాబు, దేగల చంద్రమౌళి, పేకల జాన్, గొడుగు నాగేంద్ర, వాడపల్లి శ్రీను, లోగీసు శేఖర్, సిరిపురపు రాజేష్, బీశెట్టి రాజా, దత్తి రాజా, బంటుపల్లి శ్రవణ్, రాచర్ల రమేష్, సామంతుల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# పెదపూడిలో వైభవంగా దత్తాత్రేయ జయంతి

**పెదపూడి, (మనసులో మాట) డిసెంబర్ 4..** పెదపూడి శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం దత్తాత్రేయ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎలిదిండి బాపిరాజు పార్వతీ దంపతులు యజ్ఞకర్తలుగా అర్చకులు పెద్దింటి నరసింహాచార్యులు, వేణు ఆచార్యులు దత్తాత్రేయ స్వామికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా మార్గశిర పౌర్ణమి రోజున దత్త జయంతిని నిర్వహిస్తారు. అత్రి మహాముని అనసూయ సంతానమే దత్తాత్రేయ స్వామిగా కూడా వ్యవహరిస్తారు. బ్రహ్మ విష్ణు పరమేశ్వరుల అంశంతో జన్మించిన అవతార మూర్తి శ్రీదత్తాత్రేయ స్వామి అంటూ దత్త జన్మ రహస్యాన్ని ఆధ్యాత్మికవేత్త బొడ్డు హరికృష్ణ వివరించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అప్ప స్వామి పోలరాజు, మార్ని శ్రీరాములు,ఇమంది రామారావు, ఎలిదిండి సుబ్రమణ్యం, కుసుమూరి కాశీ విశ్వనాథం, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.







## గాంధీనగర్ పార్కు ఇంచార్జ్ కమిషనర్ ఎస్‌వివి సత్యనారాయణ అభినందన

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 4..** కాకినాడ గాంధీ నగర పార్కు ని అభివృద్ధి చేసుకుంటున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులను ఇంచార్జ్ కమిషనర్ ఎస్ వి వి సత్యనారాయణ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా బాహ్య పర్యటనలో భాగంగా కాకినాడ గాంధీనగర్ పార్కును కమిషనర్ పరిశీలించగా వాకర్ అసోసియేషన్ సభ్యులు, టిడిపి 41 వ వార్డు కో ఇంచార్జ్ విద్యాసాగర్, అసోసియేషన్ సభ్యులు పైడా శంకర్రావు సంయుక్తంగా 15 వేల రూపాయలు పార్కుని అభివృద్ధి పరిచేందుకు విరాళాన్ని ప్రకటించారు ఈ సందర్భంగా కమిషనర్ వారిని అభినందిస్తూ వారి సేవలను కొనియాడారు. మరింత మంది దాతలు ఇంకా ఎవరైనా ఉంటే ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పార్కులను మరింత సుందరంగా తీర్చిదిద్దుకోవాలంటే అటు ప్రభుత్వంతో పాటు ఇటు వాకర్ అసోసియేషన్ సభ్యుల, దాతల సహకారం ఉంటే మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి 41వ వార్డు ఇంచార్జ్ జొన్నాడ వెంకటరమణ, జనసేన 38 వార్డు ఇంచార్జ్ సభ్య దీప్తి, 39 వార్డ్ సెక్రటరీ బండి సుజాత, 44 వైస్ ప్రెసిడెంట్ మట్టపర్తి మోహన కుమారి, పార్క్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పిల్లి శ్రీనివాస్ , జనరల్ సెక్రెటరీ కే శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ ప్రతాప్ వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్, కవి కుండల భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత శుభ్రత కాదు మన చుట్టుపక్కల పరిసరాలు కూడా పరిశుభ్రతగా ఉండేలా ప్రతి వ్యక్తి బాధ్యతగా వ్యవహరించాలి

**- ఇంచార్జ్ కమిషనర్ ఎన్ వి వి సత్యనారాయణ**









**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 4..** కాకినాడ మహానగరాన్ని పూర్తిస్థాయిలో పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. గురువారం ఆయన పారిశుధ్య సర్కిల్–2 పరిధిలోని 4వ డివిజన్‌లో వెంకటనగర్–డీ మార్ట్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పారిశుధ్య నిర్వహణపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.డ్రైనేజీల్లో చెత్త వేయడం వల్ల సమస్యలుతలెత్తుతున్నాయని ఇంచార్జ్ కమిషనర్ గుర్తించి, ప్రజలు సహకరించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మొక్కలు పెరిగిన విషయాన్ని గమనించిన ఇంచార్జ్ కమిషనర్ వెంటనే వాటిని తొలగించాలంటూ అధికారులను ఆదేశించారు. అలాగే పక్కనే ఉన్న భవనం వాటర్ ట్యాంక్ నుంచి నీరు ఒవర్‌ఫ్లో కావడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో నీరు పడుతున్నట్లు గుర్తించి, భవన యాజమానిని హెచ్చరించారు.తదుపరి డ్రైనేజీని మూసివేసి ఖాళీ స్థలాన్ని ఫిల్లింగ్ చేసిన ఘటనను గమనించిన కమిషనర్, సంబంధిత స్థల యాజమానికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అనంతరం డైరీ ఫారం సెంటర్‌లోని అన్నక్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, ప్రజలతో మాట్లాడి నిర్వహణలో లోపాలపై వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్నం సమయంలో టోకెన్ కౌంటర్ వద్ద ప్రజలకు అసౌకర్యం లేకుండా షెడ్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌పై కమిషనర్ సానుకూలంగా స్పందించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ కాకినాడ నగరాన్ని స్వచ్ఛ కాకినాడగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని నగరవాసులకు విజ్ఞప్తి చేస్తున్నాం” అని పేర్కొన్నారు.ఈ పర్యటనలో అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డా. పృధ్వీ చరణ్, శానిటేషన్ సూపర్వైజర్ నాయుడు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్లు పరిష్కరించాలని సీఆర్ఎంటీల వినతి



**తాళ్లరేవు (మనసులో మాట), డిసెంబరు 4:** పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ సీఆర్ఎంటీలు గురువారం అధికారులకు వినతి పత్రాలు అందజేసారు. ప్రధానంగా స్కూల్ కాంప్లెక్సులను ఎ, బి క్లస్టర్ ప్రతిపాదన విధానాన్ని విరమించాలని, 2016లో పీఎబీ అమోదించిన వేతనాలు చెల్లిస్తున్నందున పెరిగిన ధరలకు అనుగుణంగా సీఆర్ఎంటీల అర్హతల ఆధారంగా వేతనాలు పెంచాలని, ఎంటీఎస్ అమలు చేయాలని, డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోరుతూ తహసీల్దార్ పితాని త్రినాధరావు, విద్యాశాఖాధికారి అమలదాసు మంగాయమ్మలకు వినతి పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీఆర్ఎంటీ అధ్యక్షుడు తరాల మీరాసాహెబ్, కాశి శ్రీనివాస్, మత్స రాజేంద్రప్రసాద్. రేవు మానస, జల్లి ప్రశాంతి యూటీఎఫ్. ఎస్టిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



## లంచం తీసుకుంటూ ఏసిబికి పట్టుపడ్డ కారంపూడి విద్యుత్ శాఖ ఏఈ కె. పెద్దమస్తాన్

### రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసిబి అడిషనల్ ఎస్పీ మహీందర్ మరియు బృందం

**పల్నాడు, డిసెంబర్ 4, (మనసులో మాట):** కారంపూడికి చెందిన వలి ఇంజనీరింగ్ వర్క్ షాపుకు సంబంధించి కేటగిరీ 3 మీటర్ కోసం మూడు నెలల నుండి తిప్పుతూ కరెంటు మీటర్ ఇవ్వకుండా విద్యుత్ శాఖ అధికారులు ఇబ్బంది పెడుతున్నారు. అంతేకాకుండా మీటర్ ఇవ్వడానికి డబ్బులు కూడా డిమాండ్ చేయడంతో బాధితుడు మస్తాన్ వలి ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. గురువారం ఏసిబి అడిషనల్ ఎస్పీ మహీందర్ నేతృత్వంలో బృందం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కారంపూడి విద్యుత్ శాఖ కార్యాలయం పై దాడి చేసి 25 వేలు లంచం తీసుకుంటున్న కారంపూడి మండల విద్యుత్ శాఖ ఏఈ కె. పెద్ద మస్తాన్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం జరిగిందని అడిషనల్ ఎస్పీ మహీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుపడ్డ ఏఈ గతంలో రాజుపాలెం, మాచవరం మండలలలో పనిచేసారాని ఎవరైనా లంచం అడిగితే బాధితులు 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించవచ్చని ఏఎస్పీ తెలిపారు. ఈ దాడిలో ఏసిబి సిఐ లు నాగరాజు, మన్మధరావు, ఎస్ఐ లు సతీష్ బాబు, సుబ్బారావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### పిఎం ఆవాస యోజన పథకానికి

## దరఖాస్తు గడువు పొడిగింపు

**కాజులూరు (మనసులో మాట) డిసెంబరు 4..** గృహ నిర్మాణ రుణాల కోసం దరఖాస్తులు స్వీకరించే గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించినట్లు ఎంపీడీవో జె రాంబాబు తెలిపారు. గురువారం మండల మండల పరిషత్ కార్యాలయంలో ప్రకటన విడుదల చేస్తూ వివరాలు వెల్లడించారు. గత నెల 30తో దరఖాస్తుల గడువు ముగిసిపోయినప్పటికీ, పలువురు లబ్ధిదారులు సకాలంలో దరఖాస్తు చేసుకోలేకపోవడంతో, వారి అభ్యర్ధన మేరకు ప్రభుత్వం ఈ నెల 14వ తేదీ వరకు కొత్త గడువును నిర్ణయించినట్లు తెలిపారు. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాల కోసం గ్రామ సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని ప్రసన్నకుమార్ సూచించారు. స్థలాలు లేని లబ్ధిదారులు ఆధార్ కార్డు రేషన్ కార్డు ఓటర్ ఐడి కార్డుకు సంబంధించి జిరాక్స్ కాపీలను సచివాలయంలో గల డీజిటల్ అసిస్టెంట్కు అందించాలని ఆయన కోరారు.

## పేకాట రాయుళ్ళ అరెస్ట్



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 4..** కాకినాడ జిల్లా ఎస్.పి జి. బిందు మాధవ్ ఐపీఎస్ ఎక్కడా ఎటువంటి కోడి పందాలు,గుండాటలు పేకాటలు, క్రికెట్ బెట్టింగులు , బొమ్మ బొరుసు, ఎత్తులాట, కోత బంతి లాంటి జూద క్రీడలు జరుగకుండ అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఈ నేపథ్యంలో జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామ శివారులో పేకాట శిబిరం పై దాడి చేసి పేకాట రాయుళ్లను జగ్గంపేట ఎస్.ఐ రఘునాదరావు మరియు సిబ్బంది నలుగురు పేకాట రాయుళ్ళను అరెస్ట్ చేసి 10,050 రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగింది.ఎవరైనా జగ్గంపేట,గండేపల్లి, కిర్లంపూడి మండలాలలో జూద క్రీడల గురించి సమాచారం ఉంటే 100,9440796529, 9440796508 లేదా పోలీస్ వాట్సాప్ గ్రూప్ నెంబర్ 94949 33233 కు తెలియ చేయాలని ఈ సందర్భంగా సీఐ వై ఆర్ కె తెలియజేసారు.

## ప్రత్తిపాడు గిరిజన సమస్యలను పరిష్కరించండి

### ప్రతిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి



**ఏలేశ్వరం (మనసులో మాట) డిసెంబర్ 4..** ఏలేశ్వరం మండలం లోని పరిమితడక గ్రామానికి చెందిన గిరిజన రైతులకు ఆర్.ఓ.ఎఫ్.ఆర్ పట్టాలు, శంఖవరం మండలంలోని కొండ గౌరంపేట గ్రామ రైతులకు కొండపోడు పట్టాలు జారీ చేయాలని కోరుతూ ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ కాకినాడలోని కలెక్టర్ కార్యాలయనికి గురువారం చేరుకొని కలెక్టర్ షన్మోహన్ సగిలి ని కలిసి విజ్ఞప్తి చేశారు.దశాబ్దాలుగా పోడు వ్యవసాయం సాగు చేసుకొంటున్న గిరిజనులకు ఇప్పటి వరకు భూ పట్టాలు ఇవ్వకపోవడం వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే వరుపుల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భూ హక్కులు లేనందున ప్రభుత్వం అందించే పథకాలు, రుణాలు, వ్యవసాయ సదుపాయాలు పొందలేక గిరిజన రైతులు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. గిరిజనుల జీవనోపాధి రక్షణ కోసం వీరికి తక్షణమే పట్టాలు జారీ చేయాలని ఆమె గిరిజనుల పాటు కోరారు.
కలెక్టర్ కార్యాలయానికి ఎమ్మెల్యే సత్య ప్రభ వెంట చేరుకున్న సుమారు 200 మంది గిరిజనులతో కలెక్టర్ షన్మోహన్ సగిలి ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల సమస్యపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరలో నివారణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సమస్యను పూర్తిగా పరిశీలించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఆయన వారికీ ఎమ్మెల్యే సత్య ప్రభ కి కలెక్టర్ భరోసా ఇచ్చారు.

## అండర్ 14 అండర్ 19 జూడో లో ఆకట్టుకొన్న విద్యార్థులు



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 4..** ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 అండర్ 19 జూడో పోటీలు బాల బాలికలకు సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచెర్ల జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ నందు జరిగాయి ఈ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి జగ్గంపేట,ఏలేశ్వరం, కాకినాడ రాజమండ్రి, తుని, రంపచోడవరం మండలాల నుంచి 28 మంది బాల బాలికలు ఎంపికయ్యారు. కపిలేశ్వరపురం పి.ఈ.టి సుమంత్ ఆధ్వర్యంలో జూడో పోటీలకు 13 జిల్లాల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు హాజరుకాగా జగ్గంపేట నుంచి అండర్ 14 కు సంబంధించి 23 కేజీల విభాగంలో సిహెచ్ జోష్నిక లౌక్య ఆరవ తరగతి మరియు 70 కేజీల విభాగం నుంచి జె అభి బెంజిమెన్ రాజ్ 9వ తరగతి శ్రీ చైతన్య స్కూల్ నుంచి వెళ్ళగా థర్డ్ ప్లేస్ బ్రాంజు మెడల్ గెలుచుకున్నారు. అలాగే అండర్ 19 కు జగ్గంపేట గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఇంటర్ సెకండియర్ సిఇసి విద్యార్థిని ప్రసన్న సిల్వర్ సెకండ్ ప్లేస్ గెలుచుకుంది.వీరిని జూడో కోచ్ రమణ,సాయిలు అభినందించారు.శ్రీ చైతన్య ప్రిన్సిపాల్ జి శ్రీనివాస్ రావు అలాగే గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ వి శ్రీనివాస్ రావు అభినందనలు తెలియజేసారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడా నైపుణ్యం ఉండడం వల్ల మానసిక ధైర్యం పెంపొందించుతుందని అన్నారు ఈ జూడో గేమ్ వల్ల సెల్ఫ్ డిఫెన్స్ కు ఎంతో ఉపయోగపడుతుందని ఎక్కడికి వెళ్లినప్పటికీ ఆకతాయిలను ఎలా ఎదుర్కోవాలో ఈ జూడో గేమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వం నిర్వహించిన స్కూల్ గేమ్స్ సర్టిఫికెట్ భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ మెడల్స్ సత్యసాయి జిల్లా టిడిపి ఇన్చార్జ్ పరిటాల రవీంద్ర చేతుల మీదుగా అందుకోవడం విశేషం

### నిరుపేదలైన వ్యవసాయ కూలీలకు

## సాగుభూమిని పంపిణీ చేయాలి

- ఈ నెల 13 న ఏలూరులో జరిగే భూ పోరాట సదస్సును జయప్రదం చేయండి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలు తదితర భూమిలేని వ్యవసాయ కూలీలకు ఒక్కొక్క కుటుంబానికి మూడు ఎకరాలు చొప్పున సాగు భూమిని పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. గురువారం సాయంత్రం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏలూరు సదస్సు కరపత్రాలను మధు ఆవిష్కరించారు. జిల్లాలో వేలాది ఎకరాల ప్రభుత్వ మిగులు భూములు పెద్ద పెద్ద భూస్వాముల కబంధ హస్తాలలో పెట్టుకుని అనుభవించుకుంటూ ఉన్నారని, వారి చెర నుంచి సదరు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంచాలని అన్నారు. జిల్లాలో సొంత ఇల్లు లేని పేదలు చాలామంది ఉన్నారని వారందరికీ మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలాన్ని కేటాయించి పక్కా గృహ నిర్మాణం కొరకు ఐదు లక్షల రూపాయల రుణాన్ని మంజూరు చేయాలని, అలాగే గత మూడున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళ, డప్పు కళాకారులు తదితర పింఛన్లను పంపిణీ చేయడం లేదని, వెంటనే వీరం దరికీ నూతన పింఛన్లు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ నాయకులు తోట లక్ష్మణ్, పీ లావణ్య, రామ్ ప్రసాద్ రెడ్డి, రమణ, అల్లం వెంకటేశ్వరావు, దుర్గమ్మ, రాజు, కాకి శారద, పోలమ్మ పాల్గొన్నారు.

## మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి



**కాజులూరు (మనసులో మాట) డిసెంబర్ 4..** ధాన్యంను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఒళ్ళు రాజబాబు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కాజులూరు దుగ్గుదురు కుయ్యేరు గ్రామాల్లో దాన్యం రాశులను వల్లి రాజబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా రాజబాబు కుయ్యరు గ్రామంలో మాట్లాడుతూ కాజులూరు మండలంలో సగం ధాన్యం ఇంకా కళ్లాల్లోనే ఉందని ప్రతి గింజను సీఎంఆర్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన కోరారు భూ యజమానులు ధాన్యం అమ్ముకునేందుకు భూపత్రాలు ఇవ్వని కారణంగా ఆరిన ధాన్యం సైతం 75 కేజీలు ధాన్యం 17 70 రూపాయలు రావాల్సి ఉండగా 1500 నుండి 1550 వరకు అమ్ముకోవడం జరుగుతుందన్నారు. అమ్ముకోవడం చాలా దురదృష్టకరం అని మధ్య దళారీ లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పి రైతు సేవ కేంద్రాల్లో దాన్యం కాటా కానీ ధాన్యం తూసే జట్టు కానీ లేకపోవడంతో మళ్లీ దళారుల్ని ఆశ్రయించ వలసి వస్తుందని కాటా మరియు జట్టు ప్రభుత్వమే సమకూర్చాలన్నారు.జిల్లాలో 80 శాతం భూమిని కౌలు రైతులు సాగు చేస్తుండగా సాగు చేయని భూ యజమానులకు రెండుసార్లు అన్నదాత సుఖీభవ డబ్బులు వేశారని పుస్తెలు తాకట్టుపెట్టి వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం వేయలేదన్నారు. కౌలు రైతులకు పంట నష్టం లేదు అన్నదాత సుఖీభవ లేదు నూతన కౌలు చట్టం లేదు ఇన్సూరెన్స్ పంటల భీమా లేదు ఇవన్నీ ఏమీ లేకుండా రైతన్న నీకోసం కార్యక్రమం ఏమాత్రం ఉపయోగం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

## దివాన్ చెరువు జడ్పీ హైస్కూలుకు ఫర్నీచర్ అందజేసిన ఛాంబర్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** స్థానిక గౌతమీ ఘాట్ వద్దనున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా దివాన్ చెరువు పీఎంఎస్ హెచ్ఆర్ ఎస్.డీఎస్ఎంజడ్పీపీ హైస్కూలు అభ్యర్ధన మేరకు విద్యార్థుల సులభ విద్యాభ్యాసం నిమిత్తం రూ.80 వేలు విలువ చేసే 3 బీరువాలు,10 కుర్చీలు 5 టేబుళ్ళు,5 ఐరన్ రాక్స్ అందజేశారు. ట్రస్టు ఉపాధ్యక్షులు యియ్యపు మురళీధర్, మద్దుల మురళీకృష్ణ, సహాయ కార్యదర్శి యలమర్తి వెంకటేశ్వరరావు, గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా, డైరెక్టర్లు లక్కోజు వీరభద్రరావు (లక్కోజీ), సత్యవరపు గోపాలకృష్ణ చేతుల మీదుగా వాటిని స్కూలు హెడ్మాష్టర్ కే శ్రీనివాసరావు, పాఠశాల కమిటీ చైర్మన్ ప్రగడ గోవిందరావు, వైస్ చైర్మన్ పలివెల వెంకటలక్ష్మి, డీ వెంకటేశ్వరశర్మ, కే శ్రీనివాస కుమార్, కే జైన, డీ శ్రీరంగలక్ష్మికి అందజేశారు.



## భక్తితో నిప్పుల గుండం తొక్కిన భవానీభక్తులు

**కొత్తపేట( మనసులో మాట) నవంబర్ 4..** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామ దేవత వాగ్దేవి అమ్మ ఆలయం వద్ద నామాల బూరయ్య గురుస్వామి ఆధ్వర్యంలో సుమారు వందమంది భవాని మాల ధరించిన భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రి నిప్పుల గుండాన్ని తొక్కి తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ర్యాలి, అంకంపాలెం, నార్కెడిమిల్లి, భవాని లు గ్రామస్తులు,భక్తులు పాల్గొన్నారు.

### జగ్గంపేటలో మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య

## వర్ధంతి వేడుకలు



**జగ్గంపేట (మనసులోమాట) డిసెంబరు 4..** స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి వేడుకలు జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు ముఖ్యఅతిథిలుగా హాజరై కీర్తిశేషులు కొనిజేటిరోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొత్త కొండబాబు మాట్లాడుతూ ఆర్యవైశ్య కులంలో పుట్టి ఉమ్మడిఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏకైక వ్యక్తి కీర్తిశేషులు రోశయ్య అని, ఆయన గవర్నర్గా కూడా సేవలు అందించారని ఆయన ఏ పదవి చేపడితే ఆ పదవికి ఎంతో వన్నె తెచ్చారని, ఆర్థిక మంత్రిగా 16 సార్లు శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఆయనకి దక్కుతుందన్నారు. ఆరు దశాబ్దాలు ప్రజాసేవ అందించారని, మంచి వ్యక్తిత్వం గల మహోన్నతమైన వ్యక్తి అని ఆయన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, బోండా నూకబాబు, కొత్త శ్రీరామకృష్ణ (రాము), చిత్రపు బాబు, బొండా వీర సత్య,వి. నాగసత్య, బొండాడ జగన్, పాబోలు స్వామి, కంచర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

## బోధ నేతర పనులు తగ్గించాలి

- యుటిఎఫ్ జిల్లా నాయకుడు పండా కృష్ణయ్య



**ఎటపాక ( మనసులో మాట), డిసెంబరు 4:** ఆంధ్రప్రదేశ్ యుటీఎఫ్ ఎటపాక మండల నూతన కౌన్సిల్ సమావేశం నాగటి నారాయణ ప్రాంగణం, భద్రాచలంలో గురువారం జరిగింది . ఈ సమావేశానికి జిల్లా నాయకుడు పండా కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడి తగ్గడం లేదని, రకరకాల యాప్ ల రూపంలో ఉపాధ్యాయులను ఆ బోధనేతర పనులలో సతమతం చేస్తున్నారన్నారు. అలాగే ఇప్పుడు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఉత్తీర్ణత అవ్వాలనే కొత్త నిబంధనతో ప్రభుత్వ విద్యా విధానాన్ని ఇంకా నీరు గార్చే విధంగా ప్రభుత్వం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ విద్యా విధానాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలే ఇలా ప్రభుత్వ విద్యను నీరు గార్చే విధంగా చేసి పేద ప్రజలకు విద్యను దూరం చేసే కార్యక్రమాలు చేస్తే యుటిఎఫ్ సంఘం గా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అనంతరం 12 మందితో ఎటపాక మండల యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పీ. విజయ్, కే శ్రీనివాసులు ను సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాటన్ హరినాథ్,ప్రభాకర్, జహీదా బేగం, ప్రియాంక,రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ, పాయం కన్నారావు పాల్గొన్నారు.

## లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ద్వారా విద్యార్థినికి ఆర్థిక సహాయం



**పిఠాపురం, ( మనసులో మాట) డిసెంబరు 4:** ఆర్థిక ఇబ్బందుల వల్ల విద్యార్థిని చదువు ఆటంకం కాకూడదనే సంకల్పంతో స్థానిక బొజ్జా వారి తోటలో వున్న లిటిల్ స్టార్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ కార్యాలయంలో విద్యార్థినికి రూ 20 వేల రూపాయల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు కరుణ్ రాజు ( కామేశ్వరరావు)మాట్లాడతూ పిఠాపురం పట్టణంలోని స్థానిక మోహన్ నగర్ కు చెందిన ఎం కళ్యాణి అనే బిఎస్సి నర్సింగ్ చదువుతున్న విద్యార్థిని చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బంది పడుతుందని తమ ట్రస్ట్ దృష్టికి వచ్చిందన్నారు.దాంతో తమకు తెలిసిన ఎన్ రమ్య,చంటి, దంపతుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్ళడంతో వారు స్పందించి విద్యార్థిని చదువుకు ఇబ్బంది కలాగకూడదని తమ వంతుగా 15000/-రూ ఆర్థిక సాయాన్ని అందించటం జరిగిందని మరియు 5000/-రూ.దాతలు అందించారని మొత్తం 20000/-రూ.చెక్కును వారి చేతుల మీదుగా సదరు విద్యార్థినికి అందజేశామన్నారు. తమ ట్రస్ట్ తరపున ఇప్పటికే పలు అభివృద్ధి చేయూత కార్యక్రమాలు చేస్తున్నామని భవిష్యత్తులో ట్రస్టు ద్వారా మరింత మందికి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ,ఇటువంటి పేదవిద్యార్థులకు సహాయం చేయదలచిన వారు మా ట్రస్టుని సంప్రదించవచ్చు అని ఆయన అన్నారు.ఈకార్యక్రమంలో ట్రస్టు గౌరవ అధ్యక్షురాలు టి.రాధ ,ట్రస్టు సభ్యులు టి.కృపారాణి, ట్రస్టు డైరెక్టర్ టి.బ్యూలా గ్రేస్ ,సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



# రాజమహేంద్రవరం అభివృద్ధిని విస్మరిస్తున్న పాలకులు

**-బీసీవై పార్టీ సీనియర్ నేత అత్తిలి రాజు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** రాజమహేంద్రవరం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని బీసీవై పార్టీ సీనియర్ నాయకుడు అత్తిలి రాజు డిమాండు చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాశీ తర్వాత అంతటి ప్రసిద్ధ క్షేత్రంగా, దక్షిణ కాశీగా పేరుమోసిన రాజమహేంద్రవరం హిందూ సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమని, అందుకే ఈ దేశానికే 'రాజమహేంద్ర' వరం అని అభివర్ణించారు. బీజేపీ పోటీ చేసిన ప్రతి సారీ రాజమండ్రి పార్లమెంట్ విజయం బహూకరించిన ప్రజలను ఈ రోజు మరిచిపోవడం..ఆ నమ్మకానికి ముఖం చాటేయడమేనని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో అనేక దేశాలతో ఒప్పందాలు చేసుకుంటున్న కేంద్రం-సాగర తీరానికి అత్యంత చేరువగా, సహజ వనరులతో సంపన్నమైన రాజమండ్రిని అభివృద్ధి మ్యాప్‌లో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. డచ్, పోర్చుగీస్, ఈస్ట్ ఇండియా కంపెనీకి కీలక కేంద్రంగా నిలిచిన రాజమహేంద్రవరం ఈ రోజు మాత్రం అభివృద్ధి విషయంలో ద్వితీయ శ్రేణిలో ఎందుకు పడుతోందని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి చారిత్రాత్మక రాజధానిగా రాజమహేంద్రవరం నిలిచిందని,కానీ ఆంధ్రా పాలకులు ఏ ఒక్కరూ ఈ నగరాన్ని అభివృద్ధి దిశగా నడిపేలా ఏ ఒక్క నిర్ణయం తీసుకోకపోవడం అత్యంత శోచనీయమైన విషయం అన్నారు. పోలవరం పేరుతో రాజమహేంద్రవరం (గోదావరి) జలాలు దోపిడీ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తార %కానీ గోదావరి ఒడ్డున పెరిగిన రాజమండ్రి మాత్రంనీళ్లు లేని ఇసుక తిన్నెలు లాంటి దయనీయ దుస్థితికి తీసుకొచ్చారని ఆ ప్రకటనలో అత్తిలి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేనా అభివృద్ధి?, ఇది న్యాయమేనా అని ప్రశ్నించారు. రాజమండ్రి హక్కు-రాజమండ్రి వాటా కోసం కేంద్రం వెంటనే స్పందించాలి, తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజల తరుపున బీసీవై పార్టీ డిమాండు చేస్తోందని ఆ పార్టీ సీనియర్ నేత అత్తిలి రాజు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నేడు జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్ - టీచర్ సమావేశాలు

**- డీఈఓ వాసు దేవరావు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** తూర్పు గోదావరి జిల్లాలో నేడు (శుక్రవారం) మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్‌ను విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కే వాసు దేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో 7 నియోజక వర్గాలు, 2 రెవెన్యూ డివిజన్లు, 19 మండలాల్లో కలిపి 1,570 పాఠశాలల్లో ఈ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. వీటిలో 984 ప్రభుత్వ పాఠశాలలు, 586 ప్రైవేట్ పాఠశాలల్లో 2,37,754 మంది విద్యార్థులతో, వారి తల్లిదండ్రులు, సంరక్షకులతో కలిసి మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 93,399, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 1,44,355 మంది పాల్గొననున్నారని డీఈఓ తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వ్యక్తిగత వికాసం పట్ల తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ సమావేశాలను చేపట్టినట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కే వాసు దేవరావు తెలిపారు. హెూలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ, విద్యార్థుల ప్రదర్శనలు, వ్యక్తిగత అంచనాలు, పాఠశాల-సమాజ అనుసంధానాన్ని బలోపేతం చేసే అంశాలతో కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశాల్లో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు.

# పురుగుల అన్నం పెడుతున్న ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

- 31 మంది ప్రత్యేక అవసరాల గలిగిన విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్న
- విభిన్న అవసరాలు గల విద్యార్థుల బాత్రూమ్లకు ఎల్లప్పుడూ తాళాలు
- ముగ్గురు ఆయలు పనిచేస్తున్న ఫలితం శూన్యం
- మురికి కంపు కొడుతున్న విద్యార్థుల బాత్రూములు - క్రమశిక్షణ లేని ప్రభుత్వ ఉన్నత పాఠశాల
- చేపల సంత తలపోస్తున్న విద్యాలయం - ఇది ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పని తీరు








**ఏలేశ్వరం (మనసులో మాట) డిసెంబర్ 4..** ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిస్థితిని పరిశీలిస్తే అనేక అనేక విషయాలు బయటపడ్డాయి... ఈ పాఠశాలలో సీనియర్ గేజిటెడ్ హెడ్మాస్టర్ ఎన్. లక్ష్మి తులసి ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలో విద్యార్థులకు అసలు క్రమశిక్షణ లేదని కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ప్రధానోపాధ్యాయులు మీద ఏదైనా ఆరోపణలు వచ్చియాని విలేకరులు ప్రశ్నిస్తే ఆమెకి పల్లకి మోసే వారితో పాటు ఉపాధ్యాయులు కూడా కోమ్ము కాయడం ఒకంత ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ పాఠశాలలో మిడ్ డే మీల్స్ కు ఇంచార్జిగా వ్యవహరిస్తున్న( ఎం డి ఎం ) ఉపాద్యాయుడు ఈ పాఠశాల కి ఎంత చెప్పితే అంతా. ఈయన మాట అంటే చిరు ఉద్యోగస్తుల నుంచి గేజటెడ్ ప్రధాన ఉపాధ్యాయురాలు వరకు అంతా రామ మాయం..వ్యవస్థ అంతా రామమయం....గత వేసవి సెలవులు రోజుల్లో మిగిలి ఉన్న 103 బస్తాల రేషన్ బియ్యం మిగిలి పొగ వాటిని గత మూడు నెలలుగా పిల్లలకు మిడ్ డే మీల్స్ గా పెట్టడం తో పాఠశాల లో ఆహారం భుజిస్తున్న పిల్లలకు అన్నం లో తెల్ల పురుగులు కనబడటం తో అన్నం తినలేక కొందరు... ఇంటి నుంచే బాక్స్ తెచ్చుకోవడం లేక ఇంటి కి వెళ్లిపోవడం మరి కొందరు... చేస్తున్నారు. ఈ స్కూల్ లో ఉన్నా ఆర్ ఓ ప్లాంట్ తరచూ మరమ్మతులకు వచ్చినా పట్టించుకొనే దిక్కులేదు. మధ్యాహ్నం భోజనం పథకం లో పాఠశాలలో వండుతున్న వంటకాలు పుల్లలతో వండుతున్నందున కూరలు పొగ కంపు రావటం, పుగ తో పాఠశాల అంతా నిండటం తో విద్యార్థులు ఒకింత ఇబ్బందులకు గురి అవుతున్నారు. గ్యాస్ ఉపయోగించి వంట చేయవలసి ఉండగా అందుకు భిన్నం గా ఈ పాఠశాల భోజన పథకం నిర్వహణ జరుగుతుంది. అలాగే ఊర్లో ఉన్న కుక్కలన్నీ కూడా ఈ పాఠశాలలోనే నివాసం ఏర్పాటు చేసుకుని పిల్లలను వనికిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతదో అని పిల్లలు భయంతో విద్యాభ్యాసం చేస్తున్నారు.

ఈ పాఠశాల లో 18 రోమ్స్ ఉండగా మరో నాల్గు రూములు పూర్తి చేయవలసి ఉంది. అయితే గ్రాంట్ సరిపోలేదని వాటిని ఖాళీగా ఉంచి చెత్త చెదారం తో నింపి ఉంచారు. పాఠశాల లో 819 మంది విద్యార్థులు 6 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు.వీరి లో చాలా మంది మధ్యాహ్నం భోజనాన్ని పురుగులు కారణం భూజించటం లేదు.

ఇది ఇలా ఉండగా ఈ పాఠశాల కి ముగ్గురు ఆయాలు ఉండగా వారు తూ.. తూ మంత్రంగానే పని చేస్తున్నారు. ఈ పాఠశాల లో 31మంది విభిన్న అవసరాల గలిగిన విద్యార్థులు ఉండగా వీరికి సంబంధించిన వాష్రూములు కనీసం నెలలో ఒకటి రెండు సార్లు అయినా తాళాలు తీయడం గాని వాష్ చేయడం గాని జరగడం లేదు. ఆయాలు ఉన్న కనీసం హెడ్మాస్టర్ రూమ్ గాని ఆఫీస్ కార్యాలయం గాని కనీసం తుడుస్తున్న దాఖలు కనబడలేదు. పాఠశాలకు మూడు గేట్లు ఉండడంతో ఏ గేట్లోంచి విద్యార్థి బయటకు వెళ్ళిపోతున్నాడు ఏ విద్యార్థికి అపాయం జరుగుతుందో ఏ విద్యార్థి ఇంటికి వెళ్ళిపోతున్నాడు ఏ విద్యార్థి గంజాయి సేవిస్తున్నాడు లేక సిగరెట్లు కాలుస్తున్నారు తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ పాఠశాలలో విద్యార్థులకు అసలు క్రమశిక్షణ అంటేనే తెలియని పరిస్థితుల్లో ఉంది. ఈ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ని ఎవరైనా పరిశీలిస్తే చేపల సంత మాదిరిగా కనబడుతుంది. విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన యూనిఫామ్ బూట్లు బెల్ట్ లు తదితరవి ఇచ్చిన వారు ప్రతినిత్యం వాటిని వేసుకుని పాఠశాలకు రావటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలో 27 మంది వికలాంగ విద్యార్థులు నలుగురు విద్యార్థినులు ఉన్నారు. ఉపాధ్యాయులను చూసి విద్యార్థులు క్రమశిక్షణతో భయపడాలి కానీ ఈ పాఠశాలలో విద్యార్థులను చూసి ఉపాధ్యాయులు భయపడే పరిస్థితి నెలకొంది. మండల కేంద్రమైన ఏలేశ్వరంలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పరిస్థితులను నెలకొని ఉన్న మండలం లో ఇరువురు విద్యాశాఖ అధికారులు పనిచేస్తుండగా వారి పరివేక్షణ అంతంత మాత్రమే ఉందని ఈ సంఘటనలతో వెల్లడవుతుంది. ఈ పాఠశాలలో ఉన్న వాష్ రూములు ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేసేందుకు చర్యలు చేపట్టే పరిస్థితి లేదని మురికి కంపు వస్తున్నాయని విద్యార్థినిలు ఆరోపిస్తున్నారు. అలాగే ఈ పాఠశాలలో ఉన్న క్లాస్ రూములు కనీసం తుడిచే అవకాశం కూడా లేదు. గెజిటెడ్ హెడ్మాస్టర్ అయి ఉండి కూడా ఈ పాఠశాల ఏమాత్రం అభివృద్ధి దశగా పయనించడం లేదు అనే విమర్శలు సర్వత్రా ఉన్నాయి. ఇప్పటికైనా ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు జిల్లా ఉన్నతాధికారులతో పాటు మండల విద్యాశాఖ అధికారులు తరచూ పరివేక్షించి పరిశీలించి అక్కడ ఉన్న పరిస్థితులను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## అత్యాధునిక ధోబీ ఖానాల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి

**- రూ.17.7 లక్షలతో ధోబీ ఖానా ఆధునీకరణ పనులకు ఎమ్మెల్యే గోరంట్ల శంకుస్థాపన**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** అత్యాధునిక విధానాలతో ధోబీ ఖానాలు నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. గురువారం ఉదయం 16వ డివిజన్ గౌతమీ దోబీ ఖానాలో రూ.17.7 లక్షలతో వాటర్ ట్యాంక్ స్టైర్ కేసు, బోరు, ఇతర ఆధునికీకరణ పనులు చేసేందుకు ఎమ్మెల్యే గోరంట్ల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ రాజమండ్రిలో మొట్ట మొదటి ధోబీ ఖానా ఇదేనని, అప్పట్లో తన హయాంలోనే దీనిని నిర్మించామని, బట్టలు ఉతకడం కోసం వాడే కొన్ని రకాల కెమికల్స్ వల్ల పైప్ లైన్ పాడై వాటర్ ట్యాంకు ద్వారా నీరు సరిగా అందక ఇబ్బందులు పడుతున్నారని, వీటన్నిటిని ఆధునికీకరణ పనులు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని అన్నారు. పాత బోరు రిపేరు చేయించడంతోపాటు మరొక నూతన బోరు ఏర్పాటు చేయాలని, పైప్ లైన్ మొత్తాన్ని పూర్తిగా మార్చివేయాలని, తక్షణమే పిచ్చి మొక్కలు, తుప్పలు శుభ్రం చేసి జంగిల్ క్లియరెన్స్ చేయాలని అవసరమైతే మరికొన్ని నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. స్థానిక మహిళలందరూ రజకులందరికీ ప్రత్యేక నివాస స్థలాలు ఏర్పాటు చేయాలని కోరగా, ఎమ్మెల్యే గోరంట్ల స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి రజకుల సమస్యలను తీసుకువెళ్లి ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ దాలిపర్తి వేమన, రజక సంఘం అధ్యక్షుడు బొమ్మదేవర శ్రీనివాస్, అంతర్వేది ప్రభాకర్ రావు, వుల్లూరి వెంకటేశ్వరరావు, నందమూరి శ్రీనివాస్, కోటి, ఏడాకుల వెంకటేశ్వరరావు, కుంచె హనుమంతరావు, చలమూరి సత్యనారాయణ, శీలం గోవిందు, పల్లి సాయి, సింగవరపు సత్యనారాయణ, అడపా వరప్రసాద్, కొమ్మన శ్రీనివాస్, సుబ్బాయమ్మ, వాసుపల్లి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో నేడు 9 గంటల నుండి ఒంటి గంటల వరకు విద్యుత్తుకు స్వల్ప అంతరాయం

**విద్యుత్ సబ్ స్టేషన్ లో మరామత్తుల నిమిత్తం అంతరాయం -**

**అధికారులకు సహకరించవలసిందిగా వినియోగదారులకు కాకినాడ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.ఉదయభాస్కర్**

**కాకినాడ (మనసులో మాట) డిసెంబర్ 4..** కాకినాడ పోర్ట్ సెక్షన్ పరిధిలోని శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు సబ్-స్టేషన్ నందు మరమత్తుల నిమిత్తము నిలిపివేస్తున్నట్లు తిన్నాడా విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ ఉదయ్ భాస్కర్ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయం గమనించి అధికారులకు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. పోర్ట్ విద్యుత్ సబ్టేషన్ లో 33/11కేవీ పోర్ట్ విద్యుత్ సబ్-స్టేషన్ మరమ్మతులు చేయవలసి ఉన్నందున ఈ సబ్ స్టేషన్ పరిధిలోని సంజయ్ నగర్, పర్లోవ్‌పేట, రాజీవ్ గృహ కల్ప అపార్ట్మెంట్స్, వార్ఫ్ రోడ్, బుడం పేట, సూర్యనారాయణపురం, తిలక్ స్ట్రీట్, రంగయ్యనాయుడు వీధి,పాత పోర్ట్ రైల్వే స్టేషన్ ప్రాంతం, యేటిమొగ ఏరియాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయము కలుగునని కాబట్టి విద్యుత్ వినియోగదారులు,ఈ అసౌకైర్యము గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించ వలసినదిగా కాకినాడ విద్యుత్ శాఖ ఎక్జిక్యూటివ్ ఇంజినీరు ఎన్ . ఉదయ్ భాస్కర్ ఒక ప్రకటన లో తెలిపారు.



## మహిళల రక్షణే కూటమి ప్రభుత్వ ఆలోచన

- ఎలాంటి సంఘటన ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలి
- మహిళల రక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి
- ప్రభుత్వ ఆసుపత్రిలో వన్ స్టాప్ సెంటర్ కి ఎమ్మెల్యే వాసు శంకుస్థాపన

**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4 :** మహిళలపై దాడులను అరికట్టి వారికి భరోసా కల్పించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. మహిళల రక్షణ కోసం సమాజంలో ప్రతీ ఒక్కరీ బాధ్యతగా తీసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో వన్ స్టాప్ సెంటర్ భవన నిర్మాణానికి గురువారం ఉదయం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.60 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో దీన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ మహిళలపై జరిగే శారీరక, మానసిక, లైంగిక, ఆర్థిక హింసను అరికట్టి, బాధిత మహిళలకు భరోసా కల్పించడానికి ఈ సెంటర్ దోహదం చేస్తుందన్నారు. బాధిత మహిళలకు వైద్య సహాయం, పోలీసు సహాయం, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ తో పాటు తాత్కాలిక ఆశ్రయం కల్పించడానికి ఈ కేంద్రం ఉద్దేశించినట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా 181హెల్ప్ లైన్ ద్వారా 24 గంటలూ అన్ని సేవలు అందించబడతాయని తెలిపారు. అనుకోని సంఘటనలు ఎదురైనపుడు, ఊహించని ఘటనలు చోటు చేసుకున్నపుడు వెంటనే హెల్ప్ లైన్ కి ఫోన్ చేసి సహాయం పొందాలని మహిళలకు ఎమ్మెల్యే వాసు సూచించారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి సెంటర్స్ లేవని, అయితే రాజమహేంద్రవరంలో మహిళలందరూ సురక్షితంగా ఉండాలన్న ఆలోచనతో ఎన్నికల ముందు స్పష్టమైన హామీ ఇచ్చామని ఆయన అన్నారు. ఇందు కోసం అనేక విధాలుగా పరిష్కారాలు చూపిస్తూ వస్తున్నామని, ముఖ్యంగా శాంతిభద్రతల విషయంలో తగు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. అందులో భాగంగానే వన్ స్టాప్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సెంటర్ ని వినియోగించుకోవడంతో పాటు మహిళలు అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే వాసు అన్నారు. ప్రభుత్వం తీసుకునే చర్యలకు సమాజంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని, మహిళలను గౌరవించాలని, వారి రక్షణకు ప్రతి పౌరుడు బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు. త్వరితగతిన భవన నిర్మాణం పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు నాణ్యత ప్రమాణాలతో పని చేయాలని ఎమ్మెల్యే వాసు అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం కోసం రైతులు ల్యాండ్ పూలింగ్ కు సహకరించాలి



**పల్నాడు, డిసెంబర్ 4, (మనసులో మాట):** అమరావతి మండలం యండ్రాయి గ్రామంలో రెండవ విడత ల్యాండ్ పూలింగ్ పై రైతులతో మంత్రి నారాయణ,పెదకూరపాడు ఎమ్మెల్యే ఎమ్మెల్యే ప్రవీణ్ సమావేశం నిర్వహించారు. అమరావతి మండలం లో ల్యాండ్ పూలింగ్ లో ఉన్న 4 రెవెన్యూ గ్రామాల రైతులతో మంత్రి , ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు.ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ కు ముందే మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రవీణ్ సమక్షంలో ఆర్డీవో కు 4 ఎకరాల భూమికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ ను రైతు నంబూరి బలరాం అందించారు.ల్యాండ్ పూలింగ్ లో రైతులకు ఏ సమస్య ఉన్నా తన వద్దకు రావాలని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం కోసం రైతులు ల్యాండ్ పూలింగ్ కు సహకరించాలని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు.

## 36 మందికి కృత్రిమ కాలు ఏర్పాటు




**నూజివీడు/ ఏలూరు, డిసెంబర్, 4 (మనసులో మాట)..** రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్, నూజివీడు వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కృత్రిమ కాళ్ళ అమర్చేందుకు స్క్రీనింగ్ క్యాంపు లో 36 మందికి కృత్రిమ కాళ్ళు అమర్చేందుకు ఎంపిక చేయడం జరిగిందని రోటరీ క్లబ్ అఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ అధ్యక్షులు ఎస్. శశికాంత్ తెలిపారు. నూజివీడు పట్టణంలోని రోటరీ ఆడిటోరియం లో నిర్వహించిన స్క్రీనింగ్ క్యాంపు నకు 40 మంది హాజరయ్యారని, వీరిలో 36 మందికి కృత్రిమా కాళ్ళు అమర్చేందుకు ఎంపిక చేసి, వారికి సరిపడా కృత్రిమ కాళ్ళు సైజు కొలతలు తీసుకోవడం జరిగిందన్నారు. మిగిలిన 4 గురు ఇటీవలే ఆపరేషన్ చేయించుకున్నందున, మరికొంత కాలం ఆగవలసి ఉంటుందని వారికి తెలియజేయడం జరిగిందన్నారు.ఎంపిక చేసిన వారికి త్వరలో కృత్రిమ కాళ్ళు అమర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# మరింత చురుగ్గా పనిచేయాలి

### పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి రామానాయుడు





**ఏలూరు జిల్లా, పోలవరం డిసెంబర్ 4 (మనసులో మాట)..** ఆంధ్రుల జీవనాడి, రాష్ట్ర ప్రజలకు వరం అయిన పోలవరం ప్రాజెక్టును ముందుగా నిర్ణయించిన గడువు 2027 డిసెంబరు కన్నా ముందుగానే, అదే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలు నాటికే పూర్తిచేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు పనులను, పురోగతిని ఆయన గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలు మేరకు పవిత్ర గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేసే విధంగా అధికారులు, ఇంజనీరింగు నిపుణులు, నిర్మాణ ఏజెన్సీలు మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశానికి ముందు ప్రాజెక్టు పరిధిలోని గ్యాప్ -1 లో ప్రధాన డ్యామ్ రాక్ ఫిల్లింగ్ పనులు, గ్యాప్ -2 లో డయా ఫ్రం వాల్ నిర్మాణ పనులు, కుడి కాలువ అనుసంధానం పనుల్లో భాగంగా జంట సొరంగాల్లో జరుగుతున్న క్లిష్టమైన లైనింగ్ పనులను మంత్రి స్వయంగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అధికారులు చెప్పిన సమాధానాలకు, గడువు ఆధారంగా జరుగుతున్న పనులకు పూర్తి సంతృప్తి చెందారు. వారిని మనస్ఫూర్తిగా అభినందించి 2027 డిసెంబరు కంటే ముందుగా పుష్కరాలకు పూర్తి చేస్తే ఒక చరిత్ర సృష్టించిన వాళ్ళమవుతామని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ దయాఫ్రంవాల్ నేటికి 950 మీటర్లు నిర్మాణం జరిగి 75 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. 2014-2019 హయాంలో తెలుగుదేశం ప్రభుత్వం పూర్తి చేసిన 72 శాతం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 17 నెలల కాలంలో పూర్తి చేసిన 12 శాతం పనులు కలుపుకొని నేటికి పోలవరం ప్రాజెక్ట్ పనులు 88 శాతం పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.పోలవరం పనులు జగన్ 5 ఏళ్లలో 2శాతం చేస్తే, నేడు మొదటి ఏడాదిలోనే 12శాతం చేసినట్లు ఆయన చెప్పారు. క్లిష్టమైన టన్నెల్స్ లైనింగ్ తో ఉన్న రైట్ కనెక్టివిటీస్ 82 శాతం, లెఫ్ట్ కనెక్టివిటీస్ 62 శాతం పనులు పూర్తి చేశామన్నారు. బట్రస్ డ్యాం పూర్తి చేసి, వర్షా కాలం లో కూడా ప్రాజెక్టు పనులు ఆగకుండా వేగవంతం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. 18 నెలలు శ్రమించి నిర్మాణం చేసిన దయాఫ్రం వాల్ ను జగన్ ధ్వంసం చేస్తే , నేడు 900 కోట్లు ఖర్చు పెట్టి వచ్చే ఫిబ్రవరి కల్లా కొత్త దయాఫ్రం వాల్ ను పూర్తి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.పోలవరం ప్రాజెక్టు చరిత్రలో ఒక్క ఏడాదిలోనే నిర్వాసితులకు 2వేల కోట్లు ఇచ్చి వారికి అండగా నిలబడిన ఘనత కూటమి ప్రభుత్వానికి, గౌర ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రూ.600 కోట్లతోఎడమ ప్రధాన కాలువ పనులు పూర్తిచేసి 2026 సీజన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తరలిస్తామని స్పష్టం చేశారు. వైసిపి పాలనలో మంత్రులు, ముఖ్యమంత్రి జగన్ సైతం, పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో, అసలు పూర్తవుతుందో లేదో కూడా చెప్పలేమని చేతులెత్తేసిన చేతకానితనాన్ని మంత్రి నిమ్మల ఈ సందర్భంగా గుర్తు చేసి ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో విధ్వంస మైన పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు ఏ రకంగా ట్రాక్ లో పెట్టారో కళ్లకు కట్టినట్లు వివరించారు. ప్రాజెక్ట్ లో ప్రధాన విభాగాల పనులు ఒకదాని తర్వాత ఒకటి కాకుండా సమాంతరంగా చేయటం,సమయం ఆదా చేయడం, సమర్థంగా చేయడం తమ ప్రభుత్వ ప్రత్యేకతగా రామానాయుడు స్పష్టం చేశారు.అలాగే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు కూడా 2026 డిసెంబరు నాటికి పూర్తి పరిహారం చెల్లించడం, కాలనీలు నిర్మించడం లక్ష్యంగా పెట్టుకుని వడివడిగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు.అలాగే పోలవరం ప్రాజెక్టు ఆధారంగా నిర్మిస్తున్న హైడల్ పవర్ ప్రాజెక్ట్ పనులు కూడా ప్రాజెక్టుతో పాటు పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. పోలవరం చారిత్రక ప్రాజెక్టును పూర్తి చేయడానికి ఎంతో సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, గౌరవ ప్రధాని మోడీకి, మాకు అనునిత్యం వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనకు అండగా నిలుస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు రామానాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు.

జలవనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు ప్రాజెక్టు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు పనుల పురోగతి, భవిషత్తు కార్యాచరణ, పునరావాసంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



## ప్రభుత్వ సేవలలో ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా కృషి

**ఏలూరు, డిసెంబర్, 4 (మనసులో మాట)..** జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ కు తెలియజేసారు.ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం ప్రధానమంత్రి సీజనల్ వ్యాధుల నియంత్రణ, వైద్య ఆరోగ్య సేవలు, ధాన్యం సేకరణ, ఎరువులు పంపిణీ, ప్రభుత్వ సేవలలో ప్రజల సంతృప్తి స్థాయి, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ వెట్రిసెల్వి సీఎస్ కి వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతీ సేవలలోనూ ప్రజల సంతృప్తిస్తాయిని పెంచేలా అధికారులు పనిచేయాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో సామాన్య ప్రజలకు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల పంపిణీ, ధాన్యం కొనుగోలు రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ ఆసుపత్రులలో సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా చూస్తున్నామన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతీ సేవలలోనూ ప్రజల సంతృప్తిస్తాయని పెంచేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

## ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్

- ప్రజల న్యాయ సమస్యలకు త్వరిత పరిష్కారం..
- జిల్లా వ్యాప్తంగా నిర్వహణ
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్ శ్రీలక్ష్మి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), డిసెంబరు 4:** జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 13వ తేదీ రెండవ శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్ శ్రీలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు త్వరిత, తక్కువ ఖర్చుతో, సులభ న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యమని వెల్లడించారు.

చిట్‌ఫండ్ సంస్థలకు సంబంధించిన సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, అలాగే రాజీ పడదగిన ఇతర కేసులను జాబితాగా చేసి లోక్ అదాలత్‌లో పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. బాధితులకు తగిన పరిహారం, న్యాయ సేవలందించడంలో లోక్ అదాలత్ లు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు.

ప్రజల తరఫున న్యాయవాదులు కలిసి, పరస్పర అంగీకార పద్ధతిలో కేసులను పరిష్కరిస్తే న్యాయ వ్యవస్థపై భారం తగ్గడంతో పాటు, సమాజంలో సౌహార్ధ వాతావరణం నెలకొంటుందని ఆమె వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు.

## రామవరం పిహెచ్‌సి ని ఆకస్మిక తనిఖీ

### నిర్వహణా లోపాలపై సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడిన ఎమ్మెల్యే



**అనపర్తి (మనసులో మాట) డిసెంబర్ 4:** జిల్లా వైద్య అధికారులు వికలాంగ సర్టిఫికెట్ల తప్పుడు మంజూరుని సమర్ధించడాన్ని ముఖ్యమంత్రి కి పిర్యాదు చేయనున్నట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ సందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ, రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపైన ఇటీవల గ్రామస్తులు అనేక సందేహాలను లేవనెత్తుతున్నారు. వైద్యులు గాని,పారా మెడికల్ సిబ్బంది గానీ సర్వీసెస్ సరిగా లేవని చెప్పటం, పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో లేవు అందుకు మందులు ఇవ్వడం లేదని కొంత కంప్లైంట్స్ రావడం జరిగింది.

గత వారం రోజులుగా ఈ విషయాలన్ని నా దృష్టికి రావడంతో, ఈరోజు అకస్మాత్తుగా రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి రావడం జరిగింది. నేను సకాలంలో వచ్చినప్పటికీ సకాలంలో వైద్యులు ఎవరూ అందుబాటులో లేని పరిస్థితి, సిబ్బంది అందుబాటులో లేని పరిస్థితి. వారి టైమింగ్స్ కి అలవాటు పడి పేషెంట్లు కూడా ఇక్కడ ఎవరూ లేని పరిస్థితి ఉంది. ఈ విధంగా ఉంటే దీనిని ఉపేక్షించేది లేదని, జిల్లా స్థాయిలో కూడా వైద్య ఆరోగ్యశాఖ పనితీరు చాలా పేలవంగా కనిపిస్తుందని, ముఖ్యంగా అనేక సమస్యలు ఉన్నా వాటిని పట్టించుకునే స్థాయిలో ఉన్నత అధికారులకు తీరికలేని పరిస్థితి చూస్తున్నాము. ఇటువంటి పరిస్థితుల్లో తప్పనిసరిగా అనేక సమస్యలు ముఖ్యంగా వికలాంగులకి, తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారో వాటిని కూడా సమర్థించే విధంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. చేసిన తప్పును సరిదిద్దుకోవటం మానేసి తప్పుపైన మరల మరలా తప్పు చేస్తూ మొదటిగా ఇచ్చిన తప్పుడు ధృవీకరణ పత్రాన్ని మరలా సమర్ధించుకునే విధంగా వారు ప్రవర్తించడం జరుగుతుంది. ఈ విషయాలను నేను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది, మొదటిగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తాను, సరికాకపోతే ముఖ్యమంత్రి గారి దృష్టికి కాని, లేని పక్షంలో జిల్లా అధికారుల మీద అసెంబ్లీలో ప్రివిలైజ్ మోషన్ మూవ్ చేయడానికి నేను వెనుకడానని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. ఈ వేళ రాష్ట్ర ప్రభుత్వం గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ పెద్ద ఎత్తున నిధులు ఇచ్చి ప్రజలు యొక్క ఆరోగ్య%శీ% పరిరక్షించాలని ప్రయత్నం చేస్తావుంటే, అధికారుల నిర్లక్ష్యం వలన ఈ విధంగా వ్యవస్థను నిర్వీర్యం అయ్యే పరిస్థితిని ఎట్టి పరిస్థితిలోను ఉపేక్షించేది లేదు.

ఈవేళ రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేస్తే ఇక్కడ 16 మంది సిబ్బందికి 5 మంది మాత్రమే ఉండటం జరిగింది. నేను వచ్చిన 20-25 నిముషాలు తరువాత సిబ్బంది ఇక్కడికి రావడం జరిగింది.దీనిని జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకువెళ్ళి చర్చించడం జరుగుతుందని, వైద్యులు వైద్య సేవలు సక్రమంగా అందించక పోయినా, మందులు సరిగా ఇవ్వకపోయినా ఉపేక్షించేది లేదన్న అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి.

## పిఠాపురంలో ఘనంగా దత్త జయంతి వేడుకలు

- శ్రీపాద శ్రీ వల్లభ మహాసంస్థానానికి భారీగా పోటెత్తిన మహారాష్ట్ర భక్తులు
- పాదగయ క్షేత్రంలో కొలువైయున్న దత్తాత్రేయ స్వామికి భారీగా ఇరుముడులు సమర్పించిన దత్తదీక్షా స్వాములు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో దత్త జయంతి- భారీగా ఇరుముడి ల సమర్పణ.

**పిఠాపురం,(మనసులో మాట) డిసెంబరు 4:** శ్రీపాద శ్రీ వల్లభ ల జన్మస్థానమైన పిఠాపురం లో దత్త జయంతి వేడుకలు ఘనంగా జరిగా యి. వారం రోజులపాటు దత్తసప్తాహ మహోత్సవాలు నిర్వహించా రు. దత్త జయంతిని పురస్కరించుకుని శ్రీపాద శ్రీ వల్లభ మహా మహా సంస్థానం లో శ్రీపాద శ్రీ వల్లభ పాదుకులకు పంచామృత అభిషేకాలు నిర్వహిం చారు, స్వామి వారికి పూలంగి సేవ, బిల్వార్చన, పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

**సాయంత్రం ఘనంగా నగరోత్సవం**

శ్రీపాద శ్రీ వల్లభ స్వామివార్లను రథంపై ఉంచి సాయంత్రం మేళ తాళాల మధ్య శోభాయమానంగా నగరోత్సవం జరిగింది. ఈ నగరోత్సవం కార్యక్రమంలో మహారాష్ట్ర భక్తులు నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లను ఆలయ ఈవో ఆర్ సౌజన్య పర్యవేక్షించారు.

పాదగయ్య క్షేత్రంలో కొలువైన స్వయంభు దత్తాత్రేయ స్వామి వారికి వేకువజామున పంచామృత అభిషేకం నిర్వహించారు. దత్త జయంతి సందర్భంగా దత్త హెూమం, ఏకాదశ రుద్రాభిషేకం, దత్త ఆవాహనం, పూర్ణాహుతి, సాయంత్రం ఉయ్యాల సేవ స్వామి వారికి సర్వ పుష్పార్చన అర్చకులుచే నిర్వహించబడింది. దత్త మండల దీక్ష పూర్తి కావడంతో రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన దత్తస్వాములు ఇరుముడుల సమర్పణ కార్యక్రమం జరిగింది. పాదగయ క్షేత్రంలో భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ కాట్నం జగన్మోహన్ శ్రీనివాసు తెలిపారు.

**పిఠాపురం పలు ఆలయాలలో దత్త జయంతి ఉత్సవాలు**

పిఠాపురం పరిధిలో గల శ్రీ గోపాల బాబా ఆశ్రమంలోనూ, బాపనాచార్యుల స్వగృహంలోనూ, వన్నెపూడి గ్రామంలో గల దత్తాత్రేయ స్వామి ఆలయంలోనూ, సాయి దత్త పీఠంలోనూ ఘనంగా దత్త జయంతి వేడుకలు నిర్వహించారు. దత్తాత్రేయ అవతారాల్లో ఒకటైన శ్రీపాద శ్రీ వల్లభ స్వామి జన్మస్థానంగా పిఠాపురం ప్రసిద్ధి గాంచడంతో దత్త జయంతి వేడుకలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.



## రెవెన్యూ డివిజన్ కాపాడటంలో మంత్రి సుభాష్ వైఫల్యం

- ప్రజల విన్నపాలను ప్రభుత్వానికి వినిపిస్తాం
- ఈనెల 12న సంతకాల సేకరణ
- వైఎస్ఆర్ సీపీ కోఆ ర్డినేటర్ సూర్యప్రకాశ్

**రామచంద్రపురం(మనసులో మాట)డిశంబరు 04..** కూటమి ప్రభుత్వం చేస్తున్న జిల్లాల పునర్విభజనతో రామచంద్రపురం రెవిన్యూ డివిజన్ పూర్తిగా కనుమరుగు అయ్యే అవకాశలు కళ్లేదుటే కనిపిస్తున్నా స్థానిక రాష్ట్ర మంత్రి సుభాష్‌కు కనీసం సీమ కుట్టినట్లు కూడా లేదని, రెవిన్యూ డివిజన్‌ను యధాతథంగా ఉండే ప్రయత్నం కూడా చేయకుండా దున్నపోతు మీద వర్షం కురిసినట్లు వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటని వైఎస్ఆర్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ విమర్శించారు. పట్టణంలోని గాంధీపేటలో గురువారం పార్టీకార్యాలయంలో నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన పార్టీ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పక్కన ఉన్న మండపేట నియోజకవర్గంలోని టీడీపీకి చెందిన ఎమ్మెల్యే ఆయన నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని ప్రభుత్వం వద్దకు తీసుకువెళ్లి దానికి సానుకూల నిర్ణయాన్ని ప్రభుత్వం వద్ద నుంచి ప్రకటించుకునే విధంగా సఫలీకృతం అయ్యారని, కానీ రామచంద్రపురం నియోజకవర్గంలో తనను గెలిపించిన ప్రజలకు వెన్నుపోటు పొడుస్తూ వారి ఆంక్షాలకు వ్యతిరేకంగా మంత్రి సుభాస్ ఉన్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునే మంత్రిమండలిలో ఉన్న మంత్రి సుభాష్ రెవిన్యూ డివిజన్‌ను కాపాడటంతో ఎందుకు నోరు మెదపటంలేదన్నారు. ఇప్పటివరకు ఆయన అభిప్రాయాన్ని ప్రభుత్వానికి గాని ఇటు ప్రజలకు గానీ చెప్పకుండా మౌనంగా ఉండటం దారుణమన్నారు. మండపేట నియోజకవర్గంలోని రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట నియోకవర్గాలు రాజమండ్రి డివిజన్‌లో విలీనం అయితే రామచంద్రపురం రెవిన్యూ డివిజన్ కేవలం రెండు మండలాలకే ప్రరిమితం అవుతుందని దీంతో రెవిన్యూ డివిజన్‌ను కూడా ఎత్తివేసి పరిస్థితి వస్తుందన్నారు. మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాలను రాజమండ్రి రెవిన్యూ డివిజన్‌లో కలుపుతూ ప్రభుత్వం కేవలం గెజిట్ నోటిఫికేషన్‌ను మాత్రమే విడుదలచేసిందన్నారు. ఈనెల 30 వరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్న సమయంలో ప్రజల తరుపున ప్రతిపక్ష హెూదాలో వైఎస్ఆర్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే ప్రజలనుసమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా ఉండటం నియోజకవర్గ దౌర్భాగ్యమన్నారు.

రెవిన్యూ డివిజన్‌ను కాపాడేందుకు ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి విన్నినవించేందుకు ప్రజల వద్ద నుంచి విన్నపాలను స్వీకరించి ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. అందులో భాగంగా ఈనెల 12వ తేదీన పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహం వద్ద రెవిన్యూ డివిజన్‌ను యధాతథంగా ఉంచాలని ప్రజల వద్ద నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సూర్యప్రకాశ్ ప్రకటించారు. దీనికి నియోజకవర్గంలోని మేధావులు, ప్రజలు, రైతులు, విద్యార్థులు ప్రతీ ఒక్కరూ రామచంద్రపురం రెవిన్యూ డివిజన్‌ను యధతథంగా ఉంచాలని కోరుతూ సంతకాలు చేసి తమ మద్దతును తెలపాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీ శాఖా బాబి, నియోకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యర్రమిల్లి సతీష్‌కుమారి, కౌన్సిలర్‌లు కేతా శ్రీను, కో ఆప్షన్ సభ్యులు గుబ్బల గణ, మస్తాన్,పార్టీ కన్వీనర్‌లు పెట్టా శ్రీనివాసరావు, గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నాయకులు పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, వాసంశెట్టి శ్యాం, పంపన సుబ్బారావు, నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాణేలంక గురుకుల పాఠశాల విద్యార్థినిని బయటకు పంపటంపై ఆగ్రహం

- బాలిక బంధువులమంటే పంపేస్తారా?!
- గురుకుల పాఠశాలలో సిబ్బంది తీరుపై ఆ బాలిక బంధువులు ఆగ్రహం
- ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా చర్యలు శూన్యమని పలువురు నిరసన

**ముమ్మిడివరం (మనసులో మాట) డిసెంబరు 4:** గురుకుల పాఠశాలలో బాలికలపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల గురువారం పలువురు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం మండలం రాణేలంక గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని (మైనర్ బాలిక)ని ఒక వివాహితుడు బంధువునని చెప్పి బయటకు తీసుకు వెళ్లాడు. ఈ విషయం తెలిసిన మైనర్ బాలిక బంధువులు నిరసనను వ్యక్తం చేస్తూ గురువారం గురుకుల పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. ఇందుకు సంబంధించి బాలిక బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం.. కాట్రేనికోన మండలం పల్లంకుర్రు గ్రామం లో సాపేవారిపేటకు చెందిన బాలిక రాణేలంక గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. ఆ విద్యార్థిని తల్లి ఉపాధి నిమిత్తం గల్ఫ్ లో ఉండటం, తండ్రి పనులు కోసం ఇతర రాష్ట్రంలో ఉండటంతో బాలిక నాయనమ్మ తాతయ్యల వద్ద ఉంటోంది. వడ్డివారిపేట చెందిన వివాహితుడు మోకా గిరిబాబు (35) బుధవారం గురుకుల వసతి గృహానికి వచ్చి బాలికను ఆసుపత్రికి తీసుకు వెళ్ళాలని, పంపించమని గురుకుల పాఠశాల యాజమన్యాన్ని కోరగా అందుకు వారు నిరాకరించారు. దీంతో అతను వెను తిరిగి వెళ్ళిపోయాడు. మరి కొద్ది సమయానికి తాను ఆ బాలిక మేనమామ భార్యను అని చెప్పి ఓ మహిళ వసతి గృహానికి వచ్చి బాలికను తీసుకుని వెళ్లింది. అయితే బుధవారం సాయంత్రం ప్రిన్సిపాల్ డీ శారద హాజరు పరిశీలనలో ఒకరు తక్కువ ఉండటాన్ని గుర్తించి బాలికను ఇంకా ఎందుకు పంపలేదని విద్యార్థిని నాయనమ్మకు ఫోన్ చేయగా తాను ఎవరినీ పంపలేదని, తమ మనమరాలు మా ఇంటికి రాలేదని చెప్పింది. దీంతో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సెక్యూరిటీ సిబ్బంది పై పోలీసులకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే మోకా గిరిబాబు గురువారం ఆ బాలికను గురుకుల పాఠశాల వద్ద వదిలి వెళ్ళిపోయినట్టు సమాచారం. బాలిక నాయనమ్మ, బంధువులు గురువారం గురుకుల పాఠశాలకు చేరుకుని ఆందోళనచేపట్టి పోలీసులను ఆశ్రయించారు. తాము గురుకుల పాఠశాలలోకి పర్మిషన్ కోసం వెళ్లాలంటే ఎన్నో ఆంక్షలు పెడతారని అటువంటిది బయట వ్యక్తులు వచ్చి పంపించమంటే ఎలా పంపించారని పాఠశాల సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా కూడా ఎటువంటి బాధ్యతా లేకుండా ఇంత నిర్లక్ష్యంగా ఎలా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సెక్యూరిటీ పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు. అమలాపురం డీఎస్పీ ఎస్ఆర్కే ప్రసాద్ పర్యవేక్షణలో ముమ్మిడివరం సీఐ ఎం మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైద్య పరీక్షలు నిమిత్తం విద్యార్థినిని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గిరిబాబు కూడా వచ్చి బాలికను తీసుకువెళ్లిన మహిళ ఎవరనేది గుర్తించారని సమాచారం.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
శుక్రవారం 5 డిసెంబర్ 2025


# మేలుమాయి గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



పలమనేరు డిసెంబర్ 4 ( మనసులో మాట ): మదర్ తెరిసా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాంప్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్ ఏడు రోజుల్లో భాగంగా రెండవ రోజు ప్రారంభమైనది. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించి వాటి యొక్క విశిష్టత తెలియజేశారు. స్వచ్ఛభారత్ ఎలా పాటించి అన్ని విధాలుగా గ్రామంలో 100 కుటుంబాలకు పైగా అవగాహన కల్పించారు. ఈ ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాంలో మదర్ తెరిసా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మధుసూదనరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దేవేందర్ రెడ్డి, గ్రామస్తులు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇకపై ప్రజా అవసరాల తక్షణ పరిష్కారం

## - డీఎల్ డీవో కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అమర్

**పలమనేరు డిసెంబర్ 4( మనసులో మాట) :** ప్రజా అవసరాలను తక్షణం పరిష్కారించే దిశగా పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం చర్యలు తీసుకుందని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరులోని వెలుగు కార్యాలయ భవనంలో గురువారం ఆయన డి ఎల్ డి ఓ (డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్ ఆఫీస్) కార్యాలయాలన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వం ప్రజలకు జవాబు దారితనంగా పనిచేసేందుకు కొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే డీఎల్ డివో కార్యాలయాల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా సచివాలయ సిబ్బంది పై పూర్తి పర్యవేక్షణతో పాటు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం జరుగుతుందన్నారు. దీంత పారదర్శక పాలన తో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా వెలుగు భవనంలోని పై అంతస్తులో ఏర్పాటు చేయదలచిన డిఎల్డిఓ కార్యాలయ స్థలాన్ని అధికారులతో కలసి ఆయన పరిశీలించి పలు సూచనలు. ఈ కార్యక్రమంలో డీఎల్ డీవో రామచంద్ర, ఉపాధి హామీ ఎపిడి ధనలక్ష్మి, డీఈ పిఆర్ మహేష్ కుమార్,మున్సిపల్ కమిషనర్ రమణా రెడ్డి, చౌడేపల్లి, సోమల, బంగారు పాళ్యం, పలమనేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీవో లు, డిప్యుటీ ఎంపీడీఓలతో పాటు కురబ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం గౌడు,పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి బాలాజీ, బైరెడ్డి పల్లి,పలమనేరు మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్, నాగరాజు రెడ్డి నాయకులు విజయ భాస్కర్ రెడ్డి,జగదీష్ నాయుడు, వెంకటముని రెడ్డి,ఖాజా,నదీమ్ తదితరులు పాల్గొన్నారు.






# ప్రభుత్వ ఆసుపత్రికి వీల్ చైర్ వితరణ

**పలమనేరు డిసెంబర్ 4 ( మనసులో మాట):** పలమనేరు పట్టణంలో 15 ఏళ్లుగా సామాజిక సేవలో చురుకుగా ఉన్న ఫ్రెండ్స్ కాఫీ బడ్డీస్ సభ్యులు సంఘంగా కలిసి మానవతా విలువలను చాటుకుంటూ గురువారం ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలమనేరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ను సందర్శించిన సభ్యులు, రోగుల అవసరాలను గుర్తిస్తూ వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందజేసి హాస్పిటల్‌కు ఎంతో సహాయంగా నిలిచారు. సంఘం అధ్యక్షులు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ సమాజానికి తిరిగి ఇవ్వాలనే భావనతో ప్రతి సంవత్సరం విభిన్న సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలియజేశారు. రోగులకు మరింత సౌలభ్యం కల్పించాలనే భావనతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమం హాస్పిటల్ సిబ్బంది,వైద్యులు ప్రశంసలు అందుకున్నారు.

అలాగే హాస్పిటల్‌లో ఉన్న పేషెంట్స్‌కు పండ్లు, బన్నులు పంపిణీ చేసి వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం సమాజంలో సేవ భావనను పెంచే ప్రయత్నంగా సభ్యులు భావించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, అవసరమైన వారికి సహాయక చర్యలు చేపట్టాలని, సమాజానికి ఉపయోగపడే దిశగా కలిసికట్టుగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని సభ్యులు తెలిపారు. ప్రజల మధ్య సేవా భావన పెరిగితే పట్టణం మాత్రమే కాదు, సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందని, ప్రతి సంవత్సరం కొత్త సేవా కార్యక్రమాలు చేపట్టడం తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు భాస్కర్ యాదవ్, లక్ష్మీపతి యాదవ్, డాక్టర్ యుగంధర్, నరేంద్ర, పూల లోకేష్ నాయుడు, బి.ఆర్.సి కుమార్, ఇంజనీర్ ఫయాజ్,చెంగారెడ్డి, ఎస్ఎంఏ నూర్ భాయ్, ప్రదీప్ కుమార్, సీఎం శ్రీహరి, ప్రవీణ్, కిషోర్, గణేష్, సతీష్, స్వామి, కిషోర్, శ్రీనివాసులు, సూర్య నాయక్, హుస్సేన్ బై తదితరులు పాల్గొన్నారు.

# కౌండిన్య నది ప్రవాహానికి కోతకు గురవుతున్న భూములను పరిశీలించిన ఎస్ ఈ కె.వి రాజు



**పలమనేరు డిసెంబర్ 4( మనసులో మాట):** కౌండిన్యా నది నీటి ప్రవాహానికి కోతకు గురౌతున్న భూములను పరిశీలించడానికి వచ్చిన జిల్లా ఇరిగేషన్ ఎస్. ఈ. కె.వి రాజు, ఇరిగేషన్ డి.ఈ పలమనేరు ఇరిగేషన్ డి ఈ. చొక్కా నాయక్ గురువారం మొసలి మడుగు గ్రామ సమీపాన గల కౌండిన్యా నదిలో ప్రవహిస్తున్న నీరంతా వక్షున్న పంటపొలాలపై ప్రవహిస్తున్న కారణంగా భారీ నీటి ప్రవాహానికి కోతకు గురౌతున్న భూములకు సిమెంటుతో నిర్మాణం చేపట్టాలని ఎళ్ల తరబడి ప్రభుత్వాలకు ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇస్తూనే ఉన్నారు. కానీ ఇంతవరకు ఎవరూ పట్టించుకోవడం లేదని జిల్లా రైతు నాయకులు ఉమాపతి నాయుడు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రెండు సార్లు వ్యవసాయ శాఖ మంత్రి కి అలాగే ఈ మధ్యన మొసలి మడుగు గ్రామ సమీపాన గల ఏనుగుల ప్రాజెక్టు వద్దకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు వచ్చినప్పుడు అర్జీ ఇవ్వాలని అనుకున్న సందర్భంలో అక్కడ అర్జీలు ఇవ్వడానికి ఎవరికి అనుమతి ఇవ్వక పోవడంతో జిల్లా రైతు నాయకులు ఉమాపతి నాయుడు ఆ మరునాడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఈ క్రింది అర్జీలను కౌండిన్య నదిపై బ్రిడ్జి నిర్మాణంతో పాటు రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి

కౌండిన్య నదిలో ప్రవహించే భారీ నీటి ప్రవాహానికి కోతకు గురౌతున్న భూములకు సిమెంటుతో నిర్మాణం చేపట్టాలని ఏనుగుల బారినుండి రైతులతోపాటు పంటలకు పూర్తి రక్షణ కల్పించాలని ఈ మూడు అర్జీలను పవన్ కళ్యాణ్ కి పోస్ట్ ద్వారా పంపించారు. పవన్ కళ్యాణ్ ఆఫీసు నుండి ఫోన్ చేసి మాట్లాడారు... పంపిన అర్జీలను సంబంధించిన శాఖలకు పంపించారు. ఇరిగేషన్ గ్రామ సచివాలయం నుంచి ఇంజనీరింగ్ అధికారి భవాణి కూడా వచ్చి అన్ని పరిశీలించి ఈ విషయాన్ని ఇదివరకే వాలా సార్లు ఎస్టిమేట్ వేసి ప్రభుత్వానికి పంపించామని ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని తెలిపారు. మళ్ళీ ఒకసారి పంపుతామని మా ప్రయత్నం మేము చేస్తాము వీటి కొరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేపట్టి వచ్చినప్పుడు తప్పక చేపడుతామని ఉమాపతి నాయుడు కి ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



# ఎం.వి.ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని సౌత్ జోన్ వాలీబాల్ జట్టుకు ఎంపిక

**పలమనేరు డిసెంబర్ 4 (మనసులో మాట) :** ఎం.వి.ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని సౌత్ జోన్ వాలీబాల్ జట్టుకు ఎంపిక అయినట్లు కరస్పాండెంట్ ఎంవిఆర్ రెడ్డి తెలిపారు. ఈనెల 15వ తేదీ ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీ చెన్నైలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ ఉమెన్స్ టోర్నమెంట్ నందు తమ కళాశాలకు చెందినటువంటి ప్రవీణ ఎస్వీ యూనివర్సిటీ తరఫున ఆడేందుకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ ఎంవిఆర్ రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీ సుధా, పిడి కిరణ్, అధ్యాపక బృందం అభినందించారు.

# నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నవీన్ కుమార్



**పలమనేరు డిసెంబర్ 4( మనసులో మాట):** నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్ టి ఎఫ్ ) జాతీయ అధ్యక్షులు డాక్టర్ కుంభ రవి బాబు, సహకారంతో రాష్ట్ర అధ్యక్షులు మానుపాటి నవీన్ ఆదేశాల మేరకు ఏపీటీఎఫ్ జిల్లా పలమనేరు మున్సిపాలిటీ చెందిన సి నవీన్ కుమార్ ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆయన తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చిన వారందరికి నవీన్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రత్యేకంగా పలమనేరు మున్సిపాలిటీ కౌన్సిలర్ కేఎం నాగరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

# టీటీడీ ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కరించండి

## - ఈఓ కు వినతి



**తిరుపతి (మనసులో మాట) :** టీటీడీ పరిధి లో ఉద్యోగస్తుల సమస్యల పై తితిదే కార్యనిర్వాహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ తో తితిదే ఎంప్లాయిస్ గ్రీవెన్స్ సమావేశం బుధవారం జరిగింది .. ఈసమావేశం లో 1.పాదిరేడు వద్ద తితిదే వారు తితిదే ఉద్యోగులు కు ఇళ్ల స్థలాలు కేటాయించి, రిజిస్ట్రేషన్ చేసి ఇంతవరకు డెవలప్మెంట్ చేసి తితిదే ఉద్యోగుల స్వాధీనం చేయడం జరగలేదు అని . 2) వెంకటగిరి వద్ద పల్లాం సమీపంలో ఉన్న ల్యాండ్ కు తితిదే వారు అమౌంట్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారికి ఇవ్వడం జరిగింది. కాని ఇంత వరకు సదరు ల్యాండ్ ను తితిదే వారు స్వాధీనం చేసుకోవడం జరగలేదు. పదవీవిరమణ చేసిన తితిదే ఉద్యోగుల కు మరియు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగింది అని . ఇందుకు టీటీడీ 3) తితిదే లో 1060 అమెండ్మెంట్ చేయడానికి కమిటీ వేయడం జరిగింది. కానీ ఇంత వరకు తితిదే లో 1060 అమెండ్మెంట్ జరగలేదు అని 4) టీటీడీ ఇన్ సర్వీస్ ఉద్యోగుల టీచర్ పోస్టులు బోర్డులో ఆమోదించబడింది కొన్ని కారణాల వలన ఆగడం జరిగింది . దీన్ని మళ్లీ తీసుకోవాల్సిందిగా కోరుచున్నాము అని 5) తితిదే వారి ఆదేశాల ప్రకారం తితిదే రెఫరల్ హాస్పిటల్స్ నందు వైద్యం చేయుచున్న తితిదే ఉద్యోగులకు వైద్య ఖర్చులు నిమిత్తం ప్రస్తుతం ఇస్తున్న రూపాయలు 3 లక్షల రూపాయల నుంచి 5 లక్షల రూపాయలు పెంచవలసిందిగా కోరుచున్నాము అని 6) స్విమ్స్ , బర్డ్ మరియు ఆయుర్వేద హాస్పిటల్ లలో సెంట్రల్ హాస్పిటల్ లో లాగా వైద్యం అందించాలి మరియు %బూ% నుంచి తీసివేయవలసిందిగా కోరుచున్నాము అని 7) స్విమ్స్ హాస్పిటల్ లో తితిదే లో పదవీవిరమణ చేసిన సి పి యస్ ఉద్యోగులకు ఓ పి పునరుద్దరణ చేయవలసినదిగా కోరుచున్నాము అని 8) ప్రతి సంవత్సరం తితిదే లో బ్రహ్మోత్సవాలు మరియు వైకుంఠ ఏకాదశి కి తితిదే ఉద్యోగుల సిఫార్సు పై 10 మందికి దర్శనాలకు సంబంధించిన స్టాండర్డ్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరడమైనది దానిపై సాధ్యాసాధ్యాలు చూసి తప్పకుండా చేస్తామన్నారు .9) టిటిడి ఉద్యోగుల రెఫరల్ పై బందువుల/స్నేహితులకు నెలకు 10 మంది చొప్పున రూ.300/- టికెట్లు దర్శనం కల్పించాలని కోరుచున్నాము అని10) ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఫండ్ మళ్లీ పునరుద్ధరించాలని కోరుచున్నాము అని 11) చాలా మంది ఉద్యోగులు రిటైర్డ్ అవుతున్న కారణంగా అన్ని డిపార్ట్మెంట్ లలో వర్క్ లోడు పెరిగి ఉద్యోగులు అనారోగ్యం కు గురి అవుతున్నారు కావున ఉద్యోగాల భర్తీ చేయాలి అని12) టీటీడీ కాలేజస్ మరియు స్కూల్స్ హాస్టల్స్ నందు సిబ్బంది పోస్టు (శాంక్షన్ పోస్ట్) సంఖ్య పెంచుట కొరకు అభ్యర్థన. చేస్తున్నాము అని 13) పెండింగ్లో ఉన్న కార్య నియామకాలు వెంటనే ఇవ్వవలసినదిగా కోరుచున్నాము అని 14) సెంట్రల్ హాస్పిటల్ నందు డాక్టర్స్ ను నియమించాలి. మరియు ఉద్యోగులకు అవసరం అయిన మందులు సమకూర్చాలి. సెంట్రల్ హాస్పిటల్ ను అభివృద్ధి చేయాలి అని 15) చాలా రోజుల నుంచి పెండింగ్లో ఉన్న తితిదే ఉద్యోగుల కు పి సి ఎ 5,000/- %ఓ% హెచ్ అలెవెన్సు 1,000/- పెంచాలి అని 16 ) తిరుమల రిసెప్షన్ విభాగంలో కార్యాలయ అధీనులు కొరత ఎక్కువగా ఉన్న కారణంగా ఏరియాల లో %బూూ% లను నియమించాలి. ( ఒక్కొక్కరు సుమారుగా 150 రూం నుంచి 200 రూంలు చూస్తున్నారు. వారిలో ఎవరైనా సెలవు పెడితే సెలవు పెట్టిన వారి పని భారం ప్రక్క లో పై పడుతోంది. ప్రస్తుతం చాలా మంది రిటైర్మెంట్ దగ్గర లో ఉన్న వారు ఆరోగ్య పరమైన సమస్యలతో బాధ పడేవారు చాలామంది ఉన్నారు) 17) .18) స్విమ్స్ హాస్పిటల్ లో వైద్యం చేయించుకున్న వారి రూంలలో మరియు సభా మందిరం లో స్వామి వారి నిత్య కైంకర్యాలు దృశ్య రూపంలో వీక్షించడం కొరకు టి వి లు ఏర్పాటు చేయాలి. ఈ విధంగా ఏర్పాటు చేస్తే వారికి మానసిక ఆనందం కలగడానికి వీలు ఉంటుంది అని 19) స్విమ్స్ హాస్పిటల్ నందు వారానికి రెండు పర్యాయాలు హరికథ ఏర్పాటు చేయమని మా మనవి. ఎందుకంటే స్విమ్స్ హాస్పిటల్ లో రోగుల కు మరియు వారి బంధు గణానికి ఆ హరికథ వినడం ద్వారా భక్తి తత్వం ఏర్పడి మానసిక ప్రశాంతత చేకూరుతుంది అని .20 ) తితిదే లో పదవీవిరమణ చేస్తున్న ఉద్యోగులందరికీ పదవీవిరమణ ఫంక్షన్ అందరికీ ఒకే వేదికపై జరిగే విధంగా పరిపాలనా భవనంలో ఏర్పాటు చేయవలసినదిగా కోరడమైనది అని 21) తితిదే పరిపాలనా భవనంలో జనరల్ ఎంప్లాయిస్ వారు వారి సమస్యల పై చర్చించు కొని గౌరవనీయులైన తితిదే యాజమాన్యం దృష్టి కి తీసుకువెళ్ళడానికి ఒక రూం ను కేటాయించవలసినదిగా కోరడమైనది.22) ఉద్యోగుల పిల్లలు అయినటువంటి అమ్మాయిలకు %ఇూ% చెక్కిన ను దేవస్థానం తరఫున ఉచితంగా వేయమని కోరుచున్నాము.23) ప్రత్యేక ప్రతిభావంతులైన ఉద్యోగుల కోసం మరియు పదవీవిరమణ చేసిన వీడియో వృద్ధుల కోసం పరిపాలనా భవనంలో ఆఫీస్ పనుల నిమిత్తం వచ్చేవారికి పరిపాలనా భవనంలో ముందు వైపు వెనుక వైపు వీల్ చైర్ ను కలిపించాలి.24) నైట్ డ్యూటీ చేస్తున్న తితిదే ఉద్యోగులకు నైట్ డ్యూటీ అలవెన్స్ ఇప్పించవలసిందిగా కోరడమైనది.25) మన రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా ప్రత్యేకంగా 5 రోజుల సెలవు మంజూరు చేసారని, అదే విధంగా తితిదే లో కూడా అమలు చేసారు. కాని కొన్ని విభాగాలు అమలు చేయడం లేదు. సదరు విషయం మీ దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సమస్యను పరిశీలన చేయవలసినది గా ఈ గ్రీవెన్స్ సమావేశం లో తితిదే కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ ని తితిదే ఉద్యోగుల తరఫున మేము అభ్యర్ధించడం జరిగింది అని టీటీడీ ఉద్యోగస్తుల నాయకులు తెలియజేసినారు .

ఈ సమావేశంలో గౌరవనీయులైన తితిదే సంయుక్త కార్యనిర్వాహణాధికారి వారైన శ్రీ వీరబ్రహ్మం , యఫ్ ఎ అండ్ సి ఇ ఒ బాలాజీ వెల్ఫేర్ డిపూటీ ఇ ఓ ఆనంద రాజు సి యం ఓ కుసుమ తితిదే జాయింట్ కౌన్సిల్ ఆఫ్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల కృష్ణ రెడ్డి, గంజల వెంకట రమణ రెడ్డి, ఉపాధ్యక్షులు కల్లన %బీఓ% రవికుమార్ హేమ సుధ, సెక్రటరీ ఆఫ్ జనరల్ ముని వెంకట రెడ్డి, సంఘ నాయకులు మరియు సంఘ సభ్యులుపాల్గొన్నారు. కూలంకషంగా మాతో చర్చించి వారి పరిధిలోని అన్ని సమస్యలను పెద్దమనసుతో పరిష్కరిస్తామని టీటీడీ ఈఓ హామీ ఇచ్చారు.వారికి ఉద్యోగస్తుల తరఫున ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాము అని టీటీడీ ఉద్యోగ సంఘ నాయకులు తెలియజేసారు.

# పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లు హ్యాక్

- పోలీసులకు షాక్ ఇచ్చిన సైబర్ నేరగాళ్లు



**హైదరాబాద్, డిసెంబరు 4 (మనసులో మాట):**

తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఇటీవలే హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన సైబర్ క్రిమినల్స్.. తాజాగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లను పనిచేయకుండా చేశారు. దీంతో గత పది రోజులుగా రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లు పూర్తిగా నిలిచిపోయాయి. వీటిలోకి మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే అధికారిక సమాచారానికి బదులుగా గేమింగ్ సైట్లకు రీడైరెక్ట్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో సర్వర్లను డౌన్ చేసి వాటిని నిర్వహిస్తున్న ఎన్ఐసీకి సమాచారం అందించారు. సమస్యను పరిష్కరించేందుకు రెండు కమిషనరేట్లలోని ఐటీ బృందాలు యత్నిస్తున్నాయి. వెబ్‌సైట్ల పునరుద్ధరణకు ఎన్ఐసీ పర్యవేక్షణలో ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల పోలీస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. మళ్లీ హ్యాకింగ్ కాకుండా అధునాతన ఫైర్‌వాల్స్ ఆడిట్ చేస్తున్నారు. ఆడిహ్యాకింగ్‌కు కారణమైన మూలాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేస్తూ సర్వర్ల భద్రతను బలోపేతం చేసే పనిలో నిమగ్నమ య్యారు. కాగా, ఇదే తరహాలో పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు కూడా హ్యాక్ అయినట్లు సమాచారం. ఇప్పటికే డార్క్ వెబ్‌లో 22 వెబ్‌సైట్లకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉందని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

# హిల్ట్ పాలసీ పేరుతో భారీ కుంభకోణం



- పారిశ్రామికవేత్తలకు భూములుకట్టబెట్టే కుట్రలు
- బీఆర్ఎస్ రాగానే ఆ పాలసీని రద్దుచేస్తాం
- ఎవరైనా పెట్టుబడి పెడితే నష్టపోక తప్పదు
- జీడిమెట్ల పారిశ్రామిక కారిడార్‌ను సందర్శించిన కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబరు 4 (మనసులో మాట):**

హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నది బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్‌ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావని, ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు, ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇచ్చారని గుర్తుచేశారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పున్నదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు, పాఠశాలలు, దవాఖానలు, చివరికి స్మశానాలకు స్థలం లేదు.. కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ 9300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్పున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూళ్లు, హాస్పిటళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదిలిపెట్టదని, కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలోని కాలనీల ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని చెప్పారు. 9300 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసి లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఢిల్లీకి మూటలు పంపడానికి చేస్తున్న ఈ స్కామ్ ను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల విలువచేసే ప్రజల భూమిని కాపాడే దాకా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయిందంటూ ప్రభుత్వం బాధపడుతున్నదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఎయిర్ పోర్ట్.. పరిశ్రమలు.. యూనివర్సిటీ

## ఆదిలాబాద్‌పై రేవంత్ రెడ్డి వరాల జల్లు

### సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపించి ఉద్యోగాలు ఇస్తామని హామీ

### రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**ఆదిలాబాద్, డిసెంబరు 4 (మనసులో మాట):**

ఆదిలాబాద్ జిల్లాకు సిఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు ప్రకటించారు. ఎయిర్ పోర్టు, యూనివర్సిటీ, తుమ్మడిహట్టి ద్వారా నీళ్లు తీసుకొచ్చే బాధ్యత తనలదని ప్రకటించారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఏడాదిలోపు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభిస్తామని వ్యాఖ్యానించారు. వరంగల్‌తో పాటు ఆదిలాబాద్‌కు అన్ని రకాల వసతులతో కూడిన ఎయిర్-పోర్టు ఉండాల్సిందేనని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు వస్తే ఆదిలాబాద్‌కు పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఎర్రబస్సే కాదని.. ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు కూడా తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అనంతరం ప్రసంగించారు. ఆదిలాబాద్ అభివృద్ధి బాధ్యత నేనే తీసుకుంటానని చెప్పుకొచ్చారు. ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి.. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నాం. రెండేళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా. చిన్న వయసులోనే నాకు గొప్ప అవకాశం దక్కడం.. ప్రజల దీవెన, దేవుడి సంకల్పం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అనుమతించలేదు. ఎమ్మెల్యేలను కూడా సచివాలయంలోకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వాన్ని గత పదేళ్లలో చూశాం. ఏ ఆశయంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో.. గత పదేళ్లలో అది నెరవేరలేదు. రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంటరీ రూపొందించాం. పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం అని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంద్రవెల్లి స్ఫూర్తిగానే గత ప్రభుత్వంపై నేను పోరాటం ప్రారంభించానని అన్నారు. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్థూపం పర్యాటకంగా అభివృద్ధి చేసే దస్త్రంపై సంతకం పెట్టాను. ఆదిలాబాద్‌కు సాగునీరు అందేలా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును వైఎస్ఆర్ చేపట్టారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. మూడేళ్లకే కాళేశ్వరం కూలింది. ప్రజల సొమ్ము దోచుకుని అక్రమ సొమ్ము కోసం ఇవాళ ఆ కుటుంబంలో గొడవలు పడుతున్నారు. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దే నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తాం. ఎన్నికల ఉత్సవం పూర్తి కాగానే మరో 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తి చేస్తాం అని సీఎం హామీ ఇచ్చారు.తమ్మిడిహట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కట్టితీరుతామని స్పష్టం చేశారు.ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తానే వస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నాయని వివరించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా మారుస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు మళ్లీ వస్తానని.... రోజంతా సమస్యలపై సమీక్షిస్తానని తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యూనికేషన్‌లో ఆదిలాబాద్ అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఆదిలాబాద్‌లో తప్పకుండా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ ఎక్కడ కట్టాలో స్థానిక నేతలంతా కలిసి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిలో యూనివర్సిటీ కడితే బాగుంటుందని తన భావన అని తెలిపారు. అనుమతి మాత్రమే తనదని.. ఎక్కడ కట్టాలో నిర్ణయం మీదేనని చెప్పుకొచ్చారు. ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. రాబోయే రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. మన యువత ఐఏఎస్, ఐపీఎస్‌లు అయినప్పుడే తనకు సంతోషమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాగా చదువుకుని తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటాలన్నారు. సర్పంచ్‌లను చూసి ఎన్నుకోవాలని, పనిచేసే వారికే అవకాశం ఇవ్వాలన్నారు. మంత్రులు వివేక్ , జూపల్లి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు కోసం నేను పనిచేయను

- రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని శాసించనున్న ఏఐ
- 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి ప్లాన్
- వేయికోట్ల రూపాయలతో స్టార్టప్ లను ప్రోత్సహిస్తాం
- క్వాంటం టెక్నాలజీలో తెలంగాణ గ్లోబల్ లీడర్
- నీతి ఆయోగ్ క్వాంటం సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**హైదరాబాద్, డిసెంబరు 4 (మనసులో మాట):**

రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ప్రపంచాన్ని శాసిస్తుందని డిప్యూటీ సీఎం విక్రమార్క పేర్కొన్నారు. అయితే, తెలంగాణ 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి చేరుకోవాలని ప్లాన్ చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన క్వాంటం పవర్డ్ ఎకానమీ స్ట్రాటజీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. క్వాంటం టెక్నాలజీ గురించి దేశం చర్చిస్తుంది.. దాని ఆవిష్కరణకి తెలంగాణను ఎంచుకున్నందుకు నీతి ఆయోగ్ కి ధన్యవాదాలు చెప్పుకొచ్చారు. డిజిటల్, టాలెంట్ కి హైదరాబాద్ కి కేంద్రంగా మారింది అన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా టెక్నాలజీని ప్రమోట్ చేసే పనిలో ఉన్నారు.. నీతి ఆయోగ్ కూడా గ్లోబల్ సమ్మిట్ లో భాగస్వామ్యం కావాలని కోరుతున్నాం.. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అన్ని రంగాల పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం.. యంగ్ ఇండియా స్టార్టప్ కోసం ఫండింగ్ చేయాలని నిర్ణయించాం.. 1000 కోట్ల రూపాయలతో స్టార్టప్ లను ప్రోత్సహిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. 'క్వాంటం సిటీ'గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీని రూపొందించా మన్నారు. గచ్చిబౌలిలోని 'ఐఐఐటీ హైదరాబాద్'లో 'నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం అండ్ తెలంగాణ క్వాంటం స్ట్రాటజీని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీలో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్‌లో ఆర్అండ్ డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమే కాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశా నిర్దేశర చేసే 'డైరెక్షన్' అని అన్నారు. ఈ టెక్నాలజీ లో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్'కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. 'ఇండస్ట్రీ డే' పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు.

# బాలు విగ్రహాన్ని అడ్డుకోవడం దారుణం

- రోశయ్య, బాల సుబ్రహ్మణ్యం ఒకప్రాంతం వారు కాదు
- బీఆర్ఎస్‌సెంటిమెంట్ రాజకీయాలు ఆపాలి
- రోశయ్య వర్ధంతి సభలో పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



**హైదరాబాద్, డిసెంబరు 4 (మనసులో మాట):**

తెలంగాణ సెంటిమెంట్‌తో భారత రాష్ట్ర సమితి రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రాంతానికి చెందిన వారు కాదనిమహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని రవీంద్ర భారతిలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభలో మహేష్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్ర భారతిలో పెడితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. సెంటిమెంట్ రగల్చి బీఆర్ఎస్ లబ్ది పొందే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేవుళ్ల విషయంలో సీఎం ఒక సామెతగా చెప్పారని.. దాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని ఆరోపించారు. హిల్ట్ పాలసీ ద్వారా భూముల ధరలు అందుబాటులో వస్తాయని వెల్లడించారు. కాలుష్య రహిత నగరంగా మారుతుందని తెలిపారు. అవినీతికి అలవాటు పడ్డ కేసీఆర్ కుటుంబం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా అవినీతి అని ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ విమర్శించారు.ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభను రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ దయానంద్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, జగ్గారెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి నేతలు నివాళు లర్పించారు. రోశయ్య వర్ధంతి సందర్భంగా వి.హనుమంతరావును రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ సత్కరించింది. అలాగే రోశయ్య వె-ఎమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ స్కాలర్ షిప్‌లు అందజేశారు.

# చలాన్లపై రాయితీ వార్తల ప్రచారం

## అలాంటిదేమీ లేదని ఖండించిన ట్రాఫిక్ విభాగం

**హైదరాబాద్, డిసెంబరు 4 (మనసులో మాట):**

ట్రాఫిక్ చలాన్లపై భారీ తగ్గింపుల పేరుతో తిరుగుతున్న ఈ ప్రచారం మొత్తం ఫేక్ అని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. పెండింగ్ చలాన్లు క్లియర్ చేసేందుకు ఇది మంచి అవకాశం అనుకుంటున్న వాహనదారులు అసత్య సమాచారానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు. ఇటీవలి రోజుల్లో ఇంటర్నెట్‌లో డిసెంబర్ 13న చలాన్లపై పూర్తి రాయితీలు ఇస్తున్నారంటూ వేగంగా ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసులు తమ అధికారిక ట్విట్టర్ ద్వారా స్పష్టతనిచ్చారు. ఆ తేదీన ఎలాంటి లోక్ అదాలత్ నిర్వహించడంలేదని, చలాన్లపై రాయితీలకు సంబంధించిన ఎలాంటి అధికారిక నోటిఫికేషన్ ఇప్పటివరకు జారీ కాలేదని తెలిపారు. ప్రజలు ఇలాంటి తప్పుడు పోస్టులను నమ్మకుండా, మరెవరికి పంపకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఇక తరచూ చలాన్లపై డిస్కౌంట్లు ప్రకటించడం సరికాదని, అలాంటి రాయితీలు వాహనదారుల్లో భయం తగ్గించి నిబంధనల ఉల్లంఘనలు పెరిగే అవకాశముందని హైకోర్టు ఇప్పటికే వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ట్రాఫిక్ చలాన్లపై ఎలాంటి రాయితీ లేదు. పెండింగ్ చలాన్ల గురించి నమ్మకమైన, అధికారిక సమాచారం కోసం మాత్రమే పోలీసుల వెబ్‌సైట్‌లు, యాప్‌లను వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఉద్యోగాల పేరిట ఎర

## మోసగాళ్ల ముఠా గుట్టు రట్టు

**హైదరాబాద్, డిసెంబరు 4 (మనసులో మాట):**

నిరుద్యోగులే వారి టార్గెట్.. విదేశాల్లో మంచి ఉద్యోగం అని చెబుతారు.. లక్షల్లో జీతం, అన్ని రకాల సౌకర్యాలుంటాయని నమ్మబలుకుతారు..విదేశాలకు పంపిస్తారు.. విదేశాల్లో ఉద్యోగం అని ఎన్నో ఆశలతో వెళ్లిన నిరుద్యోగులకు చేయకూడని పనులన్నీ చేయిస్తారు. విదేశీ ఉద్యోగం పేరుతో సైబర్ క్రైమ్ కాల్ సెంటర్లకు నిరుద్యోగ యువతను పంపుతున్న మోసగాళ్ల ముఠా గుట్టు రట్టు అయింది. నిరుద్యోగ యువతను ఆకర్శించి మోసాలకు పాల్పడుగున్న సైబర్ క్రైం ఏజెంట్ల గ్యాంగ్ ను పోలీసులు పట్టుకున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అక్కడ సైబర్ క్రైం చేయిస్తున్న ఏజెంట్ల గ్యాంగ్ ను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఉద్యోగాల పేరుతో యువతను మియన్మార్, థాయ్‌లాండ్‌కు తరలిస్తున్న హైదరాబాద్, విశాఖపట్నం, మైసూర్ కు చెందిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. సైబర్ నేరాలకు సంబంధించి ఈ గ్యాంగ్ పై పలు కేసులు నమోదు చేశారు. విదేశీ ఉద్యోగాల పేరుతో పొంచివున్న ప్రమాదంపై యువత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# పాతబస్తీలో యువకుడి దారుణ హత్య

## రియల్ వ్యాపారి జునైద్‌గా గుర్తింపు

**హైదరాబాద్, డిసెంబరు 4 (మనసులో మాట):**

హైదరాబాద్ నగరంలోని పాతబస్తీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. రెయిన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి కత్తి పోట్లతో పడి ఉన్నట్లు పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు బాధితుడిని హుటాహుటిన సంతోష్‌నగర్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు పాతబస్తీ రెయిన్ బజార్‌కు చెందిన మహమ్మద్ జునైద్ (30)గా గుర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన జునైద్‌ను కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు విచక్షణారహితంగా కత్తులతో పొడిచారని.. తీవ్రంగా గాయపడిన జువైద్‌ను ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందాడని పోలీసులు తెలిపారు. అనంతరం జునైద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ హత్యకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ మొదలుపెట్టారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. అయితే నిందితులు, బాధితుడు ఇద్దరూ కూడా బంధువులే అని అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్ తెలిపారు. జువైద్‌ను ఎందుకు హత్య చేశారనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.

# అఖండ ప్రీమియర్ షో క్యాన్సిల్



**హైదరాబాద్, డిసెంబరు 4 (మనసులో మాట):**

అఖండ 2 ప్రీమియర్స్ కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న బాలకృష్ణ అభిమానులకు సినిమా టీమ్ షాకింగ్ న్యూస్ చెప్పింది.ఒకరోజు ముందుగానే ప్రీమియర్స్‌తో సినిమా ప్రారంభించాలని అనుకున్నారు. కానీ, చివరి నిమిషంలో టెక్నికల్ ఇష్యూస్ కారణంగా సినిమా ప్రీమియర్స్ క్యాన్సిల్ చేసినట్లుగా సినిమా టీమ్ ప్రకటించింది. 'ఈరోజు వేయాల్సిన అఖండ ప్రీమియర్స్ టెక్నికల్ ఇష్యూస్ వల్ల క్యాన్సిల్ అయ్యాయి. మేము సినిమా షో వేయడానికి చాలా ప్రయత్నించాం, కానీ కొన్ని మా చేతుల్లో లేకుండా పోయాయి. సారీ ఫర్ ది ఇన్‌కన్వీనియన్స్' అంటూ సంస్థ 14 రీల్స్ ప్లస్ అధికారిక ట్విట్టర్ ఖాతా నుంచి పోస్ట్ పెట్టింది. నిజానికి, అమెరికా సహా ఇండియాలో కూడా ప్రీమియర్స్ పెద్ద ఎత్తున ప్రదర్శించాలని ఎ÷-లాన్ చేశారు. కానీ, టెక్నికల్ ఇష్యూస్ కారణంగా ఇప్పుడు ఆ ప్రీమియర్స్ ప్రదర్శన నిలిపివేస్తున్నట్లు సినిమా టీమ్ అధికారికంగా ప్రకటించింది. అయితే ఓవర్సీస్ రివ్యూస్ మాత్రం యధావిధిగా పడనున్నాయని ప్రకటించారు. సినిమా రేపు ఉదయం యధావిధిగా రిలీజ్ అవుతుందని పేర్కొంది.

# అఖండ విడుదలపై ఆంక్షలు

## మద్రాస్ హైకోర్టు ఆదేశాలు

**చెన్నై, డిసెంబరు 4 (మనసులో మాట):**

నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ' సినిమా సీక్వెల్ అయిన 'అఖండ 2' విడుదలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ సినిమా విడుదలపై తాత్కాలిక నిషేధం విధిస్తూ డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్ 'అఖండ 2' సినిమా థియేట్రికల్, డిజిటల్ విడుదలలన్నింటినీ నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ ÷ూ.ఓ. సుబ్రమన్యం మరియు జస్టిస్ అ. కుమారప్పన్ లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ ఆంక్షలను విధించింది. ఈ కేసులో పిటిషనర్‌గా ఉన్న ఎరోస్ ఇంటర్నేషనల్ మీడియా లిమిటెడ్ పక్షాన కోర్టు ఈ తీర్పును ఇచ్చింది. ఎరోస్ సంస్థ ప్రధానంగా 14 రీల్స్ ప్లస్ ఎల్ఎల్‌పిపై తీవ్ర ఆరోపణలు చేసింది. సినిమా నిర్మాతలు తమకు చెల్లించాల్సిన ?28 కోట్లు చెల్లించకుండానే సినిమాను విడుదల చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఎరోస్ ఆరోపించింది. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ కు అనుబంధ సంస్థ అయిన 14 రీల్స్ ప్లస్ ఎల్ఎల్‌పి సినిమా విడుదల ఎ÷-లాన్ చేసిందని ఎరోస్ వాదించింది. ఎరోస్ ఇంటర్నేషనల్ తరపున సీనియర్ కౌన్సిల్‌లు తమ వాదనలు వినిపించారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం, కోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు 'అఖండ 2' సినిమాను ఏ రూపంలోనూ విడుదల చేయడం అసాధ్యం అని అంటున్నారు.

# సర్పంచ పదవి కోసం కుటుంబం పోటీ పోటీ

**జగిత్యాల,డిసెంబరు 4 (మనసులో మాట):**

తెలంగాణలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చిత్ర, విచిత్ర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఓ గ్రామంలో సర్పంచ్ బరిలో తల్లి, కూతుర్లు పోటీ చేస్తుండగా మరో చోట అన్నా, చె÷-లలెలు పోటీ చేస్తుండడంతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు మరింత రసవత్తరంగా మారుతున్నాయి. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయపల్లిలో తల్లి, కూతురు పోటీ చేస్తుండగా గుమ్లాపూర్ లో సొంత అన్నా, చె÷-లలెలు సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచారు. అయితే, సర్పంచ్ ఎస్సీ జనరల్ కు ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బరిలో నిలబడ్డారు. తెడ్డు శివకుమార్ తో పాటు సొంత చెల్లెలు రౌట్ల స్రవంతి, స్రవంతి పెద్ద నాన్న కుమారుడు తెడ్డు రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఇక, సర్పంచ్ స్థానానికి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పోటీ చేస్తుండగా సర్పంచ్ పదవి ఎవరిని వరించబోతుందని జిల్లా ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కాగా, రౌట్ల స్రవంతికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు పలుకుతుండగా ఆమె అన్న తెడ్డు శివకుమార్ స్వతంత్ర అభ్యర్థిగా, పెద్ద నాన్న కుమారుడు తెడ్డు రమేష్ కు కాంగ్రెస్ పార్టీ మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు.

# పర్యాటక కేంద్రంగా ఉమ్మడి జిల్లా అభివృద్ధి

- తద్వారా స్థానికుకలు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు
- ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం రేవంత్
- ఆదిలాబాద్ పర్యనటనలో మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, డిసెంబరు 4 (మనసులో మాట):**

మినీ కాశ్మీర్ గా పేరొందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. తద్వారా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.పేదలు కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. గతంలో పాలించిన కేసీఆర్ పుణ్యమా అని ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా తయారైందన్నారు. రూ. 8 లక్షల కోట్ల రూపాయల అప్పుల చేస్తే.. దానికి ప్రతీ నెల ప్రజా ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తుంది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ రెండేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు.. ఇవాళ ఆదిలాబాద్ లో రూ. 260.45 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఆదిలాబాద్ లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కు పునాదిరాయి వేసుకున్నాం అని జూపల్లి వివరించారు. ఆదిలాబాద్ లో ఏయిర్ పోర్టు ఏర్పాటుకు 700 ఎకరాల భూసేకరణ కోసం సీయం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా 61 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. రానున్న రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. చనాక-కొరాట బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పదేండ్లలో ఒక ఎకరానికి కూడా సాగునీరు ఇవ్వలేకపోయింది. చనాక -కొరాట బ్యారేజ్ పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని హామీనిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పంటనష్టం ఇవ్వలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల పంటనష్టం ఇస్తుంది. మిగిలిన రైతులకు నివేదిక ఆధారంగా పంటనష్టం చెల్లిస్తాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేయొచ్చో.. రెండేళ్లలో చేసి చూపించాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు, సబ్సిడీ గ్యాస్ ? నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు రూ.21 వేల కోట్లకు పైగా రుణమాఫీ, సన్నాలకు రూ. 500 బోనస్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. బలమైన ఆర్థిక రాష్ట్రంగా నిలదొక్కుకోవడానికి, ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి తెలంగాణ రైజింగ్ ? 2047 విజన్ డాక్యుమెంట్ ను ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రపంచ స్థాయిలో రాష్ట్రం అగ్రగామిగా ఉండేందుకు లక్ష్యాలను నిర్దేశిరచనున్నాం. క్రీడలు, పర్యాటకం, వాణిజ్యం, పరిశ్రమలు, ప్రకృతి వ్యవసాయం ఇవన్నీ కూడా రాష్ట్ర పాలసీలో భాగంగా ముందుకెళ్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

# ఆదిలాబాద్‌కు ఇక మహర్దశ

## సీఎం హామీతో మారనున్న ముఖచిత్రం

## మంత్రి వివేక్ వెంకటస్వామి



**ఆదిలాబాద్, డిసెంబరు 4 (మనసులో మాట):**

సిఎం రేవంత్ రెడ్డి హామీలతో ఆదిలాబాద్ రూపురేఖలు మారనున్నాయని మంత్రి వివేక్ అన్నారు. అలాగే రాష్ట్రంలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 95 శాతం స్థానాల్లో విజయం సాధిస్తారని, ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి పరాభవం తప్పదని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేయడంతో పాటు వాటిని పట్టణాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించిందన్నారు. ఆదిలాబాద్ సిఎం సభలో పాల్గొన్న అనంతరం ఆయన తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టు, విశ్వవిద్యాలయం రావడం ప్రజాప్రభుత్వం విజయమని అన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమక్రమంగా అమలు చేస్తున్నామన్నారు. సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల విద్యుత్ ఫ్రీ, నూతన రేషన్ కార్డులు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఈ ఎన్నికల్లో వీటినే ప్రచారాస్త్రాలుగా నాయకులు ఉపయోగించాలని సూచించారు. అనంతరం పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సింగరేణిలో కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని దీనికి సంబంధించి తమ ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కే ఓసీ విస్తరణతో ఏరియాకు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఓసీ విస్తరించే ప్రాంతాల్లో ప్రజల డిమాండ్లను కూడా యాజమాన్యం పరిష్కరించాలన్నారు.సింగరేణిలో నాలుగు బొగ్గు బ్లాకులకు సంబంధించి ఒరిస్సా తరహాలోనే వేలం పాటంలో దక్కించుకోవాలని కోరుతున్నామని తెలిపారు.

# ఆదిలాబాద్‌కు విమానాశ్రయం అదృష్టం

## సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన పాయల శంకర్



**ఆదిలాబాద్, డిసెంబరు 4 (మనసులో మాట):**

ఆదిలాబాద్ కు విమానాశ్రయం కావాలని గతంలో సిఎం రేవంత్ రెడ్డిని తాను అడిగానని బిజెపి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. కేంద్రం మంజూరు చేస్తే.. కావాల్సిన సహకారం అందిస్తానని సిఎం అన్నారని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్న సిఎం కు ధన్యవాదాలు తెలియజేశారు. ఆదిలాబాద్ లో సిఎం పర్యటించారు. ఇందిరా ప్రియదర్శిని మైదానంలో బహిరంగసభ నిర్వహించారు. రూ. 18.7 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాయల్ శంకర్ మీడియాతో మాట్లాడుతూ..ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్తే అంగీకరించారని, విమానాశ్రయానికి వెంటనే 800 ఎకరాల భూసేకరణకు సిఎం ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. మాజీ సిఎం కెసిఆర్ ప్రభుత్వం ఆదిలాబాద్ విమానాశ్రయానికి భూమి ఇచ్చేందుకు ముందుకు రాలేదని విమర్శించారు. నియోజక వర్గం అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా సిఎం ను కలుస్తానని చెప్పారు. చనాఖా- కొరాట ప్రాజెక్టుకు పెండింగ్ నిధులు విడుదల చేయాలని, సోయాబీన్ పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని అన్నారు. ఆదిలాబాద్ కు యూనివర్శిటీ మంజూరు చేయాలని రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నానని పాయల్ శంకర్ తెలియజేశారు.

# బాధిత బాలుడికి ప్రభుత్వం అండ

- మంత్రి అడ్లూరి
- లక్ష రూపాయల తక్షణ సాయం
- ఇందిరమ్మ ఇల్లు, పించను మంజూరు



**హైదరాబాద్: డిసెంబర్ 4 (మనసులో మాట):**

ఎల్‌బీనగర్ మన్సురాబాద్ సమీపంలోని శివగంగా కాలనీలో కుక్కల దాడిలో గాయపడిన బాలుడు ప్రేమ్ చంద్ సంఘటనపై ఎస్సీ ఎస్టీ దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన వార్త కథనాలకు స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నప్పటికీ, వెంటనే తనకు ఫోన్ చేసి ప్రేమ్ చంద్‌కు తగిన వైద్య సదుపాయం, ఆర్థిక సహాయంతో పాటు కుటుంబానికి అండగా ఉండేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించినట్లు మంత్రి తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు బుధవారం మంత్రి అడ్లూరి స్వయంగా నిలోఫర్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించారు. బాలుడి తల్లిదండ్రులు సి. తిరుపతి రావు, చంద్రకళ దంపతులతో మంత్రి మాట్లాడి, ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అత్యవసర సాయం కింద బాలుడి తల్లిదండ్రులకు ఒక లక్ష రూపాయల చెక్కును మంత్రి అందించారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. బాలుడికి ప్రత్యేక పాఠశాలలో ప్రవేశం ఇప్పించి, చదువు బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. మంత్రి ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారులు బాలుడికి దివ్యాంగుల గుర్తింపు కార్డును తక్షణమే జారీ చేశారు. అర్హత ప్రకారం దివ్యాంగ పింఛను కూడా మంజూరు చేయనున్నారు. బాలుడి సంపూర్ణ వైద్య సంరక్షణ బాధ్యత, కోలుకున్న తర్వాత కావలసిన పునరావాస సహాయాన్ని ప్రభుత్వం దగ్గరుండి చూసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ హృదయ విదారక ఘటన తనను ఎంతో కలిచి వేసిందని మంత్రి అన్నారు. ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే అధికారుల బృందం నిలోఫర్ ఆసుపత్రికి చేరుకొని వివరాలు సేకరించినట్లు చెప్పారు. ఇకముందు ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో ఎప్పుడు, ఎక్కడ చోటు చేసుకున్నా జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారులు ఆలస్యం చేయకుండా బాధిత కుటుంబాలను సందర్శించి, అవసరమైన సేవలు, సహాయం వెంటనే అందించాలని కూడా మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల శాఖ కమిషనర్ అనిత రామచంద్రన్, డైరెక్టర్ శైలజ, నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయ్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి గడ్కరీతో ఎంపీ వద్దిరాజు భేటీ

## తెలంగాణ రోడ్ల విస్తరణ, అభివృద్ధిపై వినతిపత్రం అందజేత

**హైదరాబాద్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ ఉప నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. ఎంపీ రవిచంద్ర గురువారం సాయంత్రం పార్లమెంట్ ప్రాంగణంలోని గడ్కరీ కార్యాలయంలో ఆయనను కలిశారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రధాన రహదారుల విస్తరణ, అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం, మరమ్మతుల విషయంలో కేంద్రం నుంచి మరింత సహకారం అవసరమని ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.



# కుక్క కాటుకు గురైన ప్రేమ్‌చంద్‌కు మెరుగైన వైద్యం

## మేయర్, డిప్యూటీ మేయర్ పరామర్శ

## పూర్తిగా కోలుకునే వరకు ఆసుపత్రిలోనే ఉంచాలి: తల్లిదండ్రులకు మేయర్ సూచన

**హైదరాబాద్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

కుక్క కాటుకు గురై నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి ప్రేమ్ చంద్‌ను గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పరామర్శించారు. చిన్నారికి అందుతున్న వైద్య సేవలను వారు పరిశీలించారు. మేయర్, డిప్యూటీ మేయర్ సీఎంఓ పద్మజ, పశు వైద్య అధికారులతో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రి ఆర్ఎంఓ, సూపరింటెండెంట్‌తో మాట్లాడి, చిన్నారికి అత్యుత్తమ వైద్య సేవలను ప్రత్యేకంగా అందించాలని సూచించారు. చికిత్సకు బాలుడు బాగా స్పందిస్తున్నట్లు వైద్యులు మేయర్‌కు, డిప్యూటీ మేయర్‌కు తెలిపారు. ఏ మాత్రం రాజీ పడకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని మేయర్ ఆసుపత్రి అధికారులను కోరారు. బాలుడు పూర్తిగా కోలుకునే వరకు వైద్యులు చెప్పినట్టు ఆసుపత్రిలోనే ఉండి చికిత్స అందించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బాలుడి తల్లిదండ్రులకు సూచించారు.

# ఎంతమందికైనా ఆర్థిక సాయం

- రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం ద్వారా అందజేస్తాం
- మెయిన్స్ కు ఎంపికైన 50 మందికి లక్ష చొప్పున చెక్కులు అందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద సివిల్ సర్వీసెస్ మెయిన్స్, ఇంటర్వ్యూలకు ఎంతమంది ఎంపికైనా ఆర్థిక సహాయం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రకటించారు. గురువారం సాయంత్రం ప్రజా భవన్‌లో యూపీఎస్సీ ఇంటర్వ్యూకు ఎంపికైన 50 మంది అభ్యర్థులకు ఆయన చెక్కులు అందించిన అనంతరం ప్రసంగించారు. సివిల్ సర్వీసుల్లో విజయం సాధించి రాష్ట్రానికి, దేశానికి సేవ చేయాలని తపిస్తున్న అందరికీ ఉప ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. రాష్ట్రం నుంచి ఎంత ఎక్కువ మంది ఎంపిక అయితే రాష్ట్రానికి అంత మంచిదని భావించి, ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అపారమైన మేధస్సు ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఎంపిక కాలేకపోతున్నారన్న సమాచారంతో, ఆ ఇబ్బందులు తీర్చేందుకు సింగరేణి ఆధ్వర్యంలో ఈ పథకాన్ని తీసుకువచ్చామని వివరించారు.

### ఆర్థిక ప్రోత్సాహం, లక్ష్యం

మెయిన్స్‌కు ఎంపికైన వారికి లక్ష రూపాయలు, ఆ తర్వాత ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి మరో లక్ష రూపాయల ఆర్థిక సాయంతో పాటు ఢిల్లీలో వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. లక్ష రూపాయల ఆర్థిక సాయం పుస్తకాలు, ప్రయాణం, కోచింగ్ వంటి అవసరాలకు ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావించి ఈ పథకాన్ని తీసుకొచ్చింది. గత సంవత్సరం 20 మంది ఇంటర్వ్యూకు వెళ్లగా, అందులో ఏడుగురు సివిల్ సర్వీసెస్ కు ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. ఈసారి ఏకంగా 50 మంది ఇంటర్వ్యూకు ఎంపిక కావడం శుభపరిణామం అని, వచ్చేసారి ఈ సంఖ్య 100కు దాటి వెళ్లాలని ఆకాంక్షించారు.

### ఇంటర్వ్యూ బోర్డు ఏర్పాటు:

ఇంటర్వ్యూకు వెళ్లే అభ్యర్థులకు మార్గనిర్దేశం చేసేందుకు, రాష్ట్ర ప్రభుత్వంలోని సీనియర్ బ్యూరోక్రాట్లతో ఒక ఇంటర్వ్యూ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ మేరకు ప్రధాన కార్యదర్శితో చర్చించినట్లు వివరించారు. ఇంటర్వ్యూకు వెళ్లే అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం యావత్తు మద్దతుగా ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా విజయం సాధించాలని అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేయాలని తనకు చెప్పారని అన్నారు.

### సమాజం పట్ల బాధ్యత:

ఉప ముఖ్యమంత్రి అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, కోట్లాది ప్రజలు చెల్లించిన పన్నుల నుంచి ప్రభుత్వం ప్రోత్సాహకంగా లక్ష రూపాయలు అందిస్తుందని గుర్తు చేశారు. "మీరు స్థిరపడిన తర్వాత మిమ్ములను పెంచి పోషించిన తల్లిదండ్రుల పట్ల ఎంత బాధ్యతగా ఉంటారో, సమాజం పట్ల అంతే బాధ్యతగా ఉండాలి" అని కోరారు. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన తర్వాత ఆఫీసులకు వెళ్లే ప్రతిరోజు మీ సంతకం లక్షలాది మంది జీవితాల్లో మార్పు తీసుకురావాలన్న ఆలోచనతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మెయిన్స్‌కు ఎంపికైన 50 మందికి రొటీన్‌గా చెక్కులు అందజేయకుండా, వారి అభిప్రాయాలు తెలుసుకొని భవిష్యత్తులో ఈ పథకాన్ని మరింత తీర్చిదిద్దేందుకు ఈ ఇంటరాక్షన్ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొని అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. ముందుగా సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ మాట్లాడుతూ, పేద వర్గాల నుంచి కూడా అభ్యర్థులు సివిల్స్ పరీక్షల్లో విజేతలుగా నిలవాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ పథకానికి సింగరేణి సంస్థ తన సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా రూపొందించిన సింగరేణి బ్రాండ్ శాలువాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆవిష్కరించారు.

# గ్రేటర్ విస్తరణ.. బాధ్యత మరింత పెరిగింది



- 27 పురపాలికల విలీనం చారిత్రక నిర్ణయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మేయర్, డిప్యూటీ మేయర్ ధన్యవాదాలు

**హైదరాబాద్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

27 పురపాలికలను విలీనం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి తెలిపారు. ఈ విలీనం ద్వారా తమపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ, డా. బి. ఆర్. అంబేద్కర్ విగ్రహాలను డిప్యూటీ మేయర్‌తో కలిసి మేయర్ ఆవిష్కరించారు. అనంతరం మహనీయులకు మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ ఆర్. వి. కర్ణన్, ఇతర అధికారులు నివాళులు అర్పించారు. ఆ తర్వాత మేయర్ గేట్ ప్రాంగణంలో ఫౌంటేన్ సుందరీకరణ పనులకు ప్రారంభోత్సవం చేశారు.

### దేశంలో అతిపెద్ద నగరంగా హైదరాబాద్

ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ, దాదాపు రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించడం, ప్రధాన కార్యాలయానికి కార్పొరేట్ రూపు వచ్చేలా సుందరీకరణ పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. 27 పురపాలికల (20 మునిసిపాలిటీలు 7 కార్పొరేషన్లు) విలీనంతో జీహెచ్ఎంసీ పరిధి 650 చదరపు కిలోమీటర్ల నుంచి 2000 చదరపు కిలోమీటర్లకు విస్తరించిందన్నారు. ఫలితంగా హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద మెట్రోపాలిటన్ నగరంగా అవతరించిందని తెలిపారు. "దేశంలోనే అతిపెద్ద మహా నగరం హైదరాబాద్‌కు మేయర్, డిప్యూటీ మేయర్‌లుగా ఉండడం మాకు గర్వ కారణం. సంతోషంగా ఉంది" అని మేయర్ పేర్కొన్నారు.

### విలీన పురపాలికల అభివృద్ధి:

వేగంగా అభివృద్ధి చెందుతున్న జీహెచ్ఎంసీలో ఈ పురపాలికలు భాగం కావడం వల్ల ఇకపై హైదరాబాద్‌తో సమానంగా విలీన పురపాలికలు కూడా అభివృద్ధి చెందుతాయని చెప్పారు. దీనివల్ల ప్రజలు వేగంగా, సులభంగా సేవలు పొందగలుగుతారని మేయర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రక నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు మేయర్ డిప్యూటీ మేయర్ ప్రకటించి, హైదరాబాద్ ప్రజల తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, ఏకకాలంలో 27 పురపాలికలు విలీనం కావడం సంతోషంగా ఉందని, శివారు పురపాలికల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందని అన్నారు.

### రోశయ్యకు నివాళులు:

ఈ కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి మేయర్, డిప్యూటీ మేయర్, అధికారులు నివాళులు అర్పించారు. రోశయ్య అజాత శత్రువు అని, వారి సేవలు ఎనలేనివని కొనియాడారు.

## వార్డు మెంబర్ గెలుపుకోసం
# నానా తంటాలు

**భార్యను గెలిపిస్తే ఫ్రీ కటింగ్ అంటూ ప్రచారం**




**సిద్దిపేట,డిసెంబరు4(మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఓట్ల పండగలో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు కోతులను తరిమిస్తామని హామీ ఇవ్వగా, కొందరు రకరకాల హామీలు ఇస్తున్నారు. పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని అన్ని పంచాయతీ, గ్రామ, వార్డు పరిధిలో ఎన్నికల హీట్ పెరిగిపోయింది. ప్రధాన పార్టీలు బలపరచిన సర్పంచ్, వార్డ్ మెంబర్ అభ్యర్థులు ప్రచారం హోరాహోరీగా సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఓటర్లను ఆకర్షించేందుకు వివిధ రకాల ఆఫర్లు ప్రకటిస్తున్నారు. డబ్బు పంచడం ఓ ఎత్తు అయితే.. కొందరు చీరలు, వివిధ రకాల వస్తువులను బహుమతిగా అందిస్తున్నారు. ఈ క్రమంలో ఓ వార్డ్ మెంబర్ ఎన్నికల ప్రచారం సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. తన భార్యను వార్డు మెంబర్‌గా గెలిపిస్తే.. ఐదేళ్ల పాటు ఫ్రీగా కటింగ్ చేస్తానని ఆమె భర్త ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ చక్కర్ల కొడుతోంది..నా భార్యని వార్డ్ మెంబర్‌గా గెలిపిస్తే మగవారందరికీ కంటింగ్, షేవింగ్ ఫ్రీగా చేస్తానని ఓ భర్త వినూత్న ప్రచారం చేస్తున్నాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రఘోత్తంపల్లిలో ఓ మహిళ వార్డ్ మెంబర్‌గా పోటీ చేస్తోంది. ప్రస్తుతం అన్ని పంచాయతీల్లో సర్పంచ్, వార్డు మెంబర్లు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో రఘోత్తంపల్లిలో వార్డ్ మెంబర్‌గా పోటీ చేస్తున్న మహిళ కూడా ప్రచారం మొదలెట్టింది. సదరు మహిళ భర్త క్షురకుడు కావడంతో ప్రచారం వినూత్నంగా మొదలెట్టాడు. తన భార్యను వార్డ్ మెంబర్‌గా గెలిపిస్తే.. వార్డులోని మగవారందరికీ ఐదేళ్ల పాటు కటింగ్ , షేవింగ్.. ఫ్రీగా చేస్తానని చెబుతున్నాడు. ఇంటింటికీ వెళ్లి ఈ ఆఫర్ చెబుతూ.. తన భార్యను గెలిపించాలని కోరుతున్నాడు. తడి వింత ఆఫర్ వినేందుకు వినూత్నంగా ఉండడంతో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

## కోతుల సమస్యతో
# రైతులు పరేషాన్

**జాతీయ సమస్యగా గుర్తించి చర్యలు తీసుకోవాలి**

**లోక్‌సభలో ప్రస్తావించిన బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

**న్యూఢిల్లీ,డిసెంబర్ 3(మనసులో మాట):**



కోతుల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పెద్దమొత్తంలో వానరాలు పంటలను పాడు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఈ సమస్యను నివారించేందుకు జాతీయ స్థాయిలో కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కోతుల సమస్యపై గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సమస్య తమ శాఖ కిందకు రాదని కొన్ని ప్రభుత్వ శాఖలు తప్పించుకుంటున్నాయని.. వానరాల సమస్య ఏ శాఖ కిందకు వస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. కోతుల సమస్య చిన్న విషయంలాగా అనిపిస్తోందని.. కానీ అందరూ ఈ సమస్య గురించి తెలుసుకుని నవ్వుతారని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని చాలా రాష్ట్రాల్లో కోతుల సమస్య ఉందని గుర్తుచేశారు. విషయంలో నోడల్ ఏజెన్సీ అవసరమని చెప్పారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కోతుల సమస్యను ప్రజలు ప్రస్తావిస్తున్నారని గుర్తు చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కూడా ఈ సమస్య ఒక ఎజెండాగా మారిందని పేర్కొన్నారు. వానరాల సమస్యను పరిష్కరిస్తే సర్పంచ్‌గా గెలిపిస్తామని ప్రజలు అంటున్నారని.. దేశ రాజధాని ఢిల్లీలో కూడా ఈ సమస్య తీవ్రంగా ఉందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు.

# 'సారథి' సాంకేతిక సమస్య తాత్కాలికమే

**సాంకేతిక లోపం ఢిల్లీ నుండి తలెత్తింది**

**సాయంత్రం 3 గంటల తర్వాత సేవలు పునరుద్ధరణ**

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్: డిసెంబర్ 4 (మనసులో మాట):**



రాష్ట్ర రవాణా శాఖలో లైసెన్సుల జారీ, వాహనాల రిజిస్ట్రేషన్ వంటి కీలక సేవలను అందించే 'సారథి' వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక సమస్యపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఈ సమస్య తాత్కాలికమేనని ఆయన వాహనదారులకు భరోసా ఇచ్చారు. ఈ విషయంపై మంత్రి రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, కమిషనర్ ఇలాంబర్తితో పాటు ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారుల వివరణ ప్రకారం, రవాణా శాఖ కార్యాలయాలలో 'సారథి' వ్యవస్థలో ఏర్పడిన అవాంతరాలు కేవలం తాత్కాలికమైనవే. ఈ సాంకేతిక లోపం ఢిల్లీ నుండి తలెత్తినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమీక్ష అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, 'సారథి' సేవలు సాయంత్రం 3 గంటల తర్వాత యధావిధిగా తిరిగి కొనసాగుతాయని వెల్లడించారు. సాంకేతిక లోపం కారణంగా పౌరులకు, వాహనదారులకు కలిగిన అసౌకర్యానికి మంత్రి ఈ సందర్భంగా చింతిస్తున్నామని ప్రకటించారు.

## సీనియర్ వీడియో జర్నలిస్టు
# దామోదర్ మృతి

**కేసీఆర్, కేటీఆర్ సంతాపం**

**తెలంగాణ ఉద్యమ వార్తల్లో చురుకైన పాత్ర పోషించిన దామోదర్**



**హైదరాబాద్: డిసెంబర్ 4 (మనసులో మాట):**

తెలంగాణ సీనియర్ వీడియో జర్నలిస్టు దామోదర్ మరణం పట్ల భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత కె. చంద్రశేఖర రావు (కేసీఆర్) విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపి సంతాపం ప్రకటించారు. పార్టీ స్థాపించిన తొలినాటి నుంచి తెలంగాణ ఉద్యమ వార్తల కవరేజ్‌లో దామోదర్ చురుకుగా పాల్గొనే వారని కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు (కేటీఆర్) గాంధీ ఆసుపత్రికి వెళ్లి దామోదర్ మృతదేహానికి నివాళులు అర్పించారు. దామోదర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, అక్కడున్న కుటుంబ సభ్యులతో కేటీఆర్ మాట్లాడారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు.

# మెరుగైన వైద్య సేవలు అందించండి

**ఎంసీహెచ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**సీటింగ్ సామర్థ్యం పెంచాలని, అన్ని మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశం**



**పెద్దపల్లి, డిసెంబర్ 4 (మనసులో మాట):**

మాత శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని ఎంసీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గైనకాలజిస్ట్ ఔట్ పేషెంట్ విభాగం వద్ద సీటింగ్ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. గర్భిణీ మహిళలు నిలబడాల్సిన అవసరం రాకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. ఫార్మసీ స్టోర్‌లో అవసరమైన అన్ని రకాల మందులు తప్పకుండా అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎంసీహెచ్‌లో గర్భిణీ మహిళలకు, పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఏవైనా పరికరాలు అవసరమైతే, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు తక్షణమే సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంఓ డాక్టర్ విజయ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ పక్కాగా
# అమలయ్యేలా చూడాలి

**రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని**

**నిజామాబాద్, డిసెంబర్ 4 (మనసులో మాట):**



గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమలులో ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, జనరల్ అబ్జర్వర్ శ్యాంప్రసాద్ లాల్ ఇతర అధికారులు వీ.సీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన స్టేజ్ 2 జోనల్ ఆఫీసర్ల శిక్షణ తరగతులు, సర్వీస్ ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్ కు ఏర్పాట్లు, వెబ్ కాస్టింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ షెడ్యూల్ తదితర అంశాలపై కమిషనర్ సమీక్షించారు.

# బాన్సువాడలో కాంగ్రెస్ హవా

**మొదటి విడతలో 16 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం**




**బాన్సువాడ, డిసెంబర్ 4 (మనసులో మాట):**

బాన్సువాడ నియోజకవర్గంలో జరిగిన మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికై సత్తా చాటారు. ఈ అపూర్వ ఏకగ్రీవ ఫలితాలకు సహకరించిన గ్రామాల ప్రజలకు, ఆయా మండలాల నాయకులకు, గ్రామ నాయకులకు, పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ అధిష్టానం సూచనల మేరకు, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నాయకులు పోచారం సురేందర్ రెడ్డిల పర్యవేక్షణలో కాంగ్రెస్ అభ్యర్థులు ఈ విజయాలను సాధించారు. నియోజకవర్గంలోని వర్ని, కోటగిరి, పోతంగల్, చందూర్ మండలాల్లో మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వర్ని మండల పరిధిలో రూప్లానాయక్ తండా నుంచి సిరినా బలరాం, మల్లారం నుంచి లక్ష్మణ్ ముదిరాజ్, వకీల్ ఫారం నుంచి మద్దిపూడి శ్రీనివాస్, శంకోరా నుంచి హరిసింగ్, రాజ్‌పేట నుంచి కవిత, సిద్ధాపూర్ నుంచి బాల్‌సింగ్, చింతలపేట తండా నుంచి నెహ్రూ, చెల్క తాండా నుంచి గొట్టిపాటి శ్రీనివాస్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా, కోటగిరి మండలంలో రాంపూర్ నుంచి శాంకి బాయి, అడకాస్‌పల్లి నుంచి రెడ్డి రామకృష్ణ, దేవునిగుట్టతాండ నుంచి రవి నాయక్, సుద్దులం తండా నుంచి మౌనిక విజయ్, వల్లభాపూర్ నుంచి పుష్పలత విట్టల్ పటేల్ ప్రజల సమగ్ర మద్దతుతో ఏకగ్రీవంగా గెలుపొందారు. పోతంగల్ మండలంలో పీఎస్ఆర్ నగర్ నుంచి రామ్ భాయి, చందూర్ మండలంలో లక్ష్మాపూర్ నుంచి చింతం ఉమా సంజీవ్, కారేగావ్ తండా నుంచి లాల్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన పోచారం భాస్కర్ రెడ్డి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రజలు తమ పార్టీపై విశ్వాసం ఉంచడానికి ప్రధాన కారణమని స్పష్టం చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో జరగనున్న మిగిలిన గ్రామ పంచాయతీలలో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే సర్పంచులుగా ఎన్నికవుతారనే ధీమాను ఆయన వ్యక్తపరిచారు. ముఖ్యంగా మూడవ విడత నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న బాన్సువాడ గ్రామీణ, బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లో భారీగా ఏకగ్రీవాలు సాధించే పరిస్థితి నెలకొన్నదని ఆయన పేర్కొన్నారు. ప్రజా ఆశయాల సాధనలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పని చేస్తుందని ఆయన తెలిపారు.

# స్నేహబంధానికి నిదర్శనం

**మిత్రుల సహకారంతో తల్లి నామినేషన్**

**తిరుమలాపూర్‌లో సర్పంచ్ అభ్యర్థికి చిన్ననాటి మిత్రుల ఆర్థిక చేయూత**



**బాన్సువాడ, డిసెంబర్ 4 (మనసులో మాట):**

బాన్సువాడ మండలం తిరుమలాపూర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో స్నేహబంధం యొక్క గొప్పదనం మరోసారి రుజువైంది. సాధారణ మహిళా రిజర్వేషన్ వచ్చిన ఈ గ్రామంలో, గత 30 ఏళ్లుగా పోచారం శ్రీనివాస్ రెడ్డికి విధేయుడిగా సేవలందిస్తున్న మ్యాడ మల్లారెడ్డి తన తల్లి మ్యాడ అనసూయను సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దింపారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిల ప్రోత్సాహంతో ఆమె పోటీ చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మల్లారెడ్డి చిన్ననాటి స్నేహితులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆమెకు ఆర్థిక సహకారాన్ని అందించారు. గురువారం రోజు, మిత్రులు స్వయంగా ఆమె నామినేషన్ ఫీజును అందజేశారు. అంతేకాక, తదుపరి ప్రచార కార్యక్రమాలకు కావలసిన సామగ్రి సేకరణలో కూడా తాము పాల్గొంటామని నరేష్, శ్రీకాంత్, శ్రీను, అరుణ్, మనోజ్, వెంకట్రావ్ తెలిపారు. ప్రజల మధ్య ప్రచారం, ఇంటింటి సమాచార కార్యక్రమాల్లో సైతం చురుకుగా పాల్గొంటామని వారు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా పనిచేసే నాయకత్వం తిరుమలాపూర్‌కు అవసరమని, అనుభవంతో పాటు నిబద్ధత కలిగిన అభ్యర్థిని ప్రజలు ఆశిస్తున్నారని మిత్రులు అభిప్రాయపడ్డారు. అనసూయ విజయం గ్రామానికి పురోగతిని చేకూరుస్తుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు మిత్రభావంతో మెలగాలి



**రాయపోల్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రతి అభ్యర్థి, కార్యకర్త, ప్రజలు చట్టాలను పాటించాల్సిన అవసరం ఉందని తొగుట సీఐ లతీఫ్,ఎంపీడీవో శ్రీనివాసరావు లు స్పష్టం చేశారు.మండల కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యుల కోసం నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, మైక్ ప్రకటనలు జరపరాదు, ఓటర్లపై డబ్బు, మద్యం, బహుమతుల ప్రలోభాలు చూపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం, రెచ్చగొట్టే పోస్టులు, ఉద్రిక్తతలకు దారితీసే వ్యాఖ్యలు నియమావళికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో నిష్పాక్షికంగా ఎన్నికలు పూర్తయ్యేలా పోలీసు విభాగం చర్యలు తీసుకుంటోందని, అనుమానాస్పద ఘటనలు గమనించిన పక్షంలో వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మానస,ఎన్నికల అబ్జర్వర్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ 'క్వాంటం సిటీ'గా మారుస్తాం

- మంత్రి శ్రీధర్ బాబు
- దేశంలో తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ' ఆవిష్కరణ




**హైదరాబాద్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హైదరాబాద్‌ను క్వాంటం సిటీగా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. క్వాంటం టెక్నాలజీలో తెలంగాణను ప్రపంచ నాయకుడిగా మార్చే లక్ష్యంతో, నిపుణులు పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా "లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీని" రూపొందించామని వెల్లడించారు. గురువారం గచ్చిబౌలిలోని ఐఐఐటీ హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఆయన "నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం తెలంగాణ క్వాంటం స్ట్రాటజీని" ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఒకప్పుడు విద్యుత్, అంతర్జాలం వంటి ఆవిష్కరణలు ప్రపంచ రూపురేఖలను మార్చాయని, అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతోందని అన్నారు. కృత్రిమ మేధ, క్వాంటం టెక్నాలజీ వంటి అత్యంత ఆధునిక సాంకేతికతల్లో తెలంగాణను ప్రపంచ నాయకుడిగా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు.

**వ్యూహంలో ముఖ్య అంశాలు:**

లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీలో భాగంగా పరిశోధనల మౌలిక సదుపాయాలు, అంతర్జాల భద్రత, జీవశాస్త్రాల వేగవంతం, ప్రతిభావంతుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. క్వాంటం సెన్సింగ్, భద్రత, సమాచార మార్పిడి, క్వాంటం కంప్యూటింగ్‌లో పరిశోధన అభివృద్ధి, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ విధానం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని చెప్పారు. ఈ పాలసీ కేవలం ప్రభుత్వం రూపొందించిన ఒక విధానం మాత్రమే కాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశా నిర్దేశం చేసే ఒక మార్గం అని అన్నారు. ఈ సాంకేతికతలో దేశానికి ఒక బెంచ్‌మార్క్ నిర్ణయించేలా ప్రత్యేకంగా "శ్రేష్ఠతా కేంద్రాన్ని" కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

**స్టార్టప్‌లకు ప్రోత్సాహం**

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్‌లు, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా "ఫండ్స్ ఆఫ్ ఫండ్స్"ను ప్రారంభించబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు సూచనలు స్వీకరించేందుకు "ఇండస్ట్రీ డే" పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒకరోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం, సభ్యుడు డా. వీకే సారస్వత్, దేబ్ జానీ ఘోష్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ రిజర్వేషన్లపై జోక్యం చేసుకోం

**పిటిషన్లపై విచారణలో హైకోర్టు స్పష్టీకరణ**



**హైదరాబాద్,డిసెంబరు4(మనసులో మాట):**

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. చట్టప్రకారం ఎన్నికల పక్రియలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌ల వ్యవహారంలో దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారించిన హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఎస్సీ, ఎస్టీ జనాభా లేని చోట కూడా ఆయా కులాలకు వార్డుమెంబర్లు, సర్పంచి రిజర్వేషన్లు కేటాయించారన్న పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచి రిజర్వేషన్లు కేటాయించడం వల్ల తప్పులు దొర్లాయని తెలిపారు. రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులానికి చెందిన వ్యక్తులు లేకపోతే ఎన్నికల నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. ఎస్ఈసీ వాదనను రికార్డు చేసుకున్న హైకోర్టు.. పిటిషన్లపై విచారణ ముగించింది.

# ఏసీబీ వలలో ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్

**దాదాపు వందకోట్ల ఆస్తుల గుర్తింపు**

**హైదరాబాద్,డిసెంబరు4(మనసులో మాట):**

అక్రమాస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. దాదాపు వందకోట్ల ఆస్తులు ఉన్నట్లుగా గుర్తించారు. ఏడీ శ్రీనివాస్ నివాసం, బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు తెలంగాణ, ఏపీ, కర్ణాటకల్లో భారీగా ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. మొత్తం ఆరు ప్రాంతాల్లో సోదాలు చేసిన అధికారులు.. రాయదుర్గం మైహోంభుజలో ప్లాట్, కర్ణాటకలో 11 ఎకరాల వ్యవసాయ భూమి, అనంతపురంలో 11 ఎకరాలు, మహబూబ్‌నగర్‌లో నాలుగు ప్లాట్లు, నారాయణపేటలో రైస్ మిల్లు, 3 ప్లాట్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. సోదాల్లో రూ. 5లక్షల నగదు, 1.6 కిలోల బంగారం, 770 గ్రాముల వెండి, 2 కార్లు, పలు పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

**హైదరాబాద్ విమానం అహ్మదాబాద్‌కు మళ్లింపు**




**హైదరాబాద్,డిసెంబరు4(మనసులో మాట):**

షార్జా నుండి హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో విమానాన్ని అత్యవసరంగా అహ్మదాబాద్‌కు మళ్లించారు. ఈ సంఘటన ప్రయాణికులలో, విమానాశ్రయ అధికారులలో కలకలం సృష్టించింది. ఇండిగో విమానానికి సంబంధించిన అధికారులకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు అందింది. విమానంలో మానవ ఐఈడీ ఉన్నట్లుగా ఈ మెయిల్ ద్వారా బెదిరించినట్లు తెలిసింది. బెదిరింపు రాగానే అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, విమానాన్ని దాని గమ్యస్థానం హైదరాబాద్‌కు కాకుండా అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మళ్ళించారు. అహ్మదాబాద్‌లో విమానం ల్యాండ్ అయిన వెంటనే, ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. అనంతరం భద్రతా సిబ్బంది బాంబు స్క్వాడ్‌తో కలిసి విమానంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు రావడం ఇది రెండవసారి. గతంలో, కువైట్ నుండి హైదరాబాద్‌కు రావాల్సిన మరో విమానానికి బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో, ఆ విమానం ఉదయం 7:45 గంటల ప్రాంతంలో ముంబై ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయింది. అప్పుడు కూడా ప్రయాణికులను దించి, బాంబు డిస్పోజల్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాయి.

# కలెక్టరేట్‌లో రోశయ్య వర్ధంతి

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రోశయ్య సేవలు ఎనలేనివి: కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రోశయ్య చేసిన సేవలను వారు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటేశ్వర్లు, ఏవో సుధాకర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో వారసత్వ కట్టడాల సంరక్షణ

- హైదరాబాద్‌ను పరిశీలించిన బోర్డో బృందం
- ప్రపంచ వారసత్వ నగరంగా మార్చే అవకాశాలపై మేయర్‌తో సుదీర్ఘ చర్చ

**హైదరాబాద్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

హైదరాబాద్‌లోని వారసత్వ కట్టడాల సంరక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి పనులను పరిశీలించేందుకు ఫ్రాన్స్‌కు చెందిన బోర్డో మెట్రోపోల్ ప్రతినిధి బృందం నగరాన్ని సందర్శించింది. గురువారం ఈ బృందం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ బృందంలో ఆర్కిటెక్చర్ అర్బన్ హెరిటేజ్ హెడ్ అన్-లోర్ మోనియట్, ఫ్రాన్స్ డిప్యూటీ కాన్సుల్ పాస్కల్ లోరో, బోర్డో మెట్రోపోల్ హైదరాబాద్ ఫోకల్ పాయింట్ హ్యూగో కువెట్ సభ్యులుగా ఉన్నారు. హైదరాబాద్ నగర వారసత్వం, నగరాన్ని ప్రపంచ వారసత్వ నగరంగా తీర్చిదిద్దే అవకాశాలపై బృందం



మేయర్‌తో సుదీర్ఘంగా చర్చించింది. ఆ తర్వాత ఈ బృందం జీహెచ్ఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి, క్యూక్యూఎస్‌యూడీఏ, ఎన్ఐయూఎం అధికారులతో సమావేశమైంది. హైదరాబాద్ పాత నగరంలో జరుగుతున్న వారసత్వ సంరక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి పనులపై సమగ్ర వివరాలు తెలుసుకుంది. కమిషనర్ నగరంలో వారసత్వ సంరక్షణకు తీసుకుంటున్న చర్యలతో పాటు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు వివరాలను బృందానికి వివరించారు. పర్యటనలో భాగంగా బృంద సభ్యులు పాత నగరంలోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, పాత ఎంసీహెచ్ కార్యాలయం, సర్దార్ మహల్, ఖుర్షీద్ జా దేవడిలను పరిశీలించారు. దీంతో పాటు చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం వంటి కీలక వారసత్వ కట్టడాలను సందర్శించారు. అంతకుముందు బృందం కుతుబ్ షాహీ సమాధులను సందర్శించి, అక్కడ జరుగుతున్న సంరక్షణ పచ్చిక అభివృద్ధి పనులను పరిశీలించింది. రాబోయే రోజుల్లో బోర్డో బృందం హైదరాబాద్‌లో ప్రతిపాదిత వారసత్వ ప్రాజెక్టులను కూడా సందర్శించనుంది. పారిస్ %-% హైదరాబాద్ నగరాల మధ్య సహకార కార్యక్రమాలకు పునాది వేసే సమగ్ర ప్రతిపాదనను బోర్డో మెట్రోపోల్ సిద్ధం చేయనుంది.

# ఎన్నికల విధుల్లో పోలీసులకు ప్రత్యేక శిక్షణ

- శాంతియుత నిర్వహణే లక్ష్యం
- డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్ మార్గదర్శనం



**కోస్గి, డిసెంబర్ 4 (మనసులో మాట):**

నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, జిల్లా పరిధిలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా నిర్వహించేందుకు విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బందికి కోస్గిలోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి డీఎస్పీ నల్లపు లింగయ్య, డీసీఆర్బీ డీఎస్పీ మహేష్ లు మార్గదర్శకులుగా హాజరయ్యారు. ఎన్నికల సమయంలో పోలీసులు తప్పనిసరిగా పాటించాల్సిన చట్టపరమైన నిబంధనలు, ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మరియు ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) పై పోలీసు సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉంటూ, రాజకీయ పార్టీలతో పక్షపాతం లేకుండా, చట్టపరంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, అక్రమంగా డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ, ఓటర్లకు బెదిరింపులు వంటి సంఘటనలు గమనిస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లకు పూర్తి రక్షణ, భద్రత సహకారం అందిస్తూ, శాంతి భద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. ఎటువంటి రాజకీయ పార్టీల ఒత్తిళ్లకు లోనుకాకుండా, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. ఓటు వేసే ప్రదేశాల్లో 163 బీఎన్ఎస్ఎస్ (144 ఐపీఎస్) సెక్షన్, డ్రై డే అమలు, ప్రత్యేక నిబంధనలు, మహిళా భద్రత వంటి అంశాలపై వివరించారు. సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచాలని, ఎలాంటి గొడవలు జరిగే ఆస్కారం ఉన్నా లేదా గొడవలు జరుగుతున్నా వెంటనే పై అధికారులకు నివేదించాలని సూచించారు. పోలీసులు చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించిన వెంటనే కేసులు నమోదు చేయాలని, పోలింగ్ స్టేషన్ల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ప్రచార నిషేధం అమలు చేయాలని, గుంపులు గుంపులుగా ఉండకుండా చూడాలని తెలిపారు. ఓటర్లపై ఒత్తిడి, ప్రలోభాలకు అవకాశమివ్వకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ఎటువంటి వివాదాలు తలెత్తినా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల్లో తగిన శ్రద్ధ, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని, యూనిఫాంను సరిగ్గా ధరించాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కోస్గి సీఐ సైదులు, కోస్గి ఎస్సై బాలరాజు, మద్దూరు ఎస్సై విజయ్ కుమార్, ఎస్సై ఆంజనేయులుతో పాటు సర్కిల్ పరిధిలోని పోలీసు కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.



## ఖమ్మంలో గంజాయి కేసుల్లో
# కఠిన శిక్షలు

**ఇద్దరికి 20 ఏళ్లు, మరో ఇద్దరికి 10 ఏళ్ల జైలు**

**నిందితులకు జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధింపు**

**ఖమ్మం, డిసెంబర్ 4 (మనసులో మాట):**

ఖమ్మం జిల్లాలో గంజాయి అక్రమ రవాణా కేసుల్లో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి గురువారం కీలక తీర్పును వెలువరించారు. రెండు వేర్వేరు కేసుల్లో నలుగురు గంజాయి నిందితులకు మొత్తం 20 మరియు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ లక్ష రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే, మొదటి కేసులో... ఖమ్మం పట్టణం వరంగల్ క్రాస్ రోడ్డులో రాజస్థాన్‌కు చెందిన బాగ్ చంద్ బైర్వా (31) అనే నిందితుడు 2024 జనవరి 9న 22.150 కిలోల గంజాయిని తరలిస్తుండగా, డిప్యూటీ టాస్క్ ఫోర్స్ (డీటీఎఫ్) సీఐ విజేందర్ నేతృత్వంలోని బృందం పట్టుకుంది. ఈ ఘటనపై ఖమ్మం పట్టణ ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్సై సందీప్‌రావు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ అధికారులు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రమోహన్, సరితలు పూర్తి విచారణ జరిపి ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో న్యాయమూర్తి ఉమాదేవి నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

**మరో కేసులో ఇద్దరికి పదేళ్ల శిక్ష**

ఇక రెండో కేసులో... ఖమ్మం పట్టణం కొత్త బస్టాండ్ సమీపంలో మోటార్‌సైకిల్‌పై 7 కిలోల గంజాయిని సూర్యాపేటకు తరలిస్తున్న నలుగురిని 2022 ఏప్రిల్ 10న ఎక్సైజ్ అధికారులు వేణుగోపాల్, సీఐ రాజు పట్టుకున్నారు. ఈ కేసులో నిందితులు కానుకుర్తి సాయి నవీన్ మరియు నేరేళ్ల శ్రీరాములు అనే ఇద్దరికి ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి పది సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. అయితే, ఈ కేసులో మారుశ్వర్‌రావు, బట్టు హరీష్‌లు మాత్రం ఇప్పటికీ పరారీలో ఉన్నారు. రెండు కేసుల్లోనూ కఠిన శిక్షలు పడటం పట్ల ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ హర్షం వ్యక్తం చేసి, కేసులో పనిచేసిన సిబ్బందిని అభినందించారు.

# వరి కొనుగోలు వివరాలను 'స్థానిక యాప్'లో నమోదు చేయాలి

**కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**సమయానుసారం, ఖచ్చితమైన వివరాల నమోదు తప్పనిసరి**

**అధికారులకు కలెక్టర్ ఆదేశం**





**కామారెడ్డి, డిసెంబర్ 4 (మనసులో మాట):**

వరి కొనుగోలు ప్రక్రియలో భాగంగా స్థానిక యాప్‌లో (లోకల్ యాప్) వివరాల నమోదు (ఎంట్రీ) పై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ విక్టర్, గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి (డీఆర్‌డీఓ) సురేందర్, పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మేనేజర్ (డీఎం) శ్రీకాంత్, అదనపు గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి (సెర్ప్), జిల్లా కార్యక్రమ నిర్వాహకులు (డీపీఎం), సహాయక కార్యక్రమ నిర్వాహకులు (ఏపీఎం), మండల సమన్వయకర్తలు (సీసీ) తదితర అధికారులు హాజరయ్యారు. సమావేశంలో జిల్లాలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల (ఐకేపీ, పీఏసీఎస్) పనితీరును, ముఖ్యంగా స్థానిక యాప్‌లో జరుగుతున్న ట్యాబ్ నమోదుల పురోగతిని కలెక్టర్ కేంద్రాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా స్థానిక యాప్‌లో నమోదులు నూరు శాతం కంటే ఎక్కువగా లేదా యాభై శాతం కంటే తక్కువగా ఉన్న మండలాల సహాయక కార్యక్రమ నిర్వాహకులు (ఏపీఎం), మండల సమన్వయకర్తలను (సీసీ) కలెక్టర్ వివరాలు అడిగారు. అదే విధంగా, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారా కూడా స్థానిక యాప్‌లో నమోదులు నూరు శాతం కంటే ఎక్కువగా లేదా యాభై శాతం కంటే తక్కువగా ఉన్న ప్రాంతాల పర్యవేక్షణ అధికారులు, పీఏసీఎస్ కార్యదర్శుల నుండి కూడా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు ట్యాబ్ నమోదులను స్థానిక యాప్‌లో ఎప్పటికప్పుడు, ఖచ్చితంగా, సమయానుసారం అప్‌డేట్ చేయాలని సూచించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి ఆలస్యం జరగకుండా అన్ని విభాగాలు సమన్వయం పాటించాలని ఆదేశించారు. ఖచ్చితంగా నమోదులు జరగాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## మహనీయుల జీవితం
# మనందరికీ ఆదర్శనీయం

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం, డిసెంబర్ 4 : ( సమయం న్యూస్ )**

మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. కొణిజెటి రోశయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక, రవాణ, గృహ నిర్మాణం, వాణిజ్య పన్నుల, విద్య, వైద్య శాఖ మంత్రిగా సేవలు అందించారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొంత కాలం సేవలు అందించారని, అలాగే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్ గా పనిచేసారని తెలిపారు. మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, తహసిల్దార్ లు, ఎఫ్ఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులతో కలిసి
# సేవా కార్యక్రమం



**గజ్వేల్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

బీజేపీ నాయకులు నాయిని సందీప్ కుమార్ ఈరోజు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులతో కలిసి శ్రమదానం చేశారు. పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలలో పాల్గొని, వారి కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయిని సందీప్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం, ఆనందానికి ప్రధాన కారణం వీధులు శుభ్రంగా ఉండటమేనని, దీనికి పారిశుధ్య కార్మికులు చేస్తున్న కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. వారి సేవలు లేకపోతే ప్రజల ఆరోగ్యం కుంటుపడుతుందన్నారు. ముఖ్యంగా 12వ వార్డులో యాదగిరి, సైదమ్మ అనే పారిశుధ్య కార్మికులు అందరితో కలివిడిగా ఉంటూ, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా వీధులను నిత్యం పరిశుభ్రంగా ఉంచుతున్నారని ప్రశంసించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే సగం రోగాలు దరిచేరవనే విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో, నాయిని సందీప్ స్వయంగా వారితో కలిసి కాసేపు మోరీలను శుభ్రం చేస్తూ, గడ్డిని తొలగించారు. పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న సందీప్, వాటిని పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. వారి సేవకు గుర్తింపుగా, కనీస సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తామని తెలిపారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపు

- వైజ్ఞానిక ప్రదర్శనలు అభినందనీయం
- పుస్తకాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

విద్యార్థుల్లో సృజనాత్మకత, వైజ్ఞానిక పరిజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో జిల్లాస్థాయి 'ఇన్స్పైర్-సైన్స్ ఫెయిర్' కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారులు గురువారం స్థానిక వెస్లీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా విద్యాధికారి విజయ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థిని విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు.



**సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ... విద్యార్థులు ఎంచుకున్న థీమ్‌లు, సబ్-థీమ్‌లు ప్రస్తుత కాలానికి, దేశానికి అవసరమైనవిగా ఉన్నాయని ప్రశంసించారు. విద్యార్థులు కేవలం సైన్స్ చదవడం కాకుండా, ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని తమ జ్ఞానాన్ని ఇంకా పెంపొందించుకోవాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్ల ద్వారా అందుబాటులో ఉన్న ఏఐ యాప్స్ (ఉదాహరణకు: ను సరైన సూచనలు ఇచ్చి సమాచారాన్ని పొందేందుకు ఉపయోగించుకోవాలని, తద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకొని మంచి భవిష్యత్తును పొందాలని ఆయన సూచించారు. అలాగే, పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని పాఠశాల విద్యార్థులందరికీ కోర్స్ మెటీరియల్ పొందే అవకాశం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు తమ వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఉపాధ్యాయుల సహకారంతో ఈ సంస్థలకు సంబంధించిన బోధన వీడియోలను వీక్షించాలని, కాలాన్ని వృథా చేయకుండా స్మార్ట్‌ఫోన్‌ను మంచి పనులకు వినియోగించాలని కలెక్టర్ అన్నారు.

**475 ప్రాజెక్టుల ప్రదర్శన**

సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ రాహుల్ రాజ్, విద్యాశాఖ అధికారులను ప్రశంసించారు. అనంతరం ప్రదర్శన గదులలోని ప్రాజెక్టులను ప్రారంభించి వీక్షించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు, పరికరాలను పరిశీలించి, వారిని అభినందించి, పలు విషయాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మొత్తం 425 సైన్స్ ఫెయిర్ మరియు 50 ఇన్స్పైర్ ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయ మాట్లాడుతూ... విద్యార్థులు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, తమ తమ అభిరుచి, ఆసక్తికి అనుగుణంగా కోర్సులు ఎంచుకొని జీవితంలో రాణించాలని సూచించారు. ఇందుకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని ఆమె అన్నారు.

# వలస కార్మికుల పిల్లల చదువును ప్రోత్సహిస్తాం

- ఇటుక బట్టీల వద్ద ఉంటున్న పిల్లలను బడిలో చేర్పించండి
- పోషకాహారం, వైద్యం అందజేస్తాం
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

జిల్లాలోని వలస కార్మికుల పిల్లల చదువును ప్రోత్సహిస్తామని, ఇందుకోసం జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో వారికి ప్రత్యేక తరగతి గదులను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. గంగాధర మండలం గట్టుభూత్కూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వలస కార్మికుల పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తరగతి గదిని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఇక్కడ 42 మంది వలస కార్మికుల పిల్లలని గుర్తించి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఈ సందర్భంగా తరగతి గదిలోని చిన్నారులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వివిధ భాషల్లో పలుకరించి చదువు, స్వస్థలం, కుటుంబ సభ్యుల వివరాల వంటివి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వలస కార్మికుల పిల్లలందరినీ గుర్తించి వారికి సమీప పాఠశాలల్లో ప్రత్యేక తరగతి గదిలో విద్యా బోధన చేస్తున్నామని తెలిపారు. గత ఏడాది సుమారు 500 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్చి చదువు చెప్పించామని అన్నారు. ఈ సంవత్సరం కూడా మరిన్ని పాఠశాలల్లో ఈ పిల్లల కోసం ప్రత్యేక తరగతి గదులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలకు వచ్చే పిల్లలందరికీ మధ్యాహ్న భోజనం, పోషకాహారం అందిస్తామని తెలిపారు. ప్రత్యేక మెడికల్ క్యాంపు ల ద్వారా వారి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తామని అన్నారు. వలస కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసే పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇటుక బట్టీల యజమానులతో మాట్లాడి పాఠశాల వరకు రవాణా సదుపాయం ఉండేలా చూడాలని సూచించారు. కార్మికుల పిల్లలు వివిధ రాష్ట్రాల నుండి వస్తున్నందున వారికి ఇంగ్లీషులో బోధన చేయాలని సూచించారు. గణితం ఇంగ్లీషు సబ్జెక్టులను ముఖ్యంగా బోధించాలని విద్యా వాలంటీర్లను ఆదేశించారు. దీనివల్ల వారు భవిష్యత్తులో ఏ రాష్ట్రానికి వెళ్లినా ఉపయోగపడుతుందని అన్నారు. కార్మికుల పిల్లలకు అవసరమైన యూనిఫాం, పుస్తకాలు, నోట్ బుక్కులు వంటివి అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**పూర్వ ప్రాథమిక పాఠశాల సందర్శన**

విద్యాశాఖ ఆధ్వర్యంలో గట్టుబూత్కూరు మండల ప్రాథమిక పాఠశాలలోని పూర్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఇక్కడ పూర్వ ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న పిల్లలతో మమేకమయ్యారు. ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని, ఇందుకోసం ప్రభుత్వం నుండి వచ్చిన అన్ని ఆట వస్తువులను, పుస్తకాలను వినియోగించాలని సూచించారు. పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచాలని అన్నారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ రజిత, మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు తదితరులు ఉన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ఎస్ఎస్టీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**సిద్దిపేట, డిసెంబర్ 4 (మనసులో మాట):**

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీమతి కె. హైమావతి చేర్యాల మండలం పరిధిలో, జాతీయ రహదారి వెంబడి ఉన్న ముస్యాల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక నిఘా బృందం (ఎస్ఎస్టీ) శిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వాహనాల పరిశీలన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి పలు ముఖ్య ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ గారు శిబిరంలోని రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. రిజిస్టర్ ప్రకారం వాహనం వచ్చిన సమయాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని, విధులను పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. వాహనాల తనిఖీకి సంబంధించిన వీడియోలను కూడా ఆమె కెమెరాలో పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇరవై నాలుగు గంటలూ, వారంలో ఏడు రోజులూ (24/7) ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఈ తనిఖీ మొత్తాన్ని వీడియో గ్రఫీ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాలని సిబ్బందిని కలెక్టర్ గారు ఆదేశించారు.

# జాతీయ కరాటే పోటీల్లో మెరిసిన కోటా కాలేజీ విద్యార్థిని రిషిక

**కుమితేలో వెండి, కటాలో కాంస్యం సాధించి కరీంనగర్‌కు కీర్తి**

**కరీంనగర్, డిసెంబర్ 4 (మనసులో మాట):**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నవంబర్ 27 నుంచి 30 వరకు ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కరీంనగర్ కోటా కాలేజీ విద్యార్థిని కె. రిషిక అద్భుత ప్రతిభ కనబరిచింది. జూనియర్స్ 16%-%18 ఏళ్ల విభాగంలో జరిగిన కుమితే (ఫైట్) స్పర్ధలో రిషిక ద్వితీయ స్థానం సాధించి వెండి పతకం గెలుచుకుంది. అలాగే కటా విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. రిషిక ప్రదర్శన పట్ల కాలేజ్ నిర్వాహకులు అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ, కఠిన సాధన, కోచ్‌ల మార్గదర్శకాలే ఆమె విజయానికి ప్రధాన కారణాలని పేర్కొన్నారు. వరుసగా జాతీయ స్థాయిలో రాణించడం రిషిక భవిష్యత్తు క్రీడా ప్రస్థానానికి దోహదపడుతుందని వారు తెలిపారు. గురువారం నిర్వహించిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో కోటా జూనియర్ కళాశాలల చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి మాట్లాడుతూ, "జాతీయ స్థాయి వేదికపై మా విద్యార్థిని రిషిక ఇంత కీలకమైన విజయాన్ని సాధించడం ఎంతో గర్వకారణం" అని అన్నారు. కోటా రెసొనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ తమ సామర్థ్యాన్ని రుజువు చేస్తున్నారని ప్రశంసించారు. రిషికలాంటి ప్రతిభావంతుల కోసం అవసరమైన అన్ని సదు-పాయాలు, శిక్షణ కాలేజీ తరఫున అందిస్తూనే ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. డాక్టర్ అంజిరెడ్డి రిషికను శాలువాతో సన్మానించి, తదుపరి పోటీలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాళ్లు, ఉపన్యాసకులు, క్రీడా విభాగాధికారులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి జంబూరిలో పారమిత విద్యార్థుల ప్రతిభ

**స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు మెరిట్ సర్టిఫికేట్స్ ప్రధానం**



**కరీంనగర్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో నిర్వహించిన 19వ జాతీయ స్థాయి జంబూరి క్యాంపులో పాల్గొని ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. నవంబర్ 23 నుంచి 29 వరకు లక్నోలో "వికసిత్ యువ – వికసిత్ భారత్" అనే నినాదంతో ఈ జంబూరి క్యాంపు జరిగింది. కరీంనగర్ జిల్లా నుంచి 18 మంది విద్యార్థులు ఎంపిక కాగా, పారమిత పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు గైడ్ కెప్టెన్ రజిత ఆధ్వర్యంలో ఈ క్యాంపుకు హాజరయ్యారు. వారం రోజులపాటు నిర్వహించిన ఈ క్యాంపులో విద్యార్థులు మార్చ్ ఫాస్ట్, జానపద నృత్యాలు, బి. పి. ఎక్సర్‌సైజ్, క్యాంప్ క్రాఫ్ట్, రంగవల్లి, డ్రాయింగ్, శారీరక సామర్థ్య పరీక్షలు వంటి పలు పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో పాల్గొని విజయాలు సాధించిన విద్యార్థులకు పాఠశాలలో జరిగిన అభినందన సభలో పాఠశాల అధినేత డాక్టర్ ఇ. ప్రసాదరావు మెరిట్ సర్టిఫికెట్స్‌ను ప్రధానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనుకర్ రావు, వినోద రావు, వి. యు. ఎం ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజి, కవిత, సమన్వయ కర్త శ్రీనాథ్, గైడ్ కెప్టెన్ రజిత, ఉపాధ్యాయులు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను అభినందించారు.

# కాటారం పోలీస్ స్టేషన్ తనిఖీ

**ఎన్నికల సమయంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచన**



**కాటారం, డిసెంబర్ 4 (మనసులో మాట):**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల సమయంలో పాటించవలసిన జాగ్రత్తలు తగిన సూచనలు చేశారు. సిబ్బంది అందరూ బాధ్యతాయ-ుతంగా విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా సూచించారు. ముఖ్యంగా భద్రత శాంతిభద్రతల నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జున రావు, కాటారం ఎస్సై శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జీవో 27పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టొద్దు
- సీపీఎం డిమాండ్



**హైదరాబాద్: డిసెంబర్ 4 (మనసులో మాట):**

హైదరాబాద్ నగరంలోని 22 పారిశ్రామిక కేంద్రాల నుండి పరిశ్రమలను నగరం బయటికి తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 27 పై తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్షల కోట్ల రూపాయల విలువైన సుమారు 9300 ఎకరాల భూమిని అతి తక్కువ ధరలకే పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టడం వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కన్వర్షన్ ప్రక్రియ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి దారి తీస్తుందని, ఇది లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తిని దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. ఈ వ్యవహారం 'హిల్ట్' కుంభకోణంలా మారే పరిస్థితి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ భూములను ప్రజల సౌకర్యాల కోసం, ఇంటి స్థలాలు, క్రీడా స్థలాలు, పాఠశాలలు, వసతి గృహాల నిర్మాణాల కోసం కేటాయించాలని ఆయన సూచించారు. వేలాది ఎకరాలు, లక్షల కోట్లకు సంబంధించిన ఇంతటి ముఖ్యమైన అంశంపై తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, శాసనసభలో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని సీపీఎం కోరింది. 'కాలుష్యాన్ని సృష్టించే పరిశ్రమలను మాత్రమే తరలించాలి తప్ప, మిగిలిన పరిశ్రమలను ఎందుకు తరలిస్తున్నారు? పరిశ్రమలను తరలిస్తే అందులోని కార్మికుల పరిస్థితి, భద్రత ఏమిటి? వారికి అక్కడ నివాసం, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు ఎలా కల్పిస్తారు? పరిశ్రమలను బయటికి తరలిస్తే, నగరంలోని ఈ విలువైన భూములను పారిశ్రామికవేత్తలకే మార్కెట్ ధరకు కాకుండా, అతి తక్కువ ధరకే ఎందుకు ఇవ్వాలి? ప్రభుత్వం కేటాయించిన భూముల్లో మూతపడిన పరిశ్రమలు ఎన్ని? ఆ భూములను ప్రభుత్వం ఎందుకు స్వాధీనం చేసుకోలేదు?' అని ప్రశ్నించారు. గతంలో ఏ ప్రభుత్వం (బీఆర్ఎస్ లేదా బీజేపీ లేదా కాంగ్రెస్) చేసినా సరే, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలి తప్ప, పారిశ్రామికవేత్తలకో, రాజకీయ నాయకులకో అప్పగించే పద్ధతులను పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది అని జాన్ వెస్లీ స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ సమస్యలన్నింటిపై నిర్దిష్టమైన వివరాలు ప్రజలముందు ఉంచాలని, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఆయన కోరారు. విలువైన భూములను ధారాదత్తం చేసి, లక్షల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఆందోళనకు పూనుకుంటామని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఈ సందర్భంగా హెచ్చరించింది.

# కిడ్నాప్‌నకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

**సర్పంచ్ అభ్యర్థి భర్తను కిడ్నాప్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్**

**దండేపల్లి, డిసెంబర్ 4 (మనసులో మాట):**

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్మమర్రు గ్రామం పంచాయతీ పరిధిలో సర్పంచ్ అభ్యర్థి భర్తను కిడ్నాప్ చేసి పంపించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని దండేపల్లి గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం అధ్యక్షుడు అల్లంల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దండేపల్లి ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ, సర్పంచ్ అభ్యర్థి భర్త యాదగిరి యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావటం వల్లే మంత్రి అనుచరులైన బోడ్డ వెంకటరెడ్డి, ఉట్కూరి సందిరెడ్డి కిడ్నాప్ చేసి, నామినేషన్ ఉపసంహరించుకోవాలని బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అనుకూలంగా ఉన్నట్లు నటిస్తూ, బీసీలు నామినేషన్ వేయకుండా భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆయన మండిపడ్డారు. ధర్మస్థానానికి పాలుపడిన సర్పంచ్ అభ్యర్థి సందిరెడ్డిని రాష్ట్ర ఎన్నికల సంఘం తొలగించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు చౌదరి గంగయ్య, చెన్నవేని భాను ప్రసాద్, అరిగెల సురేష్, రాంపల్లి మహేష్, అరిగెల సత్యనారాయణలు పాల్గొన్నారు.




# జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు ఎంపిక

**క్రీడల వల్ల విద్యార్థులకు చాలా లాభాలు: డాక్టర్ వి. నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

క్రీడల ద్వారా విద్యార్థులకు చాలా ఉపయోగాలు ఉంటాయని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలోని శక్తివంతమైన క్రీడలలో బాస్కెట్‌బాల్ ఒకటి అని, విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించాలని చెప్పారు. పాఠశాల స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహించే పోటీలకు విద్యార్థులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు కావలసిన వనరులు సైతం కల్పించి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నామని అన్నారు. ఇటీవల కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో పాఠశాలకు చెందిన బి. సిద్ధార్థ (10వ తరగతి), ముక్తహసిని (9వ తరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా గొప్ప విషయం అని ఆయన కొనియాడారు. జాతీయ స్థాయి పోటీలలో కూడా విశేష ప్రతిభ కనబరచాలని ఆకాంక్షిస్తూ, వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రత

**సీపీ గౌస్ ఆలం పర్యవేక్షణ**

**నామినేషన్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ ప్రాంతాల వద్ద ఏర్పాట్ల పరిశీలన**

**హుజురాబాద్, డిసెంబర్ 4 (మనసులో మాట):**

కరీంనగర్ జిల్లాలో మూడు దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా, మూడవ విడత నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను సీపీ గురువారం స్వయంగా పర్యవేక్షించారు.

**భద్రతా ఏర్పాట్లు**

మూడవ విడత ఎన్నికలు జరగనున్న వీణవంక, జమ్మికుంట, హుజురాబాద్, ఇల్లందుకుంట, సైదాపూర్ మండలాల్లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ గౌష్ ఆలం తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు ఏర్పాట్లను ఆయన తనిఖీ చేశారు.

**సమస్యాత్మక కేంద్రాల పరిశీలన**

ఎన్నికలు సజావుగా సాగేందుకు వీలుగా, సీపీ పలు సమస్యాత్మక (ట్రబుల్ స్పాట్స్) పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. వీణవంక మండలంలోని చల్లూరు, మామిడాలపల్లిబీ జమ్మికుంట పరిధిలోని జగ్గయ్యపేట, వల్భాపూర్‌బీ ఇల్లందుకుంట మండలంలోని నాగంపేట, టేకుర్తిబీ హుజురాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి, చిన్నపాపయ్యపల్లి వంటి గ్రామాలలో ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ రోజు ఈ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించి, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

**రౌడీషీటర్లకు హెచ్చరిక**

శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తప్పవని సీపీ గౌష్ ఆలం హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో పలువురు రౌడీషీటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఆయన హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల్లో ఎటువంటి శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎన్నికల నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి వచ్చినందున, గతంలో నేర చరిత్ర ఉన్న ఎన్నికల నేరస్థులను బైండోవర్ చేస్తున్నట్లు సీపీ తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పర్యవేక్షణలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, కరుణాకర్, రామకృష్ణ, ఎస్సైలు ఆవుల తిరుపతి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

# పర్యావరణ సమతుల్యతకు చిత్తడి నేలలు కీలకం

- సర్వే చేసి గుర్తించండి
- జిల్లా అటవీ శాఖ అధికారి లిఖిత ఆధ్వర్యంలో అంతర్ శాఖల సమావేశం



**కామారెడ్డి: డిసెంబర్ 4 (మనసులో మాట):**

జిల్లాలో ఉన్న చిత్తడి నేలల (వెట్‌ల్యాండ్స్) గుర్తింపు, సంరక్షణ చర్యలపై జిల్లా అటవీ శాఖ అధికారి లిఖిత గురువారం మినీ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంతర్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారి లిఖిత కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా చిత్తడి నేలలు గుర్తించడం, భూ సర్వే చేయించడం, ప్రాథమిక ప్రకటన పత్రాన్ని (డ్రాఫ్ట్ నోటిఫికేషన్) సిద్ధం చేయడం వంటి అంశాలపై చర్చించారు. జిల్లాలోని అన్ని మండలాలలో ఉన్న సహజ, కృత్రిమ చెరువులు, కుంటలు, జలాశయాలు వంటి ప్రాంతాలను చిత్తడి నేలల ప్రమాణాల ప్రకారం గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, అరణ్య, నీటిపారుదల, ఫిషరీస్ శాఖల సంయుక్త బృందం ద్వారా స్థల పరిశీలన (ఫీల్డ్ వెరిఫికేషన్)ను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రతి చిత్తడి నేలకు సంబంధించిన సరిహద్దులు, పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్), భూమి రికార్డులు, జీవవైవిధ్యం, నీటి ప్రవాహ మార్గాలు వంటి వివరాలను రూపొందించి, భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) మ్యాపింగ్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. సర్వే వివరాల ఆధారంగా జిల్లా స్థాయిలో చిత్తడి నేలలకు సంబంధించిన ప్రాథమిక ప్రకటన పత్రాన్ని సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని అధికారులకు సూచించారు. చిత్తడి నేలల ప్రాంతాలలో అనధికార నిర్మాణాలు, చెత్త పారవేయడం, కాలువ మూసివేత, పూడిక (సిల్టింగ్), వ్యర్థ జలాల ప్రవాహం వంటి కార్యకలాపాలను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించారు. "చిత్తడి నేలలు మన పర్యావరణ సమతుల్యతకు కీలకం. వాటి రక్షణ, పునరుద్ధరణ ప్రతి శాఖ బాధ్యత. జిల్లా స్థాయిలో ఈ నేలలను శాస్త్రీయంగా డాక్యుమెంట్ చేయడం అత్యవసరం" అని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని శాఖలు పారదర్శకంగా, సమయపాలనతో సమాచారాన్ని అందించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మదన్ మోహన్, ఎఫ్‌డీఓ రామకృష్ణ, సునీత, అటవీ క్షేత్ర అధికారులు రమేష్, హబీబుద్దీన్ ఇతర నీటిపారుదల, మత్స్య శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక


# దక్షిణాఫ్రికాపై కోహ్లీ ఆధిపత్యం..



భారత క్రికెట్ 'రన్ మెషిన్' విరాట్ కోహ్లీ మరోసారి మైదానంలో తన ఆధిపత్యాన్ని చాటుతున్నాడు. దక్షిణాఫ్రికాతో రాయ్‌పూర్‌లో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో కోహ్లీ అద్భుతమైన 102 పరుగులు చేసి తన అంతర్జాతీయ కెరీర్‌లో 84వ శతకం సాధించాడు. ఈ సిరీస్‌లో అతని ఫామ్ అద్భుతంగా ఉంది, ఎందుకంటే మొదటి మ్యాచ్ తర్వాత వం-సగా రెండో మ్యాచ్‌లోనూ అతని బ్యాట్ నుంచి సెంచరీ వచ్చింది. ఈ సెంచరీతో కోహ్లీ వన్డే క్రికెట్‌లో మొత్తం 53 సెంచరీలు పూర్తి చేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ప్రారంభ వైఫల్యం తర్వాత విరాట్ కోహ్లీ అద్భుతంగా పుంజుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న సిరీస్‌లో అతని బ్యాట్ ఫైర్ మీద ఉంది. రాయ్‌పూర్‌లో చేసిన 102 పరుగుల సెంచరీతో ఇప్పుడు ఆఫ్రికన్ జట్టుపై అతని వన్డే సెంచరీల సంఖ్య 7కి చేరుకుంది. ఈ ప్రదర్శనతో కోహ్లీ 2027 వన్డే ప్రపంచ కప్‌లో భారత్ కోసం కీలక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నాడని స్పష్టంగా తెలుస్తోంది. వన్డే ఫార్మాట్‌లో సెంచరీల రికార్డులో విరాట్ కోహ్లీ ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్నాడు. గణాంకాలను పరిశీలిస్తే, కోహ్లీకి శ్రీలంక బౌలర్లు బాగా నచ్చారు. అతను శ్రీలంకతో ఆడిన 56 మ్యాచ్‌లలో 54 ఇన్నింగ్స్‌లలో అత్యధికంగా 10 సెంచరీలు సాధించాడు. ఆ తర్వాత వెస్టిండీస్ ఉంది, దీనిపై కోహ్లీ 43 మ్యాచ్‌ల్లో 9 సెంచరీలు నమోదు చేశాడు. వన్డే సెంచరీలలో సచిన్ టెండూల్కర్ (49) రెండో స్థానంలో, రోహిత్ శర్మ (33) మూడో స్థానంలో ఉన్నారు. రాయ్‌పూర్‌లో 102 పరుగులు చేసి అవుటైన కోహ్లీకి ఇప్పుడు విశాఖపట్నంలో జరిగే మూడో వన్డేలో చరిత్ర సృష్టించే సువర్ణావకాశం ఉంది. అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్‌లలో (టెస్ట్, వన్డే, టీ20) కలిపి 28,000 పరుగులు పూర్తి చేయడానికి కోహ్లీకి ఇప్పుడు కేవలం 90 పరుగులు మాత్రమే అవసరం. మూడో మ్యాచ్‌లో ఈ పరుగులు చేస్తే సచిన్ టెండూల్కర్, కుమార సంగక్కర తర్వాత ఈ ఘనత సాధించిన ప్రపంచ మూడో బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడు. దక్షిణాఫ్రికాపై 33 వన్డేల్లో, విరాట్ కోహ్లీ 31 ఇన్నింగ్స్‌లలో 1741 పరుగులు చేశాడు, 50ం పరుగుల 15 సార్లు సాధించాడు, ఇది ప్రోటీస్‌పై ఏ భారతీయ బ్యాట్స్‌మన్ చేసిన అత్యధిక స్కోరు. రాయ్‌పూర్‌లో తన సెంచరీతో, విరాట్ కోహ్లీ ఇప్పుడు 34 వేర్వేరు వేదికల్లో వన్డే సెంచరీలు సాధించాడు, వివిధ మైదానాల్లో అత్యధిక సెంచరీలు చేసిన టెండూల్కర్ రికార్డును సమం చేశాడు.



## అనుష్క మద్దతుకు నెటిజన్లు ఫిదా

దక్షిణాఫ్రికాతో రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఓటమి పాలైనప్పటికీ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన అద్భుత శతకంతో అభిమానులను అలరించాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ సెంచరీ సాధించిన వెంటనే ఆయన భార్య, బాలీవుడ్ నటి అనుష్క శర్మ సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. విరాట్ కోహ్లీ తన 53వ వన్డే శతకాన్ని (ఓవరాల్‌గా 86వ అంతర్జాతీయ సెంచరీ) పూర్తి చేసుకున్న కాసేపటికే, అనుష్క శర్మ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక ప్రత్యేక పోస్ట్ పెట్టారు. మైదానంలో విరాట్ కోహ్లీ బ్యాట్ పైకెత్తి ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న ఫోటోను షేర్ చేసిన ఆమె, దానికి 'హార్ట్' , 'చప్పట్లు' ఎమోజీలను జత చేశారు. ఎలాంటి రాతపూర్వక క్యాప్షన్ లేకపోయినా, ఈ ఎమోజీలతోనే ఆమె తన భర్త ప్రదర్శన పట్ల ఎంత గర్వంగా ఉందో తెలియజేశారు. ప్రస్తుతం ఈ స్క్రీన్ షాట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ (102), రుతురాజ్ గైక్వాడ్ (105) సెంచరీలతో చెలరేగడంతో భారత్ 358 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే, బౌలర్ల వైఫల్యం కారణంగా దక్షిణాఫ్రికా ఈ లక్ష్యాన్ని ఛేదించి 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జట్టు ఓడిపోయినప్పటికీ, కోహ్లీ పోరాటపటిమకు, అనుష్క మద్దతుకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. గత ఆదివారం రాంచీలో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో, డిసెంబర్ 6, శనివారం విశాఖపట్నంలో జరగనున్న మూడవ, చివరి మ్యాచ్ సిరీస్ విజేతను నిర్ణయించనుంది. సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ తన 52వ శతకాన్ని సాధించి, భారత్‌ను 349/8 స్కోరుకు చేర్చడంతో అతనికి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఆ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తమ ఇన్నింగ్స్‌లోని 50వ ఓవర్లో 332 పరుగులకు ఆలౌట్ అయింది. ఇదిలా ఉండగా, డిసెంబర్ 11న తమ 8వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్న అనుష్క, విరాట్ లండన్‌కు మకాం మార్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ జంట డిసెంబర్ 2017లో ఇటలీలో అంగరంగ వైభవంగా వివాహం చేసుకున్నారు. వీరికి 2021లో కుమార్తె 'వామిక', 2024 ఫిబ్రవరిలో రెండవ సంతానంగా కుమారుడు 'అకాయ్' జన్మించిన సంగతి తెలిసిందే.

## ఆసీస్ గడ్డపై రూట్ సెంచరీ




2025 యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా- ఇంగ్లాండ్ మధ్య రెండో టెస్టులో తొలి రోజు ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో తొలుత బ్యాటింగ్ చేస్తున్న ఇంగ్లాండ్ 325-9 స్కోర్‌తో ఉంది. క్రీజులో జో రూట్ (135 పరుగులు), జోఫ్రా ఆర్చర్ (32 పరుగులు) ఉన్నారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 6, మిచెల్ నజీర్, స్కాట్ బొలాండ్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో రూట్ బ్యాటింగే హైలైట్. తన టెస్టు కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ సాధించాడు. ఆస్ట్రేలియాలో రూట్ శతకం నమోదు చేసేందుకు 30 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు. అలాగే రూట్ కెరీర్‌లో ఇది 40వ టెస్టు సెంచరీ కావడం విశేషం. కెరీర్‌లో లోటుగా మారిన ఈ సెంచరీని సాధించేందుకు జోరూట్‌కు తాజా పర్యటనలో మూడు ఇన్నింగ్స్‌ల సమయం పట్టింది. తొలి టెస్ట్‌లో దారుణంగా విఫలమైన జోరూట్.. పింక్ బాల్ టెస్ట్‌లో తన ట్రేడ్ మార్క్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. మిచెల్ స్టార్క్ ధాటికి ఆదిలోనే బెన్ డకెట్, ఓలీ పోప్ డకౌటవ్వగా.. జాక్ క్రాలీ(76)తో కలిసి జోరూట్ జట్టును ఆదుకున్నాడు. మూడో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. జాక్ క్రాలీ వెనుదిరిగినా.. హ్యారీ బ్రూక్(31), బెన్ స్టోక్స్(19), విల్ జాక్స్(19), జోఫ్రా ఆర్చర్(32 బ్యాటింగ్)ల సాయంతో విలువైన భాగస్వామ్యాలను నెలకొల్పాడు. ఈ క్రమంలో 83 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న జోరూట్.. 181 బంతుల్లో శతకాన్ని పూర్తి చేశాడు. ఈ భారీ ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియా గడ్డపై 1000 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఇప్పటి వరకు ఆసీస్ గడ్డపై 30 ఇన్నింగ్స్‌లు ఆడిన జోరూట్ 1006 పరుగులు చేశాడు. ఇందులో తాజా సెంచరీతో పాటు 9 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో జోరూట్‌కు ఇది 22వ సెంచరీ. ఇప్పటికే ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్న జోరూట్.. తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. మరే బ్యాటర్ కూడా అతనికి దరిదాపుల్లో లేడు. డబ్ల్యూటీసీ చరిత్రలో 129 ఇన్నింగ్స్‌లు ఆడిన జోరూట్ 22 శతకాలు చేయగా.. స్టీవ్ స్మిత్ 13, మార్నస్ లబుషేన్ 11, కేన్ విలియమ్సన్ 11, శుభ్‌మన్ గిల్ 10 సెంచరీలతో తర్వాతి స్థానంలో నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక సెంచరీలు బాదిన బ్యాటర్ల జాబితాలో జోరూట్(59లి) అగ్రస్థానంలో కొనసాగతుండగా.. అలిస్టర్ కుక్(38), కెవిన్ పీటర్సన్(32), గ్రహమ్ కోచ్(28), ఆండ్రూ స్ట్రాస్(27) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలతో సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉండగా.. విరాట్ కోహ్లీ(84), రికీ పాంటింగ్(71), కుమార సంగక్కర(63), జాక్వాస్ కల్లీస్(62), జోరూట్(59లి) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. జోరూట్ సెంచరీతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 74 ఓవర్లలో 9 వికెట్లకు 325 పరుగులు చేసింది. క్రీజులో జోరూట్(135 బ్యాటింగ్), జోఫ్రా ఆర్చర్(32 బ్యాటింగ్) ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/71) ఆరు వికెట్లు తీయగా.. మైఖేల్ నెజర్, స్కాట్ బోలాండ్ తలో వికెట్ తీసారు.

## సెలెక్టర్లపై రింకూ అభిమానుల ఆగ్రహం



దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు బీసీసీఐ జట్టును ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ 15 మంది ఆటగాళ్లకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు, శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా, హార్దిక్ పాండ్యా తిరిగి జట్టులోకి వచ్చారు. రింకు సింగ్‌ను జట్టు నుంచి తొలగించడంపై చాలా మంది అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, సోషల్ మీడియాలో సెలెక్టర్లను విమర్శిస్తున్నారు. రింకు సింగ్ ఫినిషర్ పాత్ర పోషిస్తున్నాడు, అయితే అతనికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో స్థిరమైన అవకాశాలు రాలేదు. హార్దిక్ పాండ్యా గాయం కారణంగా అతను కేవలం ఆసియా కప్ ఫైనల్‌లో మాత్రమే ఆడే అవకాశం లభించింది. ఈ సంవత్సరం, రింకు ఆరు టీ20లలో ఆడాడు, వాటిలో మూడు మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేశాడు. అతనికి పరిమిత అవకాశాలు లభించినప్పటికీ, అతను చాలా మ్యాచ్‌లలో తనదైన ముద్ర వేశాడు. ఇప్పుడు, దక్షిణాఫ్రికాతో జరిగే టీ20 సిరీస్ నుంచి తొలగించడంతో, అతని అభిమానులు సెలెక్టర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వినియోగదారుడు రింకు సింగ్ టీ20 గణాంకాలను ప్రస్తావిస్తూ, అతను టీ20లలో భారతదేశపు అత్యుత్తమ ఫినిషర్ అని పేర్కొన్నాడు, అయినప్పటికీ అతన్ని తొలగించారు. మరొక వినియోగదారుడు చీఫ్ సెలెక్టర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై తమకు నచ్చిన ఆటగాళ్లను ఎంచుకున్నారని ఆరోపించారు. మరొక వినియోగదారుడు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ చివరి ఓవర్లలో వేగంగా పరుగులు చేయలేరని, సంజు శామ్‌సన్ కూడా ఫినిషర్ కాదని రాశారు. రింకు సింగ్ 35 మ్యాచ్‌లలో 25 ఇన్నింగ్స్‌లలో మొత్తం 550 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో అతని అత్యధిక స్కోరు 69లి, అతని స్ట్రైక్ రేట్ 161.76, సగటు 42.30. అతను టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో మూడు అర్ధ సెంచరీలు సాధించాడు.

## టీ20 క్రికెట్‌లో రోహిత్ రీఎంట్రీకి రెడీ



టీమిండియా టెస్టు, వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన ఈ స్టార్ బ్యాటర్, దేశవాళీ టీ20 టోర్నమెంట్ అయిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడేందుకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. రోహిత్ శర్మ తన సొంత జట్టు ముంబై తరపున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లలో ఆడేందుకు ఆసక్తి చూపించినట్లు సమాచారం. ఈ విషయాన్ని ముంబై క్రికెట్ అసోసియేషన్ వర్గాలు ధృవీకరించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ముంబై జట్టు లీగ్ దశలో అద్భుత ప్రదర్శనతో నాకౌట్‌కు చేరడం ఖాయంగా కనిపిస్తోంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లు డిసెంబర్ 12 నుంచి 18 మధ్య జరగనున్నాయి. ప్రస్తుతం రోహిత్ శర్మ దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడుతున్నారు. ఈ సిరీస్ డిసెంబర్ 6న ముగుస్తుంది. ఆ తర్వాత రోహిత్ ముంబై జట్టుకు అందుబాటులో ఉంటారు. 2024 టీ20 వరల్డ్ కప్ విజయానంతరం రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20లకు గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ టీ20 ఫార్మాట్‌లో బ్యాట్ పట్టుకునేందుకు సిద్ధమవ్వడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాబోయే ఐపీఎల్ సీజన్‌కు సన్నాహకంగా రోహిత్ ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా, హిట్ మ్యాన్ మరోసారి టీ20ల్లో మెరుపులు మెరిపించనుండటం ముంబై జట్టుకు అదనపు బలాన్ని చేకూర్చనుంది.

## డెవాల్డ్ బ్రెవిస్ బ్యాటింగ్ మైండ్ బ్లోయింగ్

**టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్**





సౌతాఫ్రికా యువ బ్యాటర్, చెన్నై సూపర్ కింగ్స్ హిట్టర్ డెవాల్డ్ బ్రెవిస్‌పై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. భారత్‌తో రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో అతని బ్యాటింగ్ అద్భుతంగా ఉందని కొనియాడాడు. ఈ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సౌతాఫ్రికా 4 వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 358 పరుగుల భారీ స్కోర్ చేసింది. విరాట్ కోహ్లీ(93 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 102), రుతురాజ్ గైక్వాడ్(83 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లతో 105) సెంచరీలతో చెలరేగగా.. కెప్టెన్ కేఎల్ రాహుల్(43 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66 నాటౌట్) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్(2/63) రెండు వికెట్లు తీయగా.. నండ్రే బర్గర్(1/43), లుంగి ఎంగిడి(1/51) చెరో వికెట్ తీసారు. అనంతరం సౌతాఫ్రికా 49.2 ఓవర్లలో 6 వికెట్లకు 362 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్ ఎయిడెన్ మార్క్‌రమ్(98 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 110) సెంచరీతో చెలరేగగా.. మాథ్యూ బ్రిట్జ్‌కే(64 బంతుల్లో 5 ఫోర్లతో 68), డెవాల్డ్ బ్రెవిస్(34 బంతుల్లో ఫోర్, 5 సిక్స్‌లతో 54) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ రెండేసి వికెట్లు తీయగా.. హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్ చెరో వికెట్ పడగొట్టారు. కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ శతకాలతో చెలరేగినా తనను డెవాల్డ్ బ్రెవిస్ బ్యాటింగ్ ఆకట్టుకుందని అశ్విన్ ట్వీట్ చేశాడు. అతని బ్యాటింగ్ బాక్సాఫీస్ హిట్ అని ఎక్స్‌వేదికగా పేర్కొన్నాడు. 'బ్రేవ్ బాల్ ఈజ్ బాక్సాఫీస్'అని ట్వీట్ చేశాడు. అతని ఫియర్‌లెస్ గేమ్ అమోఘమని, అద్భుతమైన సినిమాను చూసినట్లుందని పేర్కొన్నాడు. డెవాల్డ్ బ్రెవిస్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను తమవైపు మలుపు తిప్పాడు. 5 భారీ సిక్స్‌లతో భారత బౌలర్లకు చుక్కలు చూపించాడు.



# రష్మిక-విజయ్ డెస్టినేషన్ వెడ్డింగ్

పెళ్లి ఎప్పుడో ఇప్పుడే చెప్పలేనన్న క్యూట్ రష్మిక

టాలీవుడ్ క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ -రష్మిక మందన్న వివాహంపై గత కొన్ని రోజులుగ వాడి వేడి చర్చ నడుస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రాజస్థాన్‌లోని ఉదయపూర్ ప్యాలెస్‌లో వీరి పెళ్లి జరగనుందని ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవలే రష్మిక అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించిందన్న సమాచారం బయటకు రావడంతో ఈ రూమర్స్ మరింత వేగం పుంజుకున్నాయి. అయితే ఇప్పటి వరకు ఈ వార్తలపై ఇద్దరు నటుల తరఫున ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ నేపథ్యంలో ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో రష్మిక తన వివాహ వార్తలపై మొదటిసారి స్పందించింది. రూమర్స్‌ను ఖండించలేనని, ప్రస్తుతం మాత్రం ఏ విషయాన్నీ ధ్రువీకరించలేనని చెప్పింది. తన పెళ్లి గురించి ఎప్పుడు మాట్లాడాలో, వివరాలు ఎప్పుడు షేర్ చేసుకోవాలో అనే విషయం తనకే తెలుసని, సరైన సమయానికి అందరితో పంచుకుంటానని రష్మిక స్పష్టం చేసింది. ఇప్పుడే ఏ వివరాలూ చెప్పలేనని రష్మిక చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విజయ్?రష్మికలు ఇప్పటి వరకు ఎంగేజ్మెంట్ ఫోటో కాని, అధికారిక అనౌన్స్‌మెంట్ చేయకపోవడంతో, ఇద్దరూ ప్రత్యేకంగా ఏదో ప్లాన్ చేస్తున్నారన్న చర్చ నడుస్తోంది. ఎప్పుడు అధికారిక సమాచారం వస్తుందోనని నెటిజన్స్ ఆసక్తిగా చూస్తున్నారు. గీత గోవిందంతో హిట్ కాంబినేషన్‌గా నిలిచిన విజయ్-రష్మిక, ఆ తర్వాత డియర్ కామ్రేడ్‌లో కూడా అదే కెమిస్ట్రీని కొనసాగించారు. ప్రస్తుతం రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మరో సినిమాకు జోడీగా నటించనున్నట్టు వార్తలు వస్తున్నాయి., రీల్ లైఫ్ కపుల్‌గా ప్రారంభమైన వారి బంధం ఇప్పుడు రియల్ లైఫ్ వరకూ వెళ్తోందన్న ఊహాగానాలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. మరి దీనిపై ఎప్పుడు క్లారిటీ ఇస్తారనేది చూడాలి. ఇక రష్మిక కెరియర్ ఇప్పుడు ఫుల్ స్వింగ్‌లో ఉంది. తెలుగు, తమిళం, హిందీ భాషలలో సినిమాలు చేస్తూ సూపర్ హిట్స్ అందుకుంటుంది. నేషనల్ క్రష్ కాస్త ఇప్పుడు వరల్డ్ క్రష్‌గా మారుతుంది అంటూ ఆమె అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.



# చిత్రపరిశ్రమలో ఒడుదొడుకులు సహజం

నటి రకుల్ ప్రీత్ సింగ్ వ్యాఖ్య



చిత్రపరిశ్రమలో ఒడుదొడుకులు సహజమని నటి రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. సినిమా అన్నాక విజయాలు, అపజయాలు..నష్టాలు, లాభాలు కూడా సహజమని అన్నారు. తన భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ ఇటీవల వచ్చిన వార్తలపై ఆమె స్పందించారు. కంపెనీ మూసివేశారనే వార్తలను ఖండించారు. ఆ సమయంలో మీడియాలో వచ్చిన రూమర్స్ గురించి ప్రస్తావించారు. క్లిక్స్ కోసం ఏమైనా రాసే సంస్కృతికి అలవాటు పడ్డారు. వాస్తవానికి, ఆ వార్తలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. నాకు నిజానిజాలు అన్నీ తెలుసు కాబట్టి నేను వాటిని పట్టించుకోలేదు. పరిశ్రమలో భాగమైనప్పుడు కొన్ని విషయాల గురించి మౌనంగా ఉండడమే మంచిది. సమయం వచ్చేవరకూ ప్రజలకు అసలు నిజమేమిటనేది తెలియదు. జాకీ భగ్నానీపై వార్తలు వచ్చినప్పుడు అతడు ఎన్ని సవాళ్లు ఎదుర్కొన్నాడో నేను దగ్గర నుంచి చూశాను. కంపెనీ మూసేశారని రాశారు. అతడు నిర్మాతగా వ్యవహరించిన మూడు సినిమాలు ఆదరణ సొంతం చేసుకోలేదన్నమాట వాస్తవమే. కానీ, కంపెనీ మూసివేయలేదు. ఆర్థికంగా చాలా నష్టపోయాం. ఇండస్ట్రీలోని ప్రతి నిర్మాతకు అలా జరుగుతుంది. ఒకనొక సమయంలో అమితాబ్‌బచ్చన్‌కు కూడా ఇలానే జరిగింది. ఎదుగుతున్న సమయంలో ఇదంతా ఒక దశ అని రకుల్ అన్నారు. బాలీవుడ్ నటులు అక్షయ్‌కుమార్ (ం÷ఖబరజా ఐబీపజీస), టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బడే మియా.. ఛోటే మియా'. భారీ తారాగణంతో రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఈ సినిమా నిర్మాత, రకుల్ ప్రీత్ సింగ్ భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ గతంలో వార్తలు వచ్చాయి.




# మనశంకరవరప్రసాద్ నుంచి మరో పాట

8న విడుదలకు చిత్రబృందం సన్నాహాలు

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'మన శంకరవర ప్రసాద్' చిత్రం నుంచి తాజాగా రెండో పాట విడుదల తేదీ ఖరారైంది. ఇప్పటికే విడుదలైన మొదటి పాట 'మీసాల పిల్ల' భారీ విజయాన్ని సాధించి ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం తదుపరి పాట అప్‌డేట్‌తో అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. 'శశిరేఖ' అనే పేరుతో రాబోతున్న ఈ రెండో పాట డిసెంబర్ 8న విడుదల కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ పాటకు సంబంధించిన ప్రోమో డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తుండగా.. మెగాస్టార్ చిరంజీవితో పాటు విక్టరీ వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా వంటి అగ్ర తారలు నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుష్మిత కొణిదెల, వి. హరికృష్ణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# బాహుబలి కోసం జపాన్‌కు ప్రభాస్

స్పిరిట్ షూట్‌కు తాత్కాలిక బ్రేక్



గ్లోబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడు. ముందుగా ప్రకటించిన ప్రకారం జపాన్‌లో బాహుబలి : ది ఎపిక్ స్పెషల్ ప్రీమియర్‌కు హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభాస్ గురువారం జపాన్‌కు వెళ్లాడు. ఈవెంట్‌కు బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాత శోభు యార్లగడ్డ కూడా హాజరు కానున్నారు. బాహుబలి : ది ఎపిక్ జపాన్‌లో డిసెంబర్ 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మేరకు మేకర్స్ డిసెంబర్ 5, 6వ తేదీల్లో స్పెషల్ ప్రీమియర్స్ ఏర్పాటు చేశారు. ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రమోషన్స్ టైంలో జపాన్‌లో తాను కలవలేకపోయిన అభిమానులను కలుస్తానని హామీనిచ్చాడని తెలిసిందే. వారికిచ్చిన మాట ప్రకారం జపాన్‌లో అభిమానులతో చిట్‌చాట్ చేయనున్నాడు. ఇదిలా ఉంటే యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇప్పటికే షూటింగ్ మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ప్రభాస్, తృప్తి డిమ్రిపై వచ్చే కొన్ని సన్నివేశాలను కూడా ఇటీవలే షూట్ చేశారు. షూటింగ్ నుంచి చిన్న బ్రేక్ తీసుకున్న ప్రభాస్ జపాన్ టూర్ అయిపోగానే మళ్లీ స్పిరిట్ షూట్‌తో బిజీగా కానున్నాడు. టాలీవుడ్ డైరెక్టర్ మారుతి-ప్రభాస్ కాంబోలో రాజాసాబ్ వస్తుందని తెలిసిందే. హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రమోషన్స్‌లో భాగంగా లాంచ్ చేసిన పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్స్‌కు మంచి స్పందన వస్తోంది.

# ప్రముఖ నిర్మాత శరవణన్ మృతి

నివాళి అర్పించిన పలువురు ప్రముఖులు

ప్రముఖ కోలీవుడ్ నిర్మాత, ఏవీఎం నిర్మాణ సం స్థ అధినేత ఏవీఎం శరవణన్ (85) కన్నుమూశారు. చెన్నైలోని ఆయన నివాసంలో గురువారం తుదిశ్వాస విడిచారు. తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లో శరవణన్ పలు హిట్ చిత్రాలను నిర్మించి గుర్తింపుతెచ్చుకున్నారు. ఏవీఎం బ్యానర్‌పై మొత్తం 300 సినిమాలకు పైగా నిర్మించారు. తెలుగులో 'సంసారం ఒక చదరంగం', 'ఆ ఒక్కటీ అడక్కు', 'మెరుపు కలలు', 'జెమిని', 'శివాజీ' వంటి సిని మాలను అందించారు. శరవణన్ మృతితో చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖులు ఆయ నకు నివాళులర్పిస్తున్నారు. ఏవీఎం నిర్మాణ సంస్థ అధినేత శరవణన్ భౌతిక కాయానికి నివాళుల ర్పిస్తూ నటుడు సూర్య భావోద్వేగానికి గురయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కంటతడి పెట్టుకున్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్, రజనీకాంత్, సూర్య తండ్రి శివకుమార్ తదితరులు నిర్మాత భౌతిక కాయానికి నివాళులర్పించారు. సూర్య నటించిన 'పెరళగన్' (సుందరాంగుడు), 'వీడొక్కడే' తదితర చిత్రాలు ఏవీఎం ప్రొడక్షన్స్‌లోనే తెరకెక్కాయి. శరవణన్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. శరవణన్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తాను చిన్న వయసులో.. శరవణన్‌ను కలిశానని, ఏవీఎం స్టూడియోస్‌లో ఎన్నో పాఠాలు నేర్చుకున్నానని విశాల్ గుర్తుచేసుకున్నారు.







CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861